NPRO1D404 ©

బర్మాలో తెలుగు వాణి



ం సంస్థ,
బాదు-27

NPROID404

విదేశాంధ్రవాణి : 2

ప్రధాన సంపాదకులు :
డా॥ పి. ఎస్. ఆర్ అప్పారావు

బర్మాలో తెలుగు వాణి

రచయిత
శ్రీ కె. కె. మూర్తి

పి12-49/201

అంతర్జాతీయ తెలుగు సంస్థ
హైదరాబాదు - 500 027

barmaaloo telugu vaani

by

Sri K. K. Murthy
Kandawglay, Rangoon, Burma

PP : 145

First Impression
1000 Copies
Sept. 1977

©

PUBLISHED BY
International Telugu Institute
Barkatpura, Hyderabad – 500 027.
India

Rs. 3-00

PRINTED AT
PRAGATI ART PRINTERS
HYDERABAD–500 004.

ప్ర వే శి క

ప్రకృతి అందించిన పిలుపు అందుకొని, ప్రపంచం నలుమూలలకు ఒకనాడు తెలుగు సోదరులు తరలి వెళ్ళారు. ఏ తీరంలో కాలు మోపినా, ఏ దేశంలో నివాసమేర్పరచుకొన్నా అక్కడి విశిష్టతని ఆకళింపు చేసికొని తమలో రంగరించుకొన్నారు. ఆ దేశ నిర్మాణంలో హృదయ పూ ర్వ క ం గా భాగ స్వామ్యం పంచుకొన్నారు. ఆయా దేశాల నిజమైన పౌరులుగా నిలిచారు.

అయినా తమ ప్రత్యేకతను విడనాడ లేదు. తెలుగు పలుకుల్ని మరచి పోలేదు. తెలుగు సంస్కృతిని చెరగి పోనివ్వ లేదు. ఆత్మ సంస్కృతి, పర సంస్కృతి రెండూ శబ్దార్థాల్లా కలిసిపోయి, వారిలో ఒక కొ త్త సంస్కారాన్ని ఆవిష్కరించాయి. ఒక విశిష్టమైన ద్వంద్వత, పార్వతీ పరమేశ్వరుల తదేక భావంలో జాలువారే స్పష్టాస్పష్ట ద్వంద్వత, ఆ కొ త్త సంస్కారానికి భూమి కగా నిలిచింది. ప్రపంచ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఏదోఒక దశలో, ప్రతి జాతిజీవికలోనూ ఈ ద్వంద్వత ప్రాతిపదికగా నిలచి ఉండడం విదితం కాక పోదు.

ప్రపంచం నలు చెరగుల్లోనూ వ్యాపించిన ఈ తెలుగు సంస్కృతిని ఒక్క వేదిక మీద కనుల పండువుగా కనిపింప చేసే ప్రయత్నం, మొదటి ప్రపంచ తెలుగు మహా సభల మూలంగా జరిగింది. ఆ సభలకు హాజరైన స ద స్యు ల వాంఛానుసారం, అంతర్జాతీయ తెలుగు సంస్థ ఆవిర్భవించింది. ప్రథమ దశలో ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలు రాష్ట్రేతరాంధ్రుల విద్యా, సాంస్కృతిక సమస్యలను పరిష్కరించడానికి జాతి పరమైన గుర్తింపులో సమైక్యత సాధించడానికి యథా శ క్తి పరిశ్రమించడమే. ఆ కృషిలో భాగమే ఈ రోజు ఆరంభిస్తున్న "విదేశాంధ్రవాణి" అన్న ఈ క్రొ త్త గ్రంథావళి.

ఈ "విదేశాంధ్రవాణి" శీర్షిక ఉద్దేశ్యం - పరదేశాలకు వెళ్ళిన సోదరుల గురించి పరిచయం చేయడం మాత్రమే కాదు. దేశ దేశాలకు అల్లుకొన్న ఈ తీగ పాదును అవగాహన చేసికోవడానికి, తెలుగు సంస్కృతిని గురించి సమగ్ర మైన అధ్యయనం చేయడానికి ఈ శీర్షిక ఉపయోగ పడాలన్నది మా ఆశయం. సమగ్రంగా తెలుగువారి సామాజిక సాంస్కృతిక చరిత్ర నిర్మించడానికి సంస్థ చేస్తున్న ప్రయత్నానికి ఇది దోహదకారి కాగలదు. ఇంకకు ప్రాతి పదికగా సామాన్య పాఠకులను కూడా దృష్టిలో ఉంచుకొని, స్థూల ప రి చ యా న్ని మాత్రం కల్పించడానికి ఇలాటి శీర్షిక పేరుతో భిన్న దేశాల్లోని తెలుగు వారిని గూర్చి వివరించడానికి సంస్థ సంకల్పించింది.

ఈ శీర్షికలో తొలి కానుకగా "మారిషస్‌లో తెలుగువాణి" అన్న పు స్త కాన్ని అందించాము. ఇది మా సంస్థ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా,

సాంస్కృతిక వ్యవహార శాఖామాత్యులు అయిన మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు మారిషస్‌ను సందర్శించినప్పుడు, అక్కడి తెలుగు ప్రజల మధ్య పొందిన అనుభవాలను, అక్కడి వారి తెలుగుదనంలోని రకరకాల తీరు తెన్నులను విశదీకరించే పుస్తకం కావడంతో, ఈ పుస్తక ప్రకటన మాకు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది.

ఇప్పుడు ఇదే శీర్షిక క్రింద అందిస్తున్న రెండవ కానుక - "బర్మాలో తెలుగువాణి" గ్రంథకర్త శ్రీ కె.కె. మూర్తి తెలుగు పండితులు, బర్మాలో సుప్రసిద్ధులైన తెలుగు రచయిత. బర్మా ఆంధ్రుల చరిత్రను వ్రాయ సంకల్పించి బహుకాలం వీరు బర్మా అంతటా పర్యటించి, అక్కడి తెలుగు వారికి సంబంధించిన అనేక విశేషాలను సేకరించారు. 'బర్మా ఆంధ్రుల చరిత్ర' అన్న పెద్ద గ్రంథాన్ని రూపొందించారు. ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా కె.కె. మూర్తిగారు సంక్షిప్తంగా బర్మా ఆంధ్రులను పరిచయం చేస్తూ ఈ పుస్తకాన్ని వ్రాసి పంపడం జరిగింది. ఆ మహాసభల ఫలితమైన అంతర్జాతీయ తెలుగు సంస్థ తన ప్రచురణల కార్యక్రమం ఆరంభిస్తూ ఈ శీర్షిక క్రింద దీన్ని రెండవ కానుకగా సమర్పించగలుగుతోంది.

ఒకప్పుడు ఆంధ్రదేశం తర్వాత ఎక్కువమంది తెలుగువారు నివసించే ప్రాంతంగా బర్మాను పేర్కొనేవారు. బర్మాతోటి తెలుగువాళ్ళ సంబంధం ఈ నాటిది కాదు. చరిత్ర కందని ప్రాచీనకాలం నుండీ సువర్ణ భూమి అయిన బ్రహ్మదేశంతో తెలుగు వారికి సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. ఒకవైపు సంక్షిప్తంగా ఆ ప్రాచీన చరిత్రను తెలుపుతూ, ఇంకోవైపు ఈ కాలంలో అక్కడ నివసించిన తెలుగు పెద్దలను గురించి, సామాజిక సాంస్కృతిక రంగాలలో వారి బృహత్తర సేవలను గురించి, సంస్థలను గురించి ఆసక్తిదాయకమైన అనేక విషయాలను ఈ గ్రంథం తెలుపుతుంది. ఇది సంక్షిప్తంగా తెలుగువారి పరిచయమే అయినా, ఇందులోనే చక్కటి చరిత్రకారుని దృక్పథం కూడా మేళనమై ఉండడం సహృదయులకు విదితం కాగలదు.

ఇలాటి విలువైన పుస్తకాన్ని రచించిన శ్రీ కె.కె. మూర్తిగారిని అభినందిస్తూ, సంస్థ పక్షాన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. రచయిత పంపిన ప్రాత ప్రతిని సంస్కరించి, ముద్రణాయోగ్యం చేయడంలో సాయపడిన శ్రీ జి. లక్ష్మీ నారాయణగారికి, ప్రాతపతిని సాంతం పరిశీలించిన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి మా కృతజ్ఞతలు. అలాగే స్వల్ప వ్యవధిలో అందంగా ముద్రించిన ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్ సిబ్బందికి కూడా మా కృతజ్ఞతలు.

ప్రధాన సంపాదకులు

మ న వి

సుమారు ఇరవై సంవత్సరాలకు పూర్వం మాతృదేశానికి పోవాలని నిశ్చయించుకొన్నప్పుడు, మనసులో ఏదో అసంతృప్తి కలిగింది. ఆ అసంతృప్తి చివరకు ఒక ఆశయంగా రూపుదాల్చింది.

ఈ దేశంలోని ఆంధ్రులు, వీరి కష్టసుఖాలు, ఘనకార్యములు, అనుభవాలు మొదలైన వాటినన్నిటిని నా మాతృదేశం లోని వారికి తెలియ చెప్పాలన్న ఆశయం రోజురోజుకూ బలపడసాగింది. అయితే, అందుకు ఎలాటి సాధన మవసరమో అన్న చింత పట్టుకొంది. భావితరాల వారికి బర్మా ఆంధ్రుల అనుభవాలు చదువు కోడానికి, చెప్పుకోడానికి సులభంగా ఉంటాయి అన్న ఊహతో, వారి చరిత్రను రాయాలని 1950లో ఒక నిశ్చయానికి వచ్చాను. ఆ నిశ్చయంతో, కొందరు సుప్రసిద్ధ చరిత్రకారుల పద్ధతుల్ని ఆకళింపు చేసి కొన్నాను. ఆ పద్ధతుల్లో కొన్ని పరిశోధనలు, పరిశీలనలు చేశాను. అప్పట్లో బర్మా ఆంధ్రులకు సంబంధించిన సారస్వత సంపద ఎంతఉన్నా, ఒక చరిత్ర గ్రంథం మాత్రం లేదు. 1964లో స్థానిక 'ఆంధ్రమిత్ర పత్రిక'లో "బర్మా ఆంధ్రులకొక గ్రంథం" అన్న వ్యాసాన్ని కొన్నిసార్లు వ్రాసి ప్రకటించాను. దాన్ని చూసిన కొన్ని బర్మా ఆంధ్ర సంఘాలు, కొందరు స్నేహితులు తమ తమ అమూల్యములైన సలహాలు, పుస్తకాలు, పాత పత్రికలు ఇచ్చి నా రచనకు సహకరించారు.

1968 సంవత్సరానికి 24 అధ్యాయాలతో, 200 శీర్షికలతో ఉన్న గ్రంథాన్ని పూర్తిచేశాను. ఆ గ్రంథాన్ని ఉన్నత విద్యావంతుల కమిటీ మూలంగా పరిష్కృతం చేయించాలన్న సంకల్పం కలిగి, 1968 జూన్ నెలలో రంగూన్ కాందోం శ్రీ మారమ్మ దేవస్థాన మంటపములో 'బర్మా ఆంధ్రుల

చరిత్ర-పరిష్కరణ సంఘం' నెలకొన్నది. పరిశీలకులు, పరిచయములు అన్న మరి రెండు శాఖలు ఆ కమిటీ మూలంగా కలిశాయి. దాదాపు మూడు మాసాలు పరిశీలించి, ఆ చిత్తు గ్రంథాన్ని పరిష్కరించడం జరిగింది. కాని, తెలుగు ముద్రణ సౌకర్యాలు ఈ దేశంలో లేనందువల్ల ఆ గ్రంథాన్ని నా మాతృదేశం లోని బంధువుల వద్దకు పంపించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ముద్రించాలని ఆశించాను. ఇది నాలుగేళ్ళ క్రిందటి మాట.

అయితే, రాక్షసనామ సంవత్సరంలో జరిగిన చరిత్రాత్మకమైన ప్రపంచ తెలుగు సభలకు బర్మా ఆంధ్రుల సంగ్రహ చరిత్రను పంపాల్సిన అవసరం బర్మాలోని ఆంధ్ర సోదరులకు కలిగింది. రంగూన్‌లో ఆంధ్ర మహాజన సంఘానికి అనుబంధంగా వెలసిన 'అఖిల బర్మా తెలుగు సాంస్కృతిక కార్యవర్గం' వారి కోరికమీద ఈ చిన్న పరిచయ గ్రంథాన్ని రూపొందించడం జరిగింది.

ఈ పుస్తకంలో బర్మా ఆంధ్రుల ప్రాచీన సంబంధాలు, బ్రిటిషు కాలంలో ఆంధ్రులు బర్మా దేశానికి గావించిన వలసలు, క్రీ.శ 1900 నుండి నేటి వరకు బర్మాలో తెలుగువాళ్ళ జనాభా సూచికలు, ఇక్కడి పెద్దలు, వారి సత్కార్యాలు, కవులు-కళాకారులు, బర్మాలోని తెలుగు పత్రికలు-వాటి నిర్వాహకులు, బర్మాలోని కొన్ని ఆంధ్ర సంఘాలు - వాటి పరిచయాలు, రంగూన్‌లో ఉన్న కొన్ని హిందూ దేవాలయాలు, నేటి ఆంధ్ర సోదరులలో ప్రముఖులు - వారి పరిచయాలు సంగ్రహంగా వివరించడం జరిగింది.

కాని, ఈ పుస్తక విషయంలో నాకింకా అసంతృప్తి మిగిలేఉంది. ఆ అసంతృప్తికి కారణం - ఇది సంక్షిప్త పరిచయం కావడమే. దీని కంటె, ఇంతకుముందు నేను రూపొందించిన 'బర్మా ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి' అన్న పెద్ద గ్రంథంలో, పెక్కు సాంఘిక సంస్థల చరిత్రలు-నాటక సమాజాల చరిత్రలు-సభల వివరాలు, దర్శనీయములైన ఇక్కడి స్థలాలు, రంగూన్ ఆంధ్రులు, మోల్మేన్ ఆంధ్రులు, మెర్గ్వీ ఆంధ్రులు, హెంజడా ఆంధ్రులు, బస్సిన్ ఆంధ్రులు అంటూ ప్రతి ప్రాంతంలోని ఆంధ్రుల వివరాలు విస్తారంగా ఇచ్చాను. విపులంగా ఈ దేశంలోని ఆంధ్రుల గురించి తెలిసికొనేటంత తృప్తి ఈ సంగ్రహ పుస్తకం ద్వారా లభించదు.

నా పెద్ద గ్రంథానికి పరిష్కర్తలుగా, పరిశీలకులుగా, పరిచయకర్తలుగా వ్యవహరించిన పెద్ద లందరికీ ఈ సందర్భంలో నా కృతజ్ఞతా పూర్వక నమస్సు లను అందిస్తున్నాను. శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు అర్పిస్తున్నాను.

ఆనాడు ప్రపంచ తెలుగు మహాసభలకు పంపించిన ప్రాతప్రతిని సంపాదించి, సంస్కరించి ముద్రించిన అంతర్జాతీయ తెలుగు సంస్థకు, సంస్థ డైరెక్టరు గారికి నా కృతజ్ఞతలు.

ఈ దరిమిలా, ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న బర్మా ఆంధ్రుల కాందిశీకుల సంఘాలలో విశాఖ పట్టణంలో శ్రీ మల్లారపు అర్జునరావుగారి ఆధ్వర్యంలో నడుస్తున్న బర్మా ఆంధ్రుల కాందిశీకుల సంఘమువారు-బర్మా కాందిశీకుల పట్ల గొప్ప శ్రద్ధను, ఆసక్తిని చూపిస్తున్నట్లు తెలుస్తోంది. దానికి నా కెంతో సంతోషం కూడా కలుగుతోంది.

బుధజన విధేయుడు

కె. కె. మూర్తి

✓ 111

విషయసూచిక

		పుట
1.	బర్మా - ఆంధ్రులు	... 1
2.	బర్మా ఆంధ్ర ప్రముఖులు	... 15
3.	భారత దేశం నుండి బర్మా సందర్శించిన ఆంధ్రప్రముఖులు	... 24
4.	బర్మాలో తెలుగు పత్రికలు	... 45
5.	బర్మా తెలుగు రచయితలు	... 48
6.	బర్మాలో నటులు, సంగీతజ్ఞులు	... 62
7.	క్రీడా, చిత్రకళా రంగాల్లో తెలుగువారు	... 74
8.	బర్మాలో ఆంధ్ర సంస్థలు	... 77
9.	బర్మాలో హిందూ దేవాలయాలు	... 132
10.	వివిధ ఉద్యోగాల్లో తెలుగువారు	... 137

బర్మా - ఆంధ్రులు

ప్రాచీన చరిత్ర

సస్య శ్యామలమై స్వర్ణ భూమిగా పేరుపొందిన ఈ బ్రహ్మదేశమునకు బుద్ధునికి పూర్వమే, అంటే దాదాపు మూడువేల సంవత్సరాలకు మునుపే ఆంధ్రులు రాకపోకలు చేశారని, తర్వాతనే బౌద్ధ మతం ప్రవేశించి హిందువుల సంఖ్య తగ్గిపోయిందని ప్రాచీన చరిత్రలు వివరిస్తున్నాయి. క్రీ. పూ 3 వ శతాబ్దినుంచి మనకు ఒక విశిష్ట చరిత్ర ఉండనే ఉంది. ఒకప్పుడు కళింగాంధ్రులు ఈ దేశానికి వ్యాపారం కోసం తమ సొంత నౌకలమీద వచ్చిపోయారని, కొంత కాలానికి వీరే ఇక్కడివారితో వియ్యమంది కొని, 'తలైంగు' అన్న ఒక జాతిని సృష్టించారని చరిత్రలు నిరూపిస్తున్నాయి. ఇప్పుడు ఆ 'తలైంగు' 'తెగకు చెందిన వారే 'మోన్' జాతిలో చేర్చబడి - పేరు మారి బర్మాలో ప్రత్యేక జాతిగా పరిగణింపబడుతున్నారు. పూర్వం ఈ తలైంగులే దక్షిణ బర్మా (**Lower Burma**)ను శతాబ్దాలపాటు పాలించారు.

"బుద్ధ ఘటమ" అన్న బర్మావారి మత గ్రంథంలోను, తటోన్, పీగూ స్థల పురాణాల్లోనూ ఆంధ్రుల ప్రసక్తి చాలా ప్రశస్తంగా ఉంది. బుద్ధ భగవానుడు పుట్టకముందే-అంటే క్రీస్తుకు 700 సంవత్సరాలకు పూర్వమే ఆంధ్రులు ఈ దేశం వచ్చి దక్షిణ బర్మాలో వర్తకం ద్వారా బహులాభాలు పొందారు. అనంతరం బౌద్ధభిక్షువులుగా వచ్చి మత వ్యాప్తినిచేశారు. క్రమంగా ఈ దేశాన్ని జయించి రాజ్యాలు స్థాపించారని, ఈ దేశానికి సముద్రమార్గాన మొట్టమొదట ఆంధ్రులే వచ్చారని బర్మా చరిత్రకారులు నిర్వివాదాంశంగా అంగీకరించారు.

భారతదేశ భౌగోళికపటాన్ని పరిశీలిస్తే సహజంగా తూర్పుతీర వాసులకే, సముద్ర ప్రయాణంలో అభినివేశం ఎక్కువ అని తేలుతుంది. ఓడల అవసరం కాని, ప్రయోజనం కానీ ఉత్తర హిందుస్థానములోని గంగా సింధుమైదానములో

ఉన్న వారికంటే, సముద్ర తీరాలున్న దక్షిణ హిందుస్థానము వారికే ఎక్కువ. అందులోనూ పశ్చిమ తీర వాసులకంటె, తూర్పుతీర వాసులకు మరీ ఎక్కువ. పశ్చిమతీరవాసులు సముద్రప్రయాణం చేయాలంటే, అరేబియా సముద్రంలోనే చేయాలి. ఇది తూర్పుతీరంలోని బంగాళాఖాతం కంటె విశాలమైనది. అందులో ప్రయాణం చేసే ఓడలు ప్రయాణ మధ్యంలో ఒకపూట ఆగడానికి, నావికులు తమ తిండి తీర్థాలు సేకరించడానికి అనుకూలమైన నౌకాశ్రయాలు కాని, ద్వీపాలుకాని లేవు. ఒకవేళ ఈ ప్రయాసలన్నిటిని భరించి సాగిపోయినా, వారు అటువైపుగా చేరగలిగేది ఆఫ్రికా ఖండాన్నే. అప్పటికి ఆఫ్రికాఖండం చీకటి ఖండంగా పేరు పొందింది. తూర్పు తీరవాసుల విషయంలో అలాకాదు. తూర్పుతీరాన్ని సోకి ఉన్న బంగాళాఖాతము చిన్నది. దాన్ని దాటుతూనే, ఆనాటికి సువర్ణ భూమిగా పేరుపొందిన బ్రహ్మదేశం ఉంది. ఇక్కడ స్థావరాలు ఏర్పరచుకోవడానికి, ఇక్కడనుండి స్వదేశానికి బంగారాన్ని ఎగుమతి చేయడానికి అవకాశం ఉంది. ఈ దృష్టితో, తూర్పు దేశవాసులకు సహజంగా సముద్ర ప్రయాణం చేయడానికి కుతూహలం ఏర్పడుతుంది. నైపుణ్యాన్ని పొందడానికి అవకాశం కలుగుతుంది. అంచే తూర్పు తీరవాసులను సముద్ర వర్తకానికి ప్రేరేపించిన ఘనత బ్రహ్మదేశానిదే.

చీనా దేశమునుండి ఐరావతీ నది మీదుగా అప్పటి రేవు పట్టణమైన తటోనుకు అమితంగా బంగారం వచ్చేదని, అక్కడినుండి ఆంధ్రులు కొని స్వదేశానికి పంపేవారని, అందువల్లే ప్రాచీనాంధ్రులు బర్మాదేశాన్ని 'సువర్ణ భూమి' అంటూ పిలిచేవారని ప్రతీతి.

బర్మాకు వచ్చినవారు ఇక్కడనుండి దగ్గరదగ్గరగా ఉన్న సయాం, కంబోడియా, జావా, సుమత్ర, భరణి (బోర్నియో), సెలెబెసు, మలక్కా మొదలైన దీవులన్నిటికి సునాయాసంగా పోయే అవకాశం ఉన్నందువల్ల, తూర్పు తీరవాసులకు సముద్ర వర్తకంమీద ఉత్సాహం అధికంగా ఉంటుందని భావించడంలో తప్పులేదు. సుప్రసిద్ధ చరిత్రకారులైన ఎల్బిన్‌సన్ దొరగారుకూడా ఈ విషయాన్నే సమర్థిస్తూ "భారతదేశ తూర్పు తీరవాసులలో ముందుగా నౌకాయానమునకు దారితీసి, నైపుణ్యమును సంపాదించుకొన్నది - ఇప్పటి విశాఖపట్టణం, గంజాం జిల్లాల వాస్తవ్యులైన కాళింగులు, అనగా పూర్వపు కళింగ

రాజ్య ప్రజలు" అనిపేర్కొన్నారు. విలియం హంటర్‌గారు కూడా "దాక్షిణాత్యులలో కాళింగులు నౌకాయానమునందు అత్యంత ప్రవీణులుగా నుండిరి" అంటూ ఈ విషయాన్నే ధృవపరిచారు. ఈ అంశాల మూలంగా కళింగులే అందరికంటె ముందుగా నౌకాయానంలో ప్రవీణులయ్యారని భావించవచ్చు. సముద్రంమీద బర్మాకు వచ్చిన భారతీయుల్లో ఆంధ్రులే మొదటివారని ప్రతీతి.

అప్పటి ప్రసిద్ధ రేవు పట్టణమైన తటోను, ప్రస్తుతం సముద్రతీరానికి చాలా దూరంలో ఉన్నప్పటికీ, ఆనాటికి అది సముద్ర తీరంలోనే ఉండేదని భావించడానికి అవకాశముంది. అందుకు ఆధారంగా సముద్రంలో మాత్రమే దొరికే గవ్వలు, శంఖాలు, నత్తగుల్లలు, మొదలైనవి నేటికి ఈ ప్రాంతంలో బయల్పడుతూ ఉంటాయి. ఆనాడు ఆంధ్రులు ఈ రేవు పట్టణం వద్ద బంగారం, వెండి, గంధపు చెక్కలు, దంతములు, నెమళ్ళు మొదలైన వాటిని కొని స్వదేశానికి పంపుతుండేవారు. అప్పట్లో తటోన్ మొదలైన దక్షిణ బర్మా జిల్లాలలో చీనాదేశం నుండి వచ్చిన 'మన్' జాతివారు నివసించేవారు. వారితో మనవారు స్నేహం చేసికొని, అక్కడ రాజ్యస్థాపనానికి వసతి ఉందని కనిపెట్టి, వర్తకానికి లాభసాటిగా ఉంటుందని ఆలోచించి నెమ్మదిగా స్థిర నివాసాలనే ఏర్పరచుకొన్నారు. క్రమేణా ఆంధ్రులకు ఇది వలస రాజ్యమైపోయింది. శ్రీ భావరాజు వేంకటకృష్ణారావు గారు 1922 సం॥ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో ఈ అంశాలను కొంతదాకా నిరూపించారు.

అప్పటి ఆంధ్రులు వలస వచ్చినప్పుడు వెంట తమ స్త్రీలను తీసికొని రాలేదని, క్రమేణా తటోన్ మొదలైన జిల్లాలలో ఉన్న "మన్" జాతివారితో వారికి సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయని, వారి సంతానమే 'తలైంగులు' అని, సర్ ఆర్థర్ ఫెయిరీ కూడా వ్రాశారు. ఈ తలైంగు శబ్దము తెలుగు శబ్దమే.

బర్మీయులు అక్కడక్కడ ఇళ్ళు కట్టుకొని జీవిస్తుండగా, తిబెత్తు కొండల దారిగుండా దక్షిణ భారత కొండ ప్రజలు మొట్టమొదటగా ప్రవేశించారని. ఈ దక్షిణ భారత ప్రజలే (త్రిలింగులు) హెంజడా పట్టణమునకు దిగువ ప్రాంతములో అనగా బస్సీన్ ప్రాంతములో రాజులై యుండి అప్పుడప్పుడు బర్మా రాష్ట్రీయులతో సంఘర్షణలు జరిపేవారని చరిత్రలు తెలుపుతున్నాయి.

కళింగాంధ్రులు క్రీ.శ. 75 నాటికే 'యవ' (**Java**) ద్వీపములో స్థిర నివాసాలు ఏర్పరచుకొని క్రమంగా వలస రాజ్యాలను స్థాపించి, తమ మాతృ దేశముతో వ్యాపారము సాగించేవారని, రానురాను ఆ ద్వీపవాసుల మైత్రీ విశ్వాసాలను చూరగొని వారిని నాగరకులుగా చేశారని 'కాలనైజేషన్ ఆఫ్ జావా' వంటి చరిత్ర గ్రంథాలు వివరిస్తున్నాయి. ఈనాటికి గూడా జావా, మలాకా ద్వీపకల్పములోనూ, సింహపురము (సింగపూర్) ప్రాంతాలలోనూ మన వారిని 'క్లింగు'లనే పిలుస్తుంటారు. క్లింగులు అన్నమాట కళింగ దేశస్థులైన కాళింగులకు రూపాంతరమే.

ప్రఖ్యాత చీనా దేశ చరిత్రకారుడైన హ్యూనిత్సాంగ్ క్రీ.శ. 629 సం॥ నుండి 645 సం॥ వరకు భరతఖండంలో పర్యటన చేసి ప్రముఖ స్థలాలన్నిటినీ సందర్శించాడు. క్రీ.శ. 630 సం॥లో కళింగదేశాన్ని తాను పర్యటించినట్లు, గంగానదికి 574 మైళ్ళు దిగువగా ఆ దేశ రాజధాని ఉందని, గోదావరీనది ముఖద్వారంలోని పూర్వపు రేవు స్థలం 'కోరంగీ' పట్టణం ప్రసిద్ధమైందనీ వ్రాశాడు. ఈ కళింగానికి ఉత్తరాన ఒరిస్సాదేశమని, పడమర ఆంధ్రదేశమని ఇక్కడి ప్రజలు తెలుగు మాట్లాడే వారని ఆయన పేర్కొన్నాడు. కాళింగులు ఒక్క బంగాళాఖాతంలోనే కాకుండా, హిందూమహాసముద్ర తీరంలోని తూర్పు ద్వీపాలతో సైతం విరివిగా వర్తకం జరిపేవారని, కాళింగ నౌకలు తామ్రలిప్తి నుండి బయల్దేరి, సింహళము మీదుగా యవ ద్వీపం పోయి వచ్చేవని ఆయన వ్రాశాడు. ఆయన తన మాతృదేశమైన చీనా దేశానికి గూడా యవ ద్వీపం నుండి కళింగ నౌకలోనే ప్రయాణం జేసినట్లు పేర్కొన్నాడు. హ్యూనిత్సాంగ్ మాటలనుబట్టి కళింగ నావికులు ఫసిఫిక్ మహాసముద్రములో కూడా ప్రయాణం చేసినట్లు అర్థమవుతుంది. ఒకప్పుడు కళింగం ప్రత్యేక రాజ్యంగా ఉన్నప్పటికి క్రమంగా ఆంధ్ర ప్రాంతంతో కలిసిపోయి తెలుగు మాట్లాడే ఒకే దేశం ఏర్పడిందని హంటర్ కూడా పేర్కొన్నారు.

నేడు బర్మాలో ఉన్న కొన్ని బౌద్ధాలయాలు కూడా ఒకప్పుడు తెలుగు రాజులు కట్టించిన హిందూ దేవాలయాలే అని చరిత్రకారుడు హార్వే పేర్కొన్నాడు. రంగూన్‌లోని ష్వేడగోన్ బౌద్ధాలయము (బుద్ధఖానా), తటోన్ నగరంలోని ష్వేజయాగ్ బౌద్ధాలయము, పెగూ పట్టణంలోని ష్వేమాదే బుద్ధ మంది

రము మొదలైనవి, పూర్వం తెలంగాణం నుండి వచ్చిన తెలుగు రాజులు కట్టిం చిన హిందూదేవాలయాలే అని, తర్వాత కాలంలో బౌద్ధస్తూపాలుగా మారాయని ఆయన వివరించారు.

కీ.పూ. 261 సం॥లో కళింగ రాజ్యాన్ని అశోకవర్ధనుడు జయించిన పిమ్మట, వారి హైందవ మతములో బౌద్ధసిద్ధాంతాలు మిశ్రితములయ్యాయి. కీ.శ. 5వ శతాబ్దిలో కాంచీ నగరమున ధర్మపాలుని యాజమాన్యంలో విశేషాభి వృద్ధిని సాధించిన బౌద్ధసంఘం నుండి, అనేకమంది బౌద్ధ భిక్షువులు, ఆచార్యులు బౌద్ధమత ప్రచారంకోసం దక్షిణ బర్మాకు తరలి వచ్చారు. బర్మీయులలో బౌద్ధ మతాన్ని ప్రచారంచేసి, ఆ మతంపట్ల ప్రజలను ఆకర్షించారు. అప్పటినుండి బర్మాలో బౌద్ధమతం వ్యాపించసాగింది. కాంచీనగరం, ధర్మపాలుని పేర్లు తలైంగు వారి గ్రంథాల్లో చాలాసార్లు వస్తుంటాయి. కళింగాంధ్రులు తటోను పట్టణంలో రాజ్యస్థాపన చేసినది మొదలు రాజ్యపరిపాలన చేసిన ఏభైతొమ్మిది మంది రాజుల పేర్లతోసహా, వారి రాజ్య పరిపాలనా విశేషాలను తెలిపే గ్రంథా లున్నాయని, వారిలో మొదటి రాజు 'తిహా' మహారాజని, ఆయన బుద్ధుడు జీవించి ఉన్న కాలంలోనే రాజ్య పరిపాలన చేశాడని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఈ రాజుల చరిత్రలను విపులంగా తెలిపే చారిత్రకాధారాలు లేవు. వీరిలో చివరి రాజైన మను మహారాజు క్రీ.శ. 1050 ప్రాంతాల తటోన్ పట్టణాన్ని పాలించే వాడని చెప్పవచ్చు. ఈ మను రాజును, అప్పర్ బర్మాలో పగాన్ పట్టణపు రాజైన - అరివర్ధన పురాధిపతి అనవ్రత మహారాజు యుద్ధంలో ఓడించి, చరిత్రోపయుక్తాలైన వ్రాతల్ని కూడా నాశనం చేశాడు. దీనిమూలంగా ఈనాడు తటోన్ పూర్వచరిత్ర మనకు అందుబాటులో లేకుండా పోయింది.

ఇప్పటి పీగూ పట్టణం చాలా కాలానికి ముందు సముద్రమయంగా ఉండేది. ఐరావతి, సిట్టాంగు నదులలో కొట్టుకువచ్చి ఇసుకమట్టి అక్కడ చేరి క్రమక్రమంగా నీటిమట్టాన్ని తగ్గించినందువల్ల, పీగూప్రాంతం బయట పడిందని చెబుతారు. ఈ ప్రాంతం కొత్తగా ఏర్పడిందేనని భూతత్త్వ శాస్త్ర జ్ఞులు కూడా అంగీకరిస్తారు. ఈ పట్టణాన్ని గురించి ఒక ఐతిహ్యం ఉంది. ఇక్కడ మట్టిదిబ్బ వెలసిన కొత్తలో ఒకనాడు రెండు రాజహంసలు వాలి ఉన్నవట. దాన్ని కొందరు నావికులు చూచి, ఈ దిబ్బ గొప్ప పట్టణంగా

మారుతుందని ఊహించారట. అలాగే కొంతకాలానికి ఆ దిబ్బ, చుట్టుప్రక్కల్లోని ప్రదేశము కలసి, ఒకనాటికి గొప్ప రాజ్యమే ఏర్పడింది.

క్రీ.శ. 573వ సంవత్సరములో తటోన్ రాజకుమారులైన తమల, విమల అన్నవారు నాగవంశోద్భవురాలైన తమ తల్లిపై అలుకతో పితృరాజ్యాన్ని పరిత్యజించి పీగూ ప్రాంతంలో ఒక పట్టణాన్ని కట్టుకొంటున్నప్పుడు, ఓడలలో ఆంధ్రరాజులు ఆ ప్రదేశానికి వచ్చి ఆ రాజ్యాన్నిగూర్చి కలహించారని, తుదకు వచ్చినత్రోవనే వారు వెళ్ళిపోయారని కొన్ని చరిత్రలు వివరిస్తున్నాయి. ఆ ప్రదేశంలో హంసలు వాలి ఉన్నందువల్ల ఆ ప్రదేశాన్ని 'హంసవాడి' అని పిలిచారని, దాన్నే తలైంగు భాషలో 'పీగూ' అని పిలవడం జరిగిందని ఇంకో ప్రసిద్ధగాథ చెబుతోంది. దీన్నిపుడు 'హంతావడి' అని పిలవడంకూడా కద్దు. ఈ పీగూ రాజ్యానికి మొదట తమలుడు పట్టాభిషిక్తుడయ్యాడు. క్రమంగా తూర్పువైపుగా రాజ్యాన్ని విస్తరింపచేశాడు. ఈ తమలుని అనంతరం విమలుడు రాజయినప్పుడు, పాలనసౌకర్యం కోసం సిట్టాంగ్ పట్టణాన్ని కట్టడం జరిగింది. విమలుని కాలంలోనే, క్రీ.శ. 590 ప్రాంతాలలో బిజ్జానగర రాజు పీగూమీదకు దండెత్తి పరాజితుడైనట్లు తెలుస్తోంది. హంటర్‌గారి ప్రకారం, ఆ బిజ్జానగరపు రాజు తెలుగు దేశానికి సంబంధించిన రాజై ఉండవచ్చును.

పూర్వం బర్మాలో ప్రప్రథమంగా చదవడం, వ్రాయడం నేర్చినవారు తలైంగు జాతివారే అని ప్రసిద్ధ చరిత్రకారు లందరూ అంగీకరించారు. తలైంగు జాతి పుట్టు పూర్వాలను గూర్చి ఇంతకు మునుపే ప్రస్తావించాను. తెలుగువాళ్ళ సంతానమే తలైంగులు. వారికి తెలుగు వర్ణమాలనే తెలుగువాళ్ళు నేర్పించి ఉంటారు. పూర్వ పల్లవులు వేంగి రాజ్యాన్ని పాలించినప్పుడు వేసిన శాసనాల్లోని లిపిక, పురాతన తలైంగువారి శాసనాల్లోని లిపికి పోలిక ఉందని బర్మాదేశ చరిత్రకారులైన హార్వే గారు పేర్కొన్నారు. అప్పటి పల్లవుల లిపియే బర్మాలో ప్రారంభింపబడింది. పల్లవుల లిపినుండి బర్మా లిపి పరిణామ వికాసాలను, చాలామంది భాషాశాస్త్ర పరిశోధకులు, లిపివేత్తలు అంగీకరించి వివరించారు.

బర్మీయులకు, ఆంధ్రులకు మధ్య ఇలాగే బహుముఖంగా అతి ప్రాచీనమైన సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. ఆ ప్రాచీనత విస్మృతి పాలు గాకుండా బర్మాంధ్రులు, చరిత్రకారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

క్రీ. శ. 1057 వ సంవత్సరము వరకు తలైంగు రాజులు లోయర్ బర్మాను పరిపాలిస్తుండగా, చివరి రాజైన 'మనూహా' మహారాజు తటోన్ (సువర్ణభూమి) నగరాన్ని రాజధాని నగరంగా చేసికొని పాలించాడు. అప్పట్లో ఉత్తర బర్మాను పరిపాలిస్తున్న అనవ్రత మహారాజు మనూహా మహారాజువద్ద ఉన్న త్రిపిటకముల కోసం దండయాత్ర చేశాడు. దుర్గంలోనికి ఆరుమాసాల పాటు ఆహారపదార్థాలను కూడా చొరనీయకుండా ముట్టడి చేశాడు. చివరకు తలైంగులు గత్యంతరము లేక లొంగిపోయారు.

పగాన్ రాజైన అనవ్రతుడు త్రిపిటకములతో సహా, చాలా తెల్ల ఏనుగులను, పండితులను, భిక్షువులను, చేతిపని నిపుణులను దాదాపు ముప్పైవేల మందిని తన వెంట ఖైదీలుగా గొనిపోయాడు. కొంతకాలానికి ఈ ఖైదీలే ఉదార హృదయంతో అనవ్రతుడిని మన్నించి, బర్మీయులకు నూత్న నాగరికతను నేర్పించి, సంస్కృతీ విజ్ఞానాలను ప్రసాదించారు. వివిధ కళా ప్రవీణులుగా చేశారు. ఆనాటి నుండే బర్మీయులకు లిపి పరిజ్ఞానము, దేశ పరిపాలనా పాటవము అబ్బినవి. అంటే క్రీ. శ. 1058 వ సంవత్సరము నుండి ఈ దేశ పరిపాలనను పూర్తిగా బర్మీయులే ప్రారంభించారు.

ఆంగ్ల బర్మీయ యుద్ధత్రయము

18 వ శతాబ్దివరకు బర్మీయులు నిరంతర పురోభివృద్ధిని సాధిస్తూ, పశ్చిమంలో అరకాన్ రాష్ట్రాన్ని, వాయవ్యంలో అస్సాం, మణిపూర్ రాజ్యాలను తమ దేశంలో కలుపుకొని; నిరాటంకంగా పరిపాలన చేస్తూ వచ్చారు. 18 వ శతాబ్దిలో కొందరు అరకాన్‌వారు అప్పట్లో బెంగాల్‌లో ఉన్న బ్రిటీషు ఈస్ట్ ఇండియా కంపెనీ వారిని ఆశ్రయించి మళ్ళీ తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నం చేయసాగారు. వారిని దగ్గరకు రానీయకుండా వెడల గొట్టాల్సిందని బర్మా ప్రభుత్వం కూడా కంపెనీని కోరింది. కాని ప్రయోజనం కలగలేదు. ఫలితంగా క్రీ. శ. 1824లో మొదటిసారిగా ఆంగ్ల బర్మీయ

యుద్ధం ప్రారంభమైంది. 1852లోనూ, 1885 లోనూ మరో రెండు యుద్ధాలు జరిగినాయి. దాదాపు 60 ఏళ్ళపాటు ఎట్టకన్నువేసి,చివరకు ఆంగ్లేయులు బర్మాను మొత్తంచేజిక్కించుకొన్నారు. కాని బర్మా ప్రజల్లో శాంతి నెలకొల్పడం సాధ్యం కాలేదు. తుదకు విధిలేక దక్షిణ భారత సేవాదళాన్ని బర్మాకు రప్పించి, వారి మూలంగా ఆంగ్లేయులు శాంతిని నెలకొల్పారు. అప్పట్లో ఎందరో తెలుగువారు బ్రిటీషువారికి మద్దతుగా బర్మా రావడం జరిగింది. శాంతి వెల్లి విరిసిన పిమ్మట కూడా కొంతమంది తెలుగు వీరులు, ఈ దేశంలోనే ఉండిపోయి బ్రిటీషువారికి తోడ్పడ్డారు. వీరి సంతతివారు కూడా మొన్నమొన్నటివరకు అక్కడక్కడ కన్పించేవారు.

ఆధునిక యుగంలో బర్మాకు ఆంధ్రుల వలసలు

బ్రిటీషు పాలనలో, తెల్లవారి రాజ్యస్థాపనకూ, పారిశ్రామికాభివృద్ధికి తోడు పడడానికి ఆంధ్రులెందరో బర్మాకు వివిధ కార్మిక రూపాల్లో వచ్చారు. రంగూన్ నగరము బర్మాకు రాజధానిగా, విదేశీయుల రాకపోకలకు, వస్తువుల ఎగుమతి దిగుమతులకు ముఖ్య రేవుగా, బర్మాదేశ పరిశ్రమలకు ముఖ్యకేంద్రంగా రూపొందించిన కారణంగా ఆంధ్రకార్మికుల ఆవశ్యకత దినదినమూ పురోగమించింది. ఆంగ్లేయులు గుత్తందారులను నియమించి, ఈ ఆంధ్రుల వలసను బాగా ప్రోత్సహించారు.

రేవులలో ఎగుమతి, దిగుమతి పనులలోను, బియ్యపు మరలలోనూ, కలప మరలలోనూ, ఇనుప కర్మాగారాలలోనూ, నగర నిర్మాణాదులలోనూ, పట్టణాల పారిశుద్ధ్యములలోనూ, ప్రయాణపు సౌకర్యాలలోనూ, చమురు భూములలోనూ, చమురు శుద్ధి కర్మాగారాలలోనూ, లోహపు గనులలోనూ, బొగ్గుగనులలోనూ, రబ్బరు తోటలలోనూ,కర్షక వృత్తులలోనూ, పట్టణ నీటి సరఫరా కొళాయిలలోనూ మొదలగు పెక్కు పనులలోను ఆంధ్ర కార్మికులే బర్మాలో ప్రధాన పాత్రలు వహించారు. ఈ దేశంలోని ఏనదుల్లో చూసినా, వేలాది పడవల్ని నడిపేవారు తెలుగువారే. బర్మాలో ఉన్న చిన్నా-పెద్దా నదులన్నిటిలోనూ, సమీపంలో వున్న సముద్ర శాఖల్లోనూ వేలాది చేపల వేటగాండ్రు అందరూ తెలుగువారే. పాపం! వీరు రేయింబవళ్ళూ నీటి మధ్య జీవితాన్ని గడిపేవారు. వీరికంటే శోచనీయమైన స్థితిలోనివారు ద్వీపాంతర దీపరక్షకులు. వీరిని మామూలుగా లైట్ హౌస్

పనివారని అంటారు. వీరు ఊరూ వాకిలి విడిచి, సముద్ర మధ్యంలో కట్టిన దీప గృహంలో ఆరు మాసాలపాటు, కాదంటే ఏడాదిపాటు జీవించాల్సి ఉంటుంది. ఆ నిర్జన సముద్ర గర్భంలో ఐదేసి మంది చొప్పున జట్టులుగా ఏర్పడి పని చేయాల్సి వస్తుంద. ఇంతకు మునుపు ఆ దీపగృహంలో ప్రధాన సంరక్షకులుగా ఇంగ్లీషువారుండేవారు. ఆ ఆంగ్లేయుడికి తోడు తెలుగువారు. క్రమంగా కొంత కాలానికి ఆ ప్రధాన దీప సంరక్షక పదవిని తెలుగు వారికే ఇచ్చి, ఇతనికి "హెడ్ లైట్ కీపర్" అన్న పేరూ, మిగిలిన వారికంటె కాస్త ఎక్కువ జీతం ఇచ్చారు.

బర్మాలో తెలుగువారు ప్రతిచోట, ప్రతి శాఖలోనూ ఇలా పనిచేస్తున్నారు. రాత్రింబగళ్ళు మానసికంగా, శారీరకంగా అమితంగా 'వాడుకో' బడుతున్నారు. ముఖ్యంగా మిట్టలు, గుట్టలు, చదునుచేసి, అడవుల డొంకల్ని చక్కదిద్ది, దార్లు వేసి, ఊళ్ళుగట్టి, మందిరాలు, కోటలు, ప్రహరీలు నిర్మించి ఈ దేశానికి రూపు రేఖలు దిద్దినవారిలో ఆంధ్రులే ప్రథములు.

ఈ వలస విధానం ప్రారంభమైన మొదట్లో కార్మికులకు తగినన్ని వసతుల్ని ఈ దేశంలో ఏర్పాటుచేయలేదు. దాని మూలంగా రోగాలకు గురై మరణించిన వారు, తగిన రక్షణ సౌకర్యాలు లేని మూలంగా పనిచేస్తున్నవాళ్ళు, హఠాత్తుగా ఆ కర్మాగారాల్లో అలాగే నలిగి పోయినవాళ్ళు, చితికిపోయి ముక్కలు ముక్కలైనవాళ్ళు, అమాంతం ఊబిలో దిగబడిపోయి అంతులేకుండా పోయిన వారు, ఆంధ్ర సోదరుల్లో ఎందరో?

ఇలాంటి అవ్యవస్థ పరిస్థితి పెచ్చు పెరిగిపోయిన సందర్భంలో 1924 నుండి కీ.శే. బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావు గారు బర్మా ప్రభుత్వ శాసన సభ్యులై ఈ కార్మిక సమస్యను కొంత మెరుగు పరచగలిగారు. సుమారు పన్నెండు సంవత్సరాలపాటు ఈ సమస్యను మెరుగుపరచడానికి ఆయన పోరాడారు. వీరి అనంతరం, వీరి శిష్య సదృశులైన కీ. శే. K. S. N. మూర్తిగారు, శ్రీ కోరాడ సూర్యనారాయణగారు, కీ. శే. కర్రి అప్పారెడ్డిగారు ఒకవైపు, డా॥ ఎ. డెవిడ్ గారు, శ్రీ రాబర్టు దొరగారు మరియొకవైపు ఈ పోరాటాన్ని కొనసాగించి, తీవ్రమైన కార్మిక సమస్యల్లో బహు ముఖంగా సేవలు చేశారు. వీరందరి మూలంగా ఈ సమస్య కొంతవరకైనా

మెరుగైంది. నేటికీ ఈ దేశంలో ఆచరణలో ఉన్న కార్మిక చట్టాన్ని ఆనాడు ఒక ఆంధ్రుడే రూపొందించాడని సగర్వంగా అనుకోవచ్చు. కీ. శ. 1900 సం॥ నాటికే ఆంధ్రులీదేశాన 50 వేలకు మించి ఉన్నట్లు, క్రమంగా 1941 నాటికి రెండు లక్షలకు పై బడ్డారని ఎప్పటికప్పుడు స్థానిక పత్రికలు, సంఘాలు, తమ నివేదికల్లో సూచించి ఉన్నాయి.

బ్రిటీషు పరిపాలనలో బర్మా దేశాన్ని 8 డివిజనులుగా, సుమారు 40 జిల్లాలుగా విభజించారు. వాటన్నిటిలో ఆంధ్రుడు లేని పట్టణమే లేదంటే అతిశయోక్తికాదు. ఆనాటి నుంచి ఆంధ్రుల జనాభాను ఈ క్రింది పట్టీలో ఉజ్జాయింపుగా సూచిస్తాను.

అఖిల బర్మా ఆంధ్రుల జన సంఖ్య సూచిక

క్రీ. శ. 1900 నుండి 1930 వరకు ...	50 వేలనుండి 1 లక్ష వరకు
క్రీ. శ. 1931 నుండి 1941 వరకు ...	1 లక్ష నుండి 2 లక్షలవరకు
క్రీ. శ. 1941 నుండి 1945 వరకు (రెండవ ప్రపంచ యుద్ధకాలం) ...	2 లక్షలనుండి $1\frac{1}{2}$ లక్షల వరకు
క్రీ. శ. 1945 నుండి 1955 వరకు ...	$1\frac{1}{2}$ లక్షలనుండి $1\frac{1}{2}$ లక్షలవరకు
క్రీ. శ. 1955 నుండి 1964 వరకు ...	$1\frac{1}{2}$ లక్షలనుండి 85 వేలు
క్రీ. శ. 1964 నుండి 1974 వరకు ...	85 వేలనుండి 16వేల వరకు

సాధారణంగా మన ఆంధ్రులు ఎంత శ్రీమంతులైనా, అద్దె ఇండ్లలో ఉండేవారే ఎక్కువ. కంపెనీలలో, పరిశ్రమలలో పని చేసేవారు మాత్రం, బారకాసులలో ఉంటారు. స్వంత ఇండ్లు, భవనాలు, భూములు, మిల్లులు ఇతర పరిశ్రమలు కలిగి ఉన్నవారు చాలా అరుదు. బర్మాకు వలస వచ్చిన ఆంధ్రులలో నూటికి తొంభై మంది హిందువులు; వారిలో చాలామంది నిరక్షరాస్యులు. క్రమంగా తమ జీవనోపాధి కోసం వచ్చిన కొందరు విద్యావంతులు ఉపాధ్యాయులుగా, గుమాస్తాలుగా, కార్యాధికారులుగా అనేక ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేసి జీవించారు.

నిఘా 149/2101

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఆంధ్రుల్లో నూటికి ఏభై వంతులు సామాన్యంగా చదువుకొన్నవాళ్లు పెరిగారు. విద్యాధికుల సంఖ్య మాత్రం నూటికి రెండు పాళ్ళయినా లేకపోయింది.

ఈ క్రింది పట్టికలో తెలుగు వారున్న ముఖ్యమైన జిల్లాలు, జిల్లాలవారి తెలుగు జనాభా చూపుతాను.

ప్రాంతం	రెండవ ప్రపంచ యుద్ధ పూర్వం క్రీ.శ. 1900-1941 వరకు	యుద్ధానంతరం క్రీ.శ. 1941-1964 వరకు	బర్మానుండి భారతీయుల తిరోగమనం మొదలు క్రీ.శ. 1964-74వరకు
1	2	3	4
1. రంగూన్ మహా నగరం, పరిసర ప్రాంతాలు	65000	35000	4000.
2. హంతావడీ, సిరియాం జిల్లాలు	10000	3000	500
3. పెగూ జిల్లా	9000	3000	500
4. తటోన్, మర్త బాన్, సిట్టాంగ్ జిల్లాలు	5000	1000	1200
5. మోల్మేన్ జిల్లా	25000	12000	3000
6. హెంజడా	16000	4000	200
7. బస్సిన్	25000	8000	600
8. మెర్గ్వి, తవాయి జిల్లాలు	10000	5000	2000
9. హ్యాంగ్మ్యా, బోగ్లే, ప్యాపూన్, చైలా, డేడియా ప్రాంతాలు	10000	3000	600

1	2	3	4
10. ప్రోం, తర్రావడి, ఇన్సిన్ జిల్లాలు	10000	2000	600
11. టాంగూ, ప్యిన్తనా, తాజీ, మింజాన్, మాండలే, మేమ్యో జిల్లాలు	15000	5000	1000
12. మిచ్చీనా, ఖామో, కత్తామింబు జిల్లాలు	8000	3000	300
13. ఇనాంబ్యాంగ్, ఛౌక్, మగ్వేజిల్లాలు	10000	3000	600
	2,18,000	87,000	15,000
మిగతా జిల్లాలలో ప్రస్తుతం ఉన్నవారు			2,000
			17,000

1962 మార్పు

1962 సంవత్సరం మార్చి నెల 2వ తేదీన బర్మాదేశ పరిపాలనా విధానంలో ఒక పెద్ద మార్పు వచ్చింది. నాటి నుండి పాలనావ్యవస్థ విప్లవ సమితి కైవశమైంది. విప్లవ సమితి ప్రభుత్వాన్ని చేపట్టినప్పటినుండి బర్మాలో వలస తత్వాన్ని నిర్మూలించే వత్తిడి ఎక్కువయింది. అందుకు ప్రాతిపదికగా 1964 మార్చి నెలలో విదేశీయుల వర్తక, ఉద్యోగాలను జాతీయం చేశారు. దీని మూలంగా విదేశీయులందరూ కంగారుపడ్డారు. జాతీయం చేసిన మొదటి సంవత్సరం లోపుగానే ఏభై శాతం భారతీయులు నిరాధారులయ్యారు. 1965 నాటికి డెభ్భై శాతం వరకు నిరాధారులైపోయారు. 1966 నాటికి పూర్తిగా నిరాధారులౌతూ, వెంటనే మాతృదేశానికిపోయి జీవనోపాధులు చూసుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించారు. బర్మానుండి భారతీయులు వెనక్కి పోవడం మొదలుపెట్టారు. 1974 నాటికి 20 లక్షలమంది భారతీయులకు బదులు

ఏ మూడు లక్షలమందో మిగిలారని చెప్పడం బాధాకరమైన సత్యం. రెండు లక్షలమండి ఆంధ్రులకు బదులు, గట్టిగా వెదికితే 16 వేలమంది మిగిలారు. ఈ మిగిలిన వారిలోకూడా సగంమంది మాతృభాషకు పూర్తిగా దూరమై పోయారు.

బర్మాలోని భారతీయులు మాతృదేశానికి పునరాగమనం తలపెట్టినప్పుడు భారతదేశ ప్రభుత్వమెంతో ఉదారంగా వ్యవహరించింది. బర్మాకు ఉచితంగా నౌకలను పంపి రవాణా సౌకర్యాలు అమర్చింది. 1964 జూలై 19వ తేదీ ఈ ఓడలను ప్రారంభించి, రంగూన్‌నుండి విశాఖ రేవుకు 17 ఓడలను, మదరాసు రేవుకు 108 ఓడలను నడిపింది. ఇండియన్ ఎంబసీవారి లెక్కల ప్రకారం 1975 ఫిబ్రవరి నెలవరకు విమానాల్లోగాని, నౌకల్లోగాని, భారతదేశాన్ని చేరిన బర్మా కాందిశీకుల సంఖ్య మూడున్నర లక్షల పైబడి ఉండవచ్చు. వీరిలో దాదాపు 30 వేలమంది ఆంధ్రులు కూడా ఉంటారు. నౌకలద్వారా ఉచితంగా వస్తున్న ఆంధ్ర సోదరులు, ఒక్క ఆంధ్రప్రదేశ్ కాకుండా, భారతదేశంలోని భిన్న ప్రాంతాలకు చేర్చబడుతున్నారు. ప్రయాణ పత్రాలు సిద్ధంచేసికొని, బర్మాను వదలడానికి సన్నద్ధమైన తెలుగువాళ్ళు ఇంకో రెండు వేలమంది వరకు ఉన్నారని, సెంట్రల్ రిలీఫ్ కమిటీవారు పేర్కొంటున్నారు. ఈ మరలిపోకల కార్యక్రమంలో భారత కార్యాలయాలద్వారా ఆల్ బర్మా ఇండియన్ కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్సువారు, ఆంధ్ర మహాజనసంఘంవారు, బర్మా తమిళసంఘంవారు, నాడార్ మహా జనసంఘంవారు, తదితర సేవాదళ ములవారు శక్తివంచన లేకుండా నేటిదాకా ప్రయాణీకులకు సహకరిస్తున్నారు.

బర్మా కాందిశీకులపట్ల భారత ప్రభుత్వం సానుభూతితో ఉద్యోగాలు, ఋణాలు, తాత్కాలిక వసతులు, క్యాంపులలో భత్యాలనుఇచ్చి ఆదరిస్తోంది. ఆంధ్రదేశంలో కూడా ఈ కాందిశీకులపట్ల ఔదార్యంతో వ్యవహరించి, పునరావాస వసతుల్ని కల్పించటానికి సహకరించాల్సి ఉంది. కొన్ని శతాబ్దాలుగా దూరదేశంలో ఉండిపోయి, ఈ రోజు నిరాధారంగా వస్తున్న సోదరుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత వారిమీదఉంది. బర్మా ఆంధ్రుల విషయాల్లో కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయి. ఉదాహరణకు కులాల పట్టింపు ఇక్కడివారికి పూర్తిగా లేదు. వీరు ఆంధ్రదేశం వచ్చినప్పుడు, ఆ పట్టింపులలో వివాహాది విషయాల్లో

వ్యవహరిస్తే, చాలా ఇబ్బంది ఏర్పడుతుంది. కొన్ని దశాబ్దాలుగా, దూర దేశంలో ఉండిపోయి, ఆ దేశ సంస్కృతినికూడ తమలో గర్భీకరించుకొన్న వారిని సహృదయంతో అర్థంచేసికొని సహకరించాల్సిన బాధ్యత ఎంతైనాఉంది. ఎంతో సహృదయంతో అర్థంచేసికొని ఆదుకున్నప్పుడు శరణాగతులై వస్తున్న వారికి సుఖశాంతులు సంప్రాప్తిస్తాయి.

ఈ దరిమిలా ఆంధ్రదేశంలో కొన్ని బర్మా కాందిశీకుల సంఘాలు నెలకొని, రాష్ట్రీయ సోదరులకు కాందిశీక సోదరులకు మధ్య ప్రేమవల్లికను పుష్పింప చేయడానికి ప్రయత్నిస్తున్నాయని తెలుస్తోంది. విశేషించి, విశాఖ పట్టణములో శ్రీ మల్లవరపు అర్జునరావుగారి అధ్యక్షతలో నడుస్తున్న బర్మా ఆంధ్రుల కాందిశీక సంఘం చాలా కృషి చేస్తోందని వార్తలంది ఇక్కడి వారికి ఎంతో సంతోషాన్ని, బలాన్ని కలిగిస్తున్నాయి.

బర్మాలోని ఆంధ్ర ప్రముఖులు

కీ.శే. అవటిపల్లి నారాయణరావుగారు
B.Sc., M.A.

బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావుగారు ఇక్కడి తెలుగు ప్రముఖుల్లో చెప్పుకోదగ్గ మొదటివారు. 1920 ప్రాంతంలో ఆయన ఒక నౌకలో భారత దేశంనుండి అమెరికా వెళ్ళుతున్నారట. సరకుల్ని ఎగుమతి చేసికోడానికి మధ్యలో ఆ నౌక రంగూన్‌లో ఒకపూట ఆగడం జరిగింది. ఆపూట రంగూన్ రేవును చూడ్డానికై నారాయణరావుగారు దిగారు. దేశదేశాలనుండి వచ్చిన ఓడలతో నిండిఉన్న రంగూన్‌రేవు కన్నులపండువగా వుంది. ఓడల్లోకి సరకుల్ని నింపడం, ఓడలనుండి దించుకోవడం వగైరా పనుల్లో ఉన్న వారందరూ తెలుగువారే. నగరంలో రిక్షాలు లాగుతూ పరుగెత్తుతున్న వాళ్ళు, రోడ్లు ఊడుస్తున్నవారు, కాలువలు శుభ్రం చేస్తున్నవారు, వగైరా పనుల్ని చేస్తూ ఎందరో తెలుగువారు అగుపించారు. తెలుగువాళ్ళ చేతులమీదుగా నగరం ముస్తాబవుతోంది. రావుగారు ఒక గుర్రపుబగ్గీ మీద ఊరంతా తిరిగారు. తెలుగు శ్రామికుల నిష్ఠుర కష్టాలను కళ్ళారా చూశారు. అమెరికా దేశానికి ప్రయాణమై పోతూ బర్మాదేశానికి రాగలిగే అవకాశం ఎప్పుడైనా తనకు కలిగితే బర్మాలో ఉన్న భారతీయ కార్మికులకు న్యాయం కలిగేలాగ పాటుపడాలి, వారి పనుల్లో సక్రమ వ్యవస్థ ఏర్పడడానికి సేవచేయాలి అని మనసులో అనుకొన్నారట.

ఆ అనుకొన్న వేళా విశేషం ఏమిటోగాని, అలాగే ఆయనకు కోరుకొన్న అవకాశం కలిసివచ్చింది. అప్పట్లో దేశమంతటా జాతీయోద్యమాలు నడు

స్తున్న దినాలు. బర్మాలో కూడ జాతీయోద్యమ కారణంగా రంగూన్ కాలేజి విద్యార్థులు, ఉపాధ్యాయులు 1922లో సమ్మె చేశారు. ఆ సమ్మె ఫలితంగా 1923లో బర్మాదేశ జాతీయ నాయకులు రంగూన్ ష్వేడగోన్ పగోడా ఆవరణలో రంగూన్ నేషనల్ కాలేజిని స్థాపించారు. అప్పటికి భారత కాంగ్రెసు అధ్యక్షురాలిగా శ్రీమతి అనిబిసెంటుగారు కలకత్తాలో ఉన్నారు. బర్మా నాయకులైన ఊబాఫే, ఊమౌంగ్, మౌంగ్ గార్లు తమ నేషనల్ కాలేజికి ఇంగ్లీషులోనూ, ఆర్థికశాస్త్రంలోనూ, గణితశాస్త్రంలోనూ సమర్థులైన అధ్యాపకులు కావాలని శ్రీమతి అనిబిసెంటుగారికి లేఖ వ్రాశారు. బిసెంటుగారు మన అవటిపల్లి నారాయణరావుగారిని, ఇంకొక బెంగాలీ సోదరుని సిఫారసు చేశారు. బర్మా నాయకులు అవటిపల్లి నారాయణరావుగారిని నేరుగా వాకబుచేశారు. అప్పట్లో ఆయన బందరునుండి ముట్నూరి కృష్ణారావుగారి సంపాదకత్వంలో వెలువడుతూన్న కృష్ణాపత్రికలో పనిచేస్తున్నారని వినికిడి నారాయణరావుగారికి ఎన్నడో తన మనసులోపుట్టిన కోర్కె నెరవేరే క్షణం వచ్చిందనిపించింది. వెంటనే అంగీకరించారు. రెండుసంవత్సరాల ఒప్పందంమీద బర్మాకువచ్చారు.

నారాయణరావుగారు నేషనల్ కాలేజిలో ఉద్యోగం చేస్తూ, నెమ్మదిగా శ్రీ దొమ్మేటి వెంకటస్వామిగారితో పరిచయం సంపాదించుకొన్నారు. తరచూ వారిని కలుసుకొంటూ కార్మికుల సమస్యలను గురించి చర్చిస్తుండేవారు. ఒక ఏడాది అనంతరం కాలేజిని మూసివేయడం జరిగింది. కాని నారాయణరావుగారు ఇక్కడే ఉండిపోయి, శ్రీ దొమ్మేటి వెంకటస్వామిగారి అండతో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని దృఢ నిశ్చయులయ్యారు. మొట్టమొదట వెంకటస్వామిగారిని మునిసిపల్ కౌన్సిలర్ ఎన్నికలకు నిలబడమని ప్రోత్సాహపరిచి, విజయానికి తీవ్రంగా కృషిచేశారు. వెంకటస్వామిగారు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత నారాయణరావుగారే బర్మాప్రభుత్వపు శాసన సభ్యత్వానికి పోటీచేసి, ఎక్కువ ఓట్లతో గెలుపొందారు. క్రమంగా కార్మికుల సమస్యలకు సంబంధించిన తీర్మానాలు అనేకంగా శాసన సభలో ప్రవేశపెట్టి నెగ్గింపజేశారు. భారతీయ కార్మికులకు నాయకుడై కంపెనీలకు, పరిశ్రమల యజమానులకు, మేస్త్రీలకు సంబంధించి పరిశీలనలు, హెచ్చరికలు అధికార పూర్వకంగా చేశారు. ఇంగ్లీషు, తెలుగు పత్రికలన్నిటికోసు వివిధ కార్మిక

చట్టాలను గూర్చి వ్రాస్తూ, పరిశ్రమ యజమానుల స్వార్థబుద్ధులను ఎత్తి చూపుతూ సూటిగా హెచ్చరించారు. వీటిమూలంగా పారిశ్రామిక చట్టాన్ని ఉల్లంఘించే యజమానులకు, ప్రభుత్వపు పోలీసుశాఖ వారికి, కార్పొరేషన్ వారికి, కస్టమ్సు శాఖ వారికి, పోర్టుకమీషనర్ చాటుగాఉన్న లంచగొండిదారులకు ఆయన పేరు సింహస్వప్నంగా పరిణమించింది. అనుమానంగా ఉన్న ప్రతి చోటుకు ఆయన వెళ్ళి, స్వయంగా పరిశీలించి సత్వర చర్యలు తీసికొనేవారు. పరిశ్రమాధిపతులందరూ నారాయణరావుగారిని 'మంచి' చేసికోవడానికై ఎన్నో ప్రయత్నాలు, సన్మానాలు చేసినా ఆయన లొంగలేదు. ఆయన అపారకృషి మూలంగా అన్ని విధాలా కార్మికుల సమస్యలను పరిష్కరించి సవరించడానికి దాదాపు పదేళ్ళు పట్టినా, మేస్త్రీల విషయంలో కఠిన చర్యలు తీసికోవడానికి అనుకూలించలేదు. చివరకు మేస్త్రీలపై రావుగారు దృష్టిని కేంద్రీకరించేటప్పటికి కార్మిక జనాంగంలో సమ్మెలు, దేశీయ విదేశీయ భేదాలు, ద్వైధీ భావాలు రేకెత్తసాగాయి. వీటికి తోడు జాతీయ స్వాతంత్ర్యోద్యమాలు అధికమై, ద్వితీయ ప్రపంచ యుద్ధం సమీపించి భారత కార్మికుల తిరోగమనము కూడ ఆరంభమైంది.

బ్రహ్మశ్రీ అపటిపల్లి నారాయణరావుగారు "బర్మా ఆంధ్రకేసరి" బర్మాలోని ఒక్క తెలుగువారి కోసమే కాకుండా, యావద్భారత జాతికోసం ఆయన తన సేవాపాటవాన్ని ధారపోశారు. తెల్లవారికి ఆయన అంటే సింహస్వప్నము. ఆ నల్లని భారతీయ పుణ్యమూర్తి ఏ కార్యాలయానికి వెళ్ళినా, అక్కడి తెల్ల దొరలు సగౌరవంగా లేచి సన్మానించేవారు. వారు వెళ్ళిపోయాక తమలోతాము "భారత సింహము" (Indian Lion) వచ్చి వెళ్ళిందని అనుకొనే వారట. నారాయణరావుగారు చాలామంది తెల్లదొరలపై సైతము శిక్షలు పడేటట్లు చేశారు. ఒకసారి వారు తెలుగులో నడుపుతున్న కార్మిక పత్రికపై ఒకరు మాన నష్టపు దావా వేశారట. కాని, ఎక్కడనో రహస్యంగా దాచిన రికార్డులను పట్టించి, లండన్‌లోని ప్రధాన కార్యాలయంలో దాచిన రికార్డులతో పరిశీలింపచేసి చివరకు ఆయన కేసులో విజయాన్ని సాధించారు. దాని మూలంగా చాలా మంది తెల్లవారిని నేరస్థులుగా నిరూపించి పట్టించారు. తెల్ల వారి ప్రభుత్వంలో తెల్లవాళ్ళను అంతధైర్యంగా ఎదుర్కొన్న గుండె నిబ్బరం ఒక్క నారాయణరావుగారి సొత్తు. బర్మా భారతీయ కార్మికులు, నాయకులు,

విద్యార్థులు ఆయననుండి ఎన్నో విషయాలను నేర్చుకోగలిగారు. తెలుగువారికోసం తరచూ శ్రీ వెలగల వెంకటరెడ్డిగారి ఆధ్వర్యంలోవున్న సునేరా హోటల్లో ఆయన గొప్ప గొప్ప సభలనుజరిపించేవారు. వారి సాహసం, ఆత్మాభిమానం ఇక్కడి తెలుగువారందరికీ సదా మార్గదర్శకంగా నిలిచాయి.

రంగూన్ నగరంలో వారి అభిమానానికి అధికంగా పాత్రమైన వారిలో కి.శే. కె.ఎస్.ఎన్. మూర్తిగారు ప్రథములు. వారిద్దరూ ఎక్కడకువెళ్ళినా తండ్రీ కొడుకులని చూసినవారు భావించేవారట. మూర్తిగారు కూడా వారికి అన్ని విధాలా కుడిభుజంగా నిలిచారు. వారికి కావాల్సిన సదుపాయాలన్నిటినీ మూర్తి గారే చూసికొనేవారు. పంతులుగారి కార్మికోద్యమాలన్నిటికీ మూర్తిగారు సర్వ విధాలా సాయపడుతుండేవారు. కడపటి దినాల్లో మాత్రము, గురువుగారి సిద్ధాంతాలతో తాను విభేదిస్తున్న మూలంగా దూరమయ్యారు.

కి.శే. అవటిపల్లి నారాయణరావు పంతులుగారు బర్మాలో సరైన కార్మిక చట్టాన్ని నిర్మించి తన జీవితాన్నే బర్మాలోని భారతీయ కార్మికులకోసం, తెలుగు సోదరులకోసం అర్పించిన మహాపురుషుల్లో ఒకరు. బర్మా ఆంధ్రుల మొదటి జోహార్లు ఆయనకే చెందుతాయి.

కి. శే. దొమ్మేటి వెంకటస్వామి



కి.శే. దొమ్మేటి వెంకటస్వామిగారు రంగూన్ ఆంధ్ర మహాజన సంఘం అధ్యక్షులు, శాశ్వత రాజపోషకులు. బర్మాదేశ శాసన సభ్యులుగా, రంగూన్ పురపాలక సంఘ సభ్యునిగా, ఆనరరీ మేజిస్ట్రేటుగా సేవ చేశారు. తనలోని సేవాపరాయణత, విద్యాసంస్కారాలు మూలంగా ఈయన బర్మా ఆంధ్రుల శాశ్వత నాయకులయ్యారు. రంగూన్ కార్పొరేషన్‌లో నుండి రంగూన్ నగరానికి వెంకటస్వామిగారు చేసినంత సేవ ఇంతవరకూ మరే భారతీయ

సభ్యుడూ చేయలేదు. సరైన రోడ్లు లేనిచోట రోడ్లు వేయించారు. రంగూన్ రోడ్ల పక్కన లాంతరు స్తంభాలు, కొళాయిలు పెట్టించారు. పట్టణ సౌందర్యానికి, పారిశుద్ధ్యానికి, ఆరోగ్య వసతులకు తమ యావచ్ఛక్తినీ వినియోగించారు. ఆనాటికి ప్రపంచంలో ఎక్కడా నిర్మాణం గాని వాషింగ్ హౌస్‌ను కాండాంగ్లే ప్రాంతంలో చాకలిపాట పక్కగా ఇరవై ఎకరాల ఆవరణలో నిర్మించడానికి ముఖ్య కారణము వెంకట స్వామి గారే. అందులో ప్రతి దినం కనీసం వేయిమంది పని చేసికోగల సౌకర్యం ఉంది.

రంగూన్ ఆంధ్ర మహా జనసంఘం వెంకట స్వామిగారి భుజస్కంధాల మీదుగా అభివృద్ధి పొందింది. ఈ సంఘంలో దిన, రాత్రి పాఠశాలలు, పఠన మందిరాలు, సంగీత వ్యాయామ క్రీడాదులు మొదలైన అనేక శాఖలున్నాయి. ఇన్ని శాఖలతోటి సంఘాన్ని సమర్థ వంతంగా నిర్వహించడమే కాకుండా కాందోం ప్రాంతంలో స్వంత భవనాన్ని నిర్మించి, 500 మంది తెలుగు బిడ్డలకు విద్యా వసతిని కల్పించారు. దానిని మహా జనసంఘం అనుబంధ శాఖగా తయారు చేశారు. ఈయన చేసిన సేవ, ఉపకారం ఒక్క తెలుగు వారేకాక, బర్మాలోని భారతీయు లందరూ మరుపరానిది.

కో. శే. మల్లాది సత్యలింగం నాయకరు

శ్రీ మల్లాది సత్యలింగం నాయకరుగారు ఆంధ్రులు; శ్రీమంతులు; ఆంధ్ర ప్రజల హితాభిలాషులు. బర్మాలో పేరొందిన కాంట్రాక్టరు. తమ చివరి క్షణందాకా వీరు ప్రజోపయోగ కార్యక్రమాల్లో అపారమైన ఆశక్తిని, శ్రద్ధను చూపించారు. చివరకు మరణిస్తున్న సమయంలో కూడా ఒక్క కలం గీటుతో ఎనిమిది లక్షల రూపాయల ఆస్తిని కేవలం ప్రజోపయోగ కార్య క్రమాలకే కేటాయించారు. 1912 లో వ్రాయించిన తన వీలు నామాలో ఇలా పేర్కొన్నారు. 1. విశాలమైన ఆటస్థలం కలిగి, జిమ్నేజియమ్ ఏర్పాటుతో, కాకినాడ జగన్నాథ పురంలో ఒక ప్రాథమిక పాఠశాలను నెలకొల్పడం. 2. సదరు పాఠశాలకు సమీపంగా ప్రతి దినం రెండు వందల మంది బీదల అన్నదానం కొరకు ఒక పెద్ద సత్రం నిర్మించటం 3. కాకినాడ సమీపంలోని చొల్లంగి గ్రామంలో స్థిరమైన వసతులతో ఒక దేవాలయాన్ని నిర్మించడం. ఈ మూడింటి కొరకు ఒక లక్ష రూపాయలను కేటాయిస్తూ, మిగిలిన 7 లక్షల

మీద పచ్చే వడ్డీ సొమ్ముతో పై ధర్మ కార్యాలను పోషించాలని కోరారు. తన కున్న ఇరవై లక్షల ఆస్తిలో ఎనిమిది లక్షలను ఇలా కేటాయించారు. పై ఏడు లక్షల రూపాయల నుండి వస్తున్న వడ్డీ సొమ్ములో సాలీనా నాలుగు వేల రూపాయలను, చెన్నపురి రాజధానిలో ఏటేటా ఒక హిందూ విద్యార్థికి విద్యా భ్యాసం కొరకు విదేశాలు పంపడానికై కేటాయించ మన్నారు. ఇవే కాకుండా రంగూన్ కంబే ప్రాంతంలో ఒక పెద్ద పెరుమాళ్ కోవెలను కట్టించి శాశ్వతంగా వారి కుటుంబంలోని వారికే యాజమాన్యం ఇవ్వాలని కోరుతూ వ్రాసిన శాసనం ఒకటి ఆ గుడి ముంగిట ఉంది. ప్రస్తుతం ఆ వెంకటేశ్వర పెరుమాళ్ కోవెల ఆయన కుమారుడైన మల్లాది వెంకటరామనాయకర్ గారి నిర్వహణలో ఉంది. రంగూన్‌లో ఉన్న విష్ణ్వాలయాలన్నిటిలోకి, దీన్నిమించిన పెద్ద ఆలయం లేదు. ఈ ఆలయంలో సంప్రదాయబద్ధమైన కొన్ని ప్రత్యేక నిర్మాణాలు, చిత్రకళా రీతులు ఉన్నాయి. సంప్రదాయంపట్ల మిక్కిలి ప్రీతిని కలిగించేలాగ ఉన్నాయి. ప్రస్తుతం తెలుగువాళ్ళలో వీరి ప్రసక్తి తరచూ రాకపోయినా, వీరి సేవలను ఎవరూ మరువలేదు. బ్రహ్మశ్రీ నారాయణరావు పంతులుగారు వీరిని తమ 'విశాలాంధ్ర' గ్రంథంలో వేనోళ్ళ కొనియాడారు.

కే. శే. పరిమి సోమరాజు

శ్రీ పరిమి సోమరాజు గారు మర్తబాన్ రైల్వే కంట్రాక్టరుగా పేరు పొందారు. పడవల యజమానులు. మోల్మేన్ ఆంధ్ర మహాజన సంఘానికి అధ్యక్షులు. వేలాది ఆంధ్ర కార్మికుల అభిమానానికి పాత్రులైనవారు. సోమ రాజు గారు మోల్మేన్ పట్టణంలో తెలుగుకోసం, తెలుగువారికోసం బహు విధా లుగా పరిశ్రమించారు.

సోమరాజు గారు మోల్మేన్ రాకపునుపు అక్కడ ఆంధ్ర సంఘాలు లేవు. ప్రజా సమావేశాలు లేవు. పత్రికా పఠనం లేదు. పాఠశాలలు లేవు. వారు వచ్చిన కొద్ది కాలంలోనే మోల్మేన్ ఆంధ్ర మహాజన సంఘాన్ని స్థాపించి, పాఠ శాలలను ప్రారంభించారు. సంఘానికి పాఠశాలలకు ఎలాంటి అంతరాయాలు కలుగకుండా జాగ్రత్తగా కాపాడుకొంటూ వచ్చారు. పాఠశాలకు స్వంత భవనం లేక ఇబ్బంది ఎదురైనప్పుడు, మిత్రుల సహాయంతో చాసంగా భవనాన్ని సంపాదించి, చాలా చాకచక్యంతో సంఘాన్ని నిలబెట్టారు.

ప్రజలందరితోటి కలసిమెలసి తిరుగుతూ, వారి కష్టసుఖాలను స్వయంగా విచారించి, తగు సహాయం చేసేవారు. ఒకమారు కార్మికుల కూలిరేట్లు తగ్గిపోగా, కార్మికులందరూ గొప్ప సంక్షోభానికి గురికావాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆయన మధ్యవర్తిగా ముందుకువచ్చి, కార్మికులపక్షాన అధికారులతో సంప్రదింపులు జరిపి, ఆ సంక్షోభ స్థితి నుండి కార్మికులనందరినీ తప్పించగలిగారు. సామాన్యులందరిలోనూ గొప్ప ఆత్మవిశ్వాసం, ఆత్మవిచారణ రేకెత్తించి, ప్రజాభ్యుదయానికి కృషిచేశారు. దేశోద్ధారక స్వర్గీయ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు మోల్మేను నగరాన్ని సందర్శించటానికి వచ్చినప్పుడు, వీరు ఆతిథ్యమిచ్చి పంతులుగారికి ఆత్మీయులయ్యారు.

శ్రీ రెడ్డి సన్యాసయ్య



శ్రీ రెడ్డి సన్యాసయ్య గారు రంగూన్లో ఉన్న ఆంధ్ర సంస్థలన్నిటికీ కామధేనువు వంటి వారు. ప్రతి ఆంధ్ర సంఘాన్ని ఆయన తన శరీర భాగంగానే భావించారు. దానధర్మాలు చేయడంలో ఆయన అపర కర్ణుడిగా పేరు పొందారు. దానధర్మాలు చేయడంలో ఆయన కళావిశేషాలు గానీ, విసుగు గానీ గమనించిఎఱుగరు. సన్యాసయ్య గారికి కళలంటే అమితమైన అనురాగం. కవులు,గాయకులు, హరిదాసులు, గుడులు కట్టేవారు, చెరువులుత్రవ్వేవారు ఎవరొచ్చినాచేతినిండుగా ఇచ్చి పంపేవారు.ఫుట్బాల్, బ్యాడ్మింటన్ టోర్నమెంటులను గానీ, స్వచ్ఛంద సేవాదళాలు, సాంస్కృతిక సంస్థలు, భక్తజన సమితులను గానీ నిర్వహించేవాళ్ళను మొట్టమొదట హార్దికంగా, ఆర్థికంగా ప్రోత్సహించేది సన్యాసయ్యగారే. సన్యాసయ్యగారు స్వయంగా నాటక సమాజాలను కూడా నిర్వహిచారు. రంగూన్ స్టీవడోర్ లేబర్ కంట్రాక్టరుగా ఉన్నప్పటికీ, కళలపట్ల యువజనుల సాంస్కృతిక కార్యకలాపాలపట్ల అమితమైన ఆసక్తిని కనబరుస్తూ, సదా వారికి అండగా నిలబడి ఉండేవారు. క్వెట్టా భూకంపం కలిగినప్పుడు, చావగా మిగిలిన ఆ ఊరి ప్రజానీకం తిండికి, బట్టకు నోచుకోక అనాథలైపోయినప్పుడు, సన్యాసయ్య గారు తన యువజన మిత్ర బృందము ద్వారా కొంత ధనాన్ని, కొన్ని తానుల బట్టను సేకరించి వైస్రాయి నిధికి బర్మా ఆంధ్రుల పేర పంపి

శాశ్వతమైన కీర్తిని తెలుగువారందరికీ సంపాదించి పెట్టారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ఏలూరు పట్టణములోని రంగూన్ భవనంలో నివసిస్తున్నారు.

కో. శే. వెలగల వెంకటరెడ్డిగారు

శ్రీ వెలగల వెంకటరెడ్డి గారు రంగూన్‌లో ఆంధ్ర జాతీయ నాటక సభను స్థాపించారు. తెలుగువారి సాంస్కృతిక ఘనతను బర్మా దేశీయులకు చాటి చెప్పారు. అంతదాకా బర్మాలో తెలుగు వాళ్ళను కోరంగీలు అని పిలుస్తూ హేయదృష్టితో చూచిన వారు ఎక్కువ. తెలుగువారు కోరంగీలు కాదనీ, సాంస్కృతికంగా ఉజ్జ్వలమైన చరిత్రను కలిగిన వాళ్ళని, వాళ్ళకు తెలుగులు, ఆంధ్రులు అన్న పేర్లు ఉన్నాయని, మహోన్నతులైన కవులు, పండితులు, రాజులు, నాయకులు, వీరులు, త్యాగధనులు తెలుగు ప్రజల్లో జన్మించారని ఆంధ్రేతరులకు విశదం చేశారు. తమ నాటక సమాజం ద్వారా, బర్మాలోని ముఖ్య ప్రాంతాలంతటా నాటకాలు ప్రదర్శించి తెలుగు ఘనతను ప్రచారం చేశారు. రంగూన్‌లోని ఆంధ్ర సేవా సంఘం మూడు నాలుగు ప్రాంతాల్లో దిన, రాత్రి పాఠశాలలను నిర్వహించిందంటే వెంకటరెడ్డి గారి శక్తి సామర్థ్యాలే ముఖ్య కారణాలు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లో కూడా 'ఇతిహాస తరంగిణీ గ్రంథమాల' అన్న సంస్థను నెలకొల్పి ఆంధ్రుల చరిత్రలో తృతీయ భాగ ప్రకటనకు తోడ్పడి, ఆంధ్రదేశానికి అందించారు. వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థలకు, సత్కార్యాలకు రెడ్డిగారు విరివిగా తోడ్పడి సేవ చేశారు.

కో. శే. గుత్తుల సూర్యనారాయణ



శ్రీ సూర్యనారాయణగారు భూస్వాములు, పడవల యజమానులు, కెట్టి బలిజ సంఘానికి అధ్యక్షులుగా, శ్రీ రామాలయానికి ధర్మకర్తలుగా ఉండి సేవ చేశారు. శ్రీ దొమ్మేటి వెంకటస్వామి గారి అనంతరం, రంగూన్ ఆంధ్ర మహాజన సంఘం, సంఘం పాఠశాలలు సూర్యనారాయణ గారి ముఖ్య సహకారంతో పురోగమించాయి. వీరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళిన పిమ్మట కూడా, తూర్పు గోదావరి జిల్లా బోర్డుకు ఉపాధ్యక్షులుగా

ఎన్నికై గణనీయమైన సేవ చేశారు. అక్కడి గ్రామవాసులు ఇప్పటికీ ఈయన చేసిన ప్రజోపయోగ కార్యాలను ప్రశంసిస్తూ ఉంటారట. వీరు ఎక్కడకు వెళ్ళినా గొప్ప ఉదారహృదయులని పించుకొన్నారు.

కే. శే. పెసిని భూలోకం

బస్సిన్ పట్టణంలోని శ్రీమంతుల్లో కీ.శే. పెసిని భూలోకం గారు ఒకరు. వీరు పడవల యజమానులుగా, భూస్వాములుగా ఉన్నప్పటికీ, తెలుగు సాంస్కృతిక సంస్థలపట్ల గొప్ప ఆసక్తిని కనబరచారు. బస్సిన్ ఆంధ్రుల కొరకు నాటకాలను, సంగీత కచేరీలను, తోలుబొమ్మలాటలను, యక్షగానాలను రంగూన్ నుండి రప్పించి ప్రదర్శింప చేసేవారు. ఆంధ్ర సాంస్కృతిక సంస్థలకు భూరి విరాళాలనిస్తూ ప్రోత్సహించేవారు. తనవద్ద కెవరైనా కవులు గాని, నటులు గాని, హరిదాసులు గాని వస్తే శక్తికొద్దీ ధనసహాయం చేస్తుండేవారు. తన సంపదను కేవలం కళాప్రియత్వంకొద్దీ కాక, ఔదార్యంకొద్దీ ఖర్చు పెట్టేవారు. బీదసాదలకు ఈయన చేసిన సహాయాన్ని ఇప్పటికీ ఇక్కడివారు మరువలేదు.

బస్సిన్ పట్టణంలో మన ఆంధ్రులు ఎక్కువ భాగం బియ్యపు మరలలో పనిచేస్తుంటారు. ఒక్కొక్క మర ఉన్న ప్రాంతంలో దాదాపు ఐదువేల మంది భారత కార్మికులు, వర్తకులు నివసిస్తూ ఉంటారు. వీరిలో కనీసం సగ భాగం ఆంధ్రులే. వీరికోసం ప్రతి ప్రాంతంలోనూ కనీసం ఒక ఉపాధ్యాయుడినైనా రప్పించి, అక్కడి ప్రముఖులు వీధి పాఠశాలలను నిర్వహిస్తుంటారు. భూలోకం గారు తన యాజమాన్యంలో ఒక ధర్మ పాఠశాలను నిర్వహింపచేశారు. వీరికి ఆదినుండి ధర్మకార్యాలన్నా, దైవచింతన అన్నా తెగని ఆసక్తి, శ్రద్ధ. చివరికి తాను రప్పించే నాటకాల్లో కూడా భక్తిరసమే ప్రధాన రసంగా ఉండేటట్లు చూసి ఎంచుకొనేవారు.

శ్రీమతి జున్నూరు మాణిక్యమ్మ

శ్రీమతి జున్నూరు మాణిక్యమ్మగారు బస్సిన్ పట్టణంలో గొప్ప లేబర్ కంట్రాక్టరు. వీరి శ్రీవారు లౌకిక విషయాల్లో ఎక్కువ శ్రోక్యం పెట్టుకోక, ఎక్కువగా ఆధ్యాత్మిక చింతనలో ఉంటారు. మాణిక్యమ్మగారే అన్ని విషయాలలోనూ శ్రద్ధ తీసికొని, ఇంటా బయటా ఓర్పుగా నిర్వహించేవారు. మాణిక్యమ్మగారికి తెలుగులో మంచిపాండిత్యం ఉంది. సాహిత్యంఅన్నా, సౌజన్యంఅన్నా వీరికి అపరి

మితమైన తాత్పర్యం. పేదవారికి సాయపడే వారిలో మొదటి పేరు మాణిక్యమ్మ గారిదే. ప్రతిదినం ఉదయాన స్నానానంతరం దైవారాధనలో ఎక్కువ సమయం గడుపుతుంది. ఆ తర్వాత పది పదకొండు పేద ఇళ్ళకు భోజన పదార్థాలు పంపిగాని, తాను ఫలహారం చేయదు. ఇది ప్రతిదినం వారి ఇంటి కార్యక్రమం. తమ బిడ్డల పెళ్ళిళ్ళు జరిపించే శక్తిలేనివారు ఎవరైనా ఆమెకు తెలిపితే, స్వంత ఖర్చులమీద వారు ఎంచుకున్న వధూవరులకు వివాహాలు జరిపిస్తుంది. ఏడాదికి కనీసం రెండైనా ఇలాటి ధర్మ కల్యాణాలు ఈమె జరిపించే వారు. సాయంకాలాల్లోనూ, పండుగ దినాల్లోనూ పురాణాలు, పుణ్యకథలు చదివి చుట్టూ ఉన్నవారికి వినిపించేవారు. ఎప్పుడైనా పెళ్ళిళ్ళ సమయాల్లో పురోహితులే మంత్ర పఠనంలో తబ్బిబ్బు పడితే, స్వయంగా చదివి మంగళ కార్యాన్ని నిర్వహించేవారు. తాను నిర్వహిస్తున్న ప్రాంతంలో కే॥శే వాసనశెట్టి గణపతి పంతులుగారిని రప్పించి, తన స్వంత డబ్బుతో వేతనమిచ్చి, చుట్టు పక్కల్లోని తెలుగు పిల్లలకు మాతృభాషా బోధన ఏర్పాట్లు చేశారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక సంక్షేమ సంస్థలకు విరివిగా విరాళాలు ఇచ్చారు. వీరు అంత శ్రీమంతులైనా, బహువిధ కార్యభారం మీదవేసికొని ఉన్నా, చాలా నిరాడంబరంగా ఉంటూ పేదలలో పేదగా, పండితులలో పండితులుగా ప్రకాశించారు. బస్సిన్ పట్టణ మధ్యంలో వీరి భవనం ప్రత్యేక సౌందర్యాన్ని ప్రదర్శిస్తోంది.

కే.శే. గూడూరు తాతయ్య శెట్టి



కే.శే. గూడూరు తాతయ్య శెట్టి గారు రంగూన్లో పేరున్న లేబర్ కంట్రాక్టర్లలో ఒకరు. వీరు ఇక్కడి సెట్టి బలిజ సంఘానికి అధ్యక్షులు, పోషకులు. తాతయ శెట్టిగారు గొప్ప శ్రీరామ భక్తులు. పట్టుబట్టి రంగూన్ కిమిండైన్ ప్రాంతంలో పెద్ద శ్రీరామాలయం కట్టించారు. ప్రజలందరి సహకారంతో ఈ ఆలయాన్ని కట్టించినా, స్వయంగా తాతయ్య శెట్టిగారే సుమారు లక్ష రూపా

యల వరకు స్వంత ధనాన్ని ఖర్చు పెట్టారని ప్రతీతి. ఆంధ్రులలో ఇంత వరకు ఎవ్వరూ అంతటి రామాలయాన్ని కట్టించలేదు. ఆలయ నిర్మాణం కోసం వీరు దివారాత్రికష్టపడ్డ శ్రమను ఇప్పటికీ ప్రజలు చెప్పుకొంటుంటారు. అన్ని వసతులతో, హంగులతో ఆలయ నిర్మాణం అయ్యాక బ్రహ్మాండమైన ఉత్సవంతో సశాస్త్రీయంగా ఆలయ ప్రతిష్ఠాపన చేయించారు. ఆనాడు రంగూన్‌లో ఎక్కడ చూసినా రామనామ ధ్యానాలే. నేటికి కూడా శ్రీరామ నవమి, సీతాకల్యాణోత్సవం, శ్రీకృష్ణజన్మాష్టమి వగైరాలు చాలా వైభవంగా జరుపుతారు. ధనుర్మాస పుణ్య దినాల్లో రంగూన్ అంతటా రామనామం ప్రతిధ్వనిస్తూంటుంది.

కే. శే. కర్రి అప్పలస్వామి



కే.శే. కర్రి అప్పలస్వామిగారు మోల్మేన్ పట్టణంలోని భూస్వాములు, పెద్ద బియ్యపుమర అధిపతులు, మోల్మేన్ ఆంధ్ర మహాజనసంఘ ఉపాధ్యక్షులు ఈ సంఘానికి తన జీవితాంతం సేవ చేసి, ఎప్పుడైనా సభ్యుల్లో అభిప్రాయభేదాలు తలెత్తితే చాక చక్యంతో సవరించి, సంఘంలో ఏకీభావాన్ని చాలా నైపుణ్యంతో నెలకొల్పారు. పాఠశాలల యాజమాన్యంవారుకాని, హరిదాసులు కవులువంటి కళాకారులుకాని, సాంస్కృతికోత్సవ నిర్వాహకులు కానీ వెళ్ళి విరాళాలు అడిగినప్పుడు శక్తి కొద్దీ ఇచ్చేవారు. చాలా నిరాడంబరంగా జీవించారు.

కే.శే. నిమ్మకాయల చిన్నయ్య

కే.శే. నిమ్మకాయల చిన్నయ్యగారు పేరుపొందిన చేపల వర్తకులు. ఈయన చేతికింద దాదాపు ఐదారు వందలమంది చేపల వేటగాండ్రు ఉండేవారు. బస్సిన్ పట్టణంలో నదీసమీపంలో ఉన్న తన సామాన్య భవనంలో చేపల వేట

గాంధ్రకు ఈయన ఏర్పరచిన వసతులు చూపరులను ఆశ్చర్య చకితుల్ని చేసేవి. ఆ రోజుల్లో చాలా మంది తెలుగువారు చేపల వేటగాండ్రుగా ఉండేవారుకాని, ఇప్పుడిప్పుడు బాగా తగ్గిపోయారు. ఈయన మొదటి నుండి తెలుగువారి సామూహిక ఉత్సవాల్లో చాలా ఉత్సాహంతో పాలుపంచుకొనేవారు. ఎప్పుడైనా తాను పాలుపంచుకోవటం తటస్థించకపోతే, దాన్ని తనకొక పెద్ద అవమానంగా భావించేవారు. అమ్మవారి ఉత్సవాలు, రథోత్సవాలు మొదలైనవి జరిగినప్పుడు చూడవచ్చిన అశేష ప్రజావాహినిని అదుపులో పెట్టడానికి చిన్నయ్యగారినే చెప్పుకోవాలి. అన్ని ధర్మకార్యాలకూ అనేక విధాల సహకరిస్తూ, ముఖ్య కార్యకర్తగా ఉండేవారు. బస్సిన్ కోదండరామ ఆలయానికి భూమి విరాళాన్ని ఇచ్చిన దాత. ఆలయ ఆవరణలో మంచినీటి బావిని త్రవ్వించి, చుట్టూ సిమెంటుతో బందోబస్తుగా కట్టించి, పుణ్యాన్ని సంపాదించు కొన్నారు.

కే. శే. సొలాపు బుల్లిఅప్పన్న

కే. శే. సొలాపు బుల్లిఅప్పన్నగారు మోల్మేన్ పట్టణంలో మొదట బి.ఐ కంపెనీకి, తర్వాత సిండియా నౌకా సంస్థకు లేబర్ కంట్రాక్టర్‌గా ఉండేవారు. దానధర్మాల్లో వీరిది చాలా ధారాళమైన చేయి. యాచించిన వారికి ఇచ్చిన దానితో తృప్తిపడకుండా 'తక్కువ పడితే మళ్ళీకండి' అంటుండేవారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు బర్మాకు వచ్చినపుడు, మర్తబాన్‌కు వెళ్ళి స్వయంగా ఆహ్వానించి మోల్మేన్ పట్టణానికి పిల్చుకొని వచ్చారు. గొప్ప సన్మాన సభలు జరిపించారు. నాగేశ్వరరావు పంతులుగారు పర్యటించిన స్థలాలన్నిటికీ తోడుగావెళ్ళి ఆయన మన్ననలను పొందారు. మోల్మేన్‌లోని బౌతలేం ప్రాంతంలో ఏటేటా బ్రహ్మోత్సవం జరుగుతుంటుంది. ఆ సమయంలో ఆ పుణ్య క్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు.. వారికి తగిన సదుపాయాలు లేక అనేకమైన ఇబ్బందులు ఏర్పడగా అప్పన్నగారు స్వంత ఖర్చుతో ఒక పెద్ద బావిని, అన్ని వసతులూ ఉన్న ధర్మ సత్రాన్ని కట్టించి శాశ్వత కీర్తిని పొందారు.

శ్రీ కొవ్వూరి చినవెంకటరెడ్డి

శ్రీ కొవ్వూరి చినవెంకటరెడ్డిగారు కూడా గొప్ప లేబర్ కంట్రాక్టరు. చాలా నిరాడంబరమైన వ్యక్తి. సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు గొప్ప విరాళాలనిస్తూ తోడ్పడేవారు. కాని తన పేరు మాత్రం ఎలాంటి ప్రకటనల్లోనూ రాకూడదని కోరుకునేవారు. వ్రాత కోతల

విషయంలో అవసరమైతే, తన పేరుకు బదులు "ఒకదాత" అని వ్రాసికో మంటారు. "ఒకదాత" అంటూ, తన పేరును ఏ మాత్రం బహిర్గతం చేయ నివ్వక, ఈయన చేసిన గుప్త దానాలు లెక్కలేనన్ని. పేరంటే ఏ మాత్రం మోజుపడరు. కాబట్టి, వీరికి ప్రజల్లో రావాల్సిన ప్రఖ్యాతి, ప్రచారాలు రాలేదు. వీరు రెడ్డి యువజన సంఘం పేరున పుస్తక భాండాగారానికి శాశ్వత పోషకులు.

కే. శే. సైను ఆదెమ్మ

కే. శే. సైను ఆదెమ్మగారు, సైను అప్పయ్యగారి సతీమణి. వీరు బస్సిన్ పట్టణంలో లేబర్ కంట్రాక్టర్లు. ఆదెమ్మ గారు తెలుగులో బాగా చదువుకొన్నారు. దాన ధర్మాలు, సాంఘిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాలు పంచుకొన్నారు. అన్ని కార్యాల్లోనూ మహిళల్లో వీరే మొదటివారుగా ఉండేవారు. అందుకే బస్సిన్ ఇప్పటికీ అందరూ ఆదెమ్మగారిని ముందుగా స్మరిస్తారు.

కే. శే. తాడి రామయ్య

కే. శ. తాడి రామయ్యగారు సాధారణ కార్మికునిగా పనిచేస్తూ, క్రమంగా శ్రీమంతులయ్యారు. రామయ్యగారు ఆజానుబాహు విగ్రహం. దారి మధ్యలో నడుస్తున్నప్పుడు గంభీరమైన ఆ ఎత్తైన ఆకారం చూపరులందరినీ ఆకట్టుకొనేది. చదువు సంధ్య లేకపోయినా కష్టపడి సంతకం చేయడంమాత్రం నేర్చుకొన్నారు. వీరి సతీమణి సీతమ్మగారు, పేద సాదల పట్ల ప్రేమతో దాన ధర్మాలు అపారంగా చేశారు.

కే. శే గుడాల వెంకట రెడ్డి నాయుడు



కే. శే. గుడాల వెంకట రెడ్డినాయుడు గారు మోల్మేన్ పట్టణంలో గొప్ప భూస్వాములు, వర్తకులు. నాయుడుగారు ఒక్క మోల్మేన్‌లోనే కాకుండా, బర్మా ఆంధ్రు లందరిలోనూ గొప్ప నాయకు లనిపించుకొన్నారు. మోల్మేన్ ఆంధ్ర మహాజన సంఘానికి అధ్యక్షులు. వీరు రాజభక్తి, ప్రజా సేవలవల్లనే ప్రభుత్వ ఆదరణకు, ప్రజలగౌరవానికి పాత్రులయ్యారు. ప్రథమ ప్రపంచ యుద్ధ సమయంలో క్లిష్ట పరిస్థితి ఏర్పడగా, ప్రభుత్వం కోరగానే సిపాయిలను సమకూర్చిసహకరించారు.యుద్ధ నిధిని కూడా సేకరించి అర్పించారు.యుద్ధ రంగానికి

వెళ్తున్న వారందరికీ అనేక సౌకర్యాలు అందజేశారు. అందుకు సంబంధించిన దేవాలయాల్లో అర్చనలు, అభిషేకాలు, సమారాధనలు కూడా చేయించారు. నాయుడు గారి సేవా పరాయణతను ప్రశంసిస్తూ, లండన్‌లోని ఇండియా ప్రభుత్వ కార్యదర్శి, ఇండియాలోని గవర్నర్ జనరల్, లెఫ్టనెంట్ గవర్నర్ గార్లు ఆయనకు గౌరవాలను, సన్మానాలను గావించారు. 1918వ సంవత్సరంలో వీరి సేవను మెచ్చుకుంటూ గవర్నర్ జనరల్ గారు ఒక ప్రశంసా పత్రాన్ని పంపారు. 1920లో పై యుద్ధానికి సంబంధించిన అధికారులు నాయుడుగారికి గౌరవ పతకాన్ని బహూకరించారు. స్థానిక అధికారులు ఆనరరీ మేజిస్ట్రేటు పదవినిచ్చి తమ గౌరవభావాన్ని వెల్లడించుకొన్నారు. నగరంలోని ప్రజలు మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నుకొని తమ అభిమానాన్ని ప్రకటించారు. వీటితో పాటు మోల్మేన్ ఆంధ్ర మహాజన సంఘానికి అధ్యక్ష పదవి "సెంట్ జాన్ యాంబులెన్స్ అసోసియేషన్" యావజ్జీవ సభ్యత్వం ఆయనను వరించి, ఆయన సేవలను పొందగలిగాయి. నాయుడుగారు మోల్మేన్ చౌతలం తీర్థంవద్ద ఒక బావిని తవ్వించి, సత్రం కట్టించారు. 1932లో బర్మా గవర్నరు గారు నాయుడి గారిని శ్లాఘిస్తూ ఒక రివాల్వారును బహూకరించి గౌరవించారు. అటు ప్రభుత్వ మన్ననలను, ఇటు ప్రజల అభిమానాన్ని చూరగొనే విధంగా బహు ముఖ సేవలు చేసిన తెలుగు వాళ్ళలో నాయుడుగారే ప్రథములు.

కే.కే. కొప్పాడ మళేనయ్య

కే.కే. కొప్పాడ మళేనయ్యగారు బిస్సిన్‌లో మొదట సామాన్య కార్మికులుగా పనిచేసి, తర్వాత వర్తకం చేస్తూ గొప్ప శ్రీమంతులయ్యారు. తెలుగుదనం నిండిన కళలపట్ల వీరికి అపారమైన మక్కువ. నాటకాలు, వీధినాటకాలు, దాసరి పాటలు, జంగంపదాలు, హరికథలు మొదలైన వాటి ఏర్పాటుకు నిండు మనస్సుతో సహకరించేవారు. వివిధ సాంస్కృతిక సంఘాలు, దేవాలయాది ధార్మిక సంస్థలు, విద్యాసంస్థలు మొదలైన వానికి గొప్ప తోడ్పాటును అంద జేసేవారు. వీరు గొప్ప విద్యావంతులు కాకపోయినప్పటికీ, పురాణాలను నిత్యం చదువుతూ, లేకుంటే చదివిస్తూ ధర్మసూక్ష్మాలను అందరికీ తెలియచెప్పేవారు.

శ్రీ కోరాడ సూర్యనారాయణగారు

బర్మాదేశంలోని కార్మికుల్లో మూడువిధాల వారున్నారు. ఒకరు నెలసరి జీతాలమీద పనిచేసేవారు. రెండవ వారు స్వతంత్రంగా ఉంటూ, తమకు ఇష్టం

వచ్చిన చోట పని చేసుకొని పోతుండేవారు. బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణ రావు గారు బియ్యపు మరల్లోనూ, రేవుల్లో ఎగుమతి, దిగుమతి కార్యాల్లోనూ దిన సరి జీతాల మీద పనిచేసే వారిపట్లా, రిక్షా కార్మికులపట్ల ఎక్కువ దృష్టిని కేంద్రీకరించి, వారి సమస్యలను పరిష్కరించడానికి కృషిచేశారు. కాని నెలసరి జీతాల మీద పనిచేసేవారి కష్టసుఖాలను అర్థం చేసికొని, వారి సమస్యలను పరిష్కరించడానికి నడుం బిగించిన కార్మిక నాయకుడు శ్రీ కోరాడ సూర్య నారాయణ గారు. బి.ఓ.సి., ఐ.బి.పి., జమాల్., తులువా, ఎన్.ఓ.సి., ఆర్.ఓ.సి మొదలైన చమురు పరిశ్రమల్లోని కార్మికులకు, బి.బి.టి.సి.ఎల్., స్టీల్ బ్రదర్స్ వగైరా కలపమరల కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు కలుగు తున్న ఇక్కట్లను, అన్యాయాలను గుర్తించి పెద్దపెద్ద సమ్మెలు నడిపించి, వారి సమస్యల పరిష్కారానికి అపారంగా పరిశ్రమించినవారు కోరాడ సూర్యనారా యణ గారు. వీరికి మార్గదర్శకుడుగా ఉంటూ, బ్రహ్మశ్రీ అవటిపల్లి వారు పలు పర్యాయాలు వీరి కృషిని ప్రశంసించారు. ఇలాటి కార్మిక నాయకులు తమ వారు కావడం, తెలుగువారందరూ తమ అదృష్టంగా భావిస్తారు.

కే.శే. కొక్కిలిగడ్డ వీరరాజు

కే.శే. కొక్కిలిగడ్డ వీరరాజుగారు బస్సిన్ పట్టణంలోని బి.బి.సి.ఎల్ కంపెనీ పడవల అధికారి. ఈ కంపెనీ బాక్యార్డులో వీరు దాదాపు 500 పడ వలపై ఆజమాయిషీ వహించారు. వీరరాజుగారు చాలా ఉదార హృదయులు. పేదసాదలకు శక్తికొద్దీ సాయపడుతుండేవారు. భర్తలు వదలిపెట్టగా, నిస్స హాయులైన స్త్రీ లెవరైనా తన సహాయాన్ని అర్థించినపుడు, ఏదో ఒక విధంగా వారికి జీవనోపాధిని ఏర్పాటు చేసేవారు. జబ్బుపడ్డ వారెవరైనా తనను యాచిస్తే, తనకు పరిచయమైన వైద్యులవద్దకు పంపిస్తూ, ఆ వైద్యం ఖర్చును ఆయనే భరించేవారు. బస్సిన్‌లో నడుస్తున్న ఆంధ్ర సంఘాలలో, ఆయన సహాయాన్ని, సహకారాన్ని పొందనిది ఏదీలేదు. ఆయన బస్సిన్ ఆంధ్ర మహాజన సభకు అధ్యక్షులుగా కూడా ఉండేవారు. ఆయనకు నాటకాల సరదా. ప్రతి సంవత్సరం దీపావళికి, ఉగాదికి, సంక్రాంతికి నాటక సంఘాలను రప్పించి, స్వంత ఖర్చుమీద ప్రదర్శనలు ఇప్పించేవారు. దేశోద్ధారక కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులుగారు బస్సిన్ పట్టణాన్ని సందర్శించడానికి వచ్చి నప్పుడు ఆంధ్ర సేవాసంఘం ద్వారా బ్రహ్మాండమైన సన్మాన సభను ఏర్పాటు

చేశారు. పంతులుగారికి అంగరక్షకులుగా ఉంటూ, వారి అభిమానానికి పాత్రులయ్యారు. బస్సిన్ కోదండరామస్వామి ఆలయానికి గొప్ప విరాళాలు ఇచ్చారు.

కి. శే. టి. కె. రాజు నాయుడు

కి.శే. టి. కె. రాజనాయుడుగారు బస్సిన్ పట్టణంలోని స్టీల్ బ్రదర్స్ కంపెనీలో ప్రధాన గణకులుగా ఉద్యోగం చేశారు. ఆంధ్రసేవా సంఘానికి అధ్యక్షులు ఈ సంఘం నిర్వహించిన ధర్మ పాఠశాలకు మేనేజరుగా ఉండేవారు. నాయుడుగారు మిక్కిలి దయాళులు. పేదవారి దుస్థితిని పోగొట్టడానికి శక్తికొద్దీ పాటుపడిన సేవాకర్త. తాను నివసించే ప్రాంతంలో శ్రీ కృష్ణాలయాన్ని కట్టించారు. దానికి ఆయనే ధర్మకర్తలు. నాయుడుగారు చక్కటి వక్త, కార్యకర్త. దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు బస్సిన్ నగరానికి వచ్చినప్పుడు, ఆతిథ్యమిచ్చి వారివెంట అనేక సభల్లో పాల్గొన్నారు. అలాగే బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావుగారు బస్సిన్ నగరానికి వచ్చి, కార్మికులను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు, ఎప్పుడూ ఆయన ఆతిథ్యంలోనే ఉండేవారు. నారాయణరావుగారి వెంట ఆయనకూడా అనేక సభల్లో ప్రసంగించి, తోడ్పడేవారు. నాయుడుగారికి సాహిత్యమంటే గొప్ప ప్రీతి.

కి.శే. కురుమోజు సింహాద్రి ఆచార్యులు

కి.శే. కురుమోజు సింహాద్రి ఆచార్యులు సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప పండితులు. అష్టాదశ పురాణాలుకానీ, పంచకావ్యాలుకానీ, ఏ ఆధ్యాత్మిక గ్రంథమైనా కాని వీరి ఇంటిలో ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరికేవి. వీరికి చక్కటి వాక్శుద్ధి ఉండేది. బస్సిన్ విక్టోరియా వీధిలో వీరు ఒక దివ్య పురుషునిలాగు అగుపిస్తూ పెక్కండ్రకు పెక్కు సలహాలనిస్తూ ఉపకారులుగా ఉండేవారు. వీరి నోటివెంట ఏ పద్యం వచ్చినా, అందులో ప్రత్యేకమైన ఆకర్షణ ఉండేది. బస్సిన్‌లో దాదాపు వందమంది తెలుగు స్వర్ణకారులు ఉండేవారు. వారందరిలోకి ఈయన గురుస్థానాన్ని ఆక్రమించి, ఆచార్యుల ఆచారాలను నేర్పించేవారు. వేదాధ్యయనంలో, శాస్త్రపఠనంలో ఎందరో బ్రాహ్మణులు సింహాద్రిగారితో సరితూగలేక పోయేవారు. వీరికి భాషాభిమానం తోపాటు కళాభిమానం కూడా ఎక్కువ. 1930 నుండి 35 లోగా కి.శే. కొచ్చెర్ల

విశ్వనాధాచార్యులు తమ సీతారామాంజనేయ నాటక సభను బస్సిన్ పట్టణానికి ఎప్పుడుతెచ్చినా సతీసమేతంగా వీరి ఇంటనే బసచేసేవారు. నాటకప్రదర్శనలన్నీ ముగిశాక సింహాద్రిగారు ఆ కళాకారుల గౌరవార్థం తన ఇంటిలో ఘనమైన విందును ఇచ్చి సత్కరించేవారు.

శ్రీ కోనాల సూర్యనారాయణ వర్మ

శ్రీ కోనాల సూర్యనారాయణవర్మగారు స్టీల్ బ్రదర్స్ అరకాన్ కంపెనీ, బొంబాయి బర్మా కంపెనీలలో ప్రసిద్ధమైన లేబర్ కంట్రాక్టరు. మిక్కిలి ఉదార పరులు. పేదలపట్ల దయగలవారు. వీరి యాజమాన్యంలో ఒక ధర్మ పాఠశాల నడిచేది. దాదాపు అన్ని ఆంధ్ర సంఘాలకూ వీరి సహాయ సంపత్తులు లభిస్తుండేవి. బస్సిన్ నగరంలో, వీరి సారధ్యంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణం జరిగింది. ఆంధ్రులకు అంతకంటే మించిన దేవాలయం లేదు. వర్మగారు సత్యనారాయణ మందిరం, లక్ష్మీనారాయణ మందిరం, కాళీబారీలకు కూడా గొప్ప విరాళాలను ఇచ్చారు. ఆంధ్రేతరులు నిర్మించిన ఈ ఆలయాలకు సిమెంటు నేలలు, ప్రహారీ గోడలు కట్టించి శాశ్వత కీర్తిని సంపాదించారు. ఆంధ్రసేవా సంఘానికీ అధ్యక్షులుగా ఉంటూ, తెలుగు జాతికోసం గొప్ప సేవ చేశారు. ఒకప్పుడు బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావుగారు కార్మికుల సమస్యలను పరిశీలించడానికి వచ్చినప్పుడు, వారికి కావాల్సిన సౌకర్యాలనన్నింటినీ వర్మగారు సమకూర్చిపెట్టారు. వీరు కొంతకాలం స్వదేశానికి వెళ్ళినప్పటికీ, ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం మళ్ళీ స్వదేశాన్నుండి తిరిగివచ్చి బస్సిన్‌లో అఖిల బర్మా తెలుగు మహాజన సంఘాన్ని నెలకొల్పారు. ప్రజలు వీరినే దాని అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఈ సంఘం ఒక ధర్మ పాఠశాలను కొంతకాలందాకా నిర్వహించింది.

కె.వి. కరణం సన్యాసినాయుడు

కె.వి. కరణం సన్యాసినాయుడు హెంజడా పట్టణంలో రైల్వే కంట్రాక్టరు. హెంజడా ఆంధ్ర సంఘానికి అధ్యక్షులు. ధర్మపాఠశాలకు ధర్మకర్తలు. ఆంధ్ర సంఘ భవనాన్ని పునర్నిర్మించాలని, దాదాపు 20 వేల రూపాయలు స్వంత ధనాన్ని వెచ్చించి చక్కగా నిర్మించారు. సన్యాసినాయుడు గారెప్పుడూ ధనధాన్యాలను కూడబెట్టుకొని శ్రీమంతులు కావాలని ఆశించలేదు. వారి ఇంటికి

రైల్వే స్టేషనుకు మధ్య 400 అడుగుల దూరం మాత్రముండేది. సాయంకాలం అయిదు గంటలకు పని ముగించి ఇంటికి బయల్దేరినప్పుడు, దారిపొడవునా చేయి చాచి అనేకమంది దీనులు నిలబడి ఉండేవారు. ఆ దినం భగవంతుడు ఇచ్చిన దంతా వారికి దానం చేసి, ఇంటి ఖర్చులకు మాత్రం మిగుల్చుకొని ఇల్లు చేరు కొనేవారు. దాదాపు రోజుకు వంద, రెండు వందల రూపాయల వరకు వారు దానం చేసేవారని ప్రతీతి. అందువల్ల ఆయనకు ఎప్పుడూ తెల్లవారితే పర గడుపు జీవితం ఎదురయ్యేది. దినవారీ దానాలే కాకుండా, నెలవారీ కొన్ని గుడులకు, బడులకు, సంఘాలకు విరాళాలు ఇస్తుండేవారు. హెంజడా ఆంధ్ర సంఘం ధర్మపాఠశాలను, ఆఖరు దినాలలో ఐదు సంవత్సరాలపాటు స్వంత డబ్బుతో ఉపాధ్యాయులకు వేతనాలనిచ్చి నిలబెట్టారు. ఊరందరి సహ కారాన్ని సంపాదించేవారు. ప్రస్తుతం ఈ సంఘ భవనం నిరుపయోగమై, ఆంధ్ర సంఘ ప్రముఖుల్లో ఒకరి అదుపాజ్ఞల్లో ఉంది. శ్రీ నాయుడు గారు ఎప్పుడైనా ఎవరికైనా ఋణాలు ఇచ్చినా, మళ్ళీ తిరిగి తీసుకోవడమంటూ ఉండేది కాదని ప్రతీతి.

శ్రీ మట్టపర్తి అప్పన్న

శ్రీ మట్టపర్తి అప్పన్న గారు సాధారణ కార్మికులుగా ఉంటూ ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం పెద్ద బియ్యపుమిల్లు యజమానై, శ్రీమంతులయ్యారు. వీరు హెంజడా ఆంధ్ర సంఘానికి ధర్మకర్తలుగా ఉండేవారు. సంఘ భవన పునర్నిర్మాణాన్ని తామ చేస్తామని, ముసుపున్న కర్రిభవనాన్ని ఊడదీసి. పునాదులు మాత్రం వేయగలిగారు. అసంతరం పెత్తనాల విషయంలో హెంజడా ఆంధ్రుల మధ్య కలతలు రేకెత్తగా, అప్పటికి అధ్యక్షులుగా ఉన్న శ్రీ గొడ్డి చిన్నప్ప గారు దుబారా ఖర్చులు చేసి, అప్పన్న గారికి గాబరా కలిగించారన్న విషయాన్ని ప్రజలందరూ విచారించి, శ్రీ కరణం సన్యాసినాయుడు గారిని మళ్ళీ అధ్యక్షులుగా ఎన్నుకొని, వారి ఆధ్వర్యం క్రింద అందరూ కలసి భవ నాన్ని పునర్నిర్మించగలిగారు.

శ్రీ రామదేవు ఆదినారాయణ

శ్రీ రామదేవు ఆదినారాయణ గారు ప్రముఖ నౌకా సంఘం అన్న పేరు పొందిన బ్రిటీష్ స్టీం నేవిగేషన్ కంపెనీకి కార్మికుల సర్దారుగా ఉండేవారు.

తర్వాత ధనవంతులైనప్పటికీ, దానధర్మాలు చేస్తూఉదారహృదయు లనిపించు కొన్నారు. అనాథులకు, భక్తులకు, సంఘాలకు గోప్యంగా అనేక దానాలు చేశారు. అనంతరం వీరు మాతృదేశానికి వెళ్ళిపోయారు. అక్కడ కూడా పది తరాలపాటు లోటులేని వసతుల్ని ఏర్పరచుకొన్నారని ప్రతీతి. వీరు బర్మాలో ఉన్నంత కాలం కీర్తికాముకులుగా మాత్రం వ్యవహరించక ధర్మాత్ములని పేరు తెచ్చుకొన్నారు.

కే. శే. ఎస్. కొండయ్య

కే. శే. ఎస్. కొండయ్య గారు బస్సిన్ పటాఛాం ప్రాంతంలో గొప్ప శ్రీమంతులు. గొప్ప ధర్మగుణసంపన్నులు. వీరి సతీమణి శ్రీమతి సూరమ్మ గారు కూడా భర్తను మించిన ధర్మాత్మురాలు. వీరిద్దరూ, తమ ప్రాంతంలోని పేదవారి కెప్పుడూ గొప్ప అండగా ఉండేవారు. సూరమ్మ గారు ప్రతిదినం పురాణాలు చదివి, పరిసరాల్లో ఉన్నవారికి మన సంస్కృతి విశేషాలను తెలియజెప్తుండేది.

కే. శే. బోర బొడ్డయ్య

కే. శే. బోర బొడ్డయ్య గారు బస్సిన్ పటాఛాం ప్రాంతంలో మంచి వసతి, తోటలు కలిగిన సంపన్నులు. వీరు సాంప్రదాయికంగా ఉంటూ దాన ధర్మాలు చేస్తుండేవారు. ప్రజాహిత కార్యాలకు శక్తికొద్దీ సాయపడేవారు.

కే. శే. చిక్కాల నాయుడు

కే.శే. చిక్కాల నాయుడుగారు బస్సిన్ కూంజాం ప్రాంతంలోని ఒక బియ్యపు మరలో కూలీల కాంట్రాక్టరు. సాంఘిక సాంస్కృతిక కార్యాలలో పాల్గొంటూ, ప్రజాహిత కార్యాలలో భక్తి శ్రద్ధలు చూపిస్తుండేవారు. వీరికి వస్త్రదానం, అన్నదానం అంటే మిక్కిలి శ్రద్ధ ఉండేది. హరిదాసులు, నాటక సమాజాలు, సాంస్కృతిక సంఘాలు వీరి సహాయాన్ని బహుళంగా పొందుతూండేవి.

కే. శే. వాసనశెట్టి నూకయ్య

కే. శే. వాసనశెట్టి నూకయ్యగారు ఎ.బి.సి. కంపెనీ బాక్యార్డులో పడవల నిర్మాణానికి అధికారులు. వీరు తమ ప్రాంతంలో ఒక ప్రాథమిక పాఠశాలను

నిర్వహిస్తూ తెలుగు పిల్లల విద్యాభ్యాసానికి ఎక్కువగా తోడ్పడ్డారు. పేదలను పెక్కువిధాలుగా ఆదుకొన్న ఉత్తమ పురుషులు.

కో. శే. కె. శ్రీనివాసులు నాయుడు

కో.శే. కొనెదల శ్రీనివాసులు నాయుడు గారు రంగూన్‌లో ప్రధానకార్గో పర్యవేక్షకుల్లో ఒకరు. రంగూన్ రేవులో విదేశాలనుండి వచ్చి ఎగుమతి దిగుమతులు చేసికొనే ఓడల్లో శ్రీనివాసులు నాయుడుగారి చేతిమీదుగా కనీసం డెభ్భై అయిదు శాతం పనులు జరుగుతుండేవి. ఏజెంట్లు, కార్మికులు, సహాయకులు, సహాయ పర్యవేక్షకులు ఈయనను చాలా అభిమానించేవారు. తగినంత ధర్మబుద్ధి కూడా ఉండటం వల్ల ఈయనను ఆశ్రయించేవారు కూడా ఎక్కువ. సంఘాలంటే నాయుడుగారికి ఎంత ఆసక్తి ఉండేదో, అంత విసుగు కూడా ఉండేది. ఏ సంఘాన్ని ఆరంభించినా, ఆరంభశూరత్వం మాత్రం ప్రదర్శించకుండా, గమ్యం చేరేవరకూ ఒకే శక్తితో పరిశ్రమించమని వారు తరచూ ఇస్తూండే సలహా. తెలుగు భాషమీదకాని, తెలుగు దేశాన్ని గురించికాని, ఎవరైనా ఎక్కడైనా ప్రసంగిస్తే ప్రత్యేక ఆహ్వానం పంపించి తన ఇంట్లో విందు ఇచ్చేవారు. గ్రంథకర్తలకు, కవులకు బాగా సహకరించేవారు. ఒకప్పుడు ఆంధ్ర దేశం వెళ్లి కొందరు రచయితల్ని కలుసుకొన్న సందర్భంలో, శ్రీ సున్నం వీరరాజు కవిగారి పరిచయం కలిగింది. వారు రచించిన మట్టిబెడ్డలు అన్న నవలను బర్మాకు తెచ్చి, తమ సొంత ముద్రణాలయంలో ఉచితంగా ముద్రించి, వెయ్యి ప్రతులను కవిగారికి పంపే ఏర్పాటు చేశారు. అలాగే 'రంగసాని' అన్న నవలను కూడా ఉచితంగా ముద్రించి ఇచ్చారు. ఆంధ్ర రాష్ట్రం ఉదయించిన దినమే రంగూన్‌లో నాయుడుగారు 'లక్ష్మి ముద్రాక్షరశాల'ను స్థాపించారు. 'తెలుగు బిడ్డ' అన్న దినపత్రికను ప్రారంభించారు. అభ్యుదయ రచయితలకు ఈ పత్రిక మూలంగా కలిగినంత ఉత్సాహం, బర్మాలో మరే తెలుగు పత్రిక ద్వారా కలుగలేదు. బర్మా ఆంధ్రుల కందరికీ ఒక కేంద్ర సంఘం ఉండాలని నాయుడుగారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. రంగూన్ 44వ వీధిలోని ఆంధ్ర యువజన భజన కూటమి ధర్మ పాఠశాల 1964 వరకు పేద తెలుగు పిల్లలకు విద్యాదానం చేసిందంటే, ముఖ్యకారణం నాయుడుగారే. నాయుడుగారు శ్రీదుర్గా సంగీత కళామందిర్ యువకులతో 'నర్తకి మాధురి హత్య' అన్న నాటకాన్ని రూపొందించి, స్వయంగా దర్శకత్వం వహించి ప్రదర్శింప చేసిన

సంఘటన మరువరానిది. నాటక కళాభిరుచి ఉన్న నాయుడుగారు పిల్లలకోసం నాటకాలను ప్రోత్సహించటమే కాకుండా, పిల్లలకు, యువకులకు అనేక వ్యాయామ క్రీడల పోటీలను నిర్వహించారు. బర్మా తెలుగు రచయితలలో సృజనాత్మక శక్తిని ప్రోత్సహించేటందుకై, తమ పత్రికాలయం తరపున, ఒక వ్యాసరచన పోటీపెట్టి మంచి మంచి బహుమతుల నిచ్చారు. అనేక ధర్మ సంస్థలకు ధారాళంగా విరాళాలిచ్చి ప్రోత్సహించారు. నాయుడుగారు తమ యౌవన దశలో ఆంధ్రదేశం వెళ్ళినప్పుడు, అక్కడ ఆంధ్ర కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొని కారాగార శిక్షను అనుభవించి, మళ్ళీ బర్మా వచ్చిన స్వాతంత్ర్య వీరుల్లో ఒకరు.

శ్రీ వి. జె. సర్వోత్తమరావు

శ్రీ వి. జె. సర్వోత్తమరావు (బి. ఎ. బి. ఎల్.) గారు ప్రజా సేవలో, సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొన్నవారిలో ఒకరు. వీరు తమ విద్యార్థి దశలోనే ఆంధ్ర విద్యార్థి సంఘంలో ప్రముఖ పాత్రను వహిస్తూ, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు జరిపించడంలో ప్రధాన వ్యక్తిగా ఉండేవారు. కొంతకాలం "జ్యోతి" అన్న వారపత్రికకు సంపాదకులుగా ఈయన బర్మా ఆంధ్రులకు అనేక విధాలుగా సేవ చేశారు. ఆంధ్ర సంఘాలలో వీరు చాలా ఉత్సాహంతో పని చేస్తున్న దినాలలో, అఖిల బర్మా భారత కాంగ్రెసులో ఆంధ్రుల ప్రతినిధిగా పాల్గొన్నారు. నామ మాత్రపు ప్రతినిధిగా మాత్రం కాకుండా, శాయశక్తులా సేవ చేశారు. వీరు ఐ.ఇ.ఎస్. ఖాల్సా ఉన్నత పాఠశాలలో సీనియర్ ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేశారు. 1957వ సంవత్సరంలో బర్మాను వదలి మాతృదేశం వెళ్ళిపోయారు. అంతవరకు బర్మా ఆంధ్రులకు సాంఘిక, సాంస్కృతిక రంగాలలో చాలా తోడ్పడ్డారు.

శ్రీ సి. హెచ్. వి. రాఘవులు

శ్రీ సి. హెచ్. వి. రాఘవులు గారు రంగూన్ ఆంధ్ర మహాజన సంఘానికి చాలాకాలం కార్యదర్శిగా ఉన్నారు. సంఘ కార్యక్రమాలను అత్యంత సమర్థతతో నిర్వహించేవారు. కాందోం శ్రీ మారమ్మ దేవస్థాన ధర్మకర్తలుగా ఉండేవారు. స్థానిక ఆంధ్ర, తమిళ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. బర్మా ఆంధ్ర కాండిశీకుల ప్రతినిధిగా ఈయన చేసిన కృషిని పురస్కరించుకొని అఖిల భారత కాంగ్రెస్ సహాయ కార్యదర్శి పదవి ఈయనను వరించింది.

కొంతకాలం అందులో సేవచేసి 1966లో మాతృదేశం వెళ్ళిపోయారు. ఈయన ఉత్సాహవంతులైన యువకులు. కార్యదీక్షతోపాటు తెలుగులో మంచి ప్రవేశ మున్నవారు.

కే. శే. బి. జి. రాజు

కే.శే. బి.జి. రాజు గారు బస్సిన్ పట్టణంలో ప్రఖ్యాతులైన ఆయుర్వేద వైద్యులు. వీరికి తెలుగు భాషలో మంచి ప్రవేశం ఉండేది. కొన్ని సందర్భాలలో హరికథా కాలక్షేపాలు కూడా చేసి ప్రజల మన్ననలు చూరగొన్నారు. తెలుగు భాషలో పాండిత్యంతోపాటు, శిల్పశాస్త్రంలో కూడా వీరికి ప్రవేశం ఉండేది. దేవాలయ నిర్మాణంలో చక్కటి నైపుణ్యం కలిగినవారు. బస్సిన్ పట్టణంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ నిర్మాణం వీరి చేతిమీదుగా జరిగిందే. ఈ దేవాలయానికై కొన్ని ప్రాంతాలు తిరిగి, నిధి సేకరణ కూడా చేసి వీరు తోడ్పడ్డారు. బస్సిన్ పట్టణానికి వచ్చిన ఏ కవులైనా. హరిదాసులైనా ముందుగా వీరి ఇంటికే వెళ్ళేవారు. ఎందుకంటే, వీరిమూలంగా తర్వాత పట్టణంలోని ప్రముఖులందరి పరిచయాలు సులభంగా జరిగేవి. వీరి కనిష్ఠ పుత్రులు శ్రీ బి. యస్. రాధాకృష్ణరావు బి.కామ్ (డి.ఎమ్.ఎ.) గారు కూడా వీరి లాగే గొప్ప సాహిత్యప్రియులు. ఉదారహృదయులు. ప్రస్తుతం రాధాకృష్ణరావు గారు విశాఖపట్టణంలో వెంకటరామా కమర్షియల్ కాలేజ్‌ను నిర్వహిస్తున్నారు. బర్మా నుండి ఆంధ్రదేశం వెళ్ళిన చాలామంది యువతీ యువకులు ఆయన ఆశ్రయంలో అభివృద్ధికి రాగలిగారు.

శ్రీ తోలుం చిన్నయ్య

శ్రీ తోలుం చిన్నయ్యగారు మొదట సాధారణ కార్మికులుగాఉండి ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం మంచిస్థితి పరులై, లేబర్ కంట్రాక్టర్‌గా ఉన్నారు. బస్సిన్ కోదండరామాలయానికి ధర్మకర్త, రాజపోషకులు. పేదసాదల పట్ల కనికరం కలిగిన వారు. బస్సిన్ బర్మా ఆంధ్ర సంఘానికి భూరి విరాళమిచ్చి ప్రోత్సహించిన వారు.

శ్రీ మెంటి సింహాచలం నాయుడు

శ్రీ మెంటి సింహాచలం నాయుడు గారు కూడా ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం పెద్ద లేబర్ కంట్రాక్టరయ్యారు. బస్సిన్ కోదండరామ దేవాలయ

ధర్మకర్తలు. ముఖ్య పోషకుల్లో ఒకరు. బర్మా ఆంధ్ర సంఘానికి సలహాదారు. ఏ సంఘం వారైనా ఎలాటి సహాయం అడిగినా తప్పక చేస్తూంటారు. దేవాలయ ప్రాంగణంలో ఒక ప్రాథమిక పాఠశాలనునిర్వహిస్తూ తెలుగు పిల్లలఅభివృద్ధికై శ్రమించారు. బస్సిన్‌లోని తెలుగు ప్రజానీకానికి చాలాభాగం ఉత్తమ నాగరకతా పథాన్ని చూపిన ముఖ్యులు.

డాక్టర్ వి. ఆర్. కులశేఖరం, ఎల్. ఎమ్. పి.

కీర్తిశేషులైన డాక్టర్ కులశేఖరం గారు రంగూన్‌లో ప్రసిద్ధికెక్కిన వైద్యులు. వీరి సహకారాన్ని పొందని రంగూన్ ఆంధ్ర సంఘాలు చాలా తక్కువ. చేతిలో చిల్లిగవ్వలేని ఎంత నిరుపేదలైనా సరే, అనారోగ్యం విషమించినప్పుడు 'ఆంధ్రా డ్రగ్ హౌస్'కు వెళ్తే చాలు, ఆ గండం నుండి బయట పడేవారు. డా॥ కులశేఖరం గారు అంతటి ఉదారహృదయులు. ఎంతో కాలం నుండి రంగూన్ ఆంధ్రులు తమ ఆంధ్ర మహాజన సంఘం కొరకై కోరుకొన్న ప్రత్యేక భవనం కులశేఖరం గారి చేతిమీదుగా నెరవేరింది. కులశేఖరం గారి కృషిమూలంగా రంగూన్ ఆంధ్రులు 39 వేల రూపాయల నిధిని వసూలు చేసి 1962లో నగరం మధ్యగా ఉన్న లూయిస్ వీధిలోని 134 నెంబరు ఇంటిని కొని తమ సంఘానికి ఒక భవనాన్ని ఏర్పాటు చేసికోగలిగారు. కులశేఖరంగారు 1964లో బర్మా కాందిశీకుల సహాయకమిటీలో సభ్యులుగా ఉండి, ఆంధ్రులకు ప్రాతినిధ్యం వహించారు. కృషిచేసి అందులోకూడా ఆంధ్రులకు ప్రాధాన్యత దక్కేటట్లు చేశారు. అప్పటినుండి నేటిదాకా బర్మా రిపాట్రియేషన్ కమిటీలో ఆంధ్రులకొక ప్రత్యేకస్థానం ఉండిపోయింది. ఆంధ్ర మహాజన సంఘానికి భవనం లభించగానే గాంధీమెమోరియల్ హాలులో 1964లో బ్రహ్మాండమైన స్వర్ణోత్సవ సభలు జరిపికొంది. తన ఆఖరు దినాలలో కులశేఖరంగారు బర్మ ఆంధ్రులకు చేసిన మహోపకారం మరువరానట్టిది.

కే. వే పోతుల అప్పయ్య

కే. వే. పోతుల అప్పయ్యగారు బస్సిన్ పట్టణములో భూస్వాములు; శ్రీమంతులు-పేదలను ఆదరించడంలో వీరికి వీరే సాటి. ఉదయాన నిద్రలేస్తూనే తాను నివసిస్తున్న ప్రాంతంలోని పేదలను పరామర్శించడానికి వెళ్తూ ఎవరైనా ఆపూట తిండికి కూడా ఇబ్బంది పడుతూంటే తక్షణమే వారికి కావల

సిన వస్తువులు పంపించేవారు. ఉండటానికి ఇల్లుకూడా లేని వారెవరైనా అర్థిస్తే, తన భూమిలో కొంత స్థలమిచ్చి ఇల్లు కట్టుకోమనేవారు. వీరి ఈ ధర్మబుద్ధి ఫలంగా, వీరి ఇంటిచుట్టూ దాదాపు పంద ఇళ్ళయినా కట్టుకొని పేద తెలుగు కుటుంబాలు జీవిస్తున్నాయి. అందుమూలంగానే ఆ చిన్న ప్రాంతానికి నేటికీ 'పోతులప్పయ్య దిబ్బ' అని వాడుక.

కే. శే. ఇళ్ళ లక్ష్మయ్య

కే.శే. ఇళ్ళ లక్ష్మయ్యగారు బస్సిన్ పట్టణములో ఒక బియ్యపు మరకు కూలీల కంట్రాక్టరు. సాంస్కృతిక సంఘాలకు, పాఠశాలలకు సహకరించడంలో చాలా ఉదారంగా ఉండేవారు. బస్సిన్ కోదండ రామాలయానికి గొప్ప విరాళాన్ని ఇచ్చారు. స్వయంగా ఒక పాఠశాలను నిర్వహించారు. ఎవరు ఏ ధర్మ కార్యార్థమై వీరి సహాయాన్ని అర్థించినా, కాదనకుండా ఇచ్చేవారు. బస్సిన్ ఆంధ్రసేవా సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉండేవారు. వీరికి విస్తారంగా తెలుగు కావ్యాలతో పరిచయం ఉండేది.

కే. శే. గొరిబంద మశేను

కే.శే. గొరిబంద మశేనుగారు లేబర్ కంట్రాక్టర్‌గా ఉండేవారు. బస్సిన్ కోదండరామస్వామి గుడికి గొప్ప విరాళాన్ని ఇచ్చారు. చాలా నిరాడంబరంగా ఉండేవారు. ఎవరికి ఎంత ధనాన్ని ఇచ్చినా, బయటకు తెలియనీయరాదని ఆంక్ష పెట్టేవారు. ప్రతిదినం పురాణకావ్యాలు చదివి వినిపిస్తూ, భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పేవారు. బస్సిన్ అఖిలబర్మా తెలుగు మహాజన సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉండేవారు. వీరి ఏకైకపుత్రులు శ్రీ గొరి బంద నారాయణరావుగారు ప్రస్తుతం బర్మా ప్రభుత్వోద్యోగిగా ఉన్నారు.

శ్రీ ఎస్. కృష్ణ

శ్రీ సోమవారపుపేట కృష్ణగారు రంగూన్‌లోని కాందోం ప్రాంతీయులు. చిన్నప్పటి నుండే వివిధ సాంఘిక, సాంస్కృతిక కార్యాల్లో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావు పంతులుగారి అనుచరులలో ఈయనా ఒకరు. అనాటి కార్మికోద్యమాలతోను, ఆంధ్రప్రజల సంక్షేమ కార్యక్రమాల్లోను ప్రత్యక్ష సంబంధం కలిగిన వారు. కీ.శే. కె. ఎస్. ఎన్. మూర్తిగారి ముఖ్య

అనుచరులుగా ఉంటూ, ప్రజాసేవలో ఆయనవద్ద శిక్షణ పొందినవారు. కాందోం శ్రీ మారమ్మ దేవస్థానానికి 1956 నుండి 75 వరకు ప్రతిపర్యాయం మేనేజింగు ట్రస్టీగా ఎన్నికయ్యారు. రంగూన్‌లో బర్మా ఆంధ్ర సంఘాన్ని స్థాపించాలని కృషిచేసిన ప్రముఖుల్లో ఈయన ఒకరు. అఖిల బర్మా హిందూ లీగ్ అన్న సంస్థకు ఉపాధ్యక్షులుగా, కాందోం శాఖకు అధ్యక్షులుగా సేవచేశారు. 1961లో యేయిన్ సినిమాహాలులో (ప్రస్తుతం రిడ్జి సినిమాహాలు) మొఘల్-ఏ-అజామ్ చిత్రం ప్రదర్శితమైనప్పుడు హిందూ-ముస్లిం సోదరులమధ్య వాగ్వాదం తల ఎత్తి, చివరకు పెద్ద పోరాటంగా పరిణమించింది. అప్పట్లో స్థానిక ప్రభుత్వం వారు దేశరక్షణ చట్టం క్రింద నాలుగు మాసాలపాటు ఈయనను నిర్బంధంలో ఉంచారు. అఖిల బర్మా హిందూ సెంట్రల్ బోర్డు వారు అఖిల బర్మా ఇండియన్ కాంగ్రెసు వారు హామీ ఇచ్చిన తరువాత విడుదలయ్యారు. కాండాంగ్లే యువజన సంఘానికి వీరు చాలాకాలం అధ్యక్ష పదవిలోఉన్నారు. ప్రస్తుతం అఖిల బర్మా హిందూ కేంద్రీయ మండలిలో సభ్యులు; దీనికి అనుబంధంగా నడుస్తున్న హిందూ ధార్మిక శిక్షణ సమితికి ఉపాధ్యక్షులు. కాందోం హిందూ ధర్మ తెలుగు మండలికి అధ్యక్షులు. వీరు కిమిండైన్ శ్రీ రామాలయానికి ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, ఆలయానికి కలిగిన కొన్ని ముఖ్యమైన చిక్కుల్ని తొలగించడంలో పరిశ్రమించారు. హిందూ సెంట్రల్ బోర్డు ద్వారా కాందోం ప్రాంతపు యువకులను వ్యాయామ క్రీడల్లో సుశిక్షితుల్ని చేసి, పోటీలకు పంపడంలో చాలాశ్రద్ధ తీసికొంటారు. అఖిల బర్మా యువజన సమాఖ్యకు సహాయ కార్యదర్శిగా వ్యాయామ విభాగ కార్యదర్శిగా ఉంటూ గుణనీయమైన కృషి చేశారు. శ్రీ కృష్ణగారు ప్రతి ఆంధ్ర, ఆంధ్రేతర సంస్థకుహార్దికంగా, ఆర్థికంగా దైహికంగా శక్తివంచన లేకుండా తోడుపడుతుంటారు. వీరుకాస్త ముక్కోపి అని ప్రసిద్ధి. ముక్కోపిగా ఉంటూనే వీరింత బృహత్తర సేవలను చేసినప్పుడు శాంతస్వభావులై ఉంటే ఇంకెలా ఉండేవారో అని అందరూ అనుకొంటుంటారు. ఎవరో కొందరు స్వార్థపరులైన నాయకులు తప్ప, నిజమైన నాయకులెప్పుడూ ఆయనను అభినందించకపోరు. ఈ గ్రంథకర్త వ్రాసిన 'బర్మా ఆంధ్రుల చరిత్ర సంస్కృతి' అన్న పెద్ద పుస్తకానికి సంబంధించిన పరిష్కరణ మండలిలో వీరు గౌరవసభ్యులు. మీదు మిక్కిలి గొప్ప ప్రోత్సాహమిచ్చిన వారు.

కే. శే. కర్రి అప్పారెడ్డి

ఏ ధర్మ కార్యాలకు సంబంధించిన విరాళాల జాబితాలో కాని, రెడ్డి సోదరులు అన్న పేరు సామాన్యంగా అగుపిస్తుండేది. ఆ సోదరులు ముగ్గురు. కర్రి వీర్రెడ్డి, కర్రి పెద్దిరెడ్డి, కర్రి అప్పారెడ్డి. ఈ ముగ్గురి పేర్లూ రంగూన్లో అందరికీ పరిచయమే. ఈ సోదరత్రయంలో కనిష్టులైన కర్రి అప్పారెడ్డి గారు తొలిరోజుల్లో స్టేట్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ బోర్డులో కార్మిక అధికారిగా పనిచేశారు. తర్వాత బర్మీయ - భారతీయ కార్మికులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసి, తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఆల్ బర్మా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లో సభ్యులై కార్మికోద్యమాల్లో అహర్నిశలు పాల్గొన్నారు. అన్యాయాలు మోసాలు జరుగుతున్నచోట్ల సమ్మెల్ని లేవదీసి, కార్మిక హక్కుల్ని కాపాడడానికి పాటుపడేవారు. సత్వర విజయాల్ని సాధించేవారు. పెద్దపెద్ద బహిరంగ సభలను ఏర్పాటుచేసి, కార్మికుల్ని ఉద్దేశించి వీరు బర్మా భాషలో కాని, తెలుగు భాషలోగాని ప్రసంగిస్తున్నప్పుడు బర్మీయ, భారతీయ కార్మికులందరూ రెడ్డి గారిని తమ పాలిటి దైవంగా భావించేవారు. బర్మా భాష వారికంతగా రాకున్నప్పటికీ, తనకు వచ్చినంత భాషలోనే ప్రసంగిస్తూ, అధికారులను, నాయకులను హెచ్చరిస్తూ ఉపన్యసించేవారు. కర్రి అప్పారెడ్డి గారు పంచె కట్టుకొని ఉన్నప్పుడైనా, నిక్కరును వేసికొని ఉన్నప్పుడైనా తలపాగాను మాత్రం వదలిపెట్టేవారు కాదు. ఎవరైనా ప్రశ్నిస్తే 'ఈ పాగా మా ఆంధ్రుల కిరీటం' అని చాటి చెప్పేవారు. సభల్లో వీరు ప్రసంగిస్తున్నప్పుడు చాలా ఉద్రేకపూరితంగా ఉపన్యసించేవారని, ఒకొక్కప్పుడు ఉద్వేగంతో కన్నీరు కూడా విడిచేవారని ప్రతీతి. చివరకు అలా నిర్విరామంగా ఉపన్యసిస్తూ, నిరంతరం ఉద్యమాల్లో పాల్గొంటూండడం మూలంగా క్షయ వ్యాధికి గురయ్యారు. 1963లో అకాల మృత్యువు నోటపడ్డారు. కర్రి అప్పారెడ్డిగారు కార్మికుల కోసం కడసారిగా అవతరించిన నాయకులు. వీరు అవతరించకపోతే, మునుపటివారు సాధించిన విజయాలు నిష్ప్రయోజనమై పోవడమే కాకుండా, ప్రస్తుత సమస్యలకు పరిష్కార మంటూ ఉండేది కాదు. వీరి మరణానంతరం బర్మీయులు, భారతీయులు అన్న విభేదం లేకుండా, సమస్త కార్మికలోకం ఒక్కటై నివాళులు ఘటించింది.

శ్రీ వి. రంగరాజులు గారు

శ్రీ పడుచూరి రంగరాజులు గారు మోల్మేన్ నగరంలోని ఎక్సెల్సియర్ సినిమాహాలు అధిపతి. మోల్మేన్‌లోని బర్మా ఆంధ్ర సంఘానికి అధ్యక్షులు. ఈ సంఘం ఆధ్వర్యంలో వివిధ శాఖలు, ఆలయాలు ఉన్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం, మహాలక్ష్మమ్మ గుడి, యువజన శాఖ, సాహిత్య శాఖ, విద్యా శాఖ, ఆంధ్ర శ్మశానవాటిక శాఖలను ఈ సంఘం నిర్వహిస్తోంది. రంగ రాజులు గారు వీటన్నిటి సక్రమ నిర్వహణ పట్ల చాలా శ్రద్ధ తీసికొంటున్నారు. ఇటీవల తెలుగు భాషా బోధనకు సౌకర్యాలు లేనందున, సంఘం తరఫున ఒక ఉపాధ్యాయుని నియమించి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రాథమిక తరగతులను ఏర్పాటుచేశారు. మోల్మేన్ పరిసర ప్రాంతాల నుండి కానీ, రంగూన్ మొదలైన పట్టణాల నుండి కానీ కళాకారులు, పండితులు, సంఘ కార్య కర్తలు ఎవరైనా వస్తే రంగరాజుగారి ఇంట ఆతిథ్యం స్వీకరించి, సర్వసత్కా రాలు పొందుతారు. బర్మా ఆంధ్రుల చరిత్రకు కావలసిన అంశాలను సేకరించ డానికి ఈ రచయిత మోల్మేన్ పట్టణానికి వెళ్ళినప్పుడు, రంగరాజులు ఆదరంతో గొప్ప సభను ఏర్పరచి, కావలసిన వివరాలను, ఛాయా చిత్రాలను అనేకంగా ఇచ్చారు.

భారతదేశం నుండి బర్మా సందర్శనానికి వచ్చిన ఆంధ్ర ప్రముఖులు

బ్రిటీషువారి పరిపాలనా కాలంలో, ఎందరో భారతీయులతో పాటు బర్మాకు వచ్చిన ఆంధ్రులు కొంత కాలానికి సాంఘికంగా ఉన్నత స్థాయిని కూడా అందు కొన్నారు. తమ కష్టాలు తాము పడుతూ, అనేక ధర్మసంస్థలను నెలకొల్పి, ఆంధ్ర ప్రజానీక సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భారత దేశంనుండి నాయకులు, ప్రభుత్వోద్యోగులు చాలామంది బర్మా దేశాన్ని దర్శించడానికిగాని,ప్రభుత్వ కార్యాల మీదగానీ రావటం, ఇక్కడివారి ఆతిథ్యాన్ని అందుకోవడం జరిగింది. తెలుగు దేశానికి సంబంధించిన ప్రముఖులు కూడా వచ్చి ఇక్కడి తెలుగు సోదరులను కలిసికొన్నారు. ఇక్కడివారి కష్ట సుఖాలను విచారించి వారి సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు సాయం చేస్తామని వాగ్దానమైతే ఇచ్చారుగాని, నిలబెట్టుకొన్నదిలేదు. ఇక్కడి తెలుగు వారు మాత్రం మాతృదేశాన్ని సదా స్మరించుకొంటుంటారు. మాతృదేశం ప్రకృతి బీభత్సాలకు గురైనప్పుడు జరిపే సంక్షేమ కార్యాలకు, మాతృదేశంలోని సంస్థలకు బర్మా ఆంధ్రులు శక్తివంచన లేకుండా తమ సహకారాన్ని అందించారు. దానిమూలంగా ఆంధ్రదేశం తర్వాత, బర్మా దేశంలోని తెలుగువాళ్లకు ద్వితీయ స్థానం లభించిందని మన పెద్దలు చెప్పుకోవడం పరిపాటయింది.

భారత దేశంనుండి బర్మాను సందర్శించడానికి వచ్చిన తెలుగు ప్రముఖుల వివరాలు ఇవి.

1) శ్రీ వరాహగిరి వెంకటగిరి గారు : ప్రసిద్ధ కార్మిక నాయకులు. కొంత కాలం భారతదేశ అధ్యక్ష పదవిని కూడా అలంకరించారు. ఆదినుండి

కార్మికులకోసం బహుధా శ్రమించిన త్యాగమూర్తి. వీరు 1923లో బర్మాకు వచ్చారు.

2) శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు : దేశోద్ధారక బిరుదాంచితులు. ఆంధ్ర పత్రిక ప్రచారం కోసం, బర్మా ఆంధ్రుల స్థితి గతులను పరిశీలించుట కోసం 1927లో బర్మాను సందర్శించారు.

3) డాక్టర్ లంకా సుందరంగారు, **M.A.; Ph.D (London)**: కార్మిక నాయకులు. భారత పార్లమెంట్ సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వీరు 1937లో బర్మాకు వచ్చారు.

4) శ్రీ పుల్లెల శ్యామసుందరరావు గారు : కార్మిక నాయకులు. 1935లో బర్మాకు వచ్చారు.

5) ఆచార్య రంగా గారు **M.A** : రైతు జన బాంధవులు. బర్మాకు 1938లో వచ్చారు.

6) డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు: ఒకప్పుడు ఆంధ్రదేశ ముఖ్య మంత్రి. భారత ఛేంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గంతో 1950వ సంవత్సరంలో బర్మాకు వచ్చారు.

7) శ్రీ టి. విశ్వనాథరెడ్డి గారు :

8) శ్రీ బి.ఎస్. మూర్తి గారు :

వీరు భారత పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారు. చైనా పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో బర్మాను 1956లో సందర్శించారు.

9) శ్రీ చేగిరెడ్డి బాలిరెడ్డి గారు: భారత పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారు. వీరు అమెరికా వెళ్ళి తిరిగివస్తూ, 1958లో బర్మాకు వచ్చారు.

10) శ్రీ ధనెంకుల నరసింహం గారు : ఆచార్య రంగా గారి ప్రియ శిష్యుల్లో ఒకరు. 1957లో బర్మాకు వచ్చారు.

11) శ్రీ రామచంద్రరావు గారు **B.A.,B.L** : వీరు 1958 నుండి 62

వరకు రంగూన్ నగరం హైకోర్టులో తెలుగు భాష అనువాదికులుగా, దుబాసీగా పనిచేశారు.

12) శ్రీ చెరువు రామమూర్తి గారు **M.sc:**

13) శ్రీ త్రిశంకర సాంబశివరావు గారు :

వీరు రంగూన్ సర్వ కళాశాలలో బహిరుపన్యాస కులు (**External Lecturers**)గా నియుక్తులయ్యారు. 1957 నుండి 62 వరకు ఉద్యోగం చేశారు. రంగూన్‌లో ఉన్న కొన్ని పెద్ద సంఘాల కార్యకలాపాలలో పాల్గొని 'కేంద్ర సంఘం' స్థాపన కోసం కృషి చేశారు.

బర్మాలో తెలుగు పత్రికలు

1920 సంవత్సరం వరకు ఆంధ్రదేశపు వార్తాపత్రికలు, పుస్తకాలు తప్ప బర్మా ఆంధ్రులకు స్థానికంగా ఎలాటి సారస్వత సంస్థలు కాని, పత్రికలు కాని, గ్రంథప్రచురణలు కానీ లేవు. తర్వాత 1921 నుండి 1965 వరకూ విదేశీ పత్రికలను ప్రభుత్వమువారు రద్దు చేసేదాకా దాదాపు ఇరవై దిన, వార, పక్ష, మాస పత్రికలు బర్మా ఆంధ్రుల చేతిమీదుగా నడిచాయి.

కీ.శే. దొమ్మేటి వెంకటస్వామి గారు ఈ బర్మా ఆంధ్రుల పత్రికలకు శ్రీకారం చుట్టారని ప్రతీతి. వెంకటస్వామి గారి ప్రోత్సాహంతో, శ్రీ భక్తవత్సలం నాయుడు గారు "తెలుగు పత్రిక" అన్నదాన్ని నెలకొల్పారు. బర్మా ఆంధ్రుల్లో ఆదికవిగా పేరు పొందిన శ్రీ సోమరాజు రామానుజరావు గారు ఆ పత్రికకు మొదటి సంపాదకులయ్యారు. వారి తర్వాత శ్రీ యాండ్ర వెంకటదాసు, శ్రీ మామిడి ఆదినారాయణ, శ్రీ శకలం కృష్ణారావు గారలు క్రమంగా సంపాదకులయ్యారు. "బ్రహ్మభారతి" అన్నది బర్మా తెలుగు పత్రికల్లో రెండవది. శ్రీ సోమరాజు రామానుజరావు గారే రంగూన్ తింగాజూన్ ప్రాంతం నుండి దాన్ని వెలువరించారు. ఇప్పుడు అదే పేరుతో, అదే స్థలములో ఒక హిందీ మాసపత్రిక చిరంజీవిగా వర్ధిల్లుతోంది. శ్రీ వెలగల వెంకటరెడ్డి గారు నెలకొల్పిన 'ఐరావతి' మూడవది. ఈ పత్రికకు శ్రీ సోమరాజు రామానుజరావు, శ్రీ సత్తి వెంకట రెడ్డి, శ్రీ పి.వి. నారాయణరావు గార్లు క్రమంగా సంపాదకులయ్యారు. ఈ పత్రికనే, జపాన్ కాలంలో 'స్వాతంత్ర్య హిందూస్థాన్' అన్న పేరుతో శ్రీ కర్రి సుబ్బారెడ్డి గారు ప్రచురించారు. శ్రీ పాలెపు గోవిందరాజులువర్మ, శ్రీ పడానేని సూర్యనారాయణ గార్లు సంపాదకులుగా పనిచేశారు. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం స్వాతంత్ర్య హిందుస్థాన్ పత్రికతోపాటు 'ఆంధ్రభేరి' అన్నదాన్ని కూడా శ్రీ కర్రి సుబ్బారెడ్డి గారు నడిపారు. దీనికి శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య

గారు ప్రధాన సంపాదకులుగా, శ్రీ పడానేని సూర్యనారాయణ గారు సహాయ సంపాదకులు గాను, సంచాలకులు గాను పనిచేశారు. క్లిమెంటు బ్రదర్స్‌వారు 'బర్మా క్రైస్తవ వర్తమాని' అన్న పత్రికను కొంతకాలం నడిపారు. బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావు గారు, 'కార్మిక పత్రిక' అన్నదాన్ని తన సంపాదకత్వంలోనే నడిపారు. శ్రీ కె.యస్.యన్. మూర్తి గారు దానికి సహాయ సంపాదకులుగా పనిచేశారు. అదిమాంధ్ర సంఘం వారు కూడా శ్రీ బోడ చిట్టయ్య గారి సంపాదకత్వంలో 'ఆదిమాంధ్ర పత్రిక'ను నడిపారు. మోల్మేన్ పట్టణ వాసులైన శ్రీ కోలా ధర్మారావు గారు 'ఆంధ్రజ్యోతి' పత్రికను తమ సంపాదకత్వంలో ప్రచురించారు. డాక్టర్ ఎస్.ఎమ్. రఘునాథం గారు **L.R.C.P., M.R.C.S. (England)**, 'బర్మా పత్రిక' అన్నదాన్ని స్థాపించారు. శ్రీ సాధు పెనుమత్స వెంకన్న, సూర చిట్టయ్య, సూర మీరయ్య, సుబ్బు సింగు గార్లు ఆ పత్రికకు క్రమంగా సంపాదకులయ్యారు. 'ఆంధ్ర మిత్ర పత్రిక' అన్నదాన్ని శ్రీ పి.వి. నారాయణ గారు స్థాపించి, స్వీయసంపాదకత్వంలో నడిపారు. కొంత కాలం దానికి సహాయ సంపాదకులుగా శ్రీ పాలెపు గోవిందరాజులవర్మ గారున్నారు. 'కర్ణిక పత్రిక' అన్నది ఇంకొక పత్రిక. శ్రీ కర్ణిక కృష్ణారావు గారు దీన్ని నెలకొల్పారు. శ్రీ సాధు పెనుమత్స వెంకన్న గారు, శ్రీ కొంబత్తుల వాడపల్లి గారు దీనికి సహాయ సంపాదకులుగా ఉన్నారు. 'ఆంధ్రసేవ' అన్నది పదమూడవ పత్రిక. దీన్ని శ్రీ రఘుపాత్రుని సూర్యనారాయణ గారు స్థాపించి, స్వయంగా సంపాదకత్వం వహించారు. 'ఆంధ్రవాణి' అన్న పత్రికను శ్రీ కేళం నరసింహారావు గారి సంపాదకత్వంలో శ్రీ చంద్రగంటి ధర్మరాజు గారు స్థాపించారు. డాక్టర్ ఎ.బి. రావు గారు, శ్రీ కె.ఎస్.ఎన్. మూర్తి గారు కలిసి స్థాపించి, సంపాదకత్వం వహించిన 'బర్మా ఆంధ్రపత్రిక' పదిహేనవది. మోల్మేన్ పట్టణంలో శ్రీ కోలా ధర్మారావు గారు మళ్ళీ 'కార్మికశక్తి' అన్న పత్రికను స్థాపించి సంపాదకత్వం నిర్వహించారు. శ్రీ కరి సుబ్బిరెడ్డి గారు తమ కుమారులైన శ్రీ కె. సాగర్‌కుమార్ గారి ఆధ్వర్యం క్రింద 'ఆంధ్రభేరి' అన్న పత్రికను కూడా నడిపారు. దానికి శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య గారు సంపాదకులుగా పనిచేశారు. శ్రీ కె.కృష్ణారావు-ఉరఫ్-కైలాసరావు గారు శ్రీ వి.జె. సర్వోత్తమరావు గారి సంపాదకత్వంలో 'జ్యోతి' అన్న పత్రికను నడిపారు. బాలలకోసం శ్రీ టి.ఎన్. సాంబశివన్ గారు శ్రీ పాలెపు గోవిందరాజులవర్మ గారిని సంపా

దకులుగా చేసి 'బాల బర్మా పత్రిక'ను స్థాపించారు. 'ఆంధ్రవాణి' అన్న వ్రాత పత్రికను ఆంధ్రా యూత్ లీగ్ వారు శ్రీ గోపాల కృష్ణారావు గారి సంపాదకత్వంలో నడిపారు. శ్రీ కొనెదల శ్రీనివాసునాయుడు గారు స్థాపించిన 'తెలుగు బిడ్డ' చిట్టచివరిది. శ్రీ చొల్లింగ కంచన్న గారు, శ్రీ పాలెపు గోవింద రాజులువర్మ గారు, శ్రీ కరి రామమూర్తి గారు, శ్రీ కె. ఆంజనేయులు గారు వరుసగ దీనికి సంపాదకులయ్యారు.

చాలామంది పత్రికా వ్యవస్థాపకులు, సంపాదకులు ఇలా విభిన్న పత్రిక లను స్థాపించి, ప్రచురించి బర్మాదేశంలో తెలుగుభాషకు, తెలుగు విజ్ఞానానికి బహుముఖంగా సేవచేశారు.

బర్మా తెలుగు రచయితలు

1920 వరకు బర్మాలో తెలుగు రచయితలు, కవులు లేరనవచ్చు. అప్పుడంతా కార్మికులు, కార్మికనాయకులు, కంట్రాక్టర్‌లు, ఏజెంట్లు వగైరాలే. తర్వాత తెలుగుదేశం నుండి రచనా శక్తి కలిగినవాళ్ళుకూడా బర్మాదేశానికి వచ్చారు. బర్మాలో ఆంధ్ర సారస్వత లోకానికి వాకిళ్ళు తెరిచారు. వారి వెన్నంటి బర్మాలో కూడా రచయితలు తయారయి, నడిచారు.

1. కీ. శే. సోమరాజు రామానుజరావుగారు : ఈయనను బర్మా ఆంధ్రులలో ఆదికవిగా పెద్దలు అంగీకరిస్తున్నారు. ఈ మహాకవి రచనల్లో గంభీరమైన భావాలు సరళమైన శైలిలో శోభిస్తుంటాయి. పాత్రపోషణలోకాని, రస సిద్ధిని కలిగించే అలంకార ప్రయోగాల్లో కాని వీరిది అందెవేసినచేయి. వీరు అనేకంగా గద్య, పద్య, గేయ, నాటక గ్రంథాలను రచించారు. ముద్రితమైన పుస్తకాలలో నాటకాలే ఎక్కువ. గంగావతరణము, ప్రతాపరుద్రీయము, సతీ అనసూయ, రంగూన్ రౌడీ వంటి ప్రసిద్ధమైన నాటకాలను, కావ్యాలను దాదాపు ఏభైదాకా ప్రచురించి ఉన్నారు. అముద్రితాలుకూడా ఇంకా అన్ని ఉంటాయి. ఈయనను బర్మా ఆంధ్ర కవితాపితామహులని విజ్ఞులు అభివర్ణిస్తుంటారు.

2. కీ. శే. త్రిపురాన సత్యానంద రామదొరగారు : ఈయనను బర్మా ఆంధ్రుల్లో రూప విజ్ఞానాదులలో రెండవ రవీంద్రనాథఠాకూర్ అంటే అతిశయోక్తి కాదు. పద్య, గద్య, గేయ రచనల్లో ఈయన చేయి తిరిగినవారు. వీరి రచనల్లో కనిపించేటంతటి శిల్పజ్ఞత, పదసంధాన నైపుణి, రసపోషణ ఇతరుల రచనల్లో అగుపించవు. తెలుగుతేజమువంటి దేశభక్తి రచనలను, భక్తమందారములాంటి ఆధ్యాత్మిక రచనలను చేశారు. వీరు రచించిన ఆధ్యాత్మిక చారిత్రక రచనలు అనేకంగా అముద్రితమై ఉన్నప్పటికీ, అందులోని పద్యాలు

మాత్రం జనబాహుళ్యంలో వ్యాప్తిపొందాయి. ఈయనను టి. ఎస్. పంతులని, తమ్మాయదొరకవి అని సగౌరవంగా ఇక్కడివారు పేర్కొంటారు.

3. బ్రహ్మశ్రీ అవటిపల్లి నారాయణరావు గారు: వీరు కేవలం వక్త, కార్మికనాయకుడు మాత్రమే కాక చక్కటి రచయితకూడా. వీరు 1924 నుండి 1942 వరకు రంగూన్‌లో ఉన్నారు. బర్మా జాతీయకళాశాలలో ఆర్థిక, గణిత శాస్త్రాలకు, ఆంగ్లభాషకు ఆచార్యులుగా వచ్చారు. కార్మిక జనాంగంకోసం ఆంగ్లాంధ్ర పత్రికలలో విరివిగా వ్యాసాలువ్రాశారు. రంగూన్ మెయిల్, రంగూన్ డెయిలీ న్యూస్, రంగూన్ టైమ్స్, రంగూన్ గెజిట్‌పంటి ఆంగ్ల పత్రికల్లో పుంఖాను పుంఖంగా సామాన్యశైలిలో కార్మికులనుద్దేశించి వ్యాసాలు ప్రకటించారు. 'కాంట్రాక్ట్ లేబర్ ఇన్ బర్మా' 'ఇండియన్ లేబర్ ఇన్ బర్మా' అన్న ఆంగ్లపుస్తకాలనువ్రాసి కార్మికుల సాధకబాధకాలను ప్రభుత్వ దృష్టికితెచ్చారు. 'విశాలాంధ్ర అన్న గ్రంథంలో బర్మా ప్రముఖులనుగూర్చి, ఆంధ్రదేశ ప్రముఖులనుగురించి, ఆంధ్రదేశంలోని వివిధ ప్రజోద్యమాలనుగురించి వివరించారు. ఈ గ్రంథంలో ఈయన గ్రాంథిక శైలిని ఉపయోగిస్తూ, మధ్య మధ్య సందర్భానుసారంగా చక్కటి పద్యాలను కూడా వ్రాశారు.

4. కీ. శే. తుమ్మగుంట అప్పయ్యనాయుడు పంతులు గారు: విద్యా విషయంగా, ఆధ్యాత్మిక విషయంగా తరచూ స్థానిక తెలుగు పత్రికలలో పద్యాలను, గేయాలను, వ్యాసాలను వ్రాస్తూ వచ్చారు. బర్మాలో తెలుగు సాహిత్య రచనను నిరంతరం ప్రోత్సహించారు. అప్పయ్యనాయుడుగారు స్వయంగా ఒక పాఠశాలను స్థాపించి, ఆంధ్రప్రభుత్వం వారి పాఠ్యప్రణాళికను అనుసరిస్తూ, చాలాకాలం నిర్వహించారు. వివిధ వస్తుగుణ సంబంధాలైన పద్యాలనుకూడా నాయుడు పంతులుగారు రచించారు.

5. కీ. శే. కొచ్చర్ల అప్పల సన్యాస్యి పంతులు గారు: మోల్మేన్‌కు సంబంధించిన తెలుగు కవుల్లో వీరు ఆది కవి. ఆధ్యాత్మిక పరమైనవే కాకుండా సాంఘిక పరమైన పద్యాలను ప్రవచనాలను ఈయన బహుళంగా ప్రచురించారు, వీరి నాటకాలు, పద్యాలు, సంకీర్తనలు మోల్మేన్ ఆంధ్రుల్లో అపారమైన ప్రాచుర్యాన్ని పొందాయి. ఈనాడు మోల్మేన్ ఆంధ్రుల్లోని ప్రముఖులు చాలామంది వీరి శిష్యులు.

6. శ్రీ నారం అప్పలస్వామిగారు : బస్సిన్ ఆంధ్రుల్లో పేరొందిన కవి. వైష్ణవ సంప్రదాయ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ వీరు అనేక కవితలను వెలువ రించారు. తెలుగు పత్రికల్లో సుధీర్ఘమైన గేయాలు వ్రాశారు. ఆత్మ విచారణ· మానసిక పరివర్తనలను ప్రతిభావంతంగా కవితల్లో చిత్రీకరించారు. 'త్రిమూ ర్తుల పూజ,' 'త్రిదేవుల పూజ' అన్న రెండు ద్వీపద కావ్యాలను రచించారు. దేశీ ప్రభావము కొట్టొచ్చినట్లు కనపడే సరళమైన భాషను వాడారు. ఇవే కాక మరికొన్ని పద్య సంకలనాలను, ద్వీపద సంకలనాలను కూడా రచించారు. తగిన సహాయ ప్రోత్సాహాలు లేనందువల్ల వీటిని ముద్రించలేదు. కాని ఆయన శిష్య వర్గం మూలంగా ఆ పద్యాలు, ద్వీపదలు బాగా వ్యాప్తిని పొందాయి.

7. కీ. శే. సూర మీరయ్య బాల కవి గారు : చారిత్రక, సాంఘిక అంశాల మీద స్థానిక పత్రికల్లో వ్యాసాలే కాకుండా పద్యాలను కూడా వ్రాసి ప్రకటించారు. మాధ్యమిక తరగతుల వరకు తెలుగు విద్యార్థులకు ఉపయోగ కరంగా ఉండేలాగ బర్మా భూగోళ శాస్త్రము, ఇండియా భూగోళ శాస్త్రము అన్న రెండు గ్రంథాలను బాలకవి గారు రచించారు. అప్పటి బర్మా ప్రభుత్వం వారు ఈ గ్రంథాలపట్ల తమ ఆమోదం తెలిపి పాఠశాలల్లో ప్రవేశ పెట్టారు.

8. దుర్గా లక్ష్మీ నరసింహారావు గారు : రంగూన్‌లో పేరొందిన కవి. ఈయన శృంగార పద్యాలను, రసవత్తర నాటకాలను రచించి ప్రజల ఆదరాభి మానాలను చూరగొన్నారు. వీరి నాటక రచనల్లో కొన్ని ముద్రితములు. అముద్రిత నాటకాలను కూడా పెక్కు నాటక సమాజాల వారు ప్రచర్మించి కవి గారికి పేరు ప్రఖ్యాతులు సమకూర్చి పెట్టారు.

9. కీ. శే. రేగుపత్సల రామమూర్తి పంతులుగారు : ద్వితీయ ప్రపంచ యుద్ధ పూర్వము హొంజడా పట్టణం నుండి చక్కటి కవితలు వెలయించిన ప్రముఖులు రామమూర్తి పంతులు గారు. ఇప్పటి హొంజడా ఆంధ్ర సంఘ ప్రముఖుల్లో రామమూర్తి పంతులు గారి శిష్యులే అధికం. వీరి నాటకాలు ఇప్ప టికీ ప్రదర్శిత మవుతుంటాయి. నాటకాల్లోని పద్యాలు, పాటలు అనేక సభల్లోనూ కచ్చేరీలలోనూ తరచూ కనబడుతుంటాయి. రామమూర్తి పంతులు గారు తమ యావజ్జీవితాన్ని విద్యా బోధనలో గడిపారు. నిద్రాహారాలు మాని నిరంతరం విద్యా బోధనలో నిమగ్న మయ్యేవారు.

10. కీ. శే. కర్రి రామమూర్తి పంతులు గారు : బర్మాలోని ప్రముఖ వ్యాస రచయితల్లో రాష్ట్ర భాషా ప్రవీణ కర్రి రామమూర్తి పంతులు గారు ఒకరు. జాతీయ సంస్కరణను ఆశిస్తూ అనేక గేయ రచనలను, గద్య రచన లను చేశారు "తెలుగు బిడ్డ" పత్రికకు సంపాదకులుగా ఉన్నప్పుడు వీరు వ్రాసిన సంపాదకీయాలు గణనీయమైనవి. వీరి రచన లెప్పుడూ ప్రజా బాహు ళ్యానికి అర్థమయ్యే సులభ శైలిలో ఉండేవి. వీరు కొంత కాలం ఆంధ్ర యువ జన భజన కూటమిలో ఉపాధ్యాయులుగా పని చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ఉపాధ్యాయులుగా పని చేశారు.

11. శ్రీ చోడిపిల్లి రామమూర్తి పంతులు గారు : శ్రీ చోడిపిల్లి రామ మూర్తిగారు బర్మా పత్రిక, ఐరావతి, ఆంధ్రమిత్ర లాటి తెలుగు పత్రికల్లో వ్యాసాలు, కథలు వ్రాసి బర్మా ఆంధ్ర సారస్వత లోకానికి సేవ చేశారు. మద్రాసునుండి వెలువడే "ఆంధ్రభూమి" పత్రికలో కూడా దేశాభిమానం, దైవ భక్తి నిండిన రచనలు చేశారు.

12. కీ. శే. పి. వి. నారాయణగారు : 1965వ సంవత్సరంలో స్థానిక బర్మా ప్రభుత్వం, విదేశీ పత్రికాలయాలను జాతీయం చేసేటంత వరకు వెలు వడిన పత్రిక "ఆంధ్రమిత్ర" బర్మాలోని తెలుగు పత్రికలన్నింటిలోనూ, చాలా కాలం నిరాఘాటంగా వెలువడిన పత్రిక ఇదే. దీని సుదీర్ఘ చరిత్ర వెనుక ఉన్న ప్రధానమైన ప్రేరక శక్తి కీ. శే. పి. వి. నారాయణ గారు. ఈయన దాదాపు 30 ఏళ్ళపాటు. ఈ పత్రికను ఆధారం చేసికొని వైవిధ్యం కలిగిన అనేక రచనలు చేశారు. బర్మానుండి వీరు ఆంధ్ర దేశం తరలి వెళ్ళిన వెనుక విశాఖ పట్టణంలో "ఆంధ్రమిత్ర" ముద్రణాలయాన్ని పునరుద్ధరించి కీర్తిశేషు లయ్యారన్న వార్త బర్మా ఆంధ్రులనందరినీ విచార సాగరంలో ముంచింది.

13. కీ. శే. కొమర శంకరనారాయణ దొరగారు : మృదు మధురమైన రీతిలో ఉత్తమ కావ్య ఖండికలను, వ్యాసాలను వీరు రచించారు. వీరి రచనలను సమీక్షించేటప్పుడు సామాన్యంగా ఇక్కడి వారంతా "కవిదొరగారి నోటివెంట రసవంతమైన కవితా మధువు స్రవిస్తుంది" అంటూ పేర్కొనడం రివాజు.

14 శ్రీ కె. అచ్యుతరావు కవిగారు : సాహిత్య రంగంలో బర్మా ఆంధ్రులకు

చిరపరిచితులు. ఇరవై ఏళ్ళకు పూర్వం 'జీవాత్మహిత' లేక 'జీవాత్మసంవాదము' అన్న ఆధ్యాత్మిక గ్రంథాన్ని పద్య కావ్యంగా వెలువరించారు. ఎవరికైనా, ఏ సందర్భానికైనా అవసరమైనప్పుడు పాటలను, పద్యాలను వ్రాసి ఇస్తూంటారు. ఇలా అప్పుడప్పుడు సందర్భానుసారంగా చేసిన రచనలు కూడా ప్రసిద్ధమై వ్యాప్తి పొందాయి. వీరికి నాటక ప్రదర్శనల్లో అనుభవం ఉంది. కొన్ని నాటకాలకు దర్శకత్వం వహించారు.

15. శ్రీ బయ్యా సూర్యనారాయణమూర్తిగారు : వీరు రంగూన్లో ఉన్నంత కాలం స్థానిక తెలుగు పత్రికల్లో జాతీయ విజ్ఞానాన్ని ప్రసాదించే వ్యాసాలను అనేకం వ్రాసి ప్రకటించారు. అప్పుడప్పుడు పద్యాలను కూడా ప్రకటించారు. మధ్యలో మళ్ళీ 1958లో బర్మా పర్యటనకు వచ్చినపుడు కూడా కొన్ని పద్యాలను వ్రాసి స్థానిక ఆంధ్రమిత్ర తెలుగు బిడ్డ పత్రికల్లో ప్రకటించారు. బర్మాలో ఉన్న దినాల్లో తెలుగు ప్రజల మధ్య సమైక్య భావ వికాసానికి చాలా శ్రమించే వారు. వీరు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నారు.

16. శ్రీ పాలెపు గోవిందరాజులువర్మ గారు : ప్రముఖ బర్మాంధ్ర సాహిత్యవేత్తల్లో ఒకరు. నాటకాలను రచించి, స్వయంగా దర్శకత్వం వహించి, భిన్న ప్రాంతాల్లో ప్రదర్శింప చేసేవారు. ఆంధ్రమిత్ర, ఐరావతి, బాలబర్మా, తెలుగుబిడ్డ పత్రికలకు సంపాదకత్వం వహించారు. వీరి రచనలన్నిటిలోనూ కనిపించే సామాన్య ఎస్తువు - సంఘ సంస్కరణాభిలాష. 1966లో వీరు హోమియో వైద్య శిక్షణలో ఉత్తీర్ణులై 1971లో మాతృ దేశం వెళ్ళారు.

17. శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్యగారు : విజ్ఞానదాయకాలైన వ్యాసాలను వ్రాసిన వారిలో ఎల్లయ్యగారొకరు. ఐరావతి, బర్మా పత్రిక, ఆంధ్రమిత్ర, ఆంధ్రవాణి, ఆంధ్రభేరి, తెలుగు బిడ్డ వగైరా స్థానిక తెలుగు పత్రికల్లో తరచూ వ్యాసాలు వ్రాసి తెలుగు వారందరికీ విజ్ఞాన, వికాసాలను కలిగించేవారు. ఐరావతి, ఆంధ్రభేరి పత్రికలకు ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. కొన్ని ఆంగ్లపత్రికల్లో కూడా అప్పుడప్పుడు వ్యాసాలు వ్రాశారు. అప్పుడప్పుడు ఆంగ్లంనుండి తెలుగులోకి, తెలుగులోనుండి ఆంగ్లానికి అనువాదాలను కూడా చేసేవారు. 1934 నుండి 1964 వరకు దాదాపు ముప్పయ్యేళ్ళ కాలం ఈయన బర్మా ఆంధ్ర సాహిత్య లోకానికి సేవ చేశారు.

18. కీ. శే. కె ఎస్. ఎన్. మూర్తిగారు : వీరికి తెలుగు భాష అంటే అపారమైన అభిమానం. చిన్నప్పటినుండే వ్యాసాలు, గేయాలు వ్రాయడం ఆరంభించారు. అనంతరం బ్రహ్మశ్రీ అవటి పల్లి నారాయణరావు పంతులుగారి ముఖ్య శిష్యులయ్యాక, పంతులుగారు ప్రచురిస్తున్న "కార్మిక" పత్రికకు సహాయ సంపాదకులుగా ఉంటూ, అనేక వ్యాసాలను వ్రాశారు. ఈయన వ్యాసాలన్నీ "ఆంధ్రుడు" అన్న ఒక సంపుటింగా ప్రకటిత మయ్యాయి.

19. కీ. శే. పంగల వెంకటరావు కవి గారు : అన్ని తరగతుల వారిని అలరించే పద్యాలను అనేకంగా వ్రాశారు. వీరి పద్య రచనలు సంఖ్యలో తక్కువైనా, గుణంలో మాత్రం ప్రశస్తమైనట్టివి. వెంకటరావు కవిగారు కొన్ని నాటకాలను కూడా రచించారు. కేవలం రచించడం మాత్రమే కాకుండా, నటించారు కూడాను. వీరి ప్రసక్తి వచ్చినప్పుడు "కవిపుంగవుల"న్న గౌరవపదాన్ని వీరిపట్ల సామాన్యంగా విజ్ఞులు వాడుతుంటారు.

20. కీ. శే. నేమాని ఘనశ్యామ చౌదరిగారు : చౌదరిగారు తరచూ స్థానిక తెలుగు పత్రికల్లో పద్యాలను, గేయాలను ప్రకటిస్తూ ఉండేవారు. కొన్ని కొన్ని చిన్న పుస్తకాలను కూడా కవిగారు రచించి ప్రకటించారని ప్రతీతి. "వీరపూజ" అన్న చిన్న దసరా పద్య మాలిక మాత్రం ఈ రచయిత కంటబడింది. చౌదరి గారి రచనల్లో తాత్విక ప్రబోధం కొట్టొచ్చినట్లు కనబడుతుంటుంది. ఈయన ఆయుర్వేద వైద్యులని కూడా ప్రసిద్ధి.

21. శ్రీ చిట్టూరి నాగభూషణంగారు : బళ్ళారిలోని చక్కటి హరిదాసుల్లో ఒకరు. కేవలం హరిదాసు మాత్రమే కాకుండా కవి, నటుడు. ఈయన పద్యాలు, పాటలు, భక్తుల హృదయాలకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. ప్రజల్లో బాగా వ్యాప్తిని పొందాయి. ఈయన వ్రాసిన నాటకాలు కూడా చాలా భాగం ముద్రితాలైనప్పటికీ, ప్రదర్శితాలై పేరు ప్రఖ్యాతులను ఆర్జించాయి.

22. శ్రీ కర్ణిక కృష్ణారావుగారు : వీరు 'కర్ణిక' అన్న పత్రికను స్థాపించి స్వయంగా సంపాదకత్వం వహించారు. వీరు అనేకంగా వ్యాసాలను, చక్కటి పద్యాలను వ్రాశారు. వీరి పద్యాల్లో ప్రధానంగా అగుపించే భావం అస్పృశ్యతా నిర్మూలన. ఆ విషయంగా సరళమైన వాడుక పదాల్లో హృదయాన్ని సున్ని

తంగా స్పృశించేలా పద్యాల నల్లారు. హిందువుల పండుగల గురించి అనేక మైన వ్యాసాలను వ్రాశారు. జపాన్ కాలంలో పుస్తకాల కొరత ఏర్పడి నప్పుడు, ఎప్పటికప్పుడు తన ముద్రణాలయంలో తెలుగు పాఠ్య పుస్తకాలను ముద్రించి, విద్యార్థులకు సాయపడ్డారు. విద్యార్థి లోకానికి ఈయన చేసిన సేవ బర్మా ఆంధ్రులు మరువరానిది.

23. శ్రీ కోరాడ సూర్యనారాయణగారు : ఆంధ్రుల విధ్యుక్త ధర్మం అన్న శీర్షికతో, కార్మికుల చరిత్ర అన్న శీర్షికతో వీరు అనేకమైన వ్యాసాలను ప్రచురించారు. భాషాభిమానం కొద్దీ జపాన్ కాలంలో టూమ్బే ప్రాంతాన స్వయంగా ఒక ధర్మపాఠశాలను నిర్వహించారు. అఖిల బర్మా ఆంధ్రుల సాంస్కృతిక సమ్మేళనం ఏర్పరచి, కేంద్ర సంఘ స్థాపనకై కృషిచేశారు.

24. శ్రీ దారపునేని భూమయ్య చౌదురిగారు : మోల్మేన్ నగరవాసి అయిన భూమయ్య చౌదురిగారు పేరుపొందిన జోతిర్విద్యావేత్త. 'తెలుగుబిడ్డ' పత్రికలో ప్రతివారం దిన, వార ఫలితాలను వ్రాసేవారు. బర్మా ఆంధ్రులు అన్నపేరిట కొన్ని వ్యాసాలను కూడా వ్రాశారు. వీరికి ఉన్న శబ్దవ్యుత్పత్తి చెప్పుకోదగింది.

25. కే. శే. బళ్ళ బసవరాజు పంతులుగారు : బర్మాలోని ప్రముఖ రచయి తల్లో ఒకరు. పద్యాలను, గేయాలను, గ్రాంథికభాషలో వ్రాసినప్పటికీ, వీరు వాడుకభాషను సమర్థింపక పోలేదు. మోల్మేన్ పట్టణంనుండి వెలువడే 'ఆంధ్ర జ్యోతి' పత్రికలో 1934, 35, 36 సంపత్సరాలలో బర్మా ఆంధ్రుల ప్రాచీన చరిత్రను పరిశోధన పూర్వకంగా ప్రకటించారు. తరతరాలనుండి ఇరువైపుల ఆంధ్రుల మధ్య పస్తున్న సంబంధ బాంధవ్యాలను వివరించి, బర్మా ఆంధ్రుల్లో మాతృభాషాభిమానాన్ని దేశాభిమానాన్ని రేకెత్తించారు.

26. కీ. శే. ఇంటి నందికేశ్వరరావుగారు : చక్కటి పద్యాలను, గేయాలను అనేకంగా వ్రాశారు. 'ఆంధ్రమిత్ర' పత్రికలో చాలా సంవత్సరాలు సహాయ సంపాదకులుగా పనిచేశారు. 'ఏకాకి'అన్న శీర్షికతో పత్రికలో ఒక పద్య మాలికను ప్రకటిస్తూ వచ్చారు. కాని అందులో తన తుది జీవితఘట్టాన్ని కవితా వేశంతో వర్ణించిన నందికేశ్వరరావు గారు అలాగే కొంత కాలానికి కనుమరుగయ్యారు.

27. శ్రీ పిళ్లా కన్నయ్యనాయుడు గారు : 'ఆంధ్ర బర్మీయుల యుద్ధం' అన్న కావ్యాన్ని నాయుడుగారు బొబ్బిలికథ సరళిలో రచించారు. ఈ గ్రంథాన్ని ముద్రించడానికి అప్పట్లో ఏ తెలుగు ముద్రణాలయం ముందుకు రాలేదు. చివరకు రంగూన్ చౌలియా ముస్లిం ప్రెస్సులో దీన్ని ముద్రించారు. ఆ యుద్ధం వేడిమి చల్లారిన వారం దినాలకే, నాయుడుగారు ఆ పుస్తకాన్ని తెలుగు సోదరులకు అందించారు. ఆ పుస్తకం సృష్టించగలిగే తీక్ష్ణ పరిస్థితులను గ్రహించి ప్రభుత్వంవారు నాయుడుగారిని శాంతిభంగకారకుడిగా, విద్రోహక శక్తిగా పరిగణించి నిర్బంధంలోకి తీసికొన్నారు. కొంతకాలానికి ప్రముఖుల హామీమీద, ఇలాటి వ్రాతలు వ్రాయరాదన్న ఆంక్షతో కన్నయ్యనాయుడు 'కవి'గారిని ప్రభుత్వం విడుదల చేసింది. కన్నయ్యనాయుడుగారు ప్రజాకవిత లోతుపాతులు తెలిసినవారు. ప్రభావవంతమైన కవితలను వీరు వ్రాయగలరు.

28 శ్రీ శిల్లా రాజులు రెడ్డిగారు : వీరు గ్రాంథిక శైలిలో పద్యాలను వ్రాస్తున్నా, వ్యావహారిక పదాలను కూడా విరివిగా కలిపివేస్తుంటారు. రెడ్డిగారు ఖండకావ్యాలను అనేకంగా వ్రాశారు. రక్తాశ్రువులు, స్వరాజ్య రణభేరి, హరిజన వీర, కరువు బాబూ! కరువు, కోకిలగానంలాటి కావ్యాలు ముద్రితాలై ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. ఇవేకాక ఇంకా కొన్ని అముద్రిత రచనలున్నాయి.

29. శ్రీ పోలాకి సూర్యనారాయణ గారు : 'ఆంధ్రమిత్ర' పత్రికాధిపతి తమ్ములు. పత్రికల్లో అనేక వ్యాసాలను, కథలను వ్రాసి ప్రకటించారు. వీరు వ్రాసిన 'హరినాథ్ భజన' వ్యాసాలు బర్మా ఆంధ్రులు మరువరానివి. సూర్యనారాయణగారు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో 'వంశధార' అన్న పత్రికను నడుపుతున్నట్లు తెలుస్తోంది.

30. శ్రీ గెడ్డం వెంకటరత్నంగారు : స్థానిక పత్రికల్లో చక్కటి కథలను, గేయాలను, వ్యాసాలను వ్రాశారు. 'కథారచయిత'గా మాత్రమే వీరు మంచిపేరు పొందారు. ఒకమారు 'తెలుగుబిడ్డ' పత్రిక వాళ్ళు జరిపిన కథారచన పోటీలో వీరు ప్రథమ బహుమతి పొంది స్వర్ణపతకాన్ని సంపాదించుకొన్నారు. అయితే వీరు ప్రధానంగా గ్రాంథికభాషాప్రియులు.

శ్రీ పఠానేని సూర్యనారాయణ-ఉరఫ్-తక్కా-గారు : బర్మాంధ్ర సాహిత్య రంగానికి, కళారంగానికి చిరపరిచితులు. ఐరావతి, స్వాతంత్ర్య హిందుస్థాన్ పత్రికలకు సంపాదకత్వం వహించి, స్థానిక పత్రికలన్నిటికంటె రాణింపులోకి తెచ్చారు. సిసింద్రీ, పఠాన్ సూర్యనారాయణపేర్లతో వీరు అనేక రచనలు చేశారు. ఈయన నాటకరంగంలోనూ అందెవేసినచేయి. కంస పాత్రకు వీరిని మించిన నటులు లేరని ప్రతీతి.

32. శ్రీ వేలూరి అప్పలస్వామి గారు : బర్మాలోని చక్కటి వ్యాస కర్తల్లో ఒకరు. హరిజనాభ్యుదయాన్ని ఆశిస్తూ 'జాతీయ ప్రబోధం' అన్న గేయ సంపుటిని వెలువరించారు.

33. శ్రీ కె. సుబ్బారావుగారు : ఆంధ్ర ట్రావల్ సర్వీస్ యజమానులు వీరికి మొదటినుండి రచనాసక్తి, భాషాభిమానం చాలాఎక్కువ, చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన వ్యాసాలను సామాన్య చదువరులకు కూడా అర్థమయ్యేలాగా వ్రాశారు. 'తెలుగుబిడ్డ' వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఒకసారి ఈయన కన్సొలేషన్ బహుమతిని తెచ్చుకొన్నారు.

34. శ్రీ దుమ్ము గురుమూర్తి నాయుడుగారు : వీరు 'ద్వీపాంతర దీపరక్షకుల జీవితము' అన్న గ్రంథాన్ని రచించి బర్మా ఆంధ్రకార్మికుల కష్టనష్టాలను గురించి బాగా వివరించారు. కార్మికుల జీవితాన్ని సవాస్తవికంగా చిత్రించడంతోపాటు అల్గోడా, బీకిన్, ఐస్టర్, టేబిల్, డబుల్ ఐలెండ్, గ్రీన్, సాల్వీన్, రీఫ్ అన్న ద్వీపస్తంభాల పుట్టుపూర్వాల గురించి వివరించారు. గురుమూర్తిగారు. స్థానిక పత్రికల్లోకూడా అప్పుడప్పుడూ వ్యాసాలను వ్రాశారు.

35. శ్రీ యస్. కృష్ణాగారు : చాలా చిన్నవ్రాయం నుంచే రచనలు చేస్తూ వచ్చారు. ఈయన ఆంధ్ర స్టూడెంట్స్ యూనియన్లో ఉన్నప్పుడు కొన్నివ్యాసాలను వ్రాశారు. ఆంధ్రులు బాగుపడాలంటే, రిషాలుండడం ఆంధ్రులకు అపకీర్తిదాయకం, భూపాశెములు అన్నవ్యాసాలు మంచి ఆలోచనను రేకెత్తించేవ్యాసాలు.

36. శ్రీ గొపాలకృష్ణా రావుగారు : తరచూ తెలుగు పత్రికల్లో ప్రతిభావంతమైన వ్యాసాలను వ్రాసేవారు. ఆంధ్ర యూత్‌లీగ్ వారి "ఆంధ్రవాణి"లో

ప్రయోజనాత్మకమైన సంపాదకీయాలు వ్రాశారు. నిరంతరం తమ రచనలచే ఆంధ్ర సాహిత్య లోకాన్ని ప్రోత్సాహపరిచేవారు.

37. శ్రీ నేదునూరి మశేసుగారు : మోల్మేన్‌లో నివసించేవారు. వ్యాసాలు కథలు వ్రాసి సాహిత్య సేవ చేశారు. వీరి బర్మాదేశ సంగ్రహ చరిత్ర, తంత్రం మంత్రం, పరోపకారం లాంటి రచనలు మంచి ప్రచారాన్ని పొందాయి. బర్మా తెలుగు అభ్యుదయ రచయితల్లో నేదునూరి మశేసుగారు ఒకరు.

38. శ్రీ పోలవరపు సన్యాసిరావుగారు : వీరు ముఖ్యంగా ఆంధ్రజాతి సంప్రదాయం, ఐక్యతను గురించి వ్యాసాలు. కథలు వ్రాసి పత్రికల్లో ప్రకటించారు. వీరి 'మగువ తెగువ', 'తప్పెవరిది?' అన్న రెండు నవలలు మానసిక పరివర్తనలను ప్రధాన వస్తువుగా పెట్టుకొని నడిచాయి. బర్మా ఆంధ్రులను ఆకర్షించిన తెలుగు రచనల్లో ఈ రెండు కూడా ఎన్నదగినవి.

39. శ్రీ డి. వి. కుమార్ గారు : కథలు, గేయాలు, పాటలు, నాటకాలు రచించి యువకులను ఎక్కువగా ఆకర్షించేవారు. అప్పుడప్పుడు వివిధపత్రికల్లో కూడా తన రచనలను ప్రకటించారు. 'సలామ్ మార్పు' అన్న వీరి రచన, పుస్తకరూపంగా వెలువడింది. వీరు చాలా నిరాడంబరంగా ఉండే రచయిత.

40. శ్రీ భీశెట్టి లక్ష్మణరావు : ఉత్సాహపంతులైన యువ రచయిత. చిన్నప్రాయంలోనే నాటికలను, గేయాలను అసంఖ్యాకంగా రచించి తెలుగు పత్రికల్లో ప్రకటించేవారు. ఈయన నాటకాల్లో కూడా అందెవేసిన చేయి. 'అహింసారౌడీ' అన్న నాటకాన్ని రచించి, తన దర్శకత్వంతో ప్రదర్శించి, బర్మా ఆంధ్రుల ప్రశంసల్ని పొందగలిగారు. ప్రస్తుతం, లక్ష్మణరావు గారు ఆంధ్రప్రదేశ్ - విజయవాడ ఆంధ్రపత్రిక కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఆంధ్రదేశం వెళ్ళాక నాటికలు, నవలలు వ్రాసి ప్రకటించారని వినికిడి.

41. శ్రీ వేదుల వెంకటరావుగారు : వీరు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) లో అధికారిగా ఉంటున్నారు. మాతృభాషలో మంచి ప్రావీణ్యం ఉంది. చక్కటి పద్యాలు, వ్యాసాలు వ్రాసి తరచూ స్థానిక పత్రికల్లో ప్రకటించారు. బర్మాలోని యువరచయితలకు అమూల్యమైన సలహాలనందిస్తూ ప్రోత్సహించేవారు. వీరు

వాసిన 'నేటి ఆంధ్రభాష', 'ఆంధ్రవేణి సంహార నాటక పరిచయం' లాంటి వ్యాసాలు తెలుగు భాషా, సాహిత్యాలలోని కొన్ని అంశాలను దిఙ్మాత్రంగా తెలిసికోడానికి బాగా ఉపకరిస్తాయి. బర్మా ఆంధ్రులకందరికీ ఒక కేంద్ర సంఘం స్థాపించడానికి వీరుచాలా పరిశ్రమించారు, కాని, ఆంధ్రులంటే చాలు, వారిలో వారికి అనూహ్యములైన అవాంతరపరిస్థితులు తలెత్తడం మామూలేకదా!

42. శ్రీ ఆర్. సూర్యనారాయణగారు: వీరి 'నా స్వదేశీయాత్ర' అన్న గ్రంథం అనేకుల్ని ఆకట్టుకొంది. వివిధపత్రికల్లో అనేకమైన వ్యాసాలను వ్రాశారు. కొంతకాలం 'ఆంధ్రసేవ' అన్న పత్రికను స్వయంగా స్థాపించి నడిపారు.

పైన పేర్కొన్నవారే కాకుండా ఇంకా అనేకులు వ్యాసాలను, కథలను, కవితలను వ్రాసిన చక్కటి రచయితలు ఈ దేశంలో వున్నారు. శ్రీ వస్కా సుబ్రహ్మణ్యం గారు, శ్రీ నాగలాపల్లి కన్నారావు గారు, శ్రీ బి.వి. సుబ్బారావు గారు, శ్రీ కరణం నారాయణమూర్తిగారు, శ్రీ తిమోతీగారు, శ్రీ నాయన వల్లభ రావు గారు, శ్రీ పాలపర్తి భీమరాజు గారు మొదలైన వారెందరో వ్యాసాలను, గేయాలను వ్రాశారు. భీమరాజు గారు స్వంత ఖర్చుతో 'ఆంధ్ర పవన మంది రాన్ని' రంగూన్ రేస్‌కోర్స్ ప్రాంతంలో నెలకొల్పారు. శ్రీ వెలగల కొండారెడ్డి గారు స్వంత వ్యాసాలతోపాటు 'అపోహ' అన్న శీర్షికతో కొన్ని వ్యాసాలను హిందీనుండి కూడా అనువదించి ప్రకటించారు. శ్రీ ఏ. డేవిడ్‌గారు కార్మిక సమ స్యలమీద ప్రధానంగా దృష్టిఉంచి చరిత్ర, సంస్కృతి వగైరాలకు సంబంధించిన వ్యాసాలను వ్రాశారు. కే. శే. దాడి ఆవినారాయణ గారు ఆలోచనాత్మకమైన వ్యాసాలతోపాటు 'గౌరీకుల ప్రదీపిక' అన్న ఒక పుస్తకాన్ని కూడా ప్రచు రించారు. శ్రీ కేళం నరసింహారావు గారు రెండు మూడు తెలుగు పత్రికల్లో సంపాదకులుగా ఉండి చక్కటి సంపాదకీయాలను వెలువరించారు. శ్రీ మైలిపిల్లి అప్పలస్వామిగారు, 'సుశీల' అన్న నాటకంతో ప్రముఖుల ప్రశంసలను పొందారు. ఈయన వ్యాసాలను, గేయాలను ప్రకటించారు. శ్రీ నిమ్మగి సుబ్బారావు గారు 'లాండోవాలా' అన్న కలం పేరుతో భారత సంస్కృతికి సంబంధించిన వ్యాసాలను చాలా వ్రాశారు. రంగూన్ టైమ్స్ అన్న ఆంగ్ల పత్రికలో సహాయ సంపాదకులుగా ఉన్న శ్రీ ఎ.ఎస్. నారాయణగారు తెలుగులో కూడా కొన్ని వ్యాసాలను వ్రాశారు. 'బర్మా పత్రిక'ను ప్రచురించిన శ్రీ బి.

సుబ్బుసింగు గారు, శాస్త్రీయ సంగీత విద్వాంసులైన శ్రీ సోమవరపు పేట వెంకటేశులు గారు, నటులు, హార్మోనిస్టులైన కీ.శే. మునిశెట్టి నందకుమార్ గారు, హరిదాసులైన కీ.శే. బి. కేశవదాసు గారు, చక్కటి కవితలను, వ్యాసాలను వెలయించారు. ఇంకా కీ.శే. రాపాటి వెంకటరెడ్డిగారు, కీ.శే. కర్రి వీర్రెడ్డి గారు, కీ. శే. బి. సుబ్బారావు పంతులు గారు, శ్రీ కొప్పాడ నరసింహమూర్తిగారు, కీ. శే. చెరుకూరి సూర్యనారాయణ గారు, కీ. శే. చిట్టాల భాస్కరరావు గారు, కీ.శే. మూరుకు సుబ్రహ్మణి గారు, కీ.శే. వాసనశెట్టి రాజారావుగారు, శ్రీ మైలి పిల్లి రాజయ్యగారు, శ్రీ వంకా బాలవర్ధిరాజుగారు, శ్రీ సి.హెచ్.వి. రాఘవులు గారు, శ్రీ నల్లి భాస్కరరావు గారు, శ్రీ బుంగ సుందరరావుగారు, శ్రీ ఎన్.కె. కుమార్ గారు వైవిధ్యం గల రచనా వస్తువుతో రచనలు చేశారు. తమ పేరును బయటపెట్టడానికి అంగీకరించని శ్రీ సుందర్‌గారు సుశీల, ఊహాగీతం అన్న రచనలను చాలా సున్నితమైన రీతిలో వ్రాశారు. 'మీ భూలోకం' అన్న వ్యాసాన్ని వ్రాసిన మోల్మేన్ పట్టణవాసి శ్రీ పారాచిన భూలోకం గారు యింకా చక్కటి వ్యాసాలను, కథలను వ్రాశారు. శ్రీ ఓగూరి సత్యానందం గారు వైజ్ఞానిక విషయాలకు సంబంధించిన భిన్న వ్యాసాలను ప్రకటించారు. శ్రీ టి. కె.జి. దాసుగారు, శ్రీ ఎలియాగారు పెగూ పట్టణం నుండి 'క్రైస్తవలోకం' పేరిట క్రైస్తవ మత ధర్మాలను గురించి, ఏసు ప్రభువును గురించి ప్రచారార్థం చక్కటి వ్యాసాలను వ్రాశారు. 'ఆంధ్రమిత్ర' పత్రికలో 'నారద సంచారం' అన్న శీర్షికతో శ్రీ పి. సత్యనారాయణగారు వ్రాసిన వ్యాసాలు మరువలేనట్టివి. వారి వ్యాసాలను చదువుతున్నప్పుడెల్లా, 'నేలకుపోయి నెత్తికి రుద్దుకొన్నట్లు' అన్న సామెత మనసులో మార్మ్రోగుతుంది. ఆ సామెతకు రూపకల్పన చేసే లాగ ఆయన ఆ వ్యాసాలను వ్రాశారు. జీవితంలో ఎంత నిరాడంబరంగా, సరళంగా ఉంటారో, రచనల్లో కూడా అంత నిరాడంబరంగానూ, సరళంగానూ ఉండే రచయిత శ్రీ గోపిశెట్టి సోములుగారు. శ్రీ రాణి సుబ్బారావుగారు, శ్రీ మేడా జగన్నాథరావు గారు, శ్రీ పి. సుబ్బారావు గారు, శ్రీ జుల్లూరి అర్జున రావుగారు, శ్రీ బోర అప్పలస్వామిగారు, శ్రీ లోచర్ల గంగరాజుగారు, శ్రీ వై. బి. రావుగారు ఇక్కడి మరికొందరు రచయితలు. శ్రీ సి. హెచ్. జి. దాసు గారు, శ్రీ కట్టా భూషణం గారు అభ్యుదయ రచయితలుగా గుర్తింపబడ్డారు.

రచయితలు కాకపోయినా రచయితలకు ప్రోత్సాహమివ్వడమే కాకుండా, ఎలా రచనలు చేయాలి? ఎలాటి రచనలు చేయాలి ? అన్న అంశాలమీద బర్మా ఆంధ్రులను ఉత్తేజితులుగా చేసినవారు ఇద్దరున్నారు. శ్రీ వి. సాంబశివరావుగారు శ్రీ చెరువు రామమూర్తిగారు. సాంబశివరావు గారు ఇంజనీరింగ్‌లో ఎం.ఎన్.సి. పట్టభద్రులు. రామమూర్తిగారు భౌతిక శాస్త్రంలో ఎం.ఎస్సీ పట్టభద్రులు. వీరిద్దరూ రంగూన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా వున్నారు. ఆంధ్రదేశం నుంచి విద్యాబోధన కోసం బర్మాకు వచ్చిన వీరు ఇక్కడి ఆంధ్రుల ఐక్యత కొరకు కృషిచేయడమే కాకుండా, అనేక సారస్వత సభలను ఏర్పాటుచేసి, తెలుగు దేశంమీద, తెలుగు భాషమీద, తెలుగు సాహిత్య సంప్రదాయాలమీద, ఉత్తమ ఉపన్యాసాల నిచ్చి, ఇక్కడి తెలుగు రచయితలకు గొప్ప ప్రేరణను కలిగించేవారు.

బర్మాలో రచయిత్రులు కూడా తక్కువ కాదు. కొందరు ప్రవృత్తిరీత్యా తెలుగు సాహిత్యాన్ని ఆరాధిస్తే, కొందరు ప్రవృత్తిరీత్యా తెలుగుసాహిత్యానికి తమశక్తికొద్దీ సేవ చేశారు.

1. శ్రీమతి పొన్నపల్లి రాజేశ్వరీదేవిగారు : వీరు కొంతకాలము రంగూన్ రాజారెడ్డియార్ ఉన్నత పాఠశాలలో జీతం తీసికోకుండా తెలుగు అధ్యాపకురాలుగా ఉంటూ సేవచేశారు. వారికి తెలుగుసాహిత్యంపట్ల ఎంత అభిమానం, గౌరవం ఉన్నాయో ఆ విషయంతోటి అర్థమౌతుంది. చక్కటి వ్యాసాలను, పద్యాలను తరచూ వ్రాసి ప్రకటిస్తుండేవారు. పెద్దపెద్ద సభల్లో తమ మధురోపన్యాసాలతో ప్రజలను ఆనందపరచేవారు.

2. శ్రీమతి మీరమ్మగారు : వీరు అప్పుడప్పుడు కథలను, వ్యాసాలను వ్రాసి ప్రచురించారు. కుటుంబ మనస్తత్వంతో నిండిన వీరి కథలు చాలా మందిని ఆకర్షించాయి.

3. శ్రీమతి లీలావతిగారు : స్త్రీల పురోభివృద్ధిగురించి, పురుషుల బాధ్యతను గురించి, కుటుంబ విషయాలనుగురించి, వీటి వ్యాసాలను మాత్రమే కాకుండా సృజనాత్మకమైన కథలను కూడా విరివిగా వ్రాశారు.

4. శ్రీమతి జంజా లక్ష్మీదేవిగారు : మోల్మేను ప్రాంతానికి సంబంధించిన వారు. తెలుగు మహిళలకు సంబంధించిన విషయాలను, భావి అభ్యున్నతులను గురించి వ్యాసాలు వ్రాశారు.

5. శ్రీమతి జి. పద్మావతీదేవిగారు బి.ఏ,, : వీరు శ్రీ జి. వి. కృష్ణమూర్తిగారి సతీమణి, సారస్వతప్రియులే కాకుండా, సంగీతంలోకూడా చక్కని ప్రవేశం గలవారు. సాహితీగోష్ఠులు ఏవైనా ఏర్పాటైనప్పుడు వీరు వీణ వాయిస్తూ త్యాగరాజకృతులను పాడుతూ సభకు ఒక కొత్త శోభను తెస్తుంటారు. స్త్రీలకు సంబంధించిన భిన్నవ్యాసాలను తెలుగు పత్రికల్లో ప్రకటించారు. రంగూన్‌లో వనితా మండలిని పునరుద్ధరించి, తెలుగు మహిళలకు కుట్టుపనులు, అల్లికలు మొదలైనవాటిని నేర్పుతుంటారు.

6. శ్రీమతి జె. సుశీలాదేవి గారు : వీరు భారత రాయబారి కార్యాలయంలో ఉద్యోగులైన శ్రీ జె. జగన్నాధరావుగారి సతీమణి. వీరు తెలుగుభాషపట్ల గొప్ప ప్రేమ మాత్రమే కాకుండా, అందులో మంచి ప్రవేశంకూడా ఉంది. వివిధ వ్యాసాలను కూడా వ్రాశారు. రంగూన్ ఆంధ్ర వనితామండలికి అధ్యక్షురాలిగా ఉంటూ బర్మా ఆంధ్రమహిళల కోసం చాలా శ్రమించారు.

7. కుమారి ఆర్. సుభద్రాదేవి గారు : శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్యగారి పుత్రిక. ఈమె చిన్నప్పటినుండి అనేక వ్యాసరచన పోటీల్లోనూ, వక్తృత్వ పోటీల్లోనూ పాల్గొని బహుమతులు సంపాదించింది. పెద్దయ్యాక కూడ వ్యాస రచనాభ్యాసాన్ని మానలేదు. 1964లో బర్మా కాందిశీకుల ప్రయాణపత్రాలు సమకూరుస్తున్నప్పుడు ఆంధ్ర మహాసంఘంలో రెండు సంవత్సరాల దాకా ఉచితంగా టైపిస్టుఉద్యోగం నిర్వహించారు. ప్రస్తుతం కూడా ధనాశ లేకుండా హిందూధార్మిక శిక్షణసమితిలో ఉచితంగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

వీరేకాక శ్రీమతి ఆర్. మాణిక్యమ్మగారు, శ్రీమతి మంగలక్ష్మీ దేవిగారు స్త్రీవిద్యకు, స్త్రీల బాధ్యతలకు సంబంధించిన అనేక అంశాలమీద చక్కటి వ్యాసాలను వ్రాశారు.

బర్మాలో నటులు - సంగీతజ్ఞులు

మొట్టమొదటగా క్రీ. శే. 1900 ప్రాంతంలో రంగూన్ ఆంధ్ర మహాసభ వారు రంగూన్ జూబ్లీహాలులో పౌరాణిక నాటకాలను ప్రదర్శించారని, బర్మాలో అవే మొట్టమొదటి తెలుగు నాటకప్రదర్శనాలని పెద్దలు చెబుతారు. శ్రీ చివుకుల పుల్లయ్యశాస్త్రి, శ్రీ పిచ్చయ్యశాస్త్రి (సెక్రటేరియట్‌లో ఉద్యోగులు) శ్రీ పిల్లల మట్టి నరసింహశాస్త్రి (ఏ. జి. ఆఫీసులో ఉద్యోగి) మరికొంతమంది కలిసి సంక్రాంతి, దీపావళిలాంటి ముఖ్యమైన సందర్భాల్లో ఆ నాడు తెలుగు పౌరాణిక నాటకాలను ప్రదర్శించేవారని ప్రతీతి.

కి. శే. కొచ్చర్ల విశ్వనాథంగారు, వీరి సతీమణి పార్వతీబాయిగారు, ఈమె సోదరీమణులిద్దరూ కలిసి 'శ్రీ సీతా రామాంజనేయ నాటక సభ'ను స్థాపించి బర్మా అంతటా నాటకాలను బాగా ప్రచారంచేశారు. ఈ నాటికీ వీరి శిష్య ప్రశిష్య పరంపరకు మంచి ప్రభ్యాతి ఉంది. విశ్వనాథం, పార్వతీబాయి గారలిద్దరూ ఉత్తమ కళాకారులు. నటనావైదుష్యంతోపాటు గానకళా ప్రావీణ్యం కూడా పొందినవారు. చాలామంది యువకళాకారులను తీర్చిదిద్దారు. విశ్వనాథం గారు స్త్రీ పాత్రలను కూడా వేసేవారట. మంచి వైవిధ్యం ఉన్న పాత్రలను పోషించారు. శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలనే కాకుండా సతీసావిత్రిలో సత్యవంతుడు, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు, చింతామణిలో బిల్వమంగళుడు, గంగావతరణంలో శంకరుడువంటి పాత్రలను ప్రతిభావంతంగా పోషించేవారట.

శ్రీమతి కె. పార్వతీబాయిగారు కూడా విశ్వనాథంగారికి తగ్గ సహధర్మచారిణి, చక్కటి నటి, గాయని. బర్మా ఆంధ్రుల్లో మొట్టమొదటి నటీమణిగా ఈమెను పేర్కొంటున్నారు. ఏ పాత్రలోనైనా, ఈమె బాగా రాణించేదట. సతీసావిత్రి, చంద్రమతి, చింతామణి, గంగ, సీత, సత్యభామ మొదలైన ముఖ్య

పాత్రలను ధరించేవారు. వీరి సోదరీమణులు కుమారి సుభద్రాబాయి, కుమారి మీరాబాయి గారలు కూడా కౌశల్యంతో కళామతల్లిని అర్చించారు.

విశ్వనాథంగారి శిష్యుల్లో శ్రీ యన్, కన్నారావుగారు ముఖ్యులు. ఈయన 'జయంత జయపాల'లో మేదరిగా, గంగావతరణంలో ఈశ్వరునిగా, సతీసావిత్రిలో యమునిగా నటించేవారు. భీకర పాత్రలకు ఈయన పెట్టింది పేరు. రానురాను వైవిధ్యంగల పాత్రలను చాలా సమర్థవంతంగా నటించి, తన ప్రతిభను నిరూపించుకొని ప్రముఖస్థానం పొందారు.

శ్రీ ఎ. జీవరత్నంగారు, శ్రీ కె. పైడిరాజుగారు, శ్రీ మైలపిల్లి అప్పల స్వామిగారు, శ్రీ కట్టా వీరరాఘవులుగారు, స్త్రీ పాత్రలను పోషిస్తూ, ప్రత్యేక గౌరవాలను సంపాదించుకొన్నారు. శ్రీ కొన్నే ఆచ్యుతరావు గారు ఆంజనేయ పాత్రలో గొప్పగా రాణించారు. ఈయన బహుముఖ పాత్రలలో నటించి, ఈ నాటికి కూడా బర్మా ఆంధ్ర నాటకకళారంగానికి సేవచేస్తున్నారు. కొన్ని నాట కాలకు స్వయంగా దర్శకత్వం వహించారు. విశ్వనాథంగారి ద్వితీయపుత్రిక శ్రీమతి సత్యవతీబాయిగారికి కూడ గొప్ప ప్రఖ్యాతి ఉంది.

శ్రీ కోడూరు సుబ్రమణి గారు, శ్రీ టి. వి. శ్యామాగారు ఆ దినాల్లో పేరుపొందిన హార్మోనిష్టులు. సుబ్రమణి గారు శాస్త్రీయ పద్ధతుల్లో నైనా, ఆధునిక పద్ధతుల్లో అయినా చక్కగా హార్మోనియంను వాయించేవారు. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వం అనేకవిధాలైన సభల్లో హార్మోనియం వాయించి పేరుపొందారు, శ్రీ పాలెపు గోవిందరాజులుగారు మంచి హార్మోనిష్టు మాత్రమే కాకుండా, కొన్ని పురుషపాత్రలను కూడా పోషించి పేరుపొందారు. శ్రీ రాయల రమణయ్యాచార్యులు కూడా హార్మోనిస్టులుగా ప్రసిద్ధులైనా, అవసరం వచ్చినప్పుడు కూడా పాత్రధారణ కూడా చేసి ప్రశంసలు పొందారు. శ్రీ వాసిపిల్లి మీరాగారు తబలా వాద్యంలో ప్రథమశ్రేణికి చెందిన విద్వాంసులు.

బర్మా ఆంధ్రులలో నారదపాత్రకు మొట్టమొదటగా చెప్పుకోదగ్గవారు కీ. శే. వి. శంభూరావుగారు, ఈయన మరికొన్ని పాత్రలను కూడా పోంషించినా, నారదపాత్రలో ప్రఖ్యాతిని సంపాదించుకొన్నారు. ఈయన తబలా వాద్యంలో నిపుణులు కూడా.

రౌద్ర పాత్రలంటే శ్రీ పఠాన్‌టి సూర్యనారాయణ-ఉరఫ్-తక్కీ గారి పేరు ఇప్పటికీ ఇక్కడ వాళ్ళకు జ్ఞాపకం వస్తుంటుంది. అలాగే శ్రీ దొమ్మేటి సూర్యనారాయణ గారి పేరు చెబితే రంగూన్ రౌడీ నాటకం జ్ఞావకం వస్తుంది. ఆయా పాత్రలకు వీరిద్దరూ అంత ప్రఖ్యాతినిపొందారు. భీకరమైన పాత్రలను పోషించడంలో వీరు అంత ప్రసిద్ధులు. శ్రీ సత్యవాడ వెంకటరావుగారికి కూడా భీకర పాత్ర పోషణలో మంచి పేరుంది.

'గృహలక్ష్మి' అన్న తెలుగు సినిమాలో షావుకారు పాత్రను పోషించిన శ్రీ కె. అప్పలస్వామిగారు బర్మాలో ఉన్నంత కాలం వివిధ పాత్రలను ధరించి పేరు పొందారు. ఆలాగే 'పల్లెటూరిపిల్ల' సినిమాలో సేనాధిపతిగా నటించిన ఏ. వి. సుబ్బారావుగారు, 'మాలపిల్ల' చిత్రంలో మేనమామగా నటించిన శ్రీ వి. నరసింహమూర్తిగారు బర్మాలో లబ్ధప్రతిష్ఠులు.

హాస్య పాత్రలను పోషించడంలో శ్రీ బి. వీర వెంకయ్య గారికి మంచి పేరుంది. ఈయన గంగావ తరణం నాటకంలో కుష్టురోగి పాత్రను పోషించిన తీరు బర్మా ఆంధ్రులు మరువరానిది. వృద్ధరాజ పాత్రలకు శ్రీ రామోజీరావు గారిది పెట్టింది పేరు. వీరు పద్యం పాడుతుంటే, వృద్ధ స్వభావాన్ని వ్యక్తీక రిస్తూనే, హాయి గొలుపుతుంటుంది. హార్మోనియం వాయించడంలో నైపుణ్యం ఉన్న సంగీత విద్వాన్ కే. శే. కంభంపాటి సుబ్రహ్మణ్యం గారు కూడా వృద్ధ రాజ పాత్రలను పోషించడంలో పేరు పొందారు; వారిలాగే హార్మోనిస్టు అయి ఉంటే, నటునిగా కీర్తి పొందిన వ్యక్తి శ్రీ మైసూరు కృష్ణమూర్తి గారు శ్రీ ముత్యాల భద్రంగారు, శ్రీ మల్లిఖార్జునరావు గారు చక్కటి నటులనిపించు కొన్నారు. శ్రీ రాజు గారు, శ్రీ ఆకుల నరసింహం గారు ప్రముఖ హార్మో నిష్టులుగా బర్మా ఆంధ్రులకు చిరకాల పరిచితులు, తబలాలా శ్రీ పొట్టి సూరి, లచ్చన్న, రాజు గార్లు కూడా అంతే.

ఆడవాళ్ళ విషయంలో సురభి పార్వతీబాయి తర్వాత పేర్కొనదగ్గ ప్రముఖ నటీమణి శ్రీమతి రాజ రత్నం గారు. శ్రీమతి యామినీ పూర్ణ తిలకం గారికి కూడా అంత ప్రశస్థి ఉంది. శ్రీ శోభనాచలంగారి సతీమణి అయిన శ్రీమతి రాజామణి గారు ప్రముఖ స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని

సంపాదించారు. వారి పుత్రిక అయిన కుమారి సుందరీబాయి ప్రహ్లాదుడు, ధ్రువుడు. చిన్ని కృష్ణుడు మొదలైన పాత్రలను బాగా ఒప్పించారు. శ్రీమతి క్షత్రియ పార్వతీబాయి గారు కూడా ప్రముఖ పాత్రలను ధరించి ప్రసిద్ధి పొందారు.

ఆంధ్రదేశం నుండి వచ్చి బర్మా ఆంధ్రుల ప్రశంసలు పొందిన ముఖ్యుల్లో పద్మశ్రీస్థానం నరసింహంగారు ఒకరు. స్త్రీ పాత్ర పోషణలోని తమ కౌశల్యంతో వీరు బర్మా ఆంధ్రుల్ని ముగ్ధుల్ని చేసి బంగారు కిరీటాన్ని బహుమతి పొందారు. వీరిలాగా స్త్రీ పురుషులెవరైనా చీరకట్టుకో గలిగితే వెయ్యిన్నూట పదహార్లు బహుమతిని వీరు ప్రకటించారు. శ్రీ సి. యస్. ఆర్. ఆంజనేయులు గారు శ్రీ కృష్ణునిగా నటించి, అలాగే బర్మా ఆంధ్రుల్ని పారవశ్యంలో ముంచారు. మొదటి దృశ్యంలో అర్జున, దుర్యోధనులను సంబోధిస్తూ విడివిడిగా పద్యాలు చెప్పకుండా, ఒక చరణం ఒకరికి, ఇంకొక చరణం ఇంకొకరికి ఒకే క్రమంలో చెప్పేవారట. రెండు భిన్న రాగాలను అలా వెంట వెంట ఆలాపిస్తూ వీరు కృష్ణ పాత్రను పోషించడం కేవలం నటనమీద మాత్రమే కాక సంగీతం మీదకూడా వీరికున్న అధికారాన్ని తెలియబరుస్తుంది.

రంగమార్తాండ శ్రీ కపిలవాయి రామనాథ శాస్త్రి గారు కొంతకాలం బర్మాలో ఉండి రౌద్ర పాత్రలను ధరిస్తూ ప్రఖ్యాతి పొందారు. ఎంతోమంచి తెలుగు కళాకారులను ప్రోత్సాహ పరిచారు. వీరు పాడిన గ్రామఫోన్ రికార్డులు తెలుగుదేశమంతా ఒకప్పుడు నిండిపోయాయి. రామనాథశాస్త్రిగారిలాగే శ్రీ ఆకుల నరసింహారావు గారు కూడా కొంతకాలం బర్మా తెలుగు నాటక రంగానికి సేవ చేశారు. ఈయన హరిశ్చంద్ర సినిమాలో నారద పాత్రను ధరించిన మేటి కళాకారుడు. వీరు మంచి హార్మోనిష్టులు కూడా. చాలా గ్రామఫోను రికార్డులకు కూడా పాడారు. శ్రీ దొమ్మేటి సత్యనారాయణగారు స్త్రీ పాత్రలను పోషించ డంలో దిట్ట అనిపించుకున్నారు. వీరు ఒకప్పుడు ఆంధ్రదేశంలో రంగూన్ రౌడీ నాటకంలోని రౌడీ పాత్ర పోషణలో పోటీకి సవాలు విసిరారని ప్రతీతి. శ్రీ వై. భద్రాచారి గారు చింతామణిలో బిల్వ మంగళునిగా, నలదమయంతిలో నలునిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రునిగా, భక్త కుచేలలో కుచేలునిగా నటించి పేరు పొందారు. కాని ఆయనకు కుచేల పాత్రధారణతో వచ్చిన ప్రఖ్యాతి ప్రత్యేక

మైనట్టిది. "అభినవ కుచేల" అన్న బిరుదును కూడా పొందగలిగారు. ఆయన హరిశ్చంద్రగా నటిస్తున్నప్పుడు కన్నీరు తుడుచుకోవడానికి చేతి రుమాళ్ళను మరచిపోకుండా తెచ్చుకొమ్మని ప్రేక్షకులను ప్రత్యేకంగా ప్రదర్శనాధికారులు కోరే వారట. "కచదేవయాని" చిత్రంలో నటించిన శ్రీ యస్. పి. లక్ష్మణ స్వామిగారు కూడా కొంతకాలం బర్మా దేశంలో వివిధ పాత్రలను ధరించి పేరు తెచ్చుకొన్నారు. వీరి గాత్రం చాలా కమ్మగా ఉండేది. మంచి గాయకులు. శ్రీ నిడుముక్కల సుబ్బారావుగారు ఆంధ్రదేశం నుంచి వచ్చిన ప్రముఖ నటుల్లో ఇంకొకరు. ఎలాటి పాత్రకైనా చాలా చక్కగా నవ్వే వారని ప్రతీతి. ఒకప్పుడు సతీ సావిత్రి నాటకంలో సత్యవంతునిగా నటించి శ్రీ రెడ్డి సన్యాసయ్య గారినుండి వెండి గొడ్డలిని బహుమతి పొందారు.

ఆంధ్ర జాతీయ నాటక సభకు శ్రీ సోమరాజు రామానుజరావు కవిగారు ఆస్థాన కవిగాఉంటూ సభ ప్రదర్శన లన్నిటికీ రచన చేశారు. నటులకు భావతాదాత్మ్యం కలిగేలాగ ప్రభావవంతంగా రచన చేయడంలో ఈయన సిద్ధహస్తులు.

బస్సిన్ నగరం నుండి కూడా చాలామంది కళాకారులు ఉన్నారు. గాయకుడు, హార్మోనిస్టు అయిన శ్రీ కురసాల అప్పారావుగారు బస్సిన్‌లో నాటకాలను బాగా ప్రోత్సహించారు. హార్మోనిష్టుగా పేరు ఉన్నప్పటికి, నటునిగా బర్మా అంతటా పేరు పొందిన శ్రీ చిట్టాల భాస్కరరావుగారు కూడా బస్సిన్‌కు చెందిన వారే. ఈయన కంసుడు, యముడు లాంటి ఉగ్ర పాత్ర పోషణతో మంచిపేరు సంపాదించినా, లంకా దహనంలో ఆంజనేయుడుగా, పాదుకా పట్టాభిషేకంలో భరతునిగా కూడా రాణించారు. శ్రీ ముదుకు సుబ్రహ్మణ్యంగారు బస్సిన్ పట్టణంలోని ఇంకొక ప్రముఖ నటుడు. ఈయన మంచి హార్మోనిష్టు కూడా. రాముడు, కృష్ణుడు, ధర్మరాజు లాంటి పాత్రలను ధరించి పేరుపొందిన సుబ్రహ్మణ్యం గారు, కొన్ని హాస్య పాత్రలను కూడా సమర్థవంతంగా పోషించారు. వెలముల వెంకన్న, తెలితి కృష్ణాగార్లు స్త్రీ పాత్రలను ధరించడంలో ప్రఖ్యాతి పొందారు. శ్రీ వల్లి రాజారావు గారు, శ్రీ లక్కోటి రామమూర్తిగారు, శ్రీ కె. జోగారావుగారు, శ్రీ యన్. అప్పలస్వామి గారు, శ్రీ గార అప్పలస్వామిగారు, కే. శే. కారంపూడి లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు, శ్రీ యస్. పి. అబ్రహాంగారు శ్రీ నడుపూరి అప్పలస్వామి గారు, శ్రీ అచ్చిరాజు గారు, శ్రీ బాణాల రామ

స్వామి గారు, బహు విధ పాత్రలను ధరించి లబ్ధ ప్రతిష్ఠులైన వారిలో కొందరు. శ్రీ కె. సన్యాసిగారు, శ్రీ కె. జోగారావు గారు, శ్రీ కె. పైడిరాజు గారు స్త్రీపాత్రలలో మంచి పేరు సంపాదించారు.

శ్రీమతి విజయలక్ష్మి, శ్రీమతి కోద నాయకి అనేక నాటకాల్లో పాల్గొని ప్రధాన స్త్రీ పాత్రలు ధరించారు. శ్రీమతి కనకం, రంగూన్ పుష్పవల్లి మీరాబాయి, మంగ తాయారు, కామాక్షి మొదలైన నటీమణులు ప్రధాన స్త్రీ పాత్రలను ధరించడమే కాకుండా, నృత్య ప్రదర్శనలు కూడా ఇస్తూ రెండవ ప్రపంచ యుద్ధ కాలం దాకా కళా రంగాన్ని సేవించారు.

బస్సిన్ వట్టణంలో మంచి కావ్యసంగీత నిపుణులు కూడా ఉన్నారు. శ్రీ యం. దొరసామినాయుడుగారు వారిలో మొదటి శ్రేణికి చెందినవారు. ఆయన తబలా, మృదంగ వాద్యాలను వాయించడంలో దిట్ట. ఈ నాటికీ బర్మాలో ప్రఖ్యాతి వహిస్తున్న మృదంగం, తబలా విద్వాంసుల్లో ఆయన శిష్యులే ఎక్కువ. తబలా మీద శ్లోకాలను, పద్యాలనుకూడా పలికిస్తూ సభికుల్ని సమ్మోహపరచే వారట. కర్ణాటక సంగీతకచ్చేరీలకు, ఆయన మృదంగి వాద్యం నిండుదనాన్ని తెచ్చేది. ఆయన శిష్యులైన శ్రీ దండా మరిడయ్య, శ్రీ దండా సింకిడు సోదరులకు మంచి ప్రసిద్ధి ఉంది. అనేక నాటకాలకు, కచ్చేరీలకు వీరు తబలా, మృదంగాలను వాయిస్తుంటారు. శ్రీ పిట్టా మరిడయ్యకూడా బస్సిన్‌కు చెందిన తబలా విద్వాంసుడు. శ్రీవాసనశెట్టి సూర్యనారాయణ దొరసామి నాయుడుగారి శిష్యుల్లో ఇంకొక ముఖ్యుడు. ఈయన తబలా మీదనే సాధనచేసి బాగా పేరులోకి వచ్చాడు. శ్రీ రఘుపాత్రుని నరసింహ పట్నాయక్‌గారు ఇంకొక ప్రముఖ మృదంగ విద్వాంసుడు.

శ్రీ చెలగకాయల అప్పలస్వామిగారు బస్సిన్ నివాసి. ఈయన బర్మా కంతటికీ పేరుపొందిన శాస్త్రీయ సంగీత విద్వాంసుడు. అనేకములైన కచ్చేరీలలో, సభలలో ఈయన త్యాగరాజకృతులను ఆలాపించి, శ్రోతలను ఆనంద సాగరంలో తేల్చేవారు. శ్రీ కొక్కిలి బైరాగి గారుకూడా బస్సిన్‌కు చెందిన శాస్త్రీయ విద్వాంసుడే. ఈయనకు హార్మోనిస్టుగా కూడా పేరుంది. శ్రీమతి మేడిచర్ల పార్వతమ్మగారికి వివిధ సాంఘిక, సాంస్కృతిక కార్యనిర్వహణల్లో

చాలా శ్రద్ధ ఉన్నవారైనప్పటికీ మంచి గాయని. ఎన్నో సభల్లో తమ మధుర కంఠాన్ని వినిపించారు. ఎంతో మందికి శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. శ్రీ యస్. వెంకటేశ్వరులు (ప్రేమకుమార్జీ) గారుకూడా గొప్ప సంగీత విద్వాంసులు. వీణ, హార్మోనియం, బేంజోలాటి భిన్న వాద్యాలలో ఆయనకు ప్రావీణ్యం ఉంది. శాస్త్రీయ సంగీత కచేరీలను కూడా చేశారు. కీ.శే. ఇద్ది అప్పారావుగారు ఇంకొక ప్రముఖ సంగీత విద్వాంసుడు. ఫిడేలు, హార్మోనియంలను చక్కగా వాయించేవారు. బస్సిన్ తెలుగువాళ్ళు ఏర్పాటు చేసిన కచేరీలలో పాల్గొని ప్రశంసలు పొందారు. శ్రీ దంటే ఆదినారాయణ గారు ప్రతి సభలోనూ తాత్త్విక గీతాలు పాడుతూ, బస్సిన్‌లో ప్రసిద్ధులయ్యారు. శ్రీ లంబే సింహాచలం గారు బుల్‌బుల్ తార (బేంజో) వాయించడంలో దిట్ట. శాస్త్రీయ సంగీత కచేరీలలో కాని, ఆధునిక సంగీత సభల్లో కాని, నాటకాల్లో కాని, ఈనాటి విద్వాంసుల్లో ఈయనకు సాటిరాగలిగేవారు అరుదు.

బర్మా ఆంధ్రులందరిలోకి మధురగాయకులని పేరు పొందిన వారిలో శ్రీ గుంటు అప్పారావు గారు ఒకరు. ఈయన ప్రముఖ హార్మోనిస్టు కూడా. నేటికీ రంగూన్ సంగీత దర్శకులలో ప్రథమ స్థానీయులు. ఈయన కొన్ని నాటకాలకు దర్శక బాధ్యతలను కూడా నిర్వహించారు.

శ్రీ తగరంపూడి కృష్ణమూర్తి గారు నటునిగా, గాయకునిగా గొప్ప ప్రసిద్ధిని సంపాదించారు. ఈయనకు అభినవ కబీరు, ఘణఘణఘంట అన్న బిరుదాల్ని ఆర్య యువజనాంధ్ర సమితి వారు, భారతాంధ్ర అమెచ్యూర్స్ వారు ఇచ్చారు. వీరు 1930 నుండి 1970 వరకు నాటక రంగానికి సేవ చేశారు. సుమిత్ర, విశ్వామిత్ర, కృష్ణ, నారద, భీష్మ, భగీరథ మొదలైన భిన్న పాత్రలను పోషించి, సామర్థ్యాన్ని నిరూపించుకొన్నారు.

శ్రీ బి. చలపతి రావు గారు కూడా ఇక్కడి ఇంకో ప్రముఖ నటుడు. ఈయన గంగావతరణంలో భగీరథునిగా, పాండురంగ మహాత్మ్యంలో పుండరీకునిగా, కృష్ణతులాభారంలో శ్రీకృష్ణునిగా, నర్తకీ మాధురి హత్యలో పోలీస్ సూపరిండెంటుగా ఇంకా అనేకమైన చారిత్రక, సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

శ్రీ దానా చలంగారు ప్రసిద్ధులైన హాస్య నటులు. మహమ్మదీయ పాత్ర లను ధరించినప్పుడు ఈయన పుట్టించే హాస్యం గుర్తించుకోదగ్గది. హాస్యపాత్ర లను విరివిగా ధరించే చలంగారు మాయలఫకీరు పాత్రతో కూడా మంచి పేరు తెచ్చుకొన్నారు. ఈయన ఎంతోమంది హాస్య నటులకు గురుప్రాయులై, తర్ఫీదును కూడా ఇచ్చారు.

శ్రీ వంగల వెంకటరావుగారు ఇంకో ప్రముఖ నటుడు. కంస, యమ, శంకరాది పాత్రలను ధరించి మంచి పేరును సంపాదించుకొన్నాడు. శ్రీ యన్.వై రత్నంగారు కూడా అలాటి నటులే. బాపనపిల్ల నాటకంలో కథానాయకునిగా, పాదుకలో భరతునిగా, నరకాసురలో నారదునిగా నటించి కీర్తి సంపాదించారు. ఈయన మంచి హార్మోనిస్టుకూడా. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం వీధి నాటకాలద్వారా ప్రశస్తిని పొందిన శ్రీ షేక్ వన్నూరుగారు తర్వాత స్టేజి నాట కాల్లో కూడా లక్ష్మణ, అర్జున; శంకర, జలంధరాది ప్రముఖ పాత్రలను ధరించి ప్రశంసలు పొందారు. శ్రీ సిద్ధనాతి అప్పలస్వామిగారు సుమారు నాలు గున్నర దశాబ్దాలుగా నాటకరంగాన్ని సేవిస్తున్నారు. పౌరాణిక, చారిత్రక నాటకాలలో బహుముఖ పాత్రలను నిర్వహించారు. నేటికికూడా వీరి కంఠ ధ్వని మార్పులేక, మాధుర్యం చెడకుండా ఉంది. చిన్నప్పుడు ఈయన స్త్రీ పాత్రలుకూడా ధరించి ఒప్పించారట. శ్రీ బోర అప్పలస్వామిగారు కూడా స్త్రీ, పురుష పాత్రలు ధరించి ప్రశంసలు పొందారు. ఈయన మంచి హార్మో నిస్టుకూడా. చారిత్రక, సాంఘిక నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించి అందరి ప్రశంసలను పొందిన శ్రీ ఇ.టి. రావుగారుకూడా బర్మా ఆంధ్రులలో గణనీయులైన నటులు. ఒకప్పుడు రంగూన్‌రౌడీ నాటకంలో, రౌడీ పాత్రకు పోటీ జరిగినప్పుడు రావుగారు బహుమతి విజేతలయ్యారు. అనేక నాటకాల్లో భిన్న పాత్రలను ధరించినవారిలో శ్రీ ఘంటి సీతారామ్‌గారు కూడా ఒకరు. ఈ నాటికి కూడా ఈయన అదే ప్రసిద్ధితో ఆంధ్ర నాటక రంగంలో రాణిస్తున్నారు. పౌరాణిక, చారిత్రక నాటకాల్లో హెచ్చుగా పాల్గొన్న సాంఘిక నాటకాల్లోకూడా బాగా పాల్గొని నటనలో చక్కటి నవీనతను ప్రదర్శించేవారు శ్రీ గొల్లపల్లి రంగారావుగారు. రంగూన్‌లో ఇప్పటికీ ఆంధ్ర, ఆంధ్రేతరుల్లో నాటకాలపట్ల ఉత్సాహాన్ని బాగా ప్రోత్సహిస్తుంటారు. 1943లో గణపతి పాత్రధారణతో ప్రారంభమైన ఈయన నటనాజీవితం, ఇప్పటికీ మంచి రాణింపులో ఉంది. వీరి

లాగే భిన్న పాత్రలను పోషించి, బహుధా ప్రజల మన్ననలకు పాత్రులైన నటులు శ్రీ కాలే అలగ్జాండరుగారు. శ్రీ తెలుగు గురుమూర్తిగారు కూడా విష్ణు, నారద, భవానీ శంకరాది పాత్రలతో ప్రఖ్యాతికి వచ్చారు.

బర్మాలో పేరెన్నికగన్న హరిదాసుల్లో శ్రీ లక్కోజి లింగరాజుగారు ప్రముఖులు. వీరు స్వయంగానే హరికథలను రచించి, చాలాచోట్ల హరికథా కాలక్షేపాలు చేశారు. ఈయన రచించిన భీమార్జున గర్వభంగము అన్న హరి కథ మంచి ప్రజాదరణను పొందింది. వీరు నటులూ, నాటక రచయిత. కొన్ని నాటకాలను తన దర్శకత్వంతోనే ప్రదర్శించారు. భారత సన్యాసి అన్న వీరి నాటక రచన ప్రజల ఆదరానికి పాత్రమైంది.

శ్రీ యస్. చిన్నాగారు, శాస్త్రీయ పద్ధతిలోనూ, ఆధునిక పద్ధతిలోనూ మృదంగం, తబలా వాద్యంలోనూ మిక్కిలి ప్రవీణులు, ప్రసిద్ధులు. ఇరవై ఏళ్ళకు పూర్వమే శాస్త్రీయ కళా కారులచే "ఆంధ్రటీన్" అన్న బిరుదును పొందారు. చాలా నాటకాలకు కూడా వాయించారు. ఆంధ్ర, ఆంధ్రేతరుల్లో వీరిని మించిన వారు లేరని ఇక్కడివారంటారు. అనేక బహుమతులను, ప్రశంసా పత్రాలను పొందారు.

శ్రీ చిన్నాగారి శిష్యుల్లో శ్రీ గళ్ళ అప్పారావు గారు ముఖ్యులు. ఈయన తబలాతో పాటు డోలక్ వాద్యంలో కూడా నిపుణత సాధించారు. దాదాపు బర్మా అంతటా వివిధ స్థానిక బృందాలతోనూ, విదేశీ బృందాలతోనూ పర్యటించి కీర్తి గడించారు. అసంఖ్యాకమైన నాటకాల్లోను, గాన కచ్చేరీలలోనూ తబలాను పలికించి, శ్రోతల హృదయాలను స్పృశించారు.

శ్రీ చొల్లంగి కంచన్నగారు నటునిగా మంచి పేరు తెచ్చుకొన్నప్పటికీ, ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఏకాంక నాటికలు పెక్కు రచించి నాటక రచయితగా కూడా ప్రకాశించారు. శ్రీ బత్తుల సుందరరావుగారు కూడా నాటికలు వ్రాసి, చక్కటి రచయితగా పరిగణనలోకి వచ్చారు. శ్రావణకుమార్, పూలగంప అన్న నాటికలు ప్రేక్షకుల ప్రశంసలను పొందాయి. శ్రీ భీశెట్టి లక్ష్మణరావుగారు బర్మాలో ఉండగా నాటక రచయితగా పేరు పొందారు.

విద్యార్థి దశనుండే చాలా సాంఘిక, జానపదనాటకాల్లో నటించి నటునిగా కూడా గుర్తింపును పొందారు. కొన్నిటికి స్వయంగా దర్శకత్వం నిర్వహించి వివిధ ఉత్సవాలలోనూ, గాంధీ మెమోరియల్ హాల్‌లోనూ ప్రదర్శనలిచ్చారు. ఈయన రచన, దర్శకత్వ బాధ్యతలు వహించిన "అహింసా రౌడీ" నాటకానికి ప్రఖ్యాతి వచ్చింది. యువతరం నట్లుల్లోనూ ఈయన గణనీయులు.

శ్రీ పుండ్రోతు సుబ్బారావుగారు, శ్రీ జి. ఎస్. మణిగారు, శ్రీ జి. సాంబ మూర్తి గారు, శ్రీ డి. అచ్యుతరావుగారు, శ్రీ యస్. కృష్ణారావు గారు, శ్రీ పెదకం శెట్టి రామారావుగారు, శ్రీ శ్రీధర్‌రావు గారు, శ్రీ శేషురావుగారు, శ్రీ బి. ఎ. రావు గారు, శ్రీ జి. రవిభాస్కర్ గారు, శ్రీ ఎ. దేవరాజ్ గారు, ఈ యువతరంలో చెప్పుకోదగ్గ చక్కటి నటులు. దేవరాజుగారు తటోన్ నగరవాసి. గాయకునిగా కూడా ఈయనకు పేరుంది. మంచి హార్మోనిష్టు కూడా. శ్రీ నల్లి భాస్కరరావు గారు తమిళం, తెలుగు నాటకాల్లో నటించి, ఇరుభాషల వారికీ అభిమానులయ్యారు.

నిలుముక్కల సుబ్బారావుగారి సతీమణి అయిన శ్రీమతి రంగమ్మగారు తన భర్త ద్వారా నాటకాల పట్ల అభిరుచి ఏర్పరచుకొని, పెక్కు నాటకాల్లో ప్రముఖ స్త్రీ పాత్రలు ధరించి, నటీమణిగా పేరు పొందారు. తన పేరిటనే స్వయంగా ఒక నాటక మండలిని కూడా స్థాపించారు. ఆమె కుమార్తెలు, కోడండ్రు గూడా నాటక రంగానికి బహుధా సేవచేస్తూ యువతరం నటీమణుల్లో అగ్రగాములై ఉన్నారు. వీరి పుత్రికలు శ్రీమతి ఎం. పార్వతమ్మ, శ్రీమతి ప్రభావతి, కుమారి శ్యామల నక్షత్రవతి మంచిపేరును సంపాదించారు. వీరే కాకుండా ఈనాటి బర్తా ఆంధ్ర నాటక రంగానికి సేవచేసిన నటీమణులు ఇంకా చాలా మంది ఉన్నారు. శ్రీమతి కమల కుమారి ప్రముఖ పాత్రలను చాలా ధరించడమే కాకుండా చక్కటి గాయనిగా కూడా పేరు పొందింది. కుమారి శ్యామసుందరి నటిగా పేరు తెచ్చుకుంటూ, ఆధునిక నాట్య ప్రదర్శనల్లో కూడా ప్రశంసలు తెచ్చుకొంది. కుమారి మోహినీ బాయి శివ తాండవం, కృష్ణప్రేమ అన్న నాటకాల్లో చూపించిన ప్రతిభ చాలా గొప్పది. కుమారి చొల్లంగి సుమిత్ర, కుమారి గొల్లపల్లి మంజులాదేవి ఉప ప్రధాన పాత్రలను ధరించడమే కాకుండా, నృత్యాలు కూడా చేస్తూ ప్రజావరణను సంపాదించారు.

యువతరానికి సంబంధించిన గాయకుల్లో శ్రీ బత్తుల వీరరాజు గారికి మంచి పేరుంది. సినిమా బాణీలలో చక్కగా పాడుతూ, శ్రోతలను బాగా ఆకర్షిస్తారు. ఈయన హార్మోనిస్టు కూడా. వీరికి శాస్త్రీయ సంగీత పరిజ్ఞానం కూడా ఉంది. శ్రీ పి. చిన్నారావు గారు కూడా సినీ బాణీలలో చక్కగా పాడతారన్న ప్రశస్తి ఉంది. ఈయన కొన్ని నాటకాల్లో నటించడమే కాకుండా, కొన్నింటికి నేపథ్యగానం చేస్తారు. శ్రీ వేషపోగు జోసెఫ్ గారు కూడా ఇలాటి ఆధునిక గాయకులే. ఈయన చాలా నాటకాలకు, సభా కార్యక్రమాలకు సంగీత దర్శకునిగా ఉంటూ, ఆంధ్ర, ఆంధ్రేతరుల్లో కూడా ప్రఖ్యాతి సంపాదించారు. శ్రీ పల్లికొండ కోటయ్య గారికి ప్రత్యేక గౌరవం ఉంది. భక్తిరస గీతాలను పాడడంలో ఈయన దిట్ట. 'జాతీయ కీర్తనలు' అన్న పుస్తకాన్ని కూడా రచించి, ప్రచురించి ప్రజల మన్ననలను పొందారు. మధురగాయకుడిగా శ్రీ డి. అప్పారావు గారికి కూడా మంచి ప్రశస్తి ఉంది.

శ్రీ టి.వి. రంగనాథం గారు ప్రముఖ హార్మోనిస్టుల్లో ఒకరు. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం నుండీ గూడా ఈయన హార్మోనిస్టుగా మంచి పేరు వహించినవారు. ఈనాటికి కూడా ఆ పేరు తగ్గలేదు. వీణ, ఫిడేలు వాయించడం లోనూ, శాస్త్రీయసంగీతంలోనూ ఈయన నిపుణులు. శ్రీ నీలాపు లక్ష్మణ్ గారు తబలా వాద్యంలో పేరుగాంచినవారు. అనేక నాటక, నాట్య ప్రదర్శనలకు వాయించడమే కాకుండా, ఖవాలీ జట్టులకు కూడా సమర్థవంతంగా వాయించారు. ప్రసిద్ధ కళాకారులతోపాటు, బర్మా ఆకాశవాణిలో తబలాను వాయించి ప్రసిద్ధి పొందారు. కే.శే. బెల్లిమిల్ల వెంకన్న గారు, ఒకప్పుడు మృదంగ, తబలా వాద్యాలలో ప్రవీణులనిపించుకొన్నారు. ఈయన పేర్గాంచిన గాయకుడు కూడా. అలాగే నాటకాల్లో నటించి ప్రజాభినందనలను పొందారు.

ఈ అధ్యాయం చివరగా ఇక్కడ ఉన్న నాటక సమాజాలను కూడా కొద్దిగా పేర్కొనడం ఈ రచయిత బాధ్యత. రంగూన్లో మొదటి సంస్థ అయిన ఆంధ్రమహాసభ, జూబ్లీహాలలో కొన్ని నాటక ప్రదర్శన లిచ్చింది. అనంతరం నాటకాలకోసం ప్రత్యేకంగా సమాజాలు అవతరించి, ఇక్కడి తెలుగు నాటకరంగాన్ని విస్తృతంగా పెంచాయి. శ్రీ కొచ్చర్ల విశ్వనాథంగారి శ్రీ సీతారామాంజనేయ సభ, శ్రీ వెలగల వెంకటరెడ్డి గారి ఆంధ్ర జాతీయనాటక

సభలేకాకుండా, రానురాను అనేక సమాజాలు ఏర్పడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి – శ్రీ సీతారామాంజనేయ నాటకశాఖ, సురభి నాటక కంపెనీ, ఆంధ్ర భారతీ - ఎమెచ్యూర్స్, ఆంధ్రరత్న నాటకకళామండలి, శుభోదయ నాట్యకళామండలి, సూర్యకళా నాట్యమండలి, బర్మా ఆంధ్ర నాట్యకళామండలి, దుర్గా సంగీత్‌కళా మందిర్, శివప్రసాద నాట్యమండలి, జయశ్రీ సంగీత కళాబృందం, బాలమిత్ర కళాబృంచం, జ్యోతి నాట్యకళామండలి, గౌరీశంకర్ నాట్యమండలి, ఆంధ్రజ్ఞానప్రచారిణీ సంఘ నాటక శాఖ, వీరాంజనేయ నాటకసభ, ఆంధ్ర యువజన నాట్యకళామండలి, నవకళా నాట్యమండలి, రంగూనాంధ్ర నాట్యకళా సమితి (బర్మా), ప్రభాత్ నాట్యకళామండలి వగైరా. సమాజాలెన్నో పుట్టడం, వాటిలో కొన్ని గిట్టడం కూడా జరిగింది. ఇవేకాకుండా శివజ్యోతి సంగీత బృందం, జయశ్రీ సంగీత కళాబృందం, బాలయోగి సంగీత కళామందిర్ లాంటివి సంగీతా: కి, నాటకప్రదర్శనలకు సమప్రాధాన్య మిచ్చాయి.

బర్మాలో ఇన్ని నాటక సమాజాలు వెలసినప్పటికీ, ప్రస్తుతం ఏవైనా ముఖ్యసందర్భాల్లో ప్రదర్శనలు ఏర్పాటుచేసే సమాజాలు రెండే. ఆవి 1. శ్రీ దుర్గా సంగీత్ కళామందిర్, 2. రంగూన్ ఆంధ్ర నాటక కళాసమితి (బర్మా). నాటక ప్రదర్శనలపట్ల మళ్ళీ పూర్వ ఉత్సాహాన్ని పుంజుకోవాల్సి ఉంది.

క్రీడా, చిత్రకళా రంగాల్లో తెలుగువారు

ఆంధ్రులెప్పుడూ మొదట ఇంకొకరిని గౌరవించి, ఏ కార్యానికైనా వెన్నెముకగా నిలబడతారని మహాత్మాగాంధి అన్నారట. బర్మా ఆంధ్రుల విషయంలో ఆ మాట ముమ్మాటికీ నిజం. ఇక్కడ ఏదైనా సంస్థ ఏర్పడినప్పుడు సామాన్యంగా భారతీయ నామాన్ని వాడుతుంటారు. ఇండియన్ టీం, ఇండియన్ కాంగ్రెస్, ఇండియన్ మ్యూజిక్, ఇండియన్ డ్రామా ఇట్లాగ భారతీయ శబ్దం మొదట్లోనే పలుకుతుంటుంది. ఈ సంస్థలన్నిటిలోనూ ఆంధ్రుడు లేకుండా పోలేదు. చాలా సంస్థల ఆవిర్భావంలో ఆంధ్రుడిదే ప్రధానమైన పాత్ర. కాని చరిత్ర తారుమారై ఆంధ్రుడి పాత్ర తెరచాటు పాలైపోతుంటుంది. కాని విడి విడిగా చూసేటప్పుడు ఆంధ్రుల పాత్రను ప్రతి చరిత్రకారుడూ గుర్తించగలడు.

క్రీడారంగంలో ఆంధ్రులు గణనీయమైన సేవ చేశారు. కాలిబంతి ఆటలు, దాటులు, మల్లయుద్ధాలు, మొదలైన వాటిల్లోనే కాకుండా, కోళ్ళ పందేలు, గొర్రెల పందేలు, ఎడ్ల పందేలు మొదలైన వాటిని కూడా బాగా ఏర్పరచేవారు. ప్రత్యేకంగా కాలిబంతి ఆటల సంస్థలను, మోల్మేన్, బస్సిన్, మొదలైన నగరాల్లో ఆంధ్రులు నెలకొల్పారు కాని, వాటిని పోషించే ఆసక్తి ఆంధ్రేతరుల్లోనే అధికంగా ఉండడంతో, ఈనాడు తెలుగువారి పేరు గొప్పగా చెప్పుకోడానికి లేకపోతోంది.

క్రీడారంగంలో ప్రముఖాంధ్రుడిగ ఎన్నదగ్గ వ్యక్తి జె. వెంకటేశులు-ఉరఫ్ - తెయిన్మ్యింట్. ఈయన ముష్టియుద్ధంలో గొప్ప పేరును పొందారు. ఈయన బర్మా బాక్సింగ్ ఫెడరేషన్ తరపున మొదటిసారిగా సౌత్ ఈస్ట్ ఏసియా బాక్సింగ్ ఛాంపియన్ క్రీడారంగంలో ఫ్లైవెయిట్ తరగతిలో పాల్గొని బంగారు పతకాన్ని సంపాదించారు. 1968లో ప్రపంచ ఒలంపిక్ ఆటలు మల

బోన్‌లో జరిగినప్పుడు, అందులో పాల్గొన్నారు. జపాన్‌లో ఏషియన్ ఒలంపిక్ గేమ్సు జరిగినప్పుడు, బెంటంవెయిట్ తరగతిలో ముష్టియుద్ధపు పోటీలలో పాల్గొని బంగారు పతకాన్ని పొందారు. మళ్ళీ బెంటంవెయిట్ తరగతిలోనే ప్రపంచ ఒలంపిక్ ఆటల్లో పాల్గొని విజయాన్ని సంపాదించారు. ప్రపంచ ఒలంపిక్ బాక్సింగ్ క్రీడలు రోములో జరిగినప్పుడు బర్మా తరపున ఆఖరుసారిగా అదే తరగతిలో పాల్గొంటూ, కీర్తిని సంపాదించాడు. ఇంకొకప్పుడు కలకత్తా నగరంలో 'రెండు రౌండుల మజుందారు' అన్న పేరు పొందిన ప్రముఖునితో పందెంలో నిలిచి గెలుపొందారు. ప్రస్తుతం వీరు బర్మా ఆర్మీ సెకండ్ ఆఫీసర్‌గా ఉన్నారు.

శ్రీ కుప్పిలి ఆదిరానాయణ - ఉరఫ్-మౌంగ్‌మ్యింట్ గారు తెలుగు జాతికి సంబంధించిన ఇంకొక ప్రముఖుడు. 1961లో ఫస్ట్ డివిజన్ టెలికాం తరపున కాలిబంతి ఆటలో పేరు సంపాదించి, బర్మా యువజన ఫుట్‌బాల్ టీం లోనికి ఎన్నుకోబడి బర్మా తరపున జపాన్‌కు వెళ్ళి 1965లో బహుమతి సంపాదించారు. అదే సంవత్సరం డిసెంబర్ నెలలో మలేసియా సీడ్ గేమ్సులో పతకాన్ని గెలుచుకొన్నారు. 1966లో బర్మా యువజన ఫుట్‌బాల్ టీం పక్షాన ఫిలిప్పైన్స్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సంపాదించారు. అదే ఏట మలేసియాలో మర్డేకా బంతి ఆట సంస్థలో సీనియర్ జట్టుతో ఆడి బర్మాకు విజయాన్ని సంపాదించారు. ఆ సంవత్సరమే బర్మా యువజనుల పక్షాన సిలోను పర్యటనకు వెళ్ళినప్పుడు, అక్కడ పోటీల్లో పాల్గొని బహుమతులను పొందారు. అదే సంవత్సరం సిలోన్‌లో జరిగిన ఎగ్జిబిషన్ సందర్భంలో బర్మా ప్రధాన మంత్రి శ్రీ నేలిన్ గారి తరపున వెళ్ళి, విజయాన్ని పొందారు. 1967లో మళ్ళీ మర్డేకా సీనియర్ జట్టుతో ఆడి విజేతలయ్యారు.

చిత్రలేఖనం

రంగూన్‌లోని చక్కటి చిత్రకారుల్లో శ్రీ పసుపులేటి అప్పలస్వామిగారు ఒకరు. యుద్ధానికి పూర్వం నుండి 1966 దాకా రంగూన్‌లోని జ్యోతి సినిమా హాల్ లోనూ, మరికొన్ని హాళ్ళలోనూ ప్రదర్శింపబడిన హిందీ, తమిళం, తెలుగు, ఉర్దూ చిత్రాలన్నిటికీ చిత్రరచన చేశారు. నాటకాలకు పోస్టర్లను, బ్లాకులకు డిజైన్లను, నాటకాల సీనరీలను విరివిగా చిత్రించి మంచి పేరును

సంపాదించారు. దేవతల బొమ్మలను చిత్రించడంలోను, ప్రకృతి దృశ్యాల రచనలోనూ ఈయనకు ప్రత్యేకత ఉంది. వీరి ఇలాటి రచనలు విరివిగా వ్యాప్తిని పొందాయి. ఈయన ప్రస్తుతం బర్మాలో లేకపోవడం, బర్మా చిత్ర కళారంగానికి గొప్ప లోటుగా భావించాలి.

శ్రీ అప్పలస్వామిగారివద్ద అభ్యాసంచేసిన శ్రీ కొండాబత్తుల అప్పారావు గారు కూడా చక్కటి చిత్రకారునిగా బర్మా ఆంధ్రుల అభిమానానికి పాత్రులయ్యారు. చిత్రకళలో నెమ్మది నెమ్మదిగా పురోగమిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రదర్శనార్థం, బర్మా ఆంధ్రుల చరిత్రకు సంబంధించి వీరు తయారుచేసిన చిత్రపటాల సంపుటిని ఆంధ్రదేశానికి పంపాలని తీర్మానించడం జరిగింది.

శ్రీ జి. సూర్యనారాయణగారు బర్మా ఆంధ్రుల్లో చెప్పుకోదగ్గ యువ చిత్రకళాకారుడు. కాంబోజా, అశోకా, రాక్సీ, జ్యోతి వగైరా చలనచిత్ర ప్రదర్శనశాలలకోసం వివిధ భారతీయ, ఆంగ్లేయ చలనచిత్రాలకు సంబంధించిన బొమ్మలు వేశారు. 1965 వరకు తన నైపుణ్యంతో ఆంధ్ర, ఆంధ్రేతరుల ప్రశంసలను పొందిన సూర్యనారాయణగారు ప్రస్తుతం మాతృదేశానికి మరలి వెళ్ళారు.

శ్రీ దోళ్ళపిల్లి రతీరావుగారు విద్యార్థిదశ నుండీ, చిత్రకళపట్ల అభిరుచి పెంచుకొని, చదువులకు కూడా స్వస్తిచెప్పి, అభ్యాసం చేశారు. రంగూన్ నగరంలో ప్రముఖ చిత్రకారులుగా పేరుపొందిన శ్రీ డావుడ్‌గారికి శిష్యులై చిత్రకళారంగంలో నిలదొక్కుకొన్నారు. చాలా చిన్న వయసులోనే వందల కొలది చిత్రాలను గీసి అందరి ప్రశంసలను చూరగొన్నారు. రంగూన్-ట్రామ్వే-ఓజు ప్రాంతంలో నివసిస్తున్న రతీరావుగారు బర్మా ఆర్ట్ కౌన్సిల్‌లో సభ్యులయ్యారు. యువక చిత్రకళాకారుల్లో మొదటిపేరు వీరిదే.

శ్రీ కర్ణిక గణేశ్వరరావుగారు, శ్రీ పి. శంకర్‌గార్లు నేటి యువ చిత్రకళాకారుల్లో పేరుపొందిన ఆంధ్రులు.

బర్మాలో ఆంధ్రసంస్థలు

బర్మాలో ఆంధ్రులు బ్రిటిషు యుగందాకా కూడా, తమ కులమత ధర్మాల పట్టింపులను ఏ మాత్రం తగించుకో లేదు. ఇక్కడ ఆంధ్రులు స్థాపించు కొన్న సంస్థలు మొట్టమొదట దైవ సంబంధంగాను, తర్వాత కులసంబంధం గానూ, రానురాను ప్రాదేశిక పరంగానూ తయారయ్యాయి. ఒకొక్కక్క ప్రదేశంలో నివసించేవారు. ఒకొక్కక్క జట్టుగా ఏర్పడి, చిన్నసంఘాలను నెలకొల్పడం ప్రారంభించారు. క్రమ క్రమంగా అలాటి సంస్థలే, సాంఘిక, సాంస్కృతిక సంస్థలుగా కార్యకర్తల విజ్ఞత మూలంగా, సంస్కారం మూలంగా పరివర్తన పొందాయి. క్రీ. శ. 1890 తర్వాతనే బర్మాలో ఆంధ్రుల సంఘాలు తలెత్తడం ప్రారంభించింది. నాటినుండి ఎన్నో సంఘాలు పుట్టి, ఆంధ్ర ప్రజానీకంలో చైతన్యం రగిల్చేటందుకు, తెలుగు విశిష్టతను కాపాడేటందుకు ప్రయత్నించాయి. కొన్ని దురదృష్టవశాత్తు కాలగర్భంలో కలిసిపోవడం కూడా జరిగింది. అయితే ఈ సంఘాలు తెలుగు జనతకు చేసిన సేవ బృహత్తరమైనది.

1. ఆంధ్ర మహాజనసంఘం (రంగూన్)

1905 సంవత్సరంలో కొందరు ఆంధ్ర ప్రముఖులు, ఆంధ్రాభిమానులు "ఆంధ్ర మహాసభ"ను రంగూన్ మొగలు వీధిలో నెలకొల్పారు. ప్రప్రథముంగా ఈ సభ తరఫున కొందరు ఉత్తమ కళాకారులు, మంచి నాటకాలను సాధన చేసి, జూబ్లీహాలులో ప్రదర్శించడం మొదలుపెట్టారు. ఆంధ్రదేశంనుండి కూడా కొన్ని నాటకసమాజాలను ఆహ్వానించి. నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారట. ఈ సభవారు ఒకవైపు నాటకకళాభిరుచిని అభివ్యక్తపరుస్తూనే, సాంఘికసేవను కూడా చేస్తుండేవారు. కాని సాంఘికసేవకే ప్రాధాన్యం ఇవ్వ

దలచిన కొందరు సభికులు సమాలోచనలు చేసి 1912 సం॥లో "ఆంధ్రమహా జనసంఘం" అన్న దాన్ని 118, లూయీ వీధిలో స్థాపించారు. 1912 లో ఆంధ్రుల మొదటి సంస్థగా, భారతీయ సంస్థల్లో నాలుగవదిగా దీన్ని రిజిస్టర్డ్ చేశారు. ఈ సంఘం ఆశయాలు— (i) ఉచిత విద్యావ్యాప్తి (iii) పఠన మందిరం, గ్రంథాలయాల నిర్వహణ (iii) ఆంధ్ర జాతిలో ఐక్యత చేకూర్చుట (iv) సాంఘిక దుష్టాచారాల నిర్మూలన. వీటితోబాటు వ్యాయామ, క్రీడాశాఖ, నాటక సంగీత శాఖలను కూడా ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో యువకులను ఉత్తేజపరచసాగింది. దిన, రాత్రి పాఠశాలలను నిర్వహిస్తూ వేలకొలది ఆంధ్రబాలురకు ఉచితంగా విద్యానాసం చేయసాగింది. పంచమ జార్జి చక్రవర్తి పట్టాభిషేక సందర్భంలో, బ్రిటిషువారు ఇచ్చిన 'తురగారోహణదళం'లో ఈ సంఘం వారు కూడా పాల్గొని, ఊరేగింపుతో, ప్రజల దృష్టిని ఆకర్షించారు.

1914-1918 సంవత్సరాల్లో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిషువారు వసూలుచేస్తున్న యుద్ధనిధికి విరాళం సమర్పించడానికై ఈ సంఘంవారు కూడా ఒక నాటకాన్ని ప్రదర్శించారు. యుద్ధానంతరం (1918 లో) ఓడలరేవులో బయల్దేరిన కార్మికోద్యమానికి మద్దతుగా, ఈ సంఘంవారు కూడా సమ్మెలో పాల్గొని కార్మికుల కూలీరేట్ల హెచ్చింపు విషయంలో ఘనమైన విజయాన్ని సాధించారు. ఆ మరుసటి సంవత్సరమే, రంగూన్ కళాశాల కమిటీలో హిందువులకు స్థానంకోరి, అందులో ఆంధ్ర భాషాబోధన కూడా ఉండాలని కృషిచేశారు. తదనంతరం గ్రంథాలయాన్ని విస్తరించడానికి ఒక ప్రణాళికను ఏర్పరచుకొని తెలుగు ప్రజల్లో చైతన్యం కలిగించారు. మొన్నటివరకు భారతకేంద్ర ప్రభుత్వంలో ఉపమంత్రిగా ఉన్న శ్రీ బయ్యా సూర్యనారాయణమూర్తిగారు, కీ. శే. సత్తి వెంకటరెడ్డి, శ్రీ పిల్లి సీతారామయ్యగారు అప్పట్లో గ్రంథాలయ నిర్వాహకులుగా ఉండేవారు. సుమారు 15 తెలుగు, ఇంగ్లీషు పత్రికలతో ఒక ప్రత్యేక పఠనమందిరాన్ని నెలకొల్పారు.

సంఘ పురోభివృద్ధికి శాశ్వత పోషకులుగా శ్రీయుతులు దొమ్మేటి వెంకట స్వామి, దొమ్మేటి వెంకటరెడ్డి, సింగన రామకృష్ణమ్మ, కాసాని బుల్లయ్య,

గుత్తల సూర్యనారాయణ, గుత్తుల నాగయ్య గార్లు ఉంటూ సర్వ బాధ్యతలను నిర్వహించేవారు. 1950 లో కాండాగ్లే (కాందోం) లో శ్రీ వై. ఎస్. రావుగారు నెలకొల్పిన 'కాండాగ్లే తెలుగుపాఠశాలను' ఆంధ్ర మహాజనసంఘం 1921 లో తనలో ఒక శాఖగా స్వీకరించింది. ఆ పాఠశాల కొన్ని సంవత్సరాల దాకా కాండాగ్లే ప్రాంతంలో ఉన్న తెలుగుపిల్లలకు ఉచిత విద్యాదానం గావించింది. తరువాత, ఆంధ్ర మహాజన సంఘం అధ్యక్షులు శ్రీ దొమ్మేటి వెంకటస్వామి గారు ఒక భవనాన్ని కట్టించి తమ స్వంత డబ్బుతో పాఠశాలను నిర్వహించారు. ఆయన మరణానంతరం, ఆయన సోదరులు జపానుయుద్ధ ప్రారంభం వరకు (1941 సం॥ అంత్యంవరకు) పోషిస్తు వచ్చారు.

ఆంధ్ర మహాజన సంఘం, కాండాగ్లే శాఖ పాఠశాల లోని పది మంది ఉపాధ్యాయులకు, బ్రిటిషు ప్రభుత్వ విద్యాశాఖ వారు 1925 సం॥ నుండి నెల జీతాలను ఇస్తూ, సంఘోద్యమానికి తోడ్పడ్డాడు. 1920-1924 సంవత్సరాల మధ్యగా జరిగిన అఖిల భారత కాంగ్రెసు ఉద్యమాన్ని పురస్కరించుకొని ప్రసంగాల ద్వారా, గాత్ర, వాద్య, సంగీత కార్యక్రమాల ద్వారా బర్మా ఆంధ్రులలో జాతీయ భావవికాసానికి ఈ సంస్థ రేయింబవళ్లు విరివిగా ప్రచారం సాగించింది. సంఘ ప్రధాన కార్యదర్శి కీ.శే. మంత్రి కేశవరావుగారు నిత్యోపన్యాసకులయ్యారు. శ్రీయుతులు కొత్తపల్లి కృష్ణమూర్తి, పిల్లి సీతారామయ్య, వినుకొండ సత్యన్నారాయణ, ఇవటూరి మల్లేశ లింగం గార్ల బోధనలు కూడా బర్మా ఆంధ్రుల్లో జాతీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. దానితోబాటు పుస్తకాలు, పత్రికలు, వీధి వీధికి తీసికొని వెళ్ళి చదువుకొన్న వారికి ఉచిత పఠనార్థమై ఇచ్చి విద్యాభిరుచిని కలిగించారు. ఈ సంచార గ్రంథాలయ కృషికి, 28వ వీధిలో ఉన్న రెడ్డిసోదరులు ఎక్కువగా ప్రోత్సాహమిచ్చారు. ఈ అభిరుచి ఫలితంగానే, ప్రస్తుతం లూయీ వీధిలో నిర్వహింపబడుతున్న 'వేమన పుస్తక భాండాగారము' వెలసింది. రెడ్డి సోదరులందరూ ఏకమై, అపారంగా పరిశ్రమించి ఈ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. తెలుగు భాషాప్రియులకు, ఈ వేమన పుస్తక భాండాగారం గొప్ప సేవను చేసింది. అన్ని వర్గాల వారికి అభిమాన పాత్రములైన పుస్తకాలను తెప్పించి, బర్మాలో తెలుగు అధ్యయనానికి ఈ గ్రంథాలయ సంస్థ చిరస్మరణీయమైన సేవ చేసింది.

1937 సం॥ ఫిబ్రవరి నెలలో ఈ సంఘం, తన రజితోత్సవాన్ని, కెప్టన్ ఆర్.బి. రషల్ దొరగారి అధ్యక్షతలో మహా వైభవంగా జరిపించుకొంది. కీ॥శే॥ శ్రీ గుత్తుల సూర్యనారాయణ, శ్రీ రెడ్డి సన్యాసయ్య, డాక్టర్లు ఎస్.ఎమ్. రఘునాథం, ఏ.బి. రావు, శ్రీ దొమ్మేటి మీరాసాహెబ్, శ్రీ కట్టా పుల్లయ్య, శ్రీ బొక్కా పుల్లంశెట్టి, శ్రీ పి.ఎల్. నారాయణ, శ్రీ బొంతు రామన్న, శ్రీ పిల్లి సీతారామయ్య, శ్రీ చొల్లంగి కంచన్న, శ్రీ సి.వి. నారాయణ మొదలైన పాత సభ్యులతో ఈ సంఘం 1941 సంవత్సరం చివరిదాకా (జపాన్ యుద్ధ కాలం వరకు) నిర్వహించబడింది.

యుద్ధానంతరం, 1950 సం॥లో కీ॥శే॥ గుత్తుల సూర్యనారాయణగారి ప్రోద్బలంతో, శ్రీ సి. వి. నారాయణ, శ్రీ చొల్లంగి కంచన్న, శ్రీ కర్రి వీర్రెడ్డి గార్లు యేకమై నెం॥ 111—113, లూయి వీధి భవనంలో ఈ సంఘాన్ని మళ్ళి పునరుద్ధరించారు. మరి కొందరు ఉత్సాహవంతులతో ఒక కొత్త కార్య వర్గం యేర్పడింది. అంతకుముందు రెండు సంవత్సరాలనుండి, 44వ వీధిలో "ఆంధ్ర యువజన భజన కూటం" వారు దిన రాత్రి పాఠశాలను నిర్వహిస్తుండగా, అచ్చట స్థలాభావంచే, ఎక్కువమంది విద్యార్థులను చేర్చుకోలేని ఇబ్బంది ఏర్పడింది. తర్వాత సదరు భజనకూటం పెద్దలు ఆంధ్ర మహాజన సంఘం పెద్దలు కలిసి ఆలోచించి భజనకూటం పాఠశాలను కూడా ఆంధ్ర మహాజన సంఘంలో కలిపివేసి పటిష్ఠమైన విద్యాభివృద్ధికి తోడ్పడ్డారు. అప్పుడొక పటిష్ఠమైన కార్యవర్గం ఏర్పడి, దినదినాభివృద్ధి పొందుతున్న పాఠశాలకు ఒక స్వంత భవనం వుండడం అవసరమని సంఘ పెద్దలు గ్రహించి, 44వ వీధిలోనున్న శ్రీ వెలగల దానిరెడ్డి గారి మూడు అంతస్తుల భవనాన్ని కొనడానికి ఆలోచించారు. ఇంతలో కార్య వర్గం వారికీ, ఉపాధ్యాయులకు భేదాభిప్రాయాలు విషమించి పోవడంతో, ఆ వుద్యమం అడుగంటిపోయింది. ఈ సదుద్యమానికి పూనుకొన్న వారిలో (1) శ్రీ గుత్తుల సూర్యనారాయణ (2) శ్రీ చొల్లంగి కంచన్న (3) శ్రీ కర్రి వీర్రెడ్డి (4) శ్రీ ఓగూరి సుబ్బారావు (5) శ్రీ గొర్రెల జానకి రామయ్య (6) శ్రీ గంధి వెంకట అప్పారావు (7) శ్రీ శీతంశెట్టి క్రిష్ణారావు (8) శ్రీ టి.వి. గోపాల నాయుడుగార్లు, పేర్కొనదగినవారు.

1951-52 సం॥లో రెండవ కార్యవర్గం ఏర్పడింది. అందులో (1) శ్రీ కంచి వెంకటరెడ్డి (అధ్యక్షులు) (2) శ్రీ చొల్లంగి నాగన్న (ఉపాధ్యక్షులు)

3. శ్రీ సి. హెచ్.వి. రాఘవులు (ప్రధాన కార్యదర్శి) 4. శ్రీ కడలి వెంకన్న (కోశాధిపతి) 5. రాళ్ళపూడి యెల్లయ్య (ఆడిటర్) 6. శ్రీ చిట్టూరి సుబ్బరాజు 7. శ్రీ కె. కొండలరావు 8. శ్రీ గొవ్వాల శ్రీరాములు 9. శ్రీ ఎ. ఎస్. ప్రకాశ్‌గార్లు మొదలగు కార్యవర్గ సభ్యుల కృషి ఫలితంగా, ఉపాధ్యాయుల వివాదం పరిష్కరింపబడింది. ఉపాధ్యాయులకు బకాయి జీతాలను కూడా యిప్పించడమైంది. బయట పాకలో కొన్ని నెలలు కాలము గడిపిన బాల, బాలికలకు పునఃప్రవేశం లభించింది.

తదనంతరం, 1. శ్రీ ద్వారంపూడి రామచంద్రారెడ్డి (అధ్యక్షులు) 2. శ్రీ కర్రి వీర్రెడ్డి (ఉపాధ్యక్షులు) 3. శ్రీ కట్టా నరసింహామూర్తి 4. శ్రీ కడలి వెంకన్న (కోశాధిపతి) 5. శ్రీ బత్తుల సుందర్రావు (ప్రధాన కార్యదర్శి) 6. శ్రీ సి. హెచ్.వి. రాఘవులు 7. శ్రీ ఏ.ఎస్. ప్రకాశ్‌గార్లు ముఖ్యులు. వీరి పాలనలో, ఉపాధ్యాయులకు, కార్యవర్గానికి మళ్ళీ వాదోపవాదాలు బయలు దేరి, పాఠశాలకు శోచనీయమైన దుర్ఘటనలు. అవాంతరాలు కలిగాయి.

1953 సంలో మన ఆంధ్ర దేశంలో, ఉభయ గోదావరి జిల్లాలలో బీభత్సమైన వరదలు కలిగిన కారణంగా, బర్మా ఆంధ్రుల పేరిట, ఈ సంఘం వారు, సోదర సంఘీయుల సహాయంతో, 32,000/- రూపాయలను ప్రోగు చేసి, ఆ మొత్తాన్ని స్థానిక ఇండియన్ ఎంబసీద్వారా భారత కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అందులో కృషి చేసినవారు - 1. శ్రీ కోరాడ సూర్యనారాయణ (కమిటీ అధ్యక్షులు) 2. శ్రీ వి.జె. సర్వోత్తమరావు **B.A., B.L.** (కార్యదర్శి) 3. శ్రీ గుత్తుల వెంకటరెడ్డి 4. శ్రీ చిట్టూరి సుబ్బరాజు 5. పి.జి. వర్మ 6. శ్రీ దొమ్మేటి కృష్ణమూర్తి గార్లు.

అదే సంవత్సరంలో, ఆంధ్ర రాష్ట్ర అవతరణను పురస్కరించుకొని, శ్రీ వి. జె. సర్వోత్తమరావు (**B.A.,B.L.**) గారి అధ్యక్షతలో, బర్మా ఆంధ్రులు జరిపిన కార్యక్రమాదులన్నిటిలోకీ, చిరస్మరణీయంగా ఉండే అతి వైభవమైన సభను రంగూన్ స్ట్రాండ్ హోటలులో ఏర్పాటు చేసి, ఈ రషీద్ మొదలగు మంత్రులను, సుప్రీం కోర్టు న్యాయమూర్తులను, ఇంకా ఇతర పుర ప్రముఖులను ఆహ్వానించి, ఆంధ్ర రాష్ట్రోద్యమ చరిత్రను విదేశీయుల దృష్టికి తెచ్చింది యీ సంఘమే.

1954 సం॥లో శ్రీ రామకృష్ణ మిషన్ హాలులో జరిగిన యావదాంధ్రుల బహిరంగ మహా సభలో, కీ॥ శే॥ శ్రీ కే. ఎన్. ఎన్.మూర్తిగారు మాట్లాడుతూ చాలా కాలం క్రిందట నెలకొన్న, ఆంధ్ర మహా జన సంఘమే బర్మా ఆంధ్రులకు "కేంద్ర సంఘం"గా పరిగణింప బడడం అత్యవసరమని ప్రతిపాదించగా, కీ॥ శే॥ శ్రీ గుత్తుల సూర్యనారాయణ గారు వెంటనే బలపర్చారు. సభలో చాల మంది తమ అంగీకారాన్ని వెలిబుచ్చారు. తదనంతరం, కేంద్ర సంఘం విషయంలో శ్రీ కోరాడ సూర్యనారాయణ, శ్రీ వి. జె. సర్వోత్తమ రావు, డాక్టరు డేవిడ్, శ్రీ గుత్తుల సూర్యనారాయణ. శ్రీ ఎ. వి. రావు, శ్రీ సి. హెచ్. జేసుదాసు గార్లు కొంత వరకు కృషి చేశారు, కాని, ఆంధ్ర నాయకులతో పొత్తు కుదరక, మరియు ప్రాతినిధ్యం విషయంలో విభిన్నమైన అభిప్రాయాలు చెలరేగడం వల్ల, కేంద్ర సంఘం సమస్య అపరిష్కృతం గానే స్తంభించి పోయింది.

1956 సం॥లో బర్మా ప్రభుత్వం వారిచే బ్రహ్మాండంగా జరిపించబడిన 2500వ, బుద్ధ జయంతి మహా సమ్మేళన సందర్భంలో యీ సంఘం వారు 1. ఆంధ్ర బౌద్ధ భక్త సమాజం 2. శ్రీ బాలయోగి భక్త సమాజం 3. హరిజన సేవా సంఘం మొదలైన సంఘాల సహకారంతో రంగూనాంధ్రుల పేరిట, ఒక బుద్ధ విగ్రహాన్ని ఊరేగింపుతో సహా, గుబాయే శాంతి పగోడాకు తీసుకపోయి, దాని నక్కడ ప్రతిష్ఠింప చేశారు. యాత్రికులకు అన్నదానం కూడా జరిపించారు.

1960 సం॥నుండి "ఆంధ్ర మహాజన సంఘ భవన నిర్మాణ కమిటీని నెలకొల్పి భూరి విరాళాలను ప్రోగు చెయ్యడం ప్రారంభించారు. చివరకు యీ భవన నిర్మాణ కమిటిలో — 1. డాక్టరు పి.ఆర్. కుల శేఖరం (అధ్యక్షులు) 2. శ్రీ కర్రి వీరారెడ్డి (ఉపాధ్యక్షులు) 3. శ్రీ సి. హెచ్.వి. రాఘవులు (కార్యదర్శి) 4. శ్రీ చిట్టూరి సుబ్బరాజు 5. శ్రీ చొల్లంగి క్రిష్ణారావు 6. శ్రీ కమ్ముజు మరిడి శెట్టి 7. శ్రీ గుత్తుల కలికి మూర్తి 8. శ్రీ దొంగా రాఘవరావు 9. శ్రీ బత్తుల సుందరరావు గార్లతో పాటు మరి కొందరు కృషి చేశారు. డాక్టరు కుల శేఖరంగారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ఆంధ్రేతరుల సుండి కూడా విరాళాలను ప్రోగు చేసి, 30,000/—చ్యాలకు (రూపాయిలు) నెంబరు 134,

లూయి వీధిలో ప్రస్తుతమున్న మూడు అంతస్తుల భవనాన్ని క్రయం చేయడ మైంది. 1961 సం॥లో నూతన భవనానికి, పాఠశాల కార్యాలయం మారిఁది. సంఘం పుట్టినది మొదలు తన 50వ ఏట వరకు అద్దె భవనంలోనే కాలం గడిపి చివరకు స్వంత భవనం సంపాదించినందుకు రంగూనాంధ్రులు సంతోషించారు. ఇదే సంవత్సరంలో బర్మా ప్రభుత్వం ఆహ్వానం పైన వచ్చిన శ్రీ మంగళ కృష్ణ మూర్తి గారి కుమార్తెలు — 1. కుమారి యామినీ పూర్ణ తిలకం 2. కుమారి జ్యోతిష్మతి గార్లతో, మహాత్మా గాంధి మెమోరియల్ హాలులో, కూచిపూడి భరత నాట్య ప్రదర్శనం ఏర్పాటు చేసి వచ్చిన డబ్బునంతటినీ కిమిండైన్‌లో ఉన్న శ్రీ రామాలయానికి నిధిగా సమర్పించింది.

1964 సం॥లో సంఘాధ్యక్షులుగా ఉన్న డాక్టరు కుల శేఖరం గారి నాయకత్వాన, మహాత్మా గాంధి హాలులో యీ సంఘం తన స్వర్ణోత్సవాన్ని వైభవంగా జరుపుకొంది బర్మా పౌరసత్వపు హక్కును కలిగిన వారి పేరిట మాత్రమే, భూములను, భవనాలను రిజిష్టరు చేయించాల్సిన కారణంగా — 1. డాక్టరు జి. రామారావు నాయుడు 2. శ్రీ సి. సత్యానందం (ఉరఫ్) టూ తేన్ మౌంగ్ 3. శ్రీ చంద్రకంటి అర్జున 4. శ్రీ టి. కే. మూర్తి గార్ల పేరిట, యీ ఆస్తిని రిజిస్టరు చేశారు.

ఇదే సంవత్సరం మార్చి నెలలో బర్మా ప్రభుత్వం అమాంతంగా కొన్ని రాజకీయ మార్పులను అమలు జరిపింది. సకల స్వదేశ, విదేశ వ్యాపార సంస్థలు, కంపెనీలు, దుకాణాలు, కర్మాగారాలు, తదితర కార్యాలయాలు, జాతీయం చేయబడ్డాయి. మరుసటి ఏప్రిల్ నెలలో, సాంఘిక సంస్థలు, సమా జాలు, పాఠశాలలు కూడా జాతీయం చేయబడ్డాయి. ఇలాంటి సత్వర పరిణా మాల పర్యవసానంగా బర్మా దేశంలో ఉన్న లక్షల కొలది భారతీయులు నిరు ద్యోగులై, భారత దేశానికి తరలి పోవడం ప్రారంభించారు ఆ సందర్భంలో భారతీయుల కోరికపైన, స్థానిక ఇండియన్ ఎంబసీ వారు నీటి ఓడలను వెంటనే యేర్పాట్లు చేసి, మాతృ దేశానికి భారతీయులను చేర్చడంలో శ్రద్ధ తీసుకొంది. 1964 సంవత్సరం జూలై నెల 19వ తేదీ నుండి, నాలుగు నీటి ఓడలు — 1. మహమ్మది 2. ముజాఫరి 3. ఇస్లామియా 4. సవూదీ వరుసగా వస్తూ,

విశాఖపట్టణం రేవుకూ మద్రాసు రేవుకూ తీసుకు పోవడం జరిగింది. ఈ సందర్భంలో, "బర్మా ఇండియన్ కాంగ్రెస్" వారు బర్మా అంతటా తమ శాఖల ద్వారా శరణా గతుల పక్షంలో ప్రయాణ సౌకర్యాలు కల్గించారు. అదే విధంగా రంగూన్ నగరంలో, ఏ నుండి డి (A-D) వరకు సెంటర్లు స్థాపించ బడ్డాయి. డాక్టరు కుల శేఖరం గారు, ఆంధ్రులకోసం, "సి" సెంటర్‌ను ఆంధ్ర మహా జన సంఘంలో నెలకొల్పారు. "కేంద్ర సహాయ కమిటీ" (**Central Relief Committee**)లో కూడా ఆంధ్ర ప్రతినిధిగా కృషి చేశారు. సంఘానికి అధ్యక్షులుగా ఉండేవారు. ఈయన 1965వ సంవత్సరంలో మాతృదేశానికి వెళ్ళిపోయారు. తదనంతరం ఈయన స్థానే, శ్రీ కోరాడ సత్యవాన్ గారు ఆ రెండు బాధ్యతలను 1970 సం॥ వరకు నిర్వహించారు.

1964 సం॥ లగాయితు నేటివరకూ (1974 - 75) సంస్థ ఆంధ్రులకు, ఆంధ్రేతరులకు ప్రయాణపత్రాలను ఉచితంగా తయారుచేసి, కాందిశీకులైన వారికి సర్వవిధాలా తోడ్పడుతునే ఉంది. ఈ సంస్థద్వారా కొన్నివేలమంది మన భారతదేశానికి చేరారు. పేదప్రజలకు, అన్ని విషయాలలోను, సహాయం, సహకారం, సలహాలు ఇస్తూనే వున్నది. కీ. శే. డాక్టరు కులశేఖరంగారి తర్వాత, ఈ సంఘానికి – 1. కీ. శే. శ్రీ కర్రి వీరెడ్డి 2. శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య 3 శ్రీ కోరాడ సత్యవాన్‌గార్లు వరుసగా అధ్యక్షులయ్యారు. ప్రస్తుతం శ్రీ బి. వెంకటరావు గారు అధ్యక్షులుగా ఉన్నారు.

2. శ్రీ రెడ్డి యువజనసంఘం మరియు వేమన పుస్తక భాండాగారం

ఈ సంస్థ కీ. శే. శ్రీ సత్తి వెంకటరెడ్డిగారి సంపూర్ణ ప్రోత్సాహంతోను, 1. శ్రీ కర్రి చినవెంకటరెడ్డి 2. శ్రీ కొవ్వూరి చినవెంకటరెడ్డి 3. శ్రీ కర్రి వీరెడ్డి 4. శ్రీ చింతా సుబ్బారెడ్డి 5. శ్రీ సోమరాజు రామానుజరావు (బర్మా ఆంధ్ర కవితా పితామహుడు) 6. శ్రీ సి. వి. నారాయణ 7. శ్రీ సలకా సూర్యనారాయణగార్ల ప్రోద్బలంతో 1924 సం॥న స్థాపించబడింది. 1926 సం॥లో బర్మా సొసైటీస్ చట్టాన్ని అనుసరించి, 28 వ సభలో, "శ్రీ రెడ్డి యువజనసంఘం మరియు వేమన పుస్తక భాండాగారం" అన్న పేరుతో

రిజిస్టర్డు అయింది. ఈ సంస్థ ప్రప్రథమంలో కుల సంఘంగా స్థాపితమైనప్పటికీ, రానురాను కాలమాన పరిస్థితులను బట్టి, విశాలదృష్టితో సకలాంధ్రులకు కృషిచేసే సదుద్దేశ్యంతో, ఇది కులసంస్థగాని, వ్యాపారసంస్థగాని, రాజకీయ సంస్థగాని కాకుండా, కేవలం సాంఘిక, సాంస్కృతిక, సాహిత్యరంగాల్లో కృషి చేస్తూ, బర్మా ఆంధ్రులకు వర్గ, మత భేదాలను పాటించకుండా సేవ చేయడమే ముఖ్యోద్దేశ్యమని ఈ సంఘం తన చట్ట నిబంధనలో ప్రకటించి ఉంది.

బర్మా దేశంలో స్థాపింపబడిన తెలుగు గ్రంథాలయాలలో ఈ వేమన పుస్తకభాండాగారమే చాలా పెద్దది. ఇది మొదట ఆరు వేల రూపాయల విలువ గల పుస్తకాలతో ప్రారంభమై అటు పిమ్మట సుమారు 4500 పుస్తకాలను సేకరించింది. 1958 సం॥ నాటికి కొన్ని తెలుగు వార్తా పత్రికలతో, సాహిత్య సంచికలతో, సినీమా సంచికలతో, ఒక పఠన మందిరాన్ని ప్రారంభించింది. రంగూనాంధ్ర సాహిత్యప్రియులకు నవలా పాఠకులకు, కళాకారులకు, సామాన్య విద్యాభిరుచి గలిగిన వారికికూడా ఎంతో తోడ్పడింది. రంగూన్ నగరంలో ఉన్న విద్యార్థులు, కొత్త రచయితలు, ఈ గ్రంథాలయం మూలంగా గొప్ప మేలును పొందారు.

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం, యీ సంస్థ ఒక ధర్మ పాఠశాలను కూడా నిర్వహించి, విద్యాదానం చేసింది. సాంఘిక, సాహిత్య రంగాలలో ఘనమైన సేవ చేసింది. 1. కీ॥శే॥ శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు 2. డాక్టరు లంకా సుందరం 3. ఆచార్య రంగాగార్లు, మరికొందరు ఆంధ్ర నాయకులు, బర్మాలో పర్యటించినప్పుడు, వారిని ఈ సంస్థ సత్కరించింది. జాతీయోద్యమాలు, దేశీయోద్యమాలు సాహిత్య కృషి, అనాధ శరణాలయాల నిర్మాణాలు, ధర్మ పాఠశాలలు, మొదలైనవాటికై ఆంధ్రదేశం నుండి వచ్చిన నాయకులకు, సేవకులకు శక్తిపంచన లేకుండా తోడ్పడడం, యీ సంస్థ ప్రత్యేకత. 1934 సం॥ నుండి 1941 సం॥ వరకు (యుద్ధకాలం వరకు) యీ సంస్థ, "ఐరావతి" అన్నతెలుగు వారపత్రికను సంఘం తరపున నిర్వహించింది. కీ॥శే॥ శ్రీ సత్తి వెంకటరెడ్డిగారు, పత్రికా నిర్వహణ కైతేనేమి, సంఘ నిర్వహణకైతేనేమి, అమోఘమైన సేవ చేసినట్లు సంఘ చరిత్ర చెబుతోంది.

యుద్ధానంతరం, 1948 సం॥లో యీ సంఘాన్ని పునరుద్ధరించారు. 1953 సం॥లో ఉభయ గోదావరి వరదలు చెలరేగినప్పుడు, యీ సంస్థవారు, ప్రత్యేకంగా పూనుకొని, "వరద బాధితుల" సహాయార్థమై నిధిని సేకరిస్తూ, దాదాపు 12 వేల చ్యాలను (రూపాయిలను) పంపినట్లు, సంఘపు రికార్డులు ఋజువు పరుస్తున్నాయి. బర్మాదేశంలో కొన్ని అగ్ని ప్రమాదములకు, ఆలయ నిర్మాణములకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు ధర్మచందాలు, భూరి విరాళాలు అర్పించి ప్రజల మన్ననలను పొందగల్గింది. ఏటేటా, జనవరి నెలలో, "వేమన వర్ధంతి"ని వైభవంగా జరుపుతుండేది.

1956 సం॥లో జరిగిన బౌద్ధమత మహా సమ్మేళనం సందర్భంలో, బుద్ధ శాసన కౌన్సిల్ వారికి విరాళ మిచ్చింది. శ్రీ రామకృష్ణ మిషన్ ఉచిత ఆసుపత్రికి ఏటేటా 159/- చ్యాలు (రూపాయలు) చందా ఇచ్చేడి. బర్మా ఆంధ్రుల కొరకు బర్మా రేడియోలో తెలుగు భాషలో కూడా కొద్దిసేపు ప్రసారం జరపడానికై కృషిచేసింది. అనేక ప్రజాహితకార్యాలను తమ శాయశక్తులా చేసింది. 1958 సం॥లో శ్రీ బి. ఎస్. మూర్తిగారు (**Indian M.P.**) పార్లమెంటరీ కార్యదర్శి బర్మా ఆంధ్రులకు ఆంధ్రదేశంలో వ్యవసాయక భూములు లభిస్తాయని, "ఆంధ్రపత్రిక"లో ప్రకటించిన వార్త కారణంగా, ఈ సంఘం వారు కొన్ని వందల దరఖాస్తులను రంగూన్ నుండి నూతన ఢిల్లీ పార్లమెంటు భవనానికి శ్రీ మూర్తిగారి పేరిట పంపించారు.

1964 సం॥ నుండీ, బర్మా కాందిశీకుల నిమిత్తమై, బర్మా-భారతదేశాల మధ్య నడుస్తున్న ఓడలు, ఒక్క మద్రాసు రేవునకే కాకుండా, ఆంధ్ర కాందిశీకుల సౌకర్యార్థం, విశాఖపట్టణం రేవులో కూడా ఆపాలని ఆంధ్రప్రభుత్వానికీ, దేశ నాయకులకూ వినతిపత్రాలు పంపించింది. 1959 సం॥ నుండి 1964 సం॥ వరకు 1. శ్రీ జి. వి. కృష్ణమూర్తి (**Indian Over-seas Bank, Chief Accountant**) 2. శ్రీ ద్వారంపూడి రామచంద్రారెడ్డి 3. శ్రీ బుల్లి వీరారెడ్డి గార్ల నాయకత్వంతో ఈ సంస్థ పనిచేసి, ఆ తర్వాత శ్రీ కోరాడ సత్యవాన్ శ్రీ పి. సత్యన్నారాయణ గార్ల అజమాయిషిలోకి వచ్చింది. కొంత కాలం తర్వాత వీరిద్దరిలో పొత్తు కుదరక, పుస్తక భాండాగార నిర్వహణ కుంటు పడింది. 1967 సం॥లో ఈ సంస్థను మూసివేసే సూచనలు కనిపించాయని

అందులో చాలా గ్రంథాలు అప్పటికే మటుమాయమైపోయాయని, ఆ సందర్భం లో కొందరు యువకులు సహించలేక, సంఘ కార్యవర్గంలో చైతన్యం కలగ డానికి ఆందోళన సాగించినందువల్ల అంతకుముందే రద్దుచేయించుకొన్న పుస్తక భాండాగారం రిజిస్ట్రేషనును ఉపసంహరించుకొంటూ, మళ్ళీ యధావిధిగా సంఘ నిర్వహణకు పూనుకొన్నట్లు ప్రజలకు పంచిపెట్టబడిన కరపత్రాల మూలంగా అర్థమౌతోంది. తదనంతరం, 1. శ్రీ జి. రంగారావు 2. శ్రీ కె. పైడయ్య 3. శ్రీ బాబూరావుగార్లు వరుసగా అధ్యక్షులయ్యారు. శ్రీ లోచర్ల గంగరాజు గారు గౌరవ ఆడిటర్ గాను, ప్రధాన కార్యదర్శి గాను కృషి చేస్తున్నారు.

సారస్వత విషయంగా యీ సంస్థ, మన తెలుగువారికి యావత్ బర్మాలో గొప్పగా తోడ్పడింది. నేటికీ మన మాతృభాషను మరువకుండా కాపాడే భాషా మందిరంగా దీన్ని పేర్కొనాలి. రెడ్డి సోదరులు ఆంధ్రజాతికి చేసిన అకుంఠిత సేవ, యీ సంస్థ చరిత్ర మూలంగా విదితమౌతుంది.

3. ఆంధ్ర సేవాసంఘం (కాండాగ్లే)

ఈ సంఘాన్ని కీ॥శే॥ శ్రీ ఆపటిపల్లి నారాయణరావు పంతులుగారి (**B.Sc., M.A., M.L.C**) ప్రోత్సాహంతో, కీ॥శే॥ శ్రీ మంత్రి కేశవరావు పంతులు, శ్రీ కే. ఎస్. ఎస్. మూర్తిగార్లు, మరికొందరు ప్రముఖులు కలిసి 1926 సం॥ లో, కాండాగ్లేలో వున్న లిటిల్ సిస్టర్స్ రోడ్డు 93 వ వీధి చివరనున్న గృహంలో నెలకొల్పారు. ఈ సంస్థ తెలుగు బిడ్డలకు ఉచిత విద్యాదానం చేస్తూ, తెలుగు భాషా వ్యాప్తికై కృషి చెయ్యడానికి బాసు కొన్నది; ఈ పాఠశాలలో శ్రీ పూతి అప్పలనరసయ్య గారు ప్రధానోపా ధ్యాయులుగానూ, శ్రీ లక్ష్మీనారాయణ శ్రీ రూబెన్ శ్రీ ప్రేమానందం, ఇంకో ముగ్గురూ ఉపాధ్యాయులుగాను ఉండేవారు, దీనిని స్థాపించిన రెండవ ఏటనే రంగూన్ 40వ వీధిలో ఒక మరొక శాఖను తెరిచారు. శ్రీ జి. నరసింహా రావుగారు ప్రధానోపాధ్యాయులు గాను, శ్రీ సి. హెచ్. వీరరాఘవులు శ్రీ శర్మా పంతులు ఇంకో ఉపాధ్యాయులూ అందులో పనిచేస్తూ ఉచిత విద్యాశిక్షణ చేస్తుండేవారు. అటుపిమ్మట, ఈ పాఠశాల స్పార్క్ రోడ్డులో కొన్నాళ్ళుండి అక్కడనుండి 35వ వీధికి తరలించబడింది. అప్పుడు, బాలకవి శ్రీ సూరా

మీరయ్య గారు ప్రధానోపాధ్యాయులు గాను, మరియు శ్రీ జి. నూకాలు మరి కొంపరు ఉపాధ్యాయులుగానూ ఉండేవారు

కొంతకాలం గడచిన పిదప, పజుండౌంగ్ (పసిందాం)ప్రాంతంలో కూడా ఇంకొక శాఖను తెరిచారు మొత్తమ్మీద, ఆంధ్ర సేవాసంఘంవారు, మూడు ప్రాంతాలలో, మూడు పాఠశాలలను నిర్వహిస్తూ, ఆంధ్రుల బాల, బాలికలకు, ఉచితవిద్యా శిక్షణ చేకూర్చడం చాల ప్రశంసనీయం. పాఠశాలల పోషణార్థమై, ఉపాధ్యాయులు, చక్కని నాటకాలు యేర్పాటుచేసికొని, రంగూన్ జూబిలీహాలులో ప్రదర్శిస్తూ, వచ్చిన ఆదాయాన్ని సంఘ పోషణ నిధిలో చేర్చే వారు. కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ప్రదర్శించిన నాటకాలలో ప్రఖ్యాతి పొందినవి—1. చతుర చంద్రహాస 2. కనకతార 3. చంద్ర కాంత 4. పంచ రత్నావళి. ఈ సంస్థ, సాంఘిక, సాహిత్యాది విషయాలలో అవిరళ కృషి సల్పి, బర్మా ఆంధ్రుల విద్యావ్యాప్తి విషయంలో సేవ చేసిన మొదటి సంస్థల్లో ప్రముఖస్థానం ఆక్రమించింది.

4. ఆంధ్ర విద్యార్థి సంఘం (రంగూన్)

1926 సం॥లో కొందరు ఆంధ్ర విద్యార్థులు మన తెలుగు భాషను కూడా రంగూన్ కళాశాలలో ప్రవేశపెట్టపలసిందిగా కోరుతూ, ఈ సంఘాన్ని నెలకొల్పారు. ఓం ప్రథమంలో కృషి చేసిన వారి వివరాలు లభ్యం కాలేదు. తదనంతరం 1. డాక్టరు ఎస్. ఎన్. మూర్తి (M. B. B. S.) 2. శ్రీ గంటా వెంకటయ్య B.A 3. శ్రీ పి. రామస్వామి 4. శ్రీ వి. వీరన్న గార్లు, ఇంకా మరి కొందరు దీన్ని నిర్వహించారు. అటుపిమ్మట, 35వ వీధిలో వున్న ఒక తెలుగు పాఠశాలలో దీన్ని నెలకొల్పి సాహిత్య రంగంలో పెక్కు కార్యక్రమాలను జరిపించారు. మరి కొంతకాలానికి 1. శ్రీ కె. సుబ్బారావు 2. శ్రీ మైకల్ వాలెన్‌టైన్ 3. శ్రీ ఎమ్.కే. రావు 4. ఏ.కే. రావు 5. శ్రీ ఎస్. కృష్ణా 6. శ్రీ వి. ముత్తురాజు 7. శ్రీ విక్టర్ న్యూటన్ 8. శ్రీ వి.జె. సర్వోత్తమ రావు, B.A.,B.L. 9. శ్రీ సి.హెచ్.వి. రాఘవులు గార్లు కూడా సంఘానికి సేవ జేశారు. వీరు వక్తృత్వ పోటీలను, వ్యాయామ క్రీడలను, వ్యాసరచనలాంటి సాహిత్య కార్యాలను ముఖ్యంగా జరిపించే వారు. గత ప్రపంచ యుద్ధారంభంవరకు (1941) యీ సంస్థ నిర్వహింపబడింది.

1952 సంవత్సరం నుండి ఆంధ్ర మహాజన సంఘంలో, శ్రీ మోదుకూరి సత్యనారాయణ మరియు శ్రీ గొల్లపూడి రంగారావు గార్ల ప్రోత్సాహంతో, 1. శ్రీ స్వామినాయుడు 2. శ్రీ డి. లక్ష్మయ్య 3. శ్రీ జి. ఆప్పారావు 4. శ్రీ జి. పాపారావు 5. శ్రీ సోమసుందర్రావు 6. కాంత్రేగుల రామారావు 7. శ్రీ కె. కృష్ణారావు 8. శ్రీ కే. అప్పారావు 9. శ్రీ కే. తిరుపతి 10. శ్రీ కొండా శేషారావు గార్ల అధ్వర్యంలోనూ ఇది 1955 సం॥ వరకు నిర్వహింపబడింది. ఉపన్యాస కార్యక్రమాలను, సాహిత్య కార్యక్రమాలను ఏర్పరచడంలోనూ, బంతి ఆట టీములను తర్ఫీదు చేయడంలోనూ శ్రద్ధ తీసు కొంది. ఆతర్వాత సంఘ సభ్యులు తగ్గిపోవడంతో, వారి కార్యక్రమాలు కూడా సన్నగిల్లి పోయాయి.

1956 సం॥లో బిగాండెట్ వీధిలో ఉన్న **I.E.S.** ఖాల్సా హైస్కూళ్లు అధికార్లు, తెలుగు భాషను మాధ్యమిక తరగతులలో ప్రవేశపెట్టాలని తీర్మానించి నప్పుడు, అప్పట్లో ఆంధ్ర యువజన భజన కూటమిలో ప్రధానోపాధ్యాయునిగా ఉన్న శ్రీ కె.కె. మూర్తి గారిని, పై హైస్కూళ్లులో నియమించడమైంది. మళ్ళీ 1958 సం॥లో, ఉన్నత తరగతుల్లో కూడా తెలుగు భాషను బోధించే అవసరం ఏర్పడినప్పుడు, ఈ సంఘం తిరిగి నెలకొల్పబడింది. విద్యార్థుల తల్లిదండ్రులను, కొందరు పెద్దలను, కొందరు స్నేహితులను ఆశ్రయించి, వారి ఆర్థిక సహాయంతో, ఈ సంఘం నిర్వహింపబడింది. 1. భీశెట్టి లక్ష్మణరావు 2. యాదగిరి మోహనరావు 3. ఎస్. మార్కండేయ 4. ఆదాడ నూకరాజు 5. కుమారి సి. రమామణి 6. కుమారి సరోజినీ 7. కుమారి లక్ష్మీకాంతం ఎక్కువగా కృషిచేశారు. 1959 సం॥ నుండి తెలుగు భాష ఉన్నత తరగతులలో ప్రవేశపెట్టబడింది. పాఠశాలలను బర్మా ప్రభుత్వం వారు జాతీయం చేసేటంత వరకు (1064 సం॥) ఈ సంఘం కొనసాగింది. అప్పట్లో మిగిలి వున్న మూలనిధి 1200/- చ్యాలను (రూపాయిలను) నేతాజీ సహాయనిధి కమిటీ (**Netaji Relief Fund Committee**) వారికి, ఈ సంఘం వారు దానంగా యిచ్చి, సంఘాన్ని నిలిపివేశారు.

5. ఆంధ్ర యువజన భజన కూటమి

ప్రప్రథమంలో దీనిని, "ఆంధ్ర యువజన సంఘం" అంటూ పిలిచే వారు. కీ. శే. శ్రీ బొల్లంగి సత్యన్నారాయణ 2. శ్రీ పి.వి. నారాయణ 3. శ్రీ లక్కరాజు సత్యం 4. సి.ఐ.డి. నారాయణ 5. శ్రీ పల్లి సీతారామయ్య గార్లు మరికొందరు కలిసి 1928 సం॥లో స్థాపించారు. మొదటిసారిగా ఈ కూటమి, 38 వ వీధిలో కొందరు ప్రముఖ సంగీత విద్వాంసులతోనూ శ్రీమంతులతోనూ, భక్తాగ్రేసరులతోనూ, ప్రోత్సహింపబడిన కారణంగా, దీనిలో ఆధ్యాత్మిక చింతన, సంగీతం, గాన కళలకు ప్రాధాన్యం ఏర్పడింది. వాటితో బాటు సమాజ సంస్కరణకు కూడా ఈ సభ్యులు ప్రచారం చేసేవారు జాతీయ, సామాజిక, సాహిత్య విషయాలపైన కూడా ప్రసంగాలు జరుగు తుండేవి. రంగూన్ నగరంలో ఉన్న బహుకాలిక సంఘాలలో, ఆంధ్ర మహా జన సంఘం తర్వాత, ఈ భజన కూటమే అందరికీ ఆదర్శనీయమైనది. పూర్వపు దినాలలో ఆంధ్రుల రాజకీయ, సాంఘిక ఉద్యమాలలోనూ మాతృ దేశపు జాతీయోద్యమాలలోనూ ఈ సంస్థ పాల్గొని తన శాయశక్తులా కృషి చేసింది. సాహిత్య, సాంస్కృతిక విషయాల్లో కూడా సేవజేసింది. యుద్ధ కాలంలో ఈ సంస్థలో వున్న సంగీత పరికరాలు దొంగిలింపబడ్డంతో, అప్పట్లో నిర్మానుష్యమైన రంగూన్ నగరం లోని ఈ కూటమికూడా మూసివేయ బడింది.

యుద్ధానంతరం, 1. కీ.శే. కె. శ్రీనివాసులు నాయుడు 2. శ్రీ సోలాపురి నాయుడు 3. శ్రీ శీతంశెట్టి కృష్ణారావు 4. శ్రీ బొల్లంగి కంచన్న 5. శ్రీ ఎమ్. కృష్ణారావు 6. శ్రీ కె కైలాసరావు 7. శ్రీ బి. బసవరాజు 8. పోలీసు మిరయ్య 9. శ్రీ కొండా సూర్యారావు గార్లు మరి కొందరు పురప్రముఖులు కలసి ఈ కూటాన్ని పునఃస్థాపితం చేశారు. కీ శే. గుత్తుల సూర్యనారాయణ, శ్రీ రెడ్డి సన్యాసయ్యగార్లు, రెడ్డి సోదరులు మొదలైనవారు భూరి విరాళాలనిస్తూ, శాశ్వత పోషకులుగా, రాజపోషకులుగా ఉండటం వల్ల, ఈ కూటమి ఎలాటి ఇబ్బందులను ఎదురొక్కుండా, బీద బాల, బాలికల విద్యావిషయంలో, అమోఘ మైన కృషిని చేయగల్గింది. కొంతకాలం, పఠన మందిరాన్ని కూడా నిర్వ హించింది. విద్యార్థులకు వివిధ వ్యాయామ క్రీడల్లో తర్ఫీదునిచ్చి, అఖిల బర్మా భారత యూత్ లీగువారి అధ్వర్యాన, బి.ఏ.ఏ. మైదానంలో జరిగిన

పరుగు పందేల్లో చాలాసార్లు బహుమతులను సంపాదించగల్గింది. ఏటేటా ధను ర్మాసంలో సంక్రాంతి భిక్షకు బయలుదేరి, మూల నిధిని సేకరించేవారు. దిన, రాత్రి పాఠశాలలను నిర్వహించారు. కీ. శే. శ్రీ చొల్లంగి ధనరాజు, శ్రీ కర్రి రామమూర్తి, శ్రీ దొమ్మేటి రామమూర్తి గార్లు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, తెలుగు బిడ్డల విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు. వీరితోబాటు, రాత్రి పాఠ శాలలో మరి కొందరు ధర్మాత్ములు జీతాలను తీసికోకుండా, ఉపాధ్యాయులుగా కృషిచేస్తూ, తెలుగు బిడ్డల చదువులకు సాయపడ్డారు.

ఈ విధంగా దినదినాభివృద్ధి పొందుతున్న పాఠశాలకు స్థలాభావ సమస్య బయలుదేరింది. బడి పిల్లలు వస్తూనే ఉండడం, స్థలం లేక వారిని నిరాకరించడం జరిగెంది. ఇలాంటి ఇబ్బందులను గమనించిన భజన కూటమి పెద్దలు సమాలోచన చేసి, చివరకు ఈ పాఠశాలకు ఆంధ్ర మహా జన సంఘం భవనానికి తరలించడమే శ్రేయస్కరమని భావించి, 1950 సం॥లో అప్పట్లో వున్న సుమారు 250 మంది విద్యార్థులను, ఉపాధ్యాయులను, సామగ్రితో సహా బదలాయింపు చేసినట్లు భజన కూటమి చరిత్ర తెలుపుతోంది.

1954 సం॥లో ఆంధ్ర బాల, బాలికలు ఇంకా అధికంగా వస్తూ, ఆంధ్ర మహా జన సంఘంలో కూడా చోటు సరిపోని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు కొందరు పెద్దల ప్రోత్సాహం పైన, 44వ వీధిలో యీ భజన కూటమి లోనే ఒక ప్రాథమిక పాఠశాలను మళ్ళీ నెలకొల్పాలని నిశ్చయించి నప్పటికీ, తగిన ఉపాధ్యాయులు దొరకనందువల్ల బస్సిన్ పట్టణంలో ఉపాధ్యాయులుగా ఉన్న శ్రీ కె. కె. మూర్తి గారిని రప్పించి, ఆయనను ప్రధానోపాధ్యాయులుగా నియమించి, పాఠశాలను యథావిధిగా ప్రారంభించారు. బడిపిల్లల సంఖ్య దిన దినం పెరిగి మరల 250 మంది పరిమితికి రాగా, ఇంకో ముగ్గురు ఉపాధ్యాయులను 1. శ్రీ కర్రి రామ మూర్తి ("తెలుగు బిడ్డ" వార్తాపత్రిక మాజీ సంపాదకులు) 2. శ్రీమతి కె. పాపమ్మ 3. శ్రీమతి డి. ప్రాన్సీనా గార్లను నియమించి, తెలుగు బిడ్డల విద్యాభివృద్ధికై, యీ భజన కూటమి కృషి చేసింది పర్వదినాలలో, పాఠశాల తరఫున చిన్న నాటికలు, నృత్యం, గానం, వగైరా ఏర్పాటు చేసేవారు. ఈ విధంగా 1959 సం॥ వరకు పాఠశాల నిరాటం కంగా నడిచింది.

అప్పుడు విధివశాత్తు, భజన కూటమి పెద్దల్లో ఒక నవోత్సాహం ఉద్భవించింది. "రంగూన్ నగరంలో ఆంధ్రులకు ఒక కేంద్ర సంఘం వుండాలి. ఈ వుద్యమములో అన్ని సంఘాలు యేకం కావాలి" అనే చైతన్యం పుట్టినది. లూయి వీధిలో నున్న ఆంధ్ర యూత్ లీగ్ (ఆంధ్ర యువజన సమితి) వారు వెంటనే ఎకీభవించారు. దీనికి నిదర్శనంగా భజన కూటమి అధ్యక్షులైన శ్రీ కె. శ్రీనివాసులు నాయుడు గారూ, యూత్ లీగ్ అధ్యక్షులైన శ్రీ కోరాడ సూర్యనారాయణ గారు ఉభయ సంస్థలను విలీనం గావించ డానికి అంగీకరించారు. ఈ సంఘటనను పురస్కరించుకొని, భజన కూటమి వారు, శ్రీ వేదుల వెంకట్రావు గారి (**W. H. O**) అధ్యక్షతలో మహాత్మగాంధి హాలులో విలీనీకరణ ఉత్సవాన్ని జరిపించారు. ఆ సందర్భంలో, "ముందడుగు" అనే ఒక నాటికను భజన కూటం విద్యార్థులు ప్రదర్శించారు. ఆ నాటికను ఉభయ సంస్థల నాయకుల అభిప్రాయాలను సమన్వయం చేసే ఆంతర్యంతో, శ్రీ కె.కె. మూర్తి పంతులు గారు వ్రాశారు. మరునాడు ఉదయమే, భజన కూటమి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సామగ్రితో సహా, అప్పట్లో యూత్‌లీగ్ వారి స్వాధీనంలో ఉన్న బ్రహ్మ సమాజం భవనానికి మారారు. అంటే అప్పుడు యూత్ ఆంధ్ర లీగ్ వారి, భజన కూటమి వారి పాఠశాలలు ఏకమై పోయాయన్న మాట. కాని, భజన కూటమి మాస్టర్ల వేతనాల విషయంలో అన్యాయం, విలంబన జరిగింది. కొద్ది రోజుల, పరకు, తర్జన భర్జనలు చెలరేగుతూ వేతనాల సమస్య పరిష్కారం కానందు వల్ల, భజన కూటమి అధ్యాపకులు, విద్యార్థులు మళ్ళీ భజన కూటానికే మరలి వచ్చారు, ఆ గొడవలో, భజన కూటమి వారి 3000/- చ్యాల, ఖరీదైన సామగ్రి బ్రహ్మ సమాజంలోనే ఉండి పోయింది. క్రొత్త సామగ్రిని సేకరించి భజన కూటమి పాఠశాల యధావిధిగా నిర్వహింప బడింది. 1964 సం॥లో విదేశీ పాఠశాలలను బర్మా ప్రభుత్వంవారు జాతీయం చేసిన సందర్భంలో ఈ పాఠశాల మూసివేయబడింది. ఈ కూటమి మత సంస్థగా పరిగణింప బడడం వల్ల జాతీయం చేసే చట్టం, దీనికి వర్తించలేదు.

ఈ భజన కూటమి వారు శ్రీకృష్ణ భగవానుని మిక్కిలి ప్రేమతో పూజిస్తూ ఉంటారు. ఇందులో సుమారు నాలుగు అడుగులు ఎత్తుగల "చిరునవ్వులు చిందులు మోయు" బాలకృష్ణుని విగ్రహం చక్కగా ప్రతిష్ఠింప

బడింది. లోగడ 1. కీ॥ శే॥ శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు 2. శ్రీ పుల్లెల శ్యామసుంద్రరావు 3. ఆచార్య రంగా 4. శ్రీ ధనెంకుల నరసింహం 5. శ్రీ బి. యస్. మూర్తి 6. శ్రీ టి. విశ్వనాధరెడ్డి మొదలైన దేశీయ నాయకులను సత్కరించి, వారి చల్లని ఆశీస్సులను ఈ కూటమి వారు పొంది వుండడం హర్షింపవలసిన విషయం.

ప్రస్తుతం, ఈ భజన కూటమిలో, ప్రతి శనివారం భజనలు, సభ్యుల, అభిమానుల "ఉభయములు" జరుగుతున్నవి. ముఖ్యమైన పర్వదినాలను కూడా ఆచరిస్తూంటారు. 1. శ్రీకృష్ణ జన్మాష్టమి (ఉట్ల పండుగ) 2. శ్రీరామనవమి 3. శ్రీ దుర్గాపూజ, ముఖ్యంగా పేర్కొనదగ్గవి. ఉట్ల పండుగ తిరువీధి మహోత్సవం నేటికీ అతి వైభవంగా జరుగుతుంది. భజన కూటమిలోన, భజనానంతరం, ఆధ్యాత్మిక ప్రబోధనలు, గీతా పారాయణం, దేవీ మహాత్మ్య పఠనం కూడా జరిపిస్తున్నారు. హిందూమత ప్రబోధం చేసినవారు శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్యగారు. గీతా పారాయణం, దేవీమహాత్యం పఠనం చేసినవారు శ్రీ లోచర్ల గంగరాజుగారు. దీనికి ప్రస్తుతం, శ్రీ మద్దె వెంకటస్వామి గారు అధ్యక్షులుగాను, శ్రీ గొల్లపల్లి రంగారావు గారు ప్రధాన కార్యదర్శిగాను కృషిచేస్తున్నారు. భజనలను, "ఉభయములను" నిర్వహించే విషయంలో, శ్రీ రంగారావు గారు ప్రత్యేక శ్రద్ధవహిస్తూ, హిందూమత ప్రచారంలో కూడా ప్రోత్సాహ మిస్తూ వుంటారు.

6. ఆంధ్ర భారతి సేవా సంఘం (అల్లోన్-రంగూన్)

రంగూన్ నగరానికి పరిసరప్రాంతమైన అల్లోన్‌లో వున్న వేల్స్ వీధిలో (**Wales Street**) 1932 సంలన ఈ సంస్థను 1. కీ. శే. పల్లికొండ కాటయ్య 2. శ్రీ దండా రంగనాయకులు 3. శ్రీ కర్రి అయ్యబాబు 4. శ్రీ పాలెపు గోవిందరాజులు వర్మ 5. శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య 6. శ్రీ సార్క పద్మనాభరావు 7. శ్రీ మైలపల్లి రంగనాయకులు 8. శ్రీ టి. వి. శ్యామారావు (హార్మోనియం ప్రవీణుడు) 9. శ్రీ వూటాల సోమయ్య 10. శ్రీ ఎరగోకుల ఏసుదాసుగార్లు స్థాపించారు. సంఘాశయాలు— **i.** అనాధప్రేత సంస్కరణ **ii.** ధర్మపాఠశాల నిర్వహణ **iii.** దురాచారముల నిర్మూలన **iv.** కార్మిక సమస్యల పరిష్కరణ **v.** సాహిత్య, సాంస్కృతిక కార్యాల నిర్వహణ.

వీటికి అనుగుణ్యంగా, ధర్మపాఠశాలను ప్రపథమంగా నెలకొల్పి, పేద బాల, బాలికలకు ఉచిత విద్యాదానం చేశారు.

1934 సం॥న ఆంగ్లేయ దినపత్రిక అయిన 'రంగూన్ గజెట్'లో (Rangoon Gazette) **"Quarrel at water hydrant. coranghis fall out"** (నీటి కొళాయిలవద్ద సంఘర్షణ—కోరంగీలు కొట్టుకొన్నారు) అనే శీర్షికతో ఒక వార్తను ప్రకటించింది. ఆంధ్రజాతికి అతి నీచకరమైన "కోరంగీ" పదమును వాడిన కారణంగా, ఈ సంఘంవారు వెంటనే నిరసన తెలుపుతూ, ఆ పత్రికాధిపతిని ప్రాతపూర్వకంగా హెచ్చరించారు. ఈ సంఘంలో ప్రముఖులైన, శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య. శ్రీ పాలెపు గోవిందరాజులు వర్మ గార్లు, బ్రహ్మశ్రీ ఆవటపల్లి నారాయణరావు పంతులు (**M:A. M.L.C**)గారి వద్దకు వెళ్ళి ఆలోచింపగా, పంతులుగారు 1. శ్రీ సత్తి వెంకటరెడ్డి 2. డాక్టరు డేవిడ్ 3. శ్రీ తుమ్మగుంట అప్పయ్యనాయుడు గార్లను రప్పించి వీరందరితో బర్మా గవర్నరు గారిని సంప్రదించి, "కోరంగీ" అన్నమాట ఆంధ్రజాతి పేరు కాదనీ, మేము తెలుగువారమనీ, మా దేశము ఆంధ్రదేశమనీ, వగైరా విపరాలను తెలిపి, చివరకు ఈ కోరంగీ పేరును తీవ్రంగా నిరసించారు. ఆ కారణంగా, బ్రిటిష్ గవర్నరుగారు కూడా అందుకు సుముఖులై, ఆ నాటినుండి, "కోరంగీ" అన్న మాటకు బదులు. "తెలుగు" అన్నమాటను ప్రయోగించవలసిందని, అన్ని కార్యాలయాలకు, ఒక జెనరల్ ఆర్డరును (**G.O. No. 30/(1934)** పంపించారు. ఆ నాటినుండి బర్మాప్రభుత్వపు రికార్డులలో తెలుగువారిపట్ల, "కోరంగీ" అన్నమాట రద్దుచేయబడింది.

1. అల్లోన్‌లో వున్న బ్రిటిష్ ఫోకర్ కంపెనీ (**Foucar company**) వారి కర్రల మరలో పెద్ద మేస్త్రీ గారైన శ్రీ మద్దు తాతయ్య గారు ఒకప్పుడు సెలవుపైన స్వదేశం వెళ్ళి, తిరిగి తన పనిలో ప్రవేశించే సమయంలో, కంపెనీ అధికార్లు ఆయనను నిరాకరించారు. ఆ విధంగా ఒక ఆంధ్ర కార్మికునకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఈ సంఘం వారు కంపెనీ అధికార్లను సంప్రదించి, మేస్త్రీ పైన జరిగిన కుట్రను గ్రహించి, కార్మిక చట్ట రీత్యా తగు చర్య తీసుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. చివరకు తాతయ్య మేస్త్రీకి

ఉద్యోగము నుండి చట్ట విరుద్ధంగా తొలగించినందుకు, 4,000/– రూపాయలు నష్ట పరిహారాన్ని కంపెనీ నుండి, యీ సంఘం వారు ఇప్పించారు.

(2) మరొక కర్మల మరలో పని చేస్తున్న, లొట్టల ఎర్రయ్య అన్న కార్మికుని ఎడమ చేతి బొటన వ్రేలు రంపము కోతలో తెగిపోయినప్పుడు, నష్ట పరిహారం ఇవ్వడానికి మిల్లు యజమానియైన చైసీయుడు నిరాకరించగా ఈ సంఘం వారు ఆ ప్రమాదాన్ని లేబర్ కమీషనరు దృష్టికి తెచ్చి చట్ట రీత్యా తగు నష్ట పరిహారం 350/–రూపాయలను ఇప్పించారు. ఈ విధంగా ఏ కార్మికుని ఫిర్యాదైనా, ఈ సంఘీయులు శ్రద్ధతో ఆలకిస్తూ, తగు చర్య తీసుకొనేవారు.

(3) ఒక సందర్భంలో **B. I. S. N.** (బి. ఐ. ఎస్. ఎన్.) కంపెనీ వారు, యీ సంఘానికి వారానికి రెండు టిక్కెట్లను ఇచ్చేవారు. వాటితో, యీ సంస్థ వారానికి ఇద్దరు పేద కార్మికులను స్వదేశానికి ఉచితంగా పంపించేది. జపానీయుల రెండవ విమాన దాడిలో (25-12-1941) ఈ సంస్థ పూర్తిగా ధ్వంసమై పోయింది.

7. ఆంధ్ర జ్ఞాన ప్రచారిణీ సంఘం (కాండాగ్లే-రంగూన్)

1934 సం॥న కాండాగ్లే మాండలే రోడ్డులో, కీ॥శే॥ శ్రీ మునిశెట్టి సత్తయ్య గారి ప్రోత్సాహంతో కొందరు అభిమానులు – 1. శ్రీ మునిశెట్టి బాలాజీ 2. శ్రీ కొవ్వూరి సుబ్బయ్య 3. శ్రీ కోనా తాతయ్య లూజీ 4. శ్రీ టేకి వెంకన్న మొదలైన పెద్దలు కలిసి స్థాపించారు. ఈ సంస్థ ప్రప్రథమంగా ఒక గాయక బృందంగా ప్రారంభమై తదనంతరం, సాంఘిక, సాంస్కృతిక విషయాలలో పాల్గొన్నది. 1946 సం॥ లగాయితు శ్రీ మునిశెట్టి సత్తయ్యగారి కుమారుడైన 1. శ్రీ మునిశెట్టి నందయ్య (ఉరఫ్) నందకుమార్ 2. శ్రీ కాంద్రేగుల మీరయ్య 3. శ్రీ యోగానందం (హార్మోనిస్టు) 4. శ్రీ కాంద్రేగుల కాళిదాసు 5. శ్రీ కుప్పిలి లక్ష్మీనారాయణ 6. శ్రీ సిద్ధనాతి అప్పలస్వామి 7. శ్రీ కాటయ్య 8. శ్రీ చిన్నాగార్లు (మృదంగ ప్రవీణుడు) ఇంకా మరి కొందరు యువకులు దీన్ని నిర్వహించారు. వీరి వెనుక మరి కొందరు పెద్దలు సలహాదార్లుగా ఉంటూ అనేక సత్కార్యాలను చేయించేవారు. ఏటేటా, శ్రీ కృష్ణ

జన్మాష్టమి దినాలలో ఉట్ల సంబరం, తిరువీధి మహోత్సవం, ప్రజా సహకారంతో జరిపిస్తుండేవారు.

1946 సం॥ నుండి 1955 సం॥ వరకు, యీ సంస్థ దిన, రాత్రి పాఠశాలను కూడా నిర్వహించింది. 1955 సం॥ నుండి 1963 సం॥ వరకు, కాందోం-కల్వార్టు రోడ్డులో వున్న శ్రీ విఘ్నేశ్వరాలయ మంటపంలో ఉత్సవాలను జరిపించింది. ఈ సంఘానికి ఒక నాటక శాఖ ఉండేది. నటనా సామర్థ్యం గల సభ్యులచే చక్కని నాటకాలను పర్వదిన సందర్భాలలో ప్రదర్శించే వారు. నాటక శాఖలో 1. శ్రీ కాంద్రేగుల మీరయ్య 2. శ్రీ కాంద్రేగుల కాళిదాసు 3. శ్రీ సిద్ధనాతి అప్పలస్వామి 4. శ్రీ యోగానందం 5. శ్రీ చిన్నాగార్లు (మృదంగం) ముఖ్యులు. వీరు ప్రదర్శించిన సాంఘిక నాటకం-"నల్లతంగాళ్" లేక, "సోదరి సుగుణ" (—యీ తమిళనాటకాన్ని తెలుగులో అనువదించిన వారు శ్రీ మునిశెట్టి సత్తయ్యగారు—) మరువరానిది. ఈ సంఘంవారు ఏటేరు, కాందోం మారమ్మ ఉత్సవం నాడూ, కంబేలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవం నాడూ చలి వేంద్రను పెట్టేవారు.

8. ఆంధ్ర సాహితీ సమితి (రంగూన్)

1938 సం॥న రంగూన్ 38వ వీధిలో ఉన్న, "ఆంధ్ర యువజన భజన కూటమి"లో కీ-శే॥ శ్రీ సత్తి వెంకటరెడ్డి గారి అధ్యక్షత క్రింద యీ సమితిని స్థాపించడం జరిగింది. దీనిలో ప్రప్రథమంగా చేరిన ప్రముఖులు- 1. శ్రీ కర్రి రామమూర్తి 2. శ్రీ కేళ నరసింహారావు 3. శ్రీ పలకా సూర్యనారాయణ 4. శ్రీ రాణి సుబ్బారావు 5. శ్రీ వెలగల వెంకటరెడ్డి 6. శ్రీ శిల్లా రాజులురెడ్డి 7. శ్రీ వంగల వెంకటరావు కవి 8. శ్రీ చొల్లంగి కంచన్న 9. శ్రీ రాళ్ళ పూడి యెల్లయ్య 10. శ్రీ పాలెపు గోవిందరాజులు వర్మ 11. శ్రీ నేమాని మునియ్య చౌదరి 12. శ్రీ లక్కోజి లింగరాజు 13. శ్రీ కొమర శంకర నారాయణ 14. శ్రీ మంగాలక్ష్మి నరసింహారావు 15. డాక్టరు ఏ. డేవిడ్ 16. శ్రీ ఏ. ఎస్. నారాయణ (రంగూన్ టైమ్స్ సంపాదకుడు — **Rangoon Times Editor**) గార్లు.

ఈ సమితి సాహిత్యప్రియులకు, భాషావేత్తలకు ప్రోత్సాహ మిచ్చింది. నూతన రచయితలకు, వ్యాసకర్తలకు కూడా ప్రోద్బలమిస్తూ, వక్తృత్వపోటీలను

కధానిక పోటీలను నిర్వహించింది. రచనలలో నూతన శైలి, భాషామాధుర్యం, సారస్వతాభిరుచిని చవి చూపడానికి "వసంత కుసుమము" అన్న ఒక సంచికను సర్వాంగ సుందరంగా ప్రచురించి, సాహితీప్రియుల మన్ననల పొందుతూ, జపాన్ యుద్ధకాలం వరకు (1941) పని చేసింది. బర్మాఆంధ్ర భాషావేత్తలలో కీ॥శే॥ సోమరాజు రామానుజ రావు (బర్మా ఆంధ్ర కవితా పితామహుడు), కీ॥శే॥ శ్రీ ప్రతిపురాన సత్యానందం గారు (తమ్మయ్య దొర) బర్మాలోని ఆదికవులుగా పేర్కొన బడ్డారు. వీరి తర్వాత, 1. శ్రీ వంగల వెంకటరావు కవి, 2. శ్రీ సూరా మీరయ్య బాలకవి 3. శ్రీ సూరా చిట్టయ్యకవి 4. శ్రీ బత్తుల సుందర్రావు కవిగారును చెప్పుకోవచ్చు.

యుద్ధానంతరం, 1955 సం॥ ఆగస్టు నెల 29వ తేదీన, సంస్థ, ఆంధ్ర మహాజన సంఘంలో, 1. శ్రీ పోలవరపు సన్యాసిరావు 2. శ్రీ గెడ్డం వెంకట రత్నం 3. శ్రీ ఓగూరి సత్యానందం గార్ల ప్రోత్సాహంతో, ఆంధ్ర సాహితీ సమితి (బర్మా) అన్న పేరిట, మళ్ళీ నెలకొల్పబడింది. కార్యనిర్వాహక వర్గంలో 1. శ్రీ కర్రి రామమూర్తి 2. శ్రీ బత్తుల సుందర్రావు 3. శ్రీ గుత్తుల వెంకట రెడ్డి 4. శ్రీ సి. హెచ్. వి. రాఘవులు 5. శ్రీ కె. సుబ్బారావు గార్లు వుండే వారు. సమితి అశయాలలో ఎలాంటి మార్పులూ లేవు. ఈ సమితి ప్రతీ యేట ఒక సంచికను వార్షికోత్సవం నాడు వెలువరించాలని ఆశించింది కాని ఫలించ లేదు. అప్పట్లోవున్న, "తెలుగు బిడ్డ"-వార్తాపత్రికకు, "అనుబంధ సంచిక"గా మాత్రమే మొదటి వార్షిక సంచిక వెలువడింది. తదనంతరం, 1956 సం॥ నవంబరు నెలలో, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాన్ని పురస్కరించుకొని, "తెలుగు వెలుగు" అన్న పేరుతో రెండవ వార్షిక సంచిక వెలువడింది. దీని సంపాదక వర్గంలో 1. శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య (అధ్యక్షులు) 2. శ్రీ గెడ్డం వెంకటరత్నం (ఉపాధ్యక్షులు) 3. శ్రీ పోలవరపు సన్యాసిరావు (కార్యదర్శి) 4. శ్రీ అంత్రి నాగేశ్వరరావు గార్లు కృషిచేశారు. కార్యనిర్వాహక సభ్యులుగా 1. శ్రీ చిట్టూరి సుబ్బరాజు 2. డాక్టరు ఏ. డేవిడ్ 3. చొల్లంగి కృష్ణారావు సోదరులు 4. శ్రీ చొల్లంగి ధనరాజు 5. శ్రీ కంచి వెంకటరెడ్డిగార్లు వుండే వారు. వీరితోబాటు, శ్రీ చెరువు శ్రీరామమూర్తి గారు (M.Sc) [External Lecturer in Rangoon University రంగూన్ విశ్వవిద్యాలయ అధ్యా

పకులు] డాక్టరు ఎల్. వెంకటరమణ గార్లు సలహాదార్లుగా వుండేవారు. ఈ సంస్థ, 1964 సం॥ వరకు (ఆంధ్రుల తిరోగమనం ప్రారంభం) పని చేసింది.

ఈ సంస్థ చరిత్రలో పేర్కొనదగినవారు — 1. కీ. శే. శ్రీ చొల్లంగి కంచన్న 2. శ్రీ రాళ్ళపూడి యల్లయ్య 3. శ్రీ కర్రి రామమూర్తి 4. శ్రీ పోల వరపు సన్యాసిరావు (5) శ్రీ గెడ్డం వెంకటరత్నంగార్లు.

9. ఆదిమాంధ్ర సంఘం (లాన్మడో - రంగూన్)

1926 సం॥లో, రంగూన్ – లాన్మడో ప్రాంతంలో 6 వ నెంబరు వీధిలో, ఈ సంఘాన్ని — 1. శ్రీ మట్టా రామయ్య 2. శ్రీ రాపాక వెంకట రెడ్డి 3. వస్కా సుబ్రహ్మణ్యం 4. శ్రీ బుడితి వెంకటరెడ్డి 5. శ్రీ సూరా మీరయ్య 6. శ్రీ సూరా చిట్టియ్యగార్లు, మరి కొందరు పెద్దలూ స్థాపించారు. సాంఘిక, సాంస్కృతిక, విద్యావిషయాలలో, యీ సంస్థ కూడా పేర్కొన దగ్గదని ప్రతీతి. ఈ సంఘీయులు దిన-రాత్రి పాఠశాలలను కొంతకాలం నిర్వహించి, పగలు పనిచేసుకొని జీవించువారికి రాత్రి పాఠశాలలో ఉచిత విద్యాభ్యాసమిచ్చి, పగటి పాఠశాలలో ఆంధ్ర బిడ్డలకు కూడా ఉచిత విద్యాదానమిస్తూ, లాన్మడో ప్రాంతం లోని ఆంధ్రులకు సర్వవిధాలా సేవ చేశారు. "ఆది మాంధ్ర" అను వారపత్రికను కూడా కొంతకాలం నిర్వహించారు. నిమ్న జాత్యుద్ధరణ, జాతీయ సంస్కరణ, సాంఘిక సేవలలో అవిరళ కృషిచేసిన సంస్థలలో దీనికొక ప్రముఖ స్థానముంది. కార్మికోద్యమంలో కూడా ఘనంగా సేవచేసింది జపాన్ యుద్ధకాలంవరకు (1941) యీ సంఘం నిర్వహింపబడింది. అటుపిమ్మట, యుద్ధకాలంలో మూసివేయబడింది. యుద్ధానంతరం, పునఃస్థాపితం చేసే ప్రయత్నాలు జరిగాయి. కాని, సంఘ నాయకులలో అనైక్యత యేర్పడిన కారణంగా ఫలించలేదు.

10. కాండాగ్లే యువజనసంఘం

ఈ సంస్థ, 1938 సం॥న 1. శ్రీ దొరైకన్ను 2. శ్రీ పి. జి. కృష్ణా 3. శ్రీ కె. చిన్నయ్య 4. శ్రీ సుందరరాజు 5. శ్రీ గుంటు అప్పారావు 6. శ్రీ ఎస్. ఏ. రహీంగార్లు, ఇంకా మరికొందరు ప్రముఖులతో స్థాపించబడింది. ఆ సంస్థకు — అనాధ ప్రేత సంస్కరణ, భజన కాలక్షేపములే

ముఖ్యాశయములు. యుద్ధానంతరం, 1948 సం॥లో యీ సంఘంవారు దిన-రాత్రి పాఠశాలను నిర్వహిస్తూ, బీద బిడ్డలకు విద్యాబిక్షను పెట్టారు. వారు రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని, ప్రజా మన్ననల పొంది వున్నారు. ఏటేటా — 1. భారత స్వతంత్ర్య దినోత్సవాన్ని 2. గాంధీజయంతిని, ముఖ్యమైన పండుగలను జరపడంలో శ్రద్ధ వహించేవారు. ఈ సంఘంవారు సంగీత, నాటకాలలోను, బంతియాట, వ్యాయామక్రీడలు మొదలైన వాటిల్లోనూ పోటీలు నిర్వహించేవారు. ఫా. సా. పా. లా. బస్తీ, ప్రోం పట్టణం, అగ్నిదేవునికి ఆహుతికాగా, ఆ సందర్భములో, "అగ్ని ప్రమాద నిధి"కి విరాళాలను సేకరించారు. శ్రీ వి. జే. సర్వోత్తమరావు (B.A. B L.) గారి చదువులకు 500/- రూపాయలు సహాయంగా యిచ్చారు. మొదటినుండి 1963 సం॥వరకు, నెలకు 10 నుండి 20 రూపాయల వరకు, అనాధ సంస్కరణకు వెచ్చించేవారు. శ్రీ రామకృష్ణ మిషన్ ధర్మ ఆసుపత్రికి నిధిని సేకరించి తోడ్పడేవారు. ఈ సంస్థ కార్యాలను దీక్షతో నిర్వహించే వారిలో — 1. శ్రీ ఎస్. కృష్ణా 2. శ్రీ సి. హెచ్. వి. రాఘవులు 3. శ్రీ గుంటు అప్పారావు గార్లు ముఖ్యులు. 1967 సం॥లో యీ సంఘపు లెక్కల పరిశీలన అసంతరం, మిగిలివున్న 370/- చ్యాల మొత్తాన్ని, శ్రీ మారియమ్మ దేవాలయానికి అర్పించినట్లు తెలుస్తున్నది.

11. హరిజన సేవా సంఘం (కాండాగ్లే)

కాండాగ్లే ప్రాంతమున ఫా. సా. పా. లా. బస్తీలో 1948 సం॥న శ్రీ సార్క్ పద్మనాభరావు గారి ప్రోత్సాహంతో ఒక బహిరంగసభ జరిగింది. ఆ సభలో ఆంధ్ర హరిజనుల పురోభివృద్ధికై ఒక సంఘాన్ని స్థాపించాలని తీర్మానించడం జరిగింది. తత్ఫలితంగా, అదే సంవత్సరం, జూలై నెల 15 వ తేదీని, 1. శ్రీ పల్లికొండ కాటయ్య 2. శ్రీ పందిరి జంపారావు 3. శ్రీ వంగల వెంకటరావు కవి 4. శ్రీ బూర ఆదినారాయణ, B.A.,B.L. 5. శ్రీ గంటా వెంకటయ్య, B.A. గార్ల ఉత్సాహంతో, మరికొందరు యువకులతోను కలిసి, ఒక కార్యవర్గం ఏర్పడి, సంఘనిర్వహణ ప్రారంభమైంది. అదే ఏట, బర్మా దేశం స్వతంత్రత పొందింది. ఆ తర్వాత కొన్ని రాజకీయ పరిణామాల పర్యవసానంగా, రంగూన్‌లో వున్న పేద హరిజనులు చాలమంది నిరుద్యోగులై,

బర్మాదేశాన్ని శాశ్వతంగా విడిచి పోవడానికి నిశ్చయించుకొన్నారు. ఆ బీద హరిజనులకు, భారతదేశంలో ఉద్యోగాలు ఇప్పించే సదుద్దేశంతో, అప్పట్లో, భారత కేంద్ర ప్రభుత్వం తరపున, రంగూన్‌లో కార్మిక సంక్షేమ శాఖాధికారిగా ఉన్న శ్రీ పి. మోజెస్‌గారి ద్వారా నిరుద్యోగులైన హరిజనులకు యోగ్యతాపత్రాలను, సిఫారసు పత్రాలను ఇప్పించి, తద్వారా భారతదేశంలో, వారికి ఉద్యోగాలు కల్పించడంలో, యీ సంఘంవారు చేసిన కృషి అమోఘమైనవని చెప్పక తప్పదు. హఠాత్తుగా, దీక్షతో పనిచేసిన కొందరు కార్యవర్గ సభ్యులు, స్వదేశానికి వెళ్ళిపోవడంతో, సంఘం మూసివేయబడింది.

ఒక సంవత్సరం గతించిన పిదప, హరి జనాభ్యుదయ కృషికీ, పేద బాల బాలికల విద్యాభ్యాసానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తూ కీ॥ శే॥ శ్రీ పల్లికొండ కోటయ్య గారి ప్రత్యేక కృషితో, చెదిరిపోయిన మాజీ సభ్యులందరూ కలిశారు. 1950 సం॥ఫిబ్రవరి నెల 1వ తేదీన, 91వ వీధిలోనున్న శ్రీ వీరభోగ వసంతరాయ ధర్మ పాఠశాలయందు, ఈ సంఘాన్ని పునఃస్థాపితం చేశారు. అప్పుడు 1. శ్రీ పల్లికొండ కోటయ్య 2. బూర ఆదినారాయణ **B.A., B.L.** 3. శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య గార్ల నాయకత్వం తోను, కొందరు వుత్సాహవంతులైన సభ్యులతోను 1. శ్రీ మలబంటి కొండయ్య 2. శ్రీ పి. జంపారావు 3. శ్రీ ఎమ్. అరుణాచలం మరి కొందరితోను ఒక నూతన కార్యవర్గాన్ని నెలకొల్పడమైనది. అప్పట్లో, సంఘానికి ప్రత్యేక గృహం లేకపోయినప్పటికి — 1. అనాధ ప్రేత సంస్కరణ శాఖ 2. స్వచ్ఛంద సేవాదళ శాఖ 3. భజన శాఖ, అన్న వాటి మూలంగా సంఘ కార్యక్రమాలు చురుగ్గా సాగాయి.

1552 సం॥లో సంఘాధ్యక్షులైన శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య, ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ పల్లికొండ కోటయ్య గార్ల నాయకత్వాన, 1. శ్రీ దొడ్డా కృష్ణయ్య 2. శ్రీ గారా అప్పలస్వామి 3. శ్రీ మలబంటి కొండయ్య 4. శ్రీ ధనరాశి చిట్టి 5. శ్రీ జి. ఎస్. మణి 6. శ్రీ యమ్. అరుణా చలం 7. శ్రీ ఇ. టి. రావు గార్లతోనూ మరి కొంతమంది మాజీ సభ్యులతో నూతన కార్యవర్గ మేర్పడి, ఈ క్రింది ఆశయాలతోటి తగిన కృషిని ప్రారంభించారు. — 1. పూజ్యులైన గాంధీ మహాత్ముని పవిత్ర ఆశయాలను పాటిస్తూ, హరిజనా

భ్యుదయ కార్యక్రమాన్ని బహుముఖ రంగాలలో కొనసాగించుట 2. ధర్మ పాఠశాలను నిర్వహించుట 3. అనాధ ప్రేత సంస్కరణ 4. ఉచిత పఠన మందిరం, పుస్తక భాండాగారాలను నెలకొల్పుట, 5. అస్పృశ్యత, మధుపానం జూదం మొదలైన సంఘ దురాచారములను నిర్మూలించడానికి పూనుకొనుట, 6. స్వచ్ఛంద సేవా దళాన్ని నెలకొల్పి, తగు క్రమ శిక్షణ, కవాతులను నేర్పుతూ, కోరిన సంఘా లన్నింటిలోను పాల్గొనుట 7. ఆంధ్రాభ్యుదయ కరమగు ఉద్యమాలను ప్రోద్బలమిచ్చి, వారిలో సహకరించి కృషి చేయుట 8. పాఠశాల బాలికలకు కుట్టు అల్లిక పనులు నేర్పించుట 9. అనాథుల పట్ల, శరణాగతులపట్ల ఆదరణ చూపుట, 10. సంగీత, నాటక కళలకు, వ్యాయామ క్రీడలకు తగిన ప్రోత్సాహమిచ్చుట, వాటికి అనుగుణ్యమైన చట్ట నిబంధనలను, శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య గారు రూపొందించి, సంఘోద్యమాన్ని సాగించిన తర్వాత. 1952 సం॥ జూన్ నెల 1వ తేదీన, ఒక ధర్మ పాఠశాలను, కల్వర్టు రోడ్డులోని 52వ నెంబరు గృహంలో, గారం అప్పలస్వామి గారిచ్చిన స్థలంలో శ్రీ గాడి యెల్లయ్య పంతులు గారిచే 20 మంది బాల, బాలికలతో ప్రారంభ మైంది. పాఠశాలకు కావలసిన బెంచీలు, బ్లాక్ బోర్డు వగైరా పాఠశాల పరిక రాలను శ్రీ దొడ్డా కృష్ణయ్య గారు వెంటనే చేయించారు. సంఘానికి శాశ్వత రాజపోషకులుగా కూడా వుండి, అవసరమైన సమయాలలో ఆర్థికంగా తోడ్పడే వారు. ఈ విధంగా మూడు సంవత్సరాలలో పాఠశాలలో 120 మంది బాల, బాలికలకు విద్యా సౌకర్యాలు ఏర్పడ్డాయి. బర్మా భాషను కూడా నేర్పించే ఏర్పాట్లు చేయబడ్డాయి.

1. 1952వ సం॥లో రాయలసీమలో కరువు, కాటకం ఏర్పడ్డ సంద ర్భంలో, ఈ సంఘ సభ్యులు విరాళాలను ప్రోగుచేసి, 790/- రూపాయలను స్థానిక ఇండియన్ ఎంబసీద్వారా డిశంబరు 20వ తేదీని పంపించారు. 2. 1953 సం॥ జనవరి నెలలో ఫా. సా పా. లా. బస్తీలో చెలరేగిన ఘోరమైన అగ్ని ప్రమాదంలో గురియైన అగ్ని బాధితులకు 7 దినముల వరకు అన్న సంతర్పణలు జరిపించారు. 9 బస్తాల బియ్యాన్ని కూడా ప్రోగుచేసి ఫా. సా. ఫా. లా. సమితి వారికి సమర్పించారు. 3. 1953 సం॥ మార్చి నెలలో సంభవించిన హెంజడా అగ్నిప్రమాద సందర్భంలో సదరు అగ్ని బాధితుల సహాయార్థమై, 300/- చ్యాలను "రంగూన్ మేయర్ అగ్ని బాధితుల సహాయనిధి"కి విశదా

మిచ్చారు. 4. అదే సంవత్సరం ఆగస్టు నెలలో ఆంధ్రదేశంలో చెలరేగిన ఉభయ గోదావరి వరద బాధితుల కోసం విరాళాలను ప్రోగుచేసి, 1116/-చ్యాలు స్థానిక ఇండియన్ ఎంబసీ ద్వారా, డిశంబరు నెల 4వ తేదీన ఆంధ్ర దేశానికి పంపించారు. 5. మోల్మేన్ శ్రీ కృష్ణాలయ పునర్నిర్మాణం కొరకు 116/- చ్యాలను విరాళ మిచ్చారు.

ఆంధ్ర మహాజన సంఘం అధ్వర్యాన రంగూన్ సిటీ హాలులోనూ, శ్రీ రామకృష్ణ మిషన్ హాలులోనూ జరిగిన ఆంధ్ర రాష్ట్ర వార్షికోత్సవ మహాసభలలో ఈ సంఘం వారు తమ విద్యార్థులచే 1. బాలల గోల 2. ఆటా - పాటా 3. మూగ నటన - వంత పాట అను చిన్న నాటికలను ప్రదర్శించి, ప్రజల మన్ననలను పొందగల్గారు. ఈ విషయంలో శ్రీ గొర్ల రామారావు, శ్రీ ఎన్. వై. రత్నం గార్లు ప్రశంసనీయులు.

ఆంధ్రదేశం నుండి బర్మాకు వచ్చిన ఆంధ్ర ప్రముఖులు, భారత పౌర్ణ మెంట్ సభ్యులైన — 1. శ్రీ బి. యన్. మూర్తి 2 శ్రీ టి. విశ్వనాథరెడ్డి 3. శ్రీ చేగిరెడ్డి బాలిరెడ్డి గార్లు మరియు ఆచార్య రంగాగారి శిష్యులైన శ్రీ ధనెం కుల నరసింహం గార్లను సత్కరించినది. క్రీడారంగంలో, పాఠశాల బాల బాలి కలు అనేక బహుమతులను సంపాదించారు. ఈ సంఘం వారు 1955 సం॥లో ఒక "భవన నిర్మాణ కమిటీ"ని, కీ.శే. శ్రీ వి.ఎస్. వెంకట రామన్‌గారి అధ్య క్షతతో స్థాపించి, భవన నిర్మాణ నిధిని సేకరించారు. సంఘ శాశ్వత రాజ పోషకులగు శ్రీ దొడ్డా కృష్ణయ్యగారు 3,500/- చ్యాలు భూరి విరాళమిచ్చారు. జూపిటర్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజరైన శ్రీ సి.ఎస్. రామన్‌గారు 1,500/- చ్యాలు విరాళమిచ్చారు. ఇలాంటి దాతల ఆర్థిక సహాయంతో, 91 వ వీధిలో 50 × 30 అడుగుల పరిమాణం గల భూమిని 8,000/- చ్యాలకు కొన్నారు. భవన నిర్మాణం కమిటీలో చాలామంది సభ్యులు స్వదేశం తరలిపోవడంతో, ఆ భవన నిర్మాణ కార్యక్రమం స్తంభించి పోయింది. 1964వ సం॥ లో బర్మా ప్రభుత్వంవారు సకల సంస్థలను రద్దుచేయడం వల్ల, ఈ సంఘం కూడా మూసి వేయబడింది. సంఘ చరిత్రలో — (1) కీ॥శే॥ శ్రీ పల్లికొండ కోటయ్య (2) శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య (3) శ్రీ దొడ్డా కృష్ణయ్య (4) శ్రీ గారా అప్పలస్వామి (5) శ్రీ గొర్ల రామారావు (6) శ్రీ మలబంటి కొండయ్యగార్లు చిరస్మరణీయులు.

12. ఆంధ్ర యూత్ లీగ్

[ఆంధ్ర యువజన సమితి] రంగూన్

1936వ సం॥ములో మొట్టమొదటగా నెలకొల్పబడిన "ఆంధ్ర విద్యార్థి సంఘం", తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలలోను, బంతియాట, టేబుల్ టెన్నిస్ మొదలైన ఆటలలోను కూడా కృషి చేసింది. అప్పట్లో డాక్టరు ఎన్.ఎస్. మూర్తిగారు ఎక్కువగా ప్రోత్సాహం ఇచ్చేవారు. యుద్ధానంతరం, ఈ సంఘం పునఃస్థాపితం చేయబడినప్పటికీ, విద్యార్థులు తక్కువ సంఖ్యతో తగిన సంఘ బలం లేనందువల్ల మూసివేయబడింది. తదనంతరం విద్యార్థులు, మరికొందరు యువకులు, పురప్రముఖులు సమాలోచనలు జరిపిన ఫలితంగా, "ఆంధ్ర యూత్‌లీగ్" లేక "ఆంధ్ర యువజన సమితి" పేరిట, యీ సంస్థ 1950వ సం॥లో నెంబరు 266, లూయీ వీధిలో తలెత్తింది. భవన సౌకర్యాలను శ్రీ కోరాడ సూర్యనారాయణ గారు చేకూర్చారు. సమితి ఆశయాలు— 1. వయోజన విద్యా ప్రచారం 2. పాఠశాల నిర్వహణ 3. ఉచిత పఠన మందిరం, గ్రంథాలయాలను నెలకొల్పుట 4. వ్యాస రచన, వాగ్వాద పోటీలు ఉపన్యాస కార్యక్రమములను జరిపించుట 5. క్రీడా రంగంలో తగు ప్రోద్బల మిచ్చుట 6. ఆంధ్రేతరులతో అన్యోన్యతను పెంపొందించుకొనుట. వీటిని నిర్వహించడానికి— (ఎ) వ్యాయామ శాఖ (బి) విద్యా శాఖ (సి) సాంఘిక శాఖ (డి) ఆర్థిక శాఖలను ఏర్పరచి ప్రతి శాఖకూ ఒక కార్యదర్శిని ఎన్నుకొన్నారు. బహుముఖ రంగాలలో కృషిచేస్తూ, ప్రజల మన్ననలు పొందగల్గారు. క్రమశిక్షణలోను, సభలను, సమావేశములను జరిపినప్పుడు అనుసరించ దగిన నిర్ణీత కాలం, సభ్యత, సభా విధానం వగైరా విషయాలలోను ఈ సమితి ఆంధ్రుల కొక ఆదర్శ సంస్థగా వెలసింది.

1952వ సం॥లో ఈ లీగ్ వారు చక్కని ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహిస్తూ, రంగూన్ నగరంలో వున్న సకల ఆంధ్ర సంఘాల విద్యావంతులకు అవకాశమిచ్చారు. అప్పుడు శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య గారు (హరిజన సేవాసంఘపు అధ్యక్షులు) ఉత్తేజకరమైన ఉపన్యాసాలిచ్చారు. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి— 1. జగద్విఖ్యాతి పొందిన భారత తత్త్వ శాస్త్రవేత్త శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ గారి జీవిత చరిత్ర

2. భారత స్వాతంత్ర్య పోరాటం 3. మట్టి నుండి మానవులను చేసే మహా నీయు డెవ్వడు? 4. అఖిల భారత జాతీయ కాంగ్రెసు చరిత్ర. అప్పట్లో సమితి నాయకులైన శ్రీ కోరాడ సూర్యనారాయణ, శ్రీ శీతంశెట్టి కృష్ణారావు గార్లు వీరిని ఎంతో ప్రశంసించారు. ఈ సంస్థ 1956వ సం॥ము నుండి ఒక ప్రాథమిక పాఠశాలను నిర్వహించింది. తదనంతరం 1959వ సం॥ములో రంగూన్ బ్రహ్మసమాజ భవనాన్ని ఉచితంగా సంపాదించి, అందులో తమ పాఠశాలను నెలకొల్పారు. అదే ఏట ఆంధ్ర యువజన భజనకూటమి వారు మరి కొన్ని ఇతర సంఘాల వారు ఏకమై ఆంధ్రులకు "కేంద్ర సంఘం" ఒకటి స్థాపించాలన్న సదుద్దేశంతో, యూత్‌లీగ్ వారు కూడా తమ అంగీకారాన్ని కన బరిచారు. దానికి ఆదర్శంగా, శ్రీ కోరాడ సూర్యనారాయణ, శ్రీ కె. శ్రీనివాసులు నాయుడు గార్లు, తమ ఉభయ సంస్థలను ఒకే సంస్థగా చేయడానికి నిశ్చయించు కొన్నారు. ఆ సందర్భంలో, మహాత్మాగాంధి మెమోరియల్ హాలులో, శ్రీ వేదుల వెంకట్రావు (**W.H.O**) గారి అధ్యక్షతన విలీనీకరణోత్స వాన్ని అతి వైభవంగా జరిపించారు. ఆ మరునాడే యువజన భజన కూటమి విద్యార్థులు, ఉపాధ్యాయులు 3000/- చాల విలువగల సామాగ్రితో బ్రహ్మ సమాజానికి తరలివచ్చారు. కాని, ఉపాధ్యాయుల వేతన నిర్ణయంలో అనవ సరమైన విలంబన, వాదోపవాదాలు అంతులేకుండా సాగినందు వల్ల భజన కూటమి విద్యార్థులు, ఉపాధ్యాయులు మళ్ళీ తమ సంస్థకే మరలి వచ్చారు. యూత్ లీగ్ బడి పిల్లలు సుమారు వందమంది మాత్రము తమ బ్రహ్మ సమాజం భవనంలో వుండిపోయారు.

1960 సం॥లో ఈ పాఠశాల, "మాధ్యమిక పాఠశాల"గా మారింది. అప్పట్లో, రంగూన్‌లో ఆంధ్ర విద్యార్థులకు కనీసం ఒక హైస్కూలైనా ఉండాలనే దృఢ సంకల్పంతో, 1962 సం॥లో దానిని "ఆంధ్ర హైస్కూలు" గా హెచ్చు స్థాయిలో పెట్టగల్గారు. దాదాపు 300 మంది విద్యార్థులకూ 9 మంది ఉపాధ్యాయులకూ అవకాశం కల్గించారు. దానిని బర్మా ప్రభుత్వపు విద్యాశాఖ వారిచే రిజిస్టరు చేయించి, నిర్వహించారు. దురదృష్ట వశాత్తు, 1964 సం॥లో బర్మా విప్లవ ప్రభుత్వం అవలంబించిన విధానం మార్పులు ఫలితంగా, ఈ పాఠశాల కూడా మూసివేయబడింది.

ఆంధ్ర యూత్ లీగ్‌ను స్థాపించిన ఆరంభదశలో, శ్రీ బి. ప్రకాశం, **B.A.,B.L.,** శ్రీ వి. జే. సర్వోత్తమ రావు, **B.A.,B.L.,** గార్లు మరికొందరు ప్రముఖులు కృషి చేశారు. తదనంతరం, కార్యనిర్వాహక వర్గంలో 1. శ్రీ కోరాడ సూర్యనారాయణ 2. శ్రీ శీతం శెట్టి క్రిష్ణారావు 3. శ్రీ టి. కె మూర్తి 4. శ్రీ కె. సుబ్బారావు 5. శ్రీ కె. కైలాస రావు 6. శ్రీ ఏ. వి. రావు 7. శ్రీ కె. రామస్వామి 8. శ్రీ ఎస్. కృష్ణ 9. శ్రీ సి. హెచ్. జేసుదాసు 10. శ్రీ జి. వీరాస్వామి 11. శ్రీ గోపాల కృష్ణ గార్లతోను, యింకా కొన్ని వందల సాధారణ సభ్యులతోను, ఈ సంస్థ, ఆంధ్ర జాతికి అమోఘంగా సేవ చేసింది.

13. ఆంధ్ర బౌద్ధ భక్తసమాజం (రంగూన్)

1954 సం॥లో, 42వ వీధిలోని 29వ నెంబరు ఇంటిలో శ్రీ మల్లారపు అర్జున రావు గారు ఒక సభను శ్రీ జూలూరి హరిజన రావు గారి అధ్యక్షతలో ఏర్పాటు చేశారు. బర్మా ఆంధ్రులకు, ఒక బౌద్ధ మత సంస్థ చాల అవసరమని ఆ సభలో తీర్మానించడ మైనది. దీని ఆశయాలు **a.** బుద్ధ భగవానుని మహోన్నత సిద్ధాంతములను ప్రజలలో వ్యాప్తి చెయ్యడం **b.** కుల, మత, విభేదాలను నిర్మూలింప చేసి, పంచశీల ధర్మ ప్రబోధములను ఆచరణలో పెట్టడం **c.** ఏటేటా, బుద్ధజయంతిని విధిగా జరిపించి, బౌద్ధ భిక్కులను సత్కరించడం **d.** సమాజ సభ్యులు భిక్కు స్వీకారమును ఆచరించడం **e.** పేద, బాల, బాలికలకు, విద్యాదానం చేయుటకై ఒక పాఠశాలను నిర్వహించడం **f.** ఏటేటా, బౌద్ధమత నాయకులగు డాక్టరు బి.ఆర్. అంబేడ్కర్ గారి జయంతిని జరిపించడం **g.** స్థానిక బర్మా బుద్ధ శాసన కౌన్సిలులో ఒక శాఖగా యీ సమాజమును రూపొందించి నిర్వహించడం. ఇలాంటి ఆశయాలతో, యీ సమాజంవారు, అంతకు పూర్వ, శిధిలావస్థలో ఉన్న శ్రీరాములవారి మందిరాన్ని, కొందరు ఆంధ్రసోదరుల సహకారంతో పునర్నిర్మాణం చేసి తదనంతరం బర్మా బుద్ధశాసన కౌన్సిల్‌వారి వద్దనుండి తగు సామగ్రిని, బౌద్ధాలయానికి, సంబంధించిన విగ్రహాలను ఇతర పరికరాలను సంపాదించి, 1958 సం॥లో బర్మా సుప్రీంకోర్టు న్యాయమూర్తులగు ఊచాన్ టూన్ గారి (**M.A., Cambridge-Bar-at-law**) మహాసభను ఏర్పాటు చేసి

ఈ సమాజ భవన ప్రారంభోత్సవం జరుపుకొన్నది. అదే సంవత్సరంలో పేద, బాల, బాలికలకొరకు, దిన-రాత్రి పాఠశాలను ఒక శాఖగా నిర్వహించడం మొదలుపెట్టింది.

1956 సం॥లో బర్మా ప్రభుత్వపు ఆధ్వర్యాన్ని జరిగిన 2500వ, బుద్ధ జయంతి మహా సమ్మేళనంలో, బర్మా ఆంధ్రులు రూపొందించిన సమిష్టి కార్య క్రమంలో, ఈ సమాజంవారు ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ, బుద్ధభగవానుని విగ్ర హాన్ని తిరువీధి మహోత్సవంతో సహా గబాయే శాంతి పగోడాకు తీసుకుపోయి, ప్రతిష్ఠాపన చేశారు. అక్కడ జరిపించే అన్నదానంలో కూడా సహకరించారు. సమాజ కార్యక్రమాలతోబాటు నిమ్న జాత్యుద్ధరణ, అస్పృశ్యతా నిర్మూలనలను కూడా సూచిస్తూ, ఉపన్యాసములను ఏర్పాటు చేసేవారు.

1960 సం॥లో మెర్గ్వీ పట్టణములో, శ్రీ మల్లారపు అర్జునరావు గారు ఈ సమాజ శాఖను నెలకొల్పి, అక్కడున్న, కొందరు బౌద్ధ మతాభిమానులచే దానిని నిర్వహించడానికి ప్రోత్సాహమిచ్చారు. మరియు 1964 సం॥లో విక్టోరియా పాయింట్ (బర్మాభాషలో కొతౌంగ్) ప్రాంతంలో ఇంకొక నూతన శాఖను కూడా నెలకొల్పారు.

'సేన్ యౌంగ్ చి', బౌద్ధ మతాధిపతి యగు సయండో ఊ కోవిడాగారి యాజమాన్యంలో, రంగూన్ జూబిలీ హాలు సమీపంలోని మఠములో ఈ సమా జపు రంగూన్ సభ్యులు 30 మంది, మెర్గ్వీ శాఖనుండి 13 గురు, బౌద్ధ భిక్షు స్వీకారమును 1963 సం॥న మొదటిసారిగా పొంది, బర్మా ఆంధ్రులకు బౌద్ధ మత ప్రచారానికి ఆదర్శంగా నిలిచారు. ఇదే విధంగా, 1964 సం॥న రంగూన్ చౌటగా, న్యాంగ్లేచిన్ పట్టణములనుండి 38 మంది ఆంధ్రులు, రెండవసారిగా బౌద్ధ భిక్షు స్వీకారం పొందారు. అదే సంవత్సరం, జూన్ నెలలో, ఈ సమాజం తన దశమ వార్షికోత్సవాన్ని, మహాత్మా గాంధి మెమోరియల్ హాలులో అతి వైభవంగా జరుపుకొన్నది. మ్యోమా జాతీయ హైస్కూలు డైరెక్టరు, బర్మా-శ్రీలంక మాజీ రాయబారి అయిన మహా త్రే సీదు ఊ బాల్విన్ గారి అధ్యక్షతలో యావదాంధ్రులతోను, ఆంధ్రేతరులతోను, ఈ ఉత్సవాలు జరి గాయి. శ్రీరామకృష్ణ మిషన్ కార్యదర్శియైన శ్రీ స్వామి సత్యానంద, చిట్టగాంగ్ బౌద్ధ సమాజపు కార్యదర్శియైన శ్రీ ఎన్. ఆర్. బారువా గార్లు, బౌద్ధ భిక్షులు

కూడా పాల్గొన్నారు. వివిధ భాషల్లో ఉపన్యాసములు, కీర్తనలు, తెలుగు నాటికలు ప్రదర్శింప బడ్డాయి.

'అజంతా నాటక సమాజం, దీనికి ఒక శాఖగా ఉండేది. వీరు అప్పుడప్పుడు నాటకాలు. నాటికలు, భూపాళ ప్రదక్షిణములు జరిపించి, సమాజ నిధిని సేకరిస్తూ ఉండేవారు. ఆ నాటక శాఖకు శ్రీ డి. వి. కుమార్‌గారు వర్మకునిగా కృషి చేశారు. సమాజంలో బౌద్ధమత ప్రబోధకులుగా, ఆదినుండి 1964 సం॥ వరకు, శ్రీ డి. సత్యనారాయణ, ఆయన శిష్యుడు, ఎమ్. ధర్మరాజుగార్లు ఉండేవారు. 1. మల్లారపు అర్జునరావు 2. మేడా జగన్నాథం 3. కె. కృష్ణమూర్తి 4. గౌతం ప్రకాశ్ 5. బి. కాళిదాసు 6. ఇ.టి. రావు 7. డి.వి.కుమార్ 8. బి.ఏ. రావు 9. జి. నారాయణరావు 10. డి. సుబ్రమణి 11. ఎస్.సింహాచలం 12.జి. సోములు 13.కే.వెంకటరెడ్డి 14. జి. అప్పారావు 15.బత్తుల సుందర్రావు 16. జి.రామమూర్తి 17. జే. అప్పలస్వామి 18. నీలం శంకరయ్య 19. మొగల మాణిక్యం గార్లు వివిధ పాలక వర్గాలకు సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. సమాజ అధ్యక్షులుగా యెన్నికైన వారిలో 1. శ్రీ మల్లారపు అర్జునరావు 2. శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య 3. శ్రీ కొంబత్తుల వాడపల్లిగార్లు ముఖ్యులు.

1964వ సం॥ డిశంబరు నెలలో శ్రీ అర్జునరావుగారు స్వదేశానికి మరలిపోయే సమయంలో, ఒక సభను ఏర్పాటు చేసి అందులో శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్య గారిని శాశ్వత అధ్యక్షులు గాను, శ్రీ ఇ. టి. రావు గారిని శాశ్వత ప్రధాన కార్యదర్శిగాను ఉండమని కోరారు. వీరితోబాటు 1. శ్రీ కే. అచ్యుతరావు కవి (ఉపాధ్యక్షులు) 2. శ్రీ నీలం శంకరయ్య 3. బోర అప్పలస్వామి 4. గౌతం ప్రకాశ్‌గార్లు కార్యవర్గంలో ఉన్నారు. సమాజ సభ్యులు మాతృదేశానికి తరలి పోయినందువల్ల, ప్రస్తుతం యీ సమాజం ఆధ్యాత్మిక రంగంలో మాత్రము కృషి చేస్తున్నది. ఈ మధ్యనే దిన పాఠశాలను, సమాజ కార్యదర్శి యగు శ్రీ ఇ. టి. రావు గారు పూనుకొని నిర్వహిస్తున్నారు.

14. రంగూనాంధ్ర వనితా మండలి

1924 సంవత్సరమున బర్మా దేశంలో, భారత స్త్రీలు, కార్మికుల జనాభా లెక్కల ప్రకారం 40 వేల మంది ఉన్నారని కీ॥శే॥ బ్రహ్మశ్రీ అవటవల్లి నారా

యణ రావు గారు (M.A.,M.L.C.) తమ "Indian Labour in Burma" (బర్మాలో కార్మిక వృత్తి) అన్న ఆంగ్లేయ గ్రంథంలో సూచించి ఉన్నారు. భారత స్త్రీలలో నూటికి 90 మంది ఆంధ్ర స్త్రీలుండేవారని తెలుస్తున్న ది. అప్పట్లో, రంగూన్ నగరంలో వారికొక మహిళా సంఘం ఉండేది. 1933 సం॥లో Royal Commission (రాయల్ కమీషన్) వారిచ్చిన రిపోర్టులో మాత్రము, మహిళా సంఘం వారు తమ అభిప్రాయాన్ని వెల్లడి చేశారు, "బర్మా పత్రిక" అను తెలుగు వార్తా పత్రిక 1934 సం॥ దీపావళి సంచికలో ప్రకటించబడినది. అదే వార్తా పత్రికలో, శ్రీమతి ఆర్. మీరమ్మగారు కొన్ని సంవత్సరాల వరకు, వ్యాసాలను తరచుగా వ్రాస్తూ మహిళలకు కొన్ని అమూల్యములైన సలహాలను ఇచ్చినట్లు వెల్లడి చేయబడినది. "రంగూన్ ఆంధ్ర స్త్రీలు" అన్న శీర్షికలో వ్రాసిన వ్యాసంలో అప్పటికి ఆంధ్ర స్త్రీలు 35,819 మంది ఉన్నారని పురుషులు 123,940 ఉన్నారనీ వివరిస్తూ, స్త్రీల సాంఘిక పురోగమనానికి పురుషులే అంతరాయములు కల్గించు వారు ఎక్కువగా ఉన్నారని కూడా సూచింప బడింది. వీరితో ఆంధ్ర విదుషీమణి, శ్రీమతి తుంగ లక్ష్మి దేవి గారు కూడా బర్మా ఆంధ్ర స్త్రీలు తమ ధర్మాన్ని నిర్వహించు విధానాలను గురించి సాంఘిక దురాచారాలనుండి తమ కుటుంబాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతలను గుర్చించి వ్యాసాలు వ్రాశారు.

రంగూన్ అప్పర్ పజుండౌంగ్ ప్రాంతంలో, బియ్యపుమిల్లు ఆవరణలో నివసించిన శ్రీ మరిడి లక్ష్మణరావు గారి సతీమణి శ్రీమతి పైడమ్మ మరియు శ్రీమతి చాపల పార్వతీ గార్ల యాజమాన్యంలో ఆ ప్రాంతమందలి ఆంధ్ర స్త్రీలు, 'ఆంధ్ర మహిళా సంఘం' అన్న దాన్ని ఏర్పరచుకొన్నారు. ఆక్కడకు సమీపంలో జరిగే దైవ కార్యాలలో, యీ సంఘపు స్త్రీలు పాల్గొని, ఆధ్యాత్మిక గీతాలను, కోలాటం ఆటలు మొదలైన వినోద కార్యక్రమాలను సమర్పించే వారు. కాని, అక్కడున్న పురుషులు, వారికి తగు ప్రోత్సాహము, ఆర్థికసహాయం యివ్వకపోవడంవల్ల మహిళా సంఘం రాణించలేకపోయిందని నిస్సంశయంగా చెప్పవచ్చు.

బర్మాదేశంలో కొన్ని ప్రాంతాలలో, ఆంధ్ర స్త్రీలకు ఎక్కువ స్వతంత్రత వుండేది. తత్ఫలితంగా ఆయా ప్రాంతాలలో, వారికి తగ్గ గౌరవము,

పలుకుబడికూడా ఏర్పడ్డాయి. అటువంటివారు ధనవంతులైనాఅయి ఉండాలి, లేదా విద్యావంతులైనా అయి ఉండాలి. ఇలాంటి స్త్రీలలో కొందరు బియ్యపు మరలలో కార్మికుల ఏర్పాటుకు, కంట్రాక్టర్ల గాను, ధాన్యపు మోతలకు, ధాన్యపు కోతలకు మేస్త్రీలు గాను ఉంటూ కమీషనులు సంపాదించేవారు. చేపల వర్తకములో కూడా గుత్తందారులుగా కొందరు, ఎండుచేపల వర్తకంలో కామందులుగా కొంచరు, సారాయి వర్తకం, పూటకూళ్ళ వ్యాపారం, పిండివంటల దుకాణాలు, కాయ గూరలు, పండ్ల వర్తకాలలో మటకొందరు స్థిరపడ్డారు. తెలుగు స్త్రీల ముఖ్య వర్తకాలలో 1. గరంమసాలా పొడుము 2. పసుపు పొడుము 3. ఎండుమిరప కాయల పొడుము (వర్ణి) చెప్పుకోదగ్గవి. చివరిది చాలా ప్రాచుర్యాన్ని పొందింది. బర్మీయులు, ఈ మిశ్రమమునకు, 'కోరంగి మసాలా' అంటూ ఎంతో ఆప్యాయంగా కొనడం పరిపాటై పోయింది. ఇలాంటి వ్యాపారాలు చేసిన మహిళలు, శ్రీమంతులై, వడ్డీ వ్యాపారస్తులుగా కూడా మారిపోయారు. 1. రంగూన్ 2. బస్సీన్ 3. మోల్మేన్ 4. మెర్గ్వీ 5. హెంజడా 6. పేగూ 7. ప్రోం పట్టణాలలోనే గాక, ఏ చిన్న గ్రామంలోనైనా మన, "తెలుగమ్మ"కు మసాలా వ్యాపారం లేదని చెప్పలేము.

పురుషులు తగు ప్రోత్సాహం, సహకారం చూపకపోవడం, ఇంకొక వంక, స్త్రీలకు తగు స్వతంత్రత లేకపోవడంవల్ల, "ఆంధ్ర మహిళా సంఘం" అంటూ ఒక కార్యాలయం తెరువబడినప్పటికీ, ఆ బోర్డు బల్లతోనే ఆగిపోయింది. కాని, పురుషులకు, అన్ని రంగాలలోను, మన ఆంధ్ర మహిళలు తోడ్పడేవారు. పురుషులకే గనుక, ఇలాంటి విశాలహృదయం, నిస్వార్థత ఉండి ఉన్నట్లయితే, "వనితామండలి" ఎప్పుడో ఏర్పడి ఉండేది. ఇదిట్లుండగా, మన మహిళలు ఇంకో రకంగా ప్రచారం సాగించారు. శ్రీరామనవమికి సీతమ్మ తరఫున, ఆంధ్ర స్త్రీలంతా యేకమై పాల్గొనడం, వరలక్ష్మి నోము, గౌరీనోము, వైకుంఠ ఏకాదశి, మహాశివరాత్రుల వంటి శుభదినాల్లో, ఆంధ్ర స్త్రీలు ఐక్యతతో దేవాలయాలలో గుంపులు గుంపులుగా కూడినప్పుడు, అక్కడ కలిగిన సమాలోచనలతో, మరల ఆధునాతన పద్ధతులతో, రంగూన్ నగరమందు ఒక మహిళా మండలి రూపొందాలని ముచ్చట్లు, తెరచాటు చర్చలు జరిగాయి. తత్ఫలితంగా, 1960 సం॥ ఏప్రిల్ నెలలో కొందరు రంగూనాంధ్ర స్త్రీల ప్రోత్సాహంతో, తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని, రంగూన్ డల్‌హౌజీ వీధిలో ఉన్న

శ్రీ జి.వి. కృష్ణమూర్తి గారి గృహంలో, వారి సతీమణియైన శ్రీమతి జి. పద్మావతి గారి (**B.A**) అధ్యక్షతలో ఆంధ్ర మహిళల సభ జరిగింది. ఆ సభలో పాల్గొన్న స్త్రీలందరు ఏకాభిప్రాయానికి వచ్చి, "రంగూనాంధ్ర వనితామండలి" అన్న సంస్థను నెలకొల్పారు. దానికి 1. శ్రీమతి జి. పద్మావతి **(B. A.)** అధ్యక్షులు గాను, 2. శ్రీమతి పి. మీరమ్మ ఉపాధ్యక్షులు గాను 3. కుమారి బి. కుసుమకుమారి (శ్రీ బి. ప్రకాశం **B.A., B.L.,** గారి పుత్రిక) ప్రధాన కార్యదర్శి గాను ఎన్నుకోబడ్డారు. కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా 1. శ్రీమతి కోరాడ అమ్మన్న 2. శ్రీమతి గోషాల రాజేశ్వరి 3. శ్రీమతి సి.హెచ్. పాపమ్మ 4. శ్రీమతి సి.ఎమ్.కె. శకుంతలారావు 5. శ్రీమతి చంద్రకంటి మీనాక్షమ్మ 6. శ్రీమతి ఎన్ నూకమ్మ గార్లు ఎన్నుకోబడ్డారు. సుమారు 100 మంది సభ్యురాండ్రతో యీ సంస్థ ప్రారంభింపబడింది.

ఈ సంస్థ ముఖ్యాశయాలు: 1. సదాచార పుస్తక పఠన సహకారం 2. కుట్టుపని, అల్లిక పనులు నేర్పుట 3. శ్రద్ధగలవారికి వీణా వాయిద్యం నేర్పుట 4. వయో విద్యా సహకారం 5. సాంఘిక, సాహిత్యాది విషయాలలో శ్రద్ధ తీసికొనుట 6. పంట నేర్పుట. ఏటేటా, వినాయక చవితి, దేవీ నవరాత్రులు, ఉగాది మొదలగు పర్వదినములను ఆచరించడం, చదువుకోలేని ఒకరిద్దరు విద్యార్థులకు ఆర్థిక సహాయం చెయ్యడం, విధిగా జరుగుతుండేది. ఈ వనితా మండలికి శ్రీ గోపాలరావుగారు సలహాదారుగాను, శ్రీ ఎన్. కనకంగారు ఆర్థిక సహాయకులుగాను కృషిచేశారు.

1962 సంలో ఈ సంస్థకు, ఇండియన్ ఎంబసీ వార్తా ప్రచార శాఖోద్యోగులైన శ్రీ పి. జగన్నాధరావు **(B.A.,Hons)** గారి సతీమణి శ్రీమతి సుశీలాదేవిగారు అధ్యక్షులుగాను, శ్రీమతి కోరాడ అమ్మన్నగారు ఉపాధ్యక్షులుగాను, శ్రీమతి సి.ఎమ్.కే. శకుంతలరావు ప్రధాన కార్యదర్శిగాను శ్రీమతి గోపాల రాజేశ్వరి కోశాధిపతిగాను ఎన్నికయ్యారు. శ్రీమతి బి. కాంతమ్మ (శ్రీ బి. ప్రకాశంగారి **B.A.,B.L** సతీమణి), శ్రీమతి ఎన్. నూకమ్మ, శ్రీమతి డి. వీరమ్మ, శ్రీమతి చంద్రకంటి మీనాక్షమ్మ, శ్రీమతి జి. నాగరత్నంగార్లు కార్యనిర్వాహక వర్గంలో వున్నారు. అప్పుడు, శ్రీమతి పద్మావతీదేవి, శ్రీ గోపాలకృష్ణారావుగార్లు సలహాదార్లుగా ఉన్నారు. వీరితోపాటు మరి కొందరు

మాజీ సభ్యురాండ్రుకూడా అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొని, వనితా మండలికి సర్వవిధాలా తోడ్పడ్డారు. రంగూన్ నగరంలో దాదాపు 4000 మందికి పైగా అంధ్ర స్త్రీలు ఉండినప్పటికీ, ఈ సంస్థలో 200 మంది స్త్రీలు మాత్రం సభ్యులుగా చేరడం చాల శోచనీయం. 1964 సం॥లో జాతీయ చట్టం అవతరించడంతో యీ సంస్థ మూసివేయబడింది. అప్పట్లో ఉన్న 1800/- చ్వాలు మూల ధనాన్ని, ఆంధ్ర హైస్కూల్‌వారికి విరాళంగా ఇవ్వడం జరిగింది.

15. శ్రీ వసంతరాయ యువజన సమితి (రంగూన్)

1941 సం॥ ద్వితీయ ప్రపంచ యుద్ధం బర్మా దేశానికి రాబోయే రోజుల్లో, 45వ వీధిలోని కొందరు–శ్రీ వీరబ్రహ్మంగారి కాలజ్ఞాన సిద్ధాంతాలను నేర్పించేవారు ఏకమై, ఈ సంస్థను స్థాపించారు. వీరు పసుపురంగు దుస్తులను ధరిస్తూ, వీధి వీధికి తిరుగుతూ ప్రచారం చేసేవారు. బాంబుల భయం తగ్గగానే, వీరిలో తగ్గ ఐక్యత కూడా లేకుండా పోయింది. తదనంతరం, 1. శ్రీ ఎ.టి. నాయుడు 2. శ్రీ డి. సుబ్బారావు 3. శ్రీ ఎన్. పైడిరాజుగార్లు, కాలజ్ఞాన తత్త్వాల పుస్తకాన్ని చదివి, మళ్ళీ ప్రచారానికి ప్రారంభమయ్యారు. చందాలను, విరాళాలను, ప్రోగుచేసి, గృహనిర్మాణం గావించారు. శ్రీ వసంతరాయుని భక్తికి ప్రాధాన్యమిచ్చారు. ముందున్న, "శ్రీ వీరభోగ వసంతరాయ స్త్రీ, పురుష భజన కూటమి" అన్న పేరుకు బదులుగా "శ్రీ వీరభోగ వసంతరాయ ప్రచారిణీ యువజన సంఘం" అన్న నూతన నామధేయంతో ఈ సంస్థను కాందోం హేక్నే క్యారేజ్ (Hackney Carriage) డెపోలో 1943 సం॥న మళ్ళీ స్థాపించారు. కొంతకాలం తర్వాత, దాని పేరును, "శ్రీ వీరభోగ వసంతరాయ భజన కూటమి"గా మార్చారు. రథోత్సవం, భూపాళ ప్రదక్షిణములు, నవరాత్రులు, ఉట్ల పండుగ ఉత్సవం, అన్న సంతర్పణలు, వగైరా కొన్ని సాంఘిక కార్యాలను జరిపించేవారు. 1947 సం॥లో శ్రీ డి. అప్పారావు గారి అధ్యక్షతను జరిగిన సభలో, దాని పేరును మరల, "వసంతరాయ యువజన సమితి"గా మార్చడం జరిగింది. ఈ సంఘంవారు ఒక పాఠశాలను, కొన్ని ఉత్సవాలను నిర్వహిస్తుండేవారు. ఒక గుడిని కట్టాలనే ఆశయం విఫలమైపోయింది. ఇందులో 1. శ్రీ శేషం వసంతరావు 2.శ్రీ ఎన్. వెంకటరావు 3. శ్రీ డి. సుబ్బారావు 4. శ్రీ బత్తిని అప్పలస్వామి 5. శ్రీ రావాడ సుబ్రహ్మణి

6. శ్రీ కె. అచ్యుతరావు 7. శ్రీ ఎ.టి. నాయుడు 8. శ్రీ జి. సీతారాం 9. శ్రీ బి. అంథోనీ 10. శ్రీ కోరాడ సత్యవాన్‌గార్లు అమోఘంగా కృషి చేశారని తెలుస్తున్నది.

16. బర్మా ఆంధ్ర సేవాసమితి (రంగూన్)

1949 సంll లో మన ఆంధ్రదేశంలో బీభత్సమైన తుఫాను బయలుదేరి, అపారమైన నష్టం ఏర్పడిన సందర్భంలో, రంగూన్‌లో ఉన్న కొన్నిసంఘాల వారు, సదరు తుఫాను నిధికై కృషిచేశారు. అప్పుడు 40 వ వీధిలో ఉన్న కొందరు యువకులు కూడా ఒక బృందాన్ని నెలకొల్పి, సుమారు 750/- రూపాయలను వసూలుచేసి, ఇండియన్ ఎంబసీ ద్వారా ఆంధ్ర ప్రభుత్వానికి అందచేశారు. తదనంతరం, వీరు ఒకసభను ఏర్పరచి, "బర్మా ఆంధ్ర సేవా సమితి" అన్న పేరుతో ఈ సంస్థను పై వీధిలోనే స్థాపించారు. దిన-రాత్రి పాఠశాలలు తెరచి, విద్యాదానం గావించారు. 1953 సంllలో ఫా. సా. పా. లా. బస్తీలో చెలరేగిన ఘోరమైన అగ్నిప్రమాదంలో, కొన్ని వేలమంది భారతీయులు, బర్మీయులు నిరాధారులై పోయారు. ఆ సందర్భంలో కొన్ని ఆంధ్ర సంఘాలు, భారతీయ ధనికులు, ఇతర సంఘాలు, ఈ అగ్నిబాధితులకు కొన్ని దినాలవరకు, అన్నదానాలు, వస్త్రదానాలు చేశారు. కొందరు పాత్రలు, గిన్నెలు, గ్లాసులు కూడా దానం గావించారు. అప్పట్లో, ఈ సమితివారు కూడా 3 దినాల వరకు, అన్నదానాలను, వస్త్రదానాలను చేశారు. సాంఘికసేవ, సాహిత్యసేవ మొదలైనవి వారి ఆశయాలు. 1. శ్రీ పాలెపు గోవిందరాజులు వర్మ (అధ్యక్షులు) 2. శ్రీ బ్రోణం సుబ్రహ్మణ్యం (ఉపాధ్యక్షులు) 3. శ్రీ ఎన్. జగన్నాధం (ప్రధాన కార్యదర్శి) (4) శ్రీ సి హెచ్. అబ్బాయిగార్లు (కోశాధికారి) మరియు శ్రీ కాకర అప్పారావు, రత్నం, ఎస్. కే. జగన్నాధం గార్లు ఈ సమితి కార్యవర్గంలో ముఖ్యులు.

17. తెలుగు ముందంజ కూటం (రంగూన్)

1959 సంవత్సరమున శ్రీ కొండాబత్తుల అప్పారావు (చిత్రకారుడు), శ్రీ నల్లి భాస్కరరావుగార్ల ప్రోత్సాహంతో, ఈ సంస్థ స్థాపించబడింది. తదనంతరం 1. శ్రీ గౌతం ప్రకాశ్ 2. శ్రీ లోచర్ల గంగరాజు 3. శ్రీ

వై. సత్యన్నారాయణ 4. శ్రీ దున్న కృష్ణారావు 5. శ్రీ సూరా లక్ష్మణరావు 6. శ్రీ జే. గోపాల్ 7 శ్రీ ఆషా కృష్ణారావు 8. శ్రీ బూసి రామ గోపాల్‌గార్లు ఈ సంస్థలో ముఖ్యముగా గుర్తింపు పొందారు. ఈ సంస్థ తేట తెలుగుభాషను ప్రజలలో ప్రచారం చెయ్యాలని కొంత కృషిచేసింది. ఏటేటా-ఆంధ్రరాష్ట్ర అవతరణోత్సవం, ఉగాది, బర్మా స్వతంత్ర దినోత్సవం మొదలైన కార్యాలను చేస్తుండేది. వీటితోబాటు వ్యాసరచన, నాట్యకళ, ముగ్గులు, పిల్లల చిత్రకళ, సంగీతం, వక్తృత్వ పోటీలను నిర్వహించి, తెలుగు జాతీయతను ప్రచారం చేసింది. ఈ సంస్థ "పుత్తడి సీమ" అన్న పేరుతో ఒక తెలుగు వారపత్రికను నిర్వహించాలని కొంత కృషిచేసింది. అదట్లుండగా 1963 సం॥న "తెలుగు ముత్యాలు" అన్న గేయ సంపుటిని మాత్రము ప్రకటించింది.

14 వ బర్మా స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని (1962 సం॥) రంగూన్ నగరంలో దాదాపు 30 వరకు రాజబాటలలో చిత్ర విచిత్రాలు చలువ పందిళ్లు, మకర తోరణ ద్వారాలు కట్టించారు. వాటిలో ఈ సంస్థ రంగూనాంధ్రుల సహకారంతో, "ఆంధ్రత్వము"ను ప్రకటించు ఒక ఆకర్షణీయమైన తోరణ ద్వారాన్ని కట్టి, బర్మా రాష్ట్రపతి గారి ప్రశంసలను సంపాదించింది. దీనికి నిదర్శనంగా 1000/- చ్యాల విలువగల ఒక రజత పాత్రను పారితోషికంగా పొంది తద్వారా బర్మా ఆంధ్రుల సంస్కృతిని, కళా విశిష్టతను వెల్లడి చేసింది. ఈ విషయంలో చిత్రకారుడైన శ్రీ కొండాబత్తుల అప్పారావు గారి చిత్రకళా నైపుణ్యం హర్షింపదగినది.

18. బర్మా ఆంధ్ర యువక బృందం (రంగూన్)

1958 సం॥లో కాందోం 94 వ వీధిలోని, 1. శ్రీ పాలెపు నారాయణ మూర్తి 2. శ్రీ కర్రి జగ్గారావు 3. శ్రీ కోరిబిల్లి అప్పారావు 4. శ్రీ బుద్దా ఆదినారాయణ 5. శ్రీ కోరిబిల్లి జగ్గారావు 6. శ్రీ గండిబోయిన అప్పారావు గార్ల ప్రోత్సాహంతో, ఆ వీధిలో వున్న కొందరు పెద్దలు, యువకులు ఏకమై ఈ సంస్థను నెలకొల్పారు. ప్రప్రథమంలో వీరు ఒక పాకలో రాత్రి ధర్మ పాఠశాలను ప్రారంభించారు. తదనంతరం శ్రీ కె. అచ్యుతరావు గారు భూపాల ప్రదక్షిణములు, సినిమా ప్రదర్శనముల ద్వారా నిధి సేకరణ చేసినట్లయితే

ఆ పాఠశాలను మంచి స్థితికి తేగలమని సలహా ఇవ్వగా, తత్ఫలితంగా కొంత నిధి సేకరణ జరిగింది. అప్పుడు ఉదార స్వభావులైన శ్రీ పల్లి అప్పన్న మేస్త్రి గారు 500/- చ్యాలు విరాళంగా ఇచ్చిన సొమ్ముతో ఆ వీధిలోని 40వ నెంబరు గృహంలో ఈ సంస్థ ఏర్పడింది. తదనంతరం కొందరు పెద్దల, పుర ప్రముఖుల, సలహా సంపత్తుల వలన దినదినాభివృద్ధి నందుకొని 100 మంది తెలుగుబిడ్డలకు విద్యాదాన మిష్వగల్గినది. కాని ఉపాధ్యాయుల కొఱత యేర్పడి నందువల్ల, సంఘ సభ్యులలో కొందరు ఉచితంగా విద్యాబోధన చేసేవారు. ఈ విధంగా 1964 సం॥ వరకు, రాత్రి ధర్మ పాఠశాలను నిర్వహించారు.

ఈ సంస్థవారు, నాటక కళలోను, వ్యాయామ క్రీడలలోను, వ్యాసరచన పోటీలలోను, రంగూనాంధ్ర సమిష్టి కార్యక్రమాలలోను పాల్గొని కొంత ప్రాముఖ్యం పొందగల్గారు. ఏటేట జరిగే కాందోం మారమ్మ అగ్నిగుండం మహోత్సవంలో చలివేంద్రాలలోనూ, శ్రీ భూలోకమ్మ, శ్రీ గౌరీశంకర రథోత్సవాలలో పాల్గొని, సేవాదళం వారిగా సహకరించేవారు. ఏటేటా—1. శ్రీ పల్లి అప్పన్నమేస్త్రి 2. శ్రీ నెయ్యిల కొండయ్య 3. శ్రీ కర్రి జగ్గారావు 4. శ్రీ డొప్పా అప్పారావు 5. శ్రీ బుద్ధా ఆదినారాయణ 6. శ్రీ కోరిబిల్లి అప్పారావు 7. శ్రీ గండిబోయిన అప్పారావు 8. శ్రీ పాలెపు నారాయణమూర్తి 9. శ్రీ అనుసూరి నారాయణ 10. శ్రీ బొడ్డేటి నూకునాయుడు 11. శ్రీ గౌడిరాజు 12. శ్రీ చిన్ని నూకరాజు 13. శ్రీ కాళ్ళ జగ్గారావు 14. గుండు సూర్యనారాయణ 15. శ్రీ తాల సూర్యనారాయణ 16. శ్రీ బుద్ధా సన్యాసిరావు 17. శ్రీకోరిబిల్లి రామునాయుడు 18. శ్రీ ఎ. ఎస్. నారాయణ గార్లు ఈ సంస్థ కార్యవర్గంలో కృషి చేశారు. ఈ బృందానికి రాజపోషకులుగా శ్రీ పల్లి అప్పన్న మేస్త్రిగారు, సలహాదారుగా శ్రీ కె. అచ్యుతరావుగారు గొప్పగా ప్రోత్సహించారు. 1965 సం॥లో జరిగిన కొన్ని క్లిష్ట పరిస్థితులను బట్టి, ఈ సంస్థ పతనమై పోయింది.

19. ఆంధ్ర సాహితీ బృందం (రంగూన్)

రంగూన్ బ్రూకింగ్ వీధిలో ఉన్న 30 వ నెంబరు ఇంటిలో 1. శ్రీ పెదకంశెట్టి రామారావు 2. శ్రీ జలగడుగుల గణేశ్వరరావు 3. శ్రీ బొడ్డేటి మహాలక్ష్మి నాయుడుగార్ల ప్రోత్సాహంతో, ఈ బృందాన్ని నెలకొల్పారు.

బృందానికి 1. శ్రీ పెదకంశెట్టి రామారావు అధ్యక్షుడుగాను 2. శ్రీ బి. మహాలక్ష్మి నాయుడు ఉపాధ్యక్షుడుగాను 3. శ్రీ ఎస్.ఎల్. నారాయణ ప్రధాన కార్యదర్శిగాను 4. శ్రీ మామిడిశెట్టి సంజీవరావు, సహాయ కార్యదర్శిగాను 5. శ్రీ పాండ్రంకి సుబ్రమణి కోశాధిపతిగాను 6. శ్రీ బి. త్రినాధరావు 7. శ్రీ జె. గణేశ్వరరావు 8. శ్రీ సి. పరదేశి 9. శ్రీ పి. భాస్కరరావు 10. శ్రీ రమేశ్‌కుమార్ మొదలగువారు కార్యనిర్వాహక సభ్యులుగాను ఎన్నుకో బడ్డారు. శ్రీ కే. అచ్యుతరావు గారు సాహిత్య కార్యదర్శిగా ఉండేవారు. ఈ సంస్థ, బర్మా ఆంధ్రులలో సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక, లలితకళాదుల పురోభివృద్ధికై కృషి సల్పి, బర్మా దేశీయులతోపాటు మత, సాంస్కృతిక విషయము లందు మాత్రము పాల్గొనుటకు నిర్ణయించింది.

1966-67 సంగలలో మన తెలుగు ఉగాది పండుగను పురస్కరించు కొని రంగూన్ మహాత్మాగాంధీ మెమోరియల్ హాలులో, మహత్తరమైన కార్య క్రమాలు జరిపించింది. ఇందుకు – 1. శ్రీ దుర్గా సంగీత్ కళామందిర్ 2. శ్రీ అభ్యుదయ నాట్యకళామండలి. 3. శ్రీ బాలమిత్ర కళాబృందం 4. ఆంధ్ర అమెచ్యూర్స్ సంగీత బృందం 5. ఇండియన్ జూబిలీ సంగీత బృందం 6. భారతమాత సంగీత బృందం వారలు తమతమ నాటక, సంగీత గాన కచ్చేరీలను దిగ్విజయముగా జరిపించారు. దీనితోబాటు – 1. శ్రీ చొల్లంగి కృష్ణారావు గారి నృత్యబృందం 2. శ్రీ సత్యన్, స్వామి నృత్యబృందం 3. శేఖర్ అండ్ పార్టీ నృత్య బృందం 4. కుమారి శ్యామసుందరి కూడా నృత్య ప్రదర్శనల నిచ్చారు. ఆ మహాసభలో 1. శ్రీ పి.వి. నారాయణ 2. శ్రీ కే.కే. మూర్తి పంతులు 3. శ్రీ కే. అచ్యుతరావు 4. శ్రీ కర్ణిక కృష్ణారావు 5. శ్రీ జె. గౌతమ్ ప్రకాశ్ 6. శ్రీ కోరాడ సత్యవ్యాన్‌గార్లు ఉపన్యాసాలిచ్చారు. ఈ బృందంలో ఉండిన చాలమంది ముఖ్యమైన సభ్యులు, స్వదేశం మరలి పోవడంతో, దీని కార్యక్రమాలు కుంటుపడి పోయినవి.

రంగూన్ నగరంలో ఉండిన మరికొన్ని సంస్థలను ఈ దిగువను సూచిస్తున్నాను.

1. అఖిలాంధ్ర యువజన సేవాసంఘం 2. ఆంధ్ర హరిజన సేవా సంఘం 3. శ్రీ పాండురంగ భజన సమాజము 4. శ్రీ గణేశ్వర భజనకూటం

5. ఆంధ్ర సేవాసంఘం (తాకేటా) 6. ఆంధ్రజన అభివృద్ధి సంఘం 7. ఆంధ్ర జనైక్యత సేవాసంఘం 8. ఆంధ్ర సంక్షేమ సంఘం 8. విశాఖపట్టణ మండలాంధ్ర యువజన సంఘం 9. శ్రీ గౌరీశంకర యువజన సంఘం.

వీటిలో చాలా సంస్థలు ధర్మ పాఠశాలలను నెలకొల్పి, ఆంధ్ర జాతిని నిరక్షరాస్యత నుండి కాపాడుతూ, నాగరికతా ప్రపంచం లోనికి పురోగమించే సదుద్యమంలో కృషిచేశాయి.

ఇక జిల్లాల వారీగా పరిశీలించినట్లయితే, యీ విధముగా సంస్థల జాబితాను అంచనా వేయవచ్చు.

1. బస్సీన్ జిల్లా :

1. ఆంధ్ర సేవాసంఘం 2. హరిజన సేవాసంఘం 3. ఆంధ్ర ఐక మత్య సంఘం 4. ఆంధ్ర యువజన సభ 5. అఖిల బర్మా తెలుగు మహాజన సంఘం 6. బాలానంద భక్త భజనకూతం 7. భారత యువజన సేవాసంఘం

ఈ సంస్థలు విద్యాభివృద్ధికి సాంఘికాభివృద్ధికి చాలా తోడ్పడ్డాయి. నాటక, గాన కళలను కూడా పోషిస్తూ, ఈ బర్మాదేశంలో ఆంధ్రుల యశస్సును ప్రకటించాయి. ప్రస్తుతం, "బర్మా ఆంధ్ర సంఘం" (బస్సీన్) నకు శ్రీ రాసకొండ సుబ్రమణిగారు అధ్యక్షులుగా ఉంటున్నారు. ఇది బస్సీన్ బండి వీధిలో శ్రీ కోదండ రామాలయ మంటపంలో ఉంది.

II. మోల్మేన్ జిల్లా :

బర్మా ఆంధ్ర సంఘం (మోల్మేన్) చాలాకాలంనుండి పనిచేస్తూ, ప్రసిద్ధి పొందిన సంస్థ. వీరు నిర్వహించిన పాఠశాలల్లో కొన్నివేలమంది తెలుగు పిల్లలు విద్యాభ్యాసం చేశారు. ఈ సంస్థకు దాదాపు 2500 పుస్తకాలున్న గ్రంథాలయ మున్నది. రెండంతస్తుల స్వంతభవనంలో పాఠశాల నిర్వహింపబడింది. దీనిలో 1. అభ్యుదయ రచయితల శాఖ 2. వ్యాయామ క్రీడల శాఖ 3. నాటక శాఖ 4. దేవాలయ శాఖ మొదలగు శాఖలతో, ఇదొక కేంద్ర సంస్థయై మోల్మేన్ ఆంధ్రుల కీర్తిని దాదాపు 50 సంవత్సరాలనుండి చాటుతూ వచ్చింది. బర్మాలో

ఆంధ్ర శ్మశాన వాటిక అను శాఖను నిర్వహిస్తున్న సంఘము ఇదొక్కటే అనక తప్పదు. 1964 సం॥లో బర్మా విప్లవప్రభుత్వం, పాఠశాలలను జాతీయం చేసినపుడు ఈ ఆంధ్ర సంఘం భవనం కూడా జాతీయం చెయ్యబడింది. తదనంతరం, ఈ సంఘం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో యథా విధిగా వివిధ శాఖలతో శ్రీ పి. రంగరాజుగారి (మోల్మేన్ ఎక్సెల్సియర్ సినిమాహాలు యజమానులు) అధ్యక్షతన నిర్వహింపబడుతోంది.

III. హెంజిడా జిల్లా :

బర్మా ఆంధ్ర సంఘం (హెంజిడా), స్వంత భవనంతో ఈ జాంగ్లా రోడ్డులో నిర్వహింపబడుతోంది. ఇది సుమారు 50 సంవత్సరాల నుండి ఆ పట్టణంలో ఉన్న తెలుగు బిడ్డలకు విద్యాదానం గావించింది. సాంఘిక, ఆధ్యాత్మిక, సాహిత్యాది కృషిని సల్పి, ఆ ప్రాంతంలోని ఆంధ్రజాతి పురోభివృద్ధికై చాల ఘనంగా సేవచేసింది. ఈ సంఘపు భవన నిర్మాణానికి శ్రీ కర్ణం సన్యాసినాయుడుగారు ప్రధాన ధర్మకర్తలు. ప్రస్తుతం, ఈయన జ్యేష్ఠపుత్రుడైన శ్రీ కర్ణం బాపినాయుడుగారు అధ్యక్షులుగా ఉంటున్నారు.

IV. మెర్గ్వి జిల్లా :

ఈ జిల్లాలో ఎన్నో ఆంధ్ర సంఘాలు నెలకొల్పబడి, కాలక్రమేణ మూసివేయబడ్డాయి. ఇక్కడి పెద్దలందరూ కలిసి స్థాపించిన "బర్మా ఆంధ్ర సంఘం"నకు ఒక స్వంతభవనం వున్నది. ఇందులో దిన-రాత్రి పాఠశాలలు నిర్వహింపబడుతూ, తెలుగు బిడ్డలకు విద్యాదానం జరుగుతోంది. సాంఘిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలలో కూడా కృషి చేస్తున్నది. వీరుకూడా ఒక పుస్తక భాండాగారమును నెలకొల్పి, తెలుగు సాహిత్యాన్ని ప్రజలకు అందించడంలో పరిశ్రమిస్తున్నారు.

V. పీగూ జిల్లా :

పీగూజిల్లాలో ఆంధ్ర ఐకమత్య సంఘం, బర్మా తెలుగు వర్తక సంక్షేమ సంఘం, శ్రీ రామాలయ సంఘం అన్న సంస్థలు నిర్వహించబడుతున్నవి.

రామాలయము, ఆంధ్ర శివాలయము అను దేవస్థానాలు కూడా నిర్వహింప బడు తున్నాయి.

ఈ సంస్థలలో శ్రీ టి. ఎ. రాజు, సిహెచ్. రావు, బి. ఎన్. రాజు, సిహెచ్. గురువులు, బి. అప్పలనాయుడు, మరిణయ్యగార్లు ముఖ్యులు. మరియు శ్రీ టి. ఎ. రావు, బాబు, సాంబమూర్తి, ఎన్. అప్పారావు, గణపతి, పి. మూర్తి, ఎ. అప్పలనాయుడు గార్లు నాటకాలు, సంగీతాలలో అనుభవజ్ఞులు. ప్రస్తుతం దాదాపు 400 మంది ఆంధ్రులుంటారు.

VI. తటోన్ జిల్లా :

తటోన్ జిల్లాలో శ్రీ రామాలయ సంఘం.ఆంధ్ర యువజన సంఘం, శ్రీ రామ భజన కూటమి, ఆనంద బాలబాలికల కూటమి, మొదలగు సంస్థలు నిర్వహింప బడు తున్నాయి.

ఈ సంస్థలలో శ్రీ చెల్లిమిల్లి వెంకన్న, శ్రీ కె. సుబ్రహ్మణ్యం, శ్రీ ఎ. దేవరాజు, శ్రీ ఐ. అప్పలనాయుడు, శ్రీ కె. సుబ్రమణి, శ్రీ కె. ముసలయ్య చొల్లంగి చౌధురీ, సింగన్నగార్లు ముఖ్యులు.

వీరిలో శ్రీ చెల్లిమిల్లి వెంకన్నగారు, శ్రీ ఎ. దేవరాజుగారు సంగీతంలోను నాటకాలలోను అనుభవజ్ఞులు.

ఈ విధంగా ఇంకా అనేక జిల్లాలలో మన ఆంధ్రులు ఉన్నారు. ఎక్కడైనా, ఏ కొద్దిమంది ఉన్నా, ఒక సంఘమో, ఒకి సమాజమో, ఒక భజన కూటమో, ఒకి పఠన మందిరమో, ఒక పుస్తక భాండాగారమో, ఒక ఆలయమో, ఒక సత్రమో, వారి శక్త్యానుసారంగా నెలకొల్పి, నిర్వహించడం పరిపాటైపోయింది. ఇలాటి వివిధ సంస్థలను పేర్కొనాలంటే, బర్మా దేశంలో కొన్ని వందల సంఖ్యవరకు వుంటాయి. వీటి మూలంగా బర్మాఆంధ్రులు కొన్ని ఘనకార్యాలను సాధించగల్గారని చెప్పడంలో అతిశయోక్తి ఎంతమాత్రము లేదు.

హిందూ ధార్మిక శిక్షణ సమితి

ఆల్ బర్మా హిందూ సెంట్రల్ బోర్డుకు అనుబంధంగా నిర్వహింపబడు తున్న - "శ్రీ సనాతన హిందూ ధర్మ స్వయం సేవక సంఘం" మూలంగా బర్మా అంతటా మంచి సేవ జరుగుతోంది. శ్రీ రాం ప్రకాశ్ ధీర్ గారు ఈ సంస్థ నిర్వాహకులు. రంగూన్ 37వ వీధి 277 నెంబరు గృహంలో దీని ప్రధాన కార్యాలయం ఉంది. మిగిలిన జిల్లాలన్నిటిలోనూ సుమారు 20 శాఖలు ఉన్నాయి. ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ప్రచారకుడు ప్రధానిగా ఉంటూ, మిగిలిన సభ్యులతో కలిసి హైందవ బాల, బాలికలకు హైందవ మత పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. ప్రతిదినం ప్రాతఃకాలంలో వ్యాయామ క్రీడల్లోనూ, వ్యక్తిత్వ పోటీల్లోనూ శిక్షణ నిస్తుంటారు. బర్మాలోని ఆంధ్ర జాతికే కాకుండా మొత్తం హైందవ జాతికే ఈ సంస్థ విశిష్టమైన సేవ చేస్తోంది.

రంగూన్‌లోని కొందరు ప్రముఖులు కలిసి పై సంఘానికి ఒక శాఖగా "హిందూ ధార్మిక శిక్షణ సమితి" అన్నదాన్ని 1971లో నెలకొల్పారు. హిందీ తెలుగు, తమిళం, బర్మా భాషలలో మూడు స్థాయిల పాఠ్య గ్రంథాలను రూపొం దించి, హైందవ మతానికి సంబంధించిన వేదాలను, పురాణాలను, శాస్త్రాలను, ఇతిహాసాలను విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇప్పుడిప్పుడు నేపాలీ భాషలో కూడా పాఠ్య గ్రంథాలను నిర్మించడం జరిగింది. ఈ పాఠ్య భాగాల్లో వేద, శాస్త్ర పురాణాది పవిత్ర గ్రంథ పరిచయాలనే గాక, మహా పురుషుల జీవిత చరిత్ర లను, భక్త పుంగవుల కథలను, పండుగలు, ప్రార్థనలు. వగైరా సంప్రదాయ ఆచారాలను ప్రాథమిక స్థాయిలో ప్రవాసి బోధిస్తున్నారు.

మొదటి స్థాయి పాఠ్య గ్రంథం (సబ్ జూనియర్) 5వ తరగతి విద్యార్థు లకు, రెండవ స్థాయి పాఠ్య గ్రంథం (జూనియర్) 6, 7 తరగతుల విద్యార్థు లకు, మూడవ స్థాయి పుస్తకం 8వ తరగతి పై నున్న విద్యార్థులకు ఉపక రిస్తున్నది. మాతృ భాషల్లో విద్యా బోధన చేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయుల నందర్నీ కూడగట్టుకొని, హిందూ పిల్లల మాతృ భాషలోనే హైందవ మత పరిజ్ఞానాన్ని వ్యాప్తిచేసేందుకు ఈ సంస్థ సంకల్పించింది. తెలుగు పిల్లలకు తెలుగు భాషలోనే ఈ బోధన చేసేటందుకు కాండాగ్లే ప్రాంతంలో శ్రీ కె. కె. మూర్తి మొట్టమొదట నడుం బిగించారు.

ఈ సంస్థ పాఠ్య గ్రంథాలను ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేస్తూ ఏటేటా నవంబరు, డిసెంబరు మాసాల్లో రంగూన్ గాంధీ మెమోరియల్ హాలులో పరీక్షలు జరిపిస్తోంది. మొదటి సంవత్సరం అంటే 1971లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో కాండాగ్లే ప్రాంతానికి సంబంధించిన 40 మంది తెలుగు విద్యార్థులు తెలుగు భాషలో పరీక్ష ఇచ్చారు. 1972లో పరీక్ష వ్రాసిన 700 మంది హిందూ విద్యార్థులలో 60 మంది తెలుగువారు. 1973లో బర్మా అంతటా నాలుగు కేంద్రాల్లో నడిచిన పరీక్షల్లో యువతీ యువకులతో పాటు సుమారు వేయి మది హిందూ విద్యార్థులు పరీక్షలు వ్రాశారు. అందులో 70 మంది తెలుగు విద్యార్థులున్నారు. 1974లో మొత్తం 1300 మంది హైందవ విద్యార్థులు పాల్గొన్నారు. అందులో దాదాపు 100 మంది తెలుగులో వ్రాశారు. తెలుగు భాషకు బర్మాలో ప్రోత్సాహం నశించి, చాలామంది తెలుగు పిల్లలు మాతృభాషాధ్యయనానికి అవకాశం కోల్పోతున్న ఈ దుర్దినాలలో ఈ పరీక్షలు భాషా విషయికంగా గొప్ప సహాయాన్ని చేస్తున్నాయి. ఈ పరీక్షల పేరిట, ఒక వైపు హైందవ మత సంప్రదాయాలలో చక్కటి శిక్షణ పొందడమే కాకుండా, మాతృ భాషాభ్యాసానికి కూడా అవకాశం కలుగుతోంది. అంచేత, చాలా మంది తెలుగు భాషాభిమానులు మామూలు తెలుగు పాఠాలతోబాటు "హిందూ ధార్మిక శిక్షణ సమితి పాఠావళిని కూడా ఉచితంగా బోధిస్తూ, ఈ ఉద్యమానికి సహకరిస్తున్నారు. ఈ సమితిలో తెలుగు భాషా సంపాదకులుగా ఉన్న శ్రీ కె. కె. మూర్తి, కుమారి ఆర్. సుభద్రా దేవి గార్లతో పాటు, శ్రీమతి మునెమ్మగారు, శ్రీ ఇ. టి. రావు గారు 1974 నుండి తెలుగులో బోధిస్తున్నారు. తెలుగు భాషాపరంగా శ్రీ లోచర్ల గంగరాజు గారు కూడా ఈ సమితి పట్ల సహకరిస్తున్నారు.

శ్రీ బాలయోగి భక్త సమాజం (రంగూన్)

శ్రీ దాకే నరసింహమూర్తి, శ్రీ జల్లూరి అర్జునరావు, శ్రీ తరివిట్ల శాంతారావు గార్ల ప్రోత్సాహంతోను, శ్రీ జంగా వెంకటరెడ్డి గారి ఆర్థిక సహాయంతోను, మరి కొందరు ప్రముఖులు – 1. శ్రీ గెడ్డం సుబ్బారావు 2. శ్రీ గెడ్డం వెంకన్న 3. శ్రీ రొంఖం చిట్టియ్య 4. శ్రీ పొద్దోకు భీమయ్య 5. శ్రీ మోకా ధనువు 6. సకిలే నడవపెల్లి 7. శ్రీ చీర వెంకన్న 8. శ్రీ పెయ్యల సాహెబు

9. శ్రీ మర్రిపాటి అప్పన్న 10. శ్రీ తోకల వెంకన్న 11. శ్రీ ఓగూరి చంద్రయ్య గార్ల సహకారంతో, 1951 సం॥లో, "శ్రీ బాలయోగి భక్త సమాజము" అను పేరిట 41వ వీధిలోనున్న 46వ నెంబరు గృహమందు ఈ సంస్థ స్థాపించబడినది. మొదటి పాలక వర్గంలో – 1. శ్రీ జంగా వెంకటరెడ్డి గారు అధ్యక్షులు గాను, 2. శ్రీ దాకే నరసింహమూర్తి గారు కార్యదర్శి గాను, 3. శ్రీ జల్లూరి అర్జునరావు గారు కోశాధిపతి గాను, మరియు 4. శ్రీ తరివిట్ల శాంతారావు 5. యెల్పే నాగన్న 6. శ్రీ ఎమ్. అప్పన్న 7. శ్రీ ఉమ్మితి వెంకటస్వామి 8. శ్రీ ఎమ్. అప్పారావు 9. శ్రీ మోకా నారాయణమూర్తి 10. శ్రీ పి. సాహెబు 11. శ్రీ సేకిరిమెల్లి సత్యం మొదలగువారు కార్యవర్గ సభ్యులుగాను ఎన్నికయ్యారు.

1951 సం॥ మార్చి నెల 6, 7, 8వ తేదీలలో జరిగిన మహాశివరాత్రి పర్వదినాలలో కలకత్తా రోడ్డు (ఫేయర్ వీధి) లో ఉన్న శ్రీకృష్ణ కోవెల ఆవరణలో, శ్రీ బాలయోగి చిత్రపటావిష్కరణ మహోత్సవం సమాజ అధ్యక్షులైన శ్రీ జంగా వెంకటరెడ్డి గారిచే జరుపబడింది. ఆనాడు శ్రీ ఆంధ్ర సేవా సమితి బాల, బాలికలచే గానకచ్చేరీలు, శ్రీ బాలయోగి భక్త సమాజ బాల, బాలికలచే భజన కోలాటములు మొదలైన కార్యక్రమాలను నిర్వహించారు. ఆ సంవత్సరంలో జరిగిన వేడుకల ఖర్చులనూ, అన్నసంతర్పణ ఖర్చులనూ శ్రీ జంగా వెంకటరెడ్డి గారే భరించారు. 1952 సం॥ ఫిబ్రవరి నెల 22,23,24వ తేదీలలో శ్రీ కృష్ణ కోవెల ఆవరణలోనే ద్వితీయ వార్షికోత్సవం జరుపబడింది. హరిజన సేవాసంఘం, ఆంధ్ర సేవా సమితివారి స్వచ్ఛంద సేవాదళములు పాల్గొన్నాయి. శ్రీ బాలయోగి భక్త సమాజంవారి బాలికల సంగీత, మురళీ, కోలాటములను అందరూ ప్రశంసించారు. శ్రీ బాలయోగి చరిత్రను శ్రీ దాకే నరసింహమూర్తి గారు రచించి తమ దళమువారితో కలిసి బుర్రకథగా చెప్పారు.

1953 మరియు 1954 సం॥లలో ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవాన్ని కూడా జరిపించారు. రెండు సంవత్సరాలు వరుసగా అధ్యక్షులుగా ఉన్న శ్రీ జంగా వెంకటరెడ్డి గారి స్థానే, రంగూన్ కార్మిక నాయకుడుగా పేరుగాంచిన శ్రీ కర్రి అప్పారెడ్డిగారిని సమాజ అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. వారి అధ్యక్షతలో

మహాశివరాత్రి కార్యక్రమాలు జరిపించబడ్డాయి. మునుపటి రెండు సంవత్సరాలలో ప్రజలు చూపిన ఆదరాభిమానాలు గమనిస్తూ, శ్రీకృష్ణ ఆలయ ఆవరణ చాల చిన్న స్థలమని భావించి, వేలాది ప్రజలు సదరు ఉత్సవంలో పాల్గొనడంవల్ల, మర్చంట్ వీధి, సూలే పగోడా రోడ్డు కూడలిలో వున్న యూనియన్ బ్యాంకు ఎదురుగా 1953 సం॥ ఫిబ్రవరి నెల 12,13,14వ తేదీలలో తృతీయ వార్షికోత్సవాన్ని 1954 సం॥ మార్చి నెల 4,5,6వ తేదీలలో చతుర్థ వార్షికోత్సవాన్ని జరిపించారు. అందులో 1. హరిజన సేవాసంఘం 2. బర్మా ఆంధ్ర సేవా సమితి 3. కొండాగ్లే యువజన సంఘం 4. ఆంధ్ర యువజన భజన కూటం 5. ఆంధ్ర మహాజనసంఘం యువకులు మొదలైనవారు పాల్గొన్నారు. ఆ మహోత్సవాలలో వేలాది ఆంధ్ర, ఆంధ్రేతర మహిళా మణులు కూడా శ్రీ బాల యోగీశ్వరులవారి ఛాయా చిత్ర పటాన్ని భక్తితో పూజించి, మంగళహారతు లిచ్చారు. పై సంఘాల వారిచే భజన కాలక్షేపములు, గాన కచ్చేరీలు సాగించ బడినవి. శ్రీ దాకే నరసింహమూర్తి గారి బుర్రకథ, శ్రీ పి. కొండయ్యదాసు గారిచే హరికథా కాలక్షేపం, శ్రీ బాలయోగి నాట్యకళా మండలి (కమ్మాకచ్చి) వారిచే "శ్రీకృష్ణ తులాభారం" అన్న నాటకం ప్రదర్శింపబడ్డాయి.

1955 సం॥లో కాస్త మార్పు జరిగింది. శ్రీ బాలయోగేంద్రుల వారికి నిత్య పూజలు జరిపించుట అత్యవసరమని, అందుకై ఒక ప్రత్యేక గది వుండి తీరాలని కార్యవర్గం తీర్మానించి, "ఒక ప్రత్యేక గృహ నిర్మాణ కమిటీ"ని ఏర్పరచారు. అందులో 1. శ్రీ జంగా వెంకటరెడ్డి 2. శ్రీ గొల్లమందల పెద వెంకన్న 3. శ్రీ దాక్షే నరసింహమూర్తి 4. శ్రీ చొల్లంగి సత్యనారాయణ 5. శ్రీ బైరిశెట్టి సూరన్న 6. శ్రీ రాయుడు పల్లంశెట్టి 7. శ్రీ మట్టిపర్తి ఆదినారాయణ రెడ్డి 8. శ్రీ కర్రి అప్పారెడ్డి 9. శ్రీ కొంబత్తుల వాడపల్లి 10. శ్రీ నావాల నాగ భూషణం (కార్యదర్శి) గార్లు ఎన్నుకోబడ్డారు. ఈ కమిటీవారి కృషి ఫలితంగా 1780/- చ్యాలు వసూలయ్యాయి. ఫిబ్రవరి నెల 21,22,23 తేదీలలో పంచమ వార్షికోత్సవం వైభవోపేతంగా జరిపించబడింది. ఈ మహోత్సవంలో భారతీ యులే కాకుండా పార్శీయ స్త్రీ, పురుష, బాల బాలికలు సైతము పాల్గొని, ఫల, పుష్ప, హారతి కర్పూరాలతో శ్రీ బాలయోగీంద్రుని పూజించారు. భజ నలతోను, సంగీత కచ్చేరీలతోను, హరికథలతోను, నాటకాలతోను, రంగూనాం ధ్రులకిదీ ఒక ప్రత్యేక గౌరవప్రదంగా కనిపించింది. 1. హరిజన సేవా

సంఘం 2. బర్మా ఆంధ్ర సేవా సమితి 3. ఆంధ్ర యువజన భజన కూటం మొదలైన సంస్థలవారు కూడా ఈ పంచమ వార్షికోత్సవములో పాల్గొని భజన కాలక్షేపాలతోను, కోలాటములతోను ప్రజలను రంజింప చేశారు. శ్రీ బాల చంద్ర నాట్య మండలి వారిచే, "పల్లెపదచు" అన్న నాటకము ప్రదర్శింప బడింది.

1956 సం॥లో పై స్థల మందే మార్చినెల 11, 12, 13వ తేదీలలో శ్రీ బాల యోగీంద్రుల శివరాత్రి మహోత్సవం జరుపబడింది. యుద్ధానంతరం ఆంధ్రులచే జరుపబడిన మహోత్సవ కార్యక్రమములన్నిటికన్నా, ఈ శివరాత్రి మహోత్సవం రంగూన్ నగరంలో ఉన్న సర్వ జనులను ఆకర్షింపగల్గింది. విద్యుద్దీపములతో అలంకరించిన బ్రహ్మాండమైన పందిలో శ్రీ బాల యోగీంద్రుల ఛాయాచిత్ర పటము, పందిరి నిండుగా భక్తాగ్రేసరులు, భజన కాలక్షేపములు, కచ్చేరీలతోనిండి, అదొక తీర్థయాత్ర కేంద్రంగా కన్పించింది. 1. హరిజన సేవాసంఘం 2. ఆంధ్ర సేవా సమితి 3. శ్రీ బౌద్ధ భక్త సమాజం మొదలగు సంస్థలవారు పాల్గొన్నారు. శ్రీ శుభోదయ నాట్యమండలి వారిచే రెండు నాటికలు, బర్మా ఆంధ్ర సేవాసమితి విద్యార్థి బృందంవారిచే ఒక నాటకం ప్రదర్శింపబడ్డాయి. ఈ మహోత్సవంలో వేలాది ప్రజలు పాల్గొని, మంగళ గీతికలతో శ్రీ బాల యోగీంద్రులవారిని పూజించారు.

1957 సం॥లో ఫిబ్రవరి నెల 28, మార్చి నెల 1, 2, 3 తేదీలలో సప్తమ వార్షికోత్సవం పూర్వపు స్థలమునందే జరుపబడింది. 1. హరిజన సేవా సంఘం 2. బాలాంధ్ర గానసభ 3. శ్రీ విశాఖపట్టణ కేంద్ర వెట్టిబలిజ యువజన సంఘం 4. శ్రీ నీలకంఠ భక్త సమాజం 5. శ్రీ బౌద్ధ భక్తసమాజం 6. శ్రీ బాలమురళీ సంగీత కోలాట సమాజం (ఆచంట) 7. శ్రీ ఆంధ్ర యువజన భజన కూటంవారు, ఈ మహోత్సవంలో పాల్గొని, గానకచ్చేరీలు, భజన కాలక్షేపములు, మురళీ కోలాటములు మొదలైన కార్యక్రమాలతో ప్రజల మనస్సులను రంజింపచేశారు. 1. శ్రీ పీతాని వెంకటదాసు గారి "భక్త రామదాసు" హరికథాకాలక్షేపం 2. శ్రీ టి. శాంతారాం గారి, "పేదబ్రతుకు" అనే నాటిక 3. శ్రీ దాకే నరసింహమూర్తి గారి "సత్యభామ పరాభవము" అన్న నాటిక 4. శ్రీ బాలయోగి నాట్య కళామండలి (కమ్మాకచ్చి)వారి 'చింతామణి'

అన్న నాటకం 5. జ్ఞానోదయ నాట్య కళామండలివారి "దేశద్రోహి" అన్న నాటకం వరుసగా ప్రదర్శింపబడ్డాయి.

1958 సం॥లో ఫిబ్రవరి నెల 17,18,19,20వ తేదీలలో అష్టమ వార్షి కోత్సవాలు పూర్వపు స్థలమునందే సమాజ నూతన అధ్యక్షులైన శ్రీ కర్రి వీరెర్రిడ్డిగారి ఆధ్వర్యంలో అతి వైభవంగా జరిగాయి. 1. శ్రీ బౌద్ధ భక్త సమాజం 2. హరిజన సేవా సంఘం 3. భారతమాత యువజన సంఘం 4. శ్రీ శివశంకర భక్తసమాజం 5. ఆంధ్ర యువజన భజన కూతం మొదలైన సంస్థలు ఈ వార్షికోత్సవంలో పాల్గొన్నాయి. శ్రీ కె. శ్రీనివాసులునాయుడు గారు ఒకరోజు అన్నసంతర్పణ జరిపించారు. 1. శ్రీ వీరాంజనేయ నాట్య కళా మండలి వారిచే "బాలనాగమ్మ" అన్న నాటకం 2. శ్రీ వివేకానంద నాట్య సమాజం వారిచే "హనుమద్రామ సంగ్రామం" అన్న నాటకం 3. శ్రీ బాల యోగి నాట్య కళామండలి (కమ్మాకచ్చి) వారిచే, "తారాశశాంకం" అన్న నాటకం ప్రదర్శింపబడ్డాయి.

1959 సం॥ మార్చి నెల 8,9,10వ తేదీలలో రంగూన్ నగర మధ్య మున బహిరంగ ప్రదేశంలో మహోత్సవం జరుపడానికి అవకాశం లభించనం దున, పసిందాం (నాటుకోట్టై చెట్టియార్లు) శ్రీ సుబ్రహ్మణ్య స్వాములవారి కోవె లలో నవమ వార్షికోత్సవం సమాజ అధ్యక్షులైన శ్రీ కర్రి వీర్రెడ్డి, సమాజ రాజపోషకులైన శ్రీ జంగా వెంకటరెడ్డి గార్ల పర్యవేక్షణలో జరిపించబడింది. అందులో 1. ఆంధ్ర బౌద్ధ భక్త సమాజం 2. హరిజన సేవాసంఘం 3. ఆంధ్ర యువకి బృందం (కాండాగ్లే) మొదలగు సమాజములవారు, సకల కార్యక్రమా లలోను పాల్గొన్నారు. 1. సౌభాగ్యవతి నీలం ఛాయాదేవి గానకచ్చేరి 2. పండరి భక్త కుట్టపత్తి సుబ్బారావుగారిచే "భక్త కుచేల" 3. శ్రీ వైరాగ్య నమ్మయ్య దాసుగారిచే "సీతా కల్యాణము" హరికథా కాలక్షేపములు జరుపబడినవి. 1. శ్రీగణేశ్ నాట్యకళామండలివారి "బాలనాగమ్మ" 2. శ్రీ బాలయోగి నాట్య కళామండలి (కమ్మాకచ్చి) వారి "తారాచంద్రుల విజయం 3. ఆంధ్ర యువ జన నాట్యకళామండలి వారి "విజయ ప్రతిజ్ఞ" నాటకములు 4. ఆంధ్రయువక బృందం (కాండాగ్లే) వారి "గుణపాఠం" అన్న వ్యంగ్య నాటిక వరుసగా ప్రదర్శింపబడ్డాయి.

1960 సం॥ జనవరినెల 21వ తేదీని శ్రీ బాలయోగి భక్త సమాజ భవనములో శ్రీ ఏ. ఎస్. ప్రకాశ్‌గారి అధ్యక్షతలో సర్వసభ్య సమావేశం జరిగింది. అందులో క్రొత్తగా ఎన్నికలు జరిగిన పిదప యీ క్రింది కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది :— సర్వశ్రీ 1. కర్రి వీర్రెడ్డి (అధ్యక్షులు) 2. వడ్లపాటి బులిస్వామి (ఉపాధ్యక్షులు) 3. కమ్ముజు మరిడి శెట్టి (ఉపాధ్యక్షులు) 4. పులిదిండి నారాయణమూర్తి (కోశాధిపతి) 5. బత్తుల సుందర్రావు (ప్రధాన కార్యదర్శి) 6. వడ్డి వెంకట్రావు 7. బి. జాన్‌కుమార్ (సహాయ కార్యదర్శులు) 8. జంగా వెంకటరెడ్డి 9. గోగి విష్ణుకుమార్ 10. శీలం నారాయణదాసు 11. గొల్లమందల పెదవెంకన్న 12. గెద్దాడ వెంకట సుబ్బారావు 13. మట్టా ధనరాజు 14. జామి వెంకట్రావు 15. ఎమ్. కృష్ణారావు 16. బి. అప్పారావు 17. గండిబోయిన అప్పారావు 18 నౌట్ల నూకరాజు 19. పితాని వెంకటదాసు 20. పి. జోగినాయుడు గార్లు. జనవరి నెల 16 వ తేదీ లగాయితు, సమాజ కార్యవర్గం వారూ, సంగీత కళామందిర్ యువకులూ, బాల, బాలికలు, లాడ్‌పైని తిరుగుచు, 30 దినాలవరకు శ్రమపడి విరాళములను ప్రోగుచేశారు. ఫిబ్రవరినెల 26 వ తేదీని పసిందాం సుబ్రహ్మణ్యస్వాములవారి కోవెలలో శ్రీ బాల యోగీంద్రుల చిత్రపటావిష్కరణ జరుపబడింది. శ్రీ గోగి సూరయ్యగారూ, వారి పుత్రులైన విష్ణుకుమార్ గారూ సమాజానికి ఇచ్చిన శ్రీ బాల యోగీంద్రుల వారి పాలరాతి విగ్రహాన్ని మంటపములో శ్రీ గోగి సూరయ్యగారు ప్రతిష్టించారు. అదేరోజున, రెండుపూటలలో షుమారు 2000 మందికి అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రంనుండి తెల్ల వారుజాముపరకు "భక్తరామదాసు" హరికథా కాలక్షేపం, తదనంతరం "బాలనాగమ్మ" నాటకం ప్రదర్శింపబడ్డాయి. 27, 28 తేదీలలో శ్రీ గోగి సూరయ్యగారూ, వారి కుమారులూ, వేలాది ప్రజలకు అన్న సంతర్పణ చేశారు. తదనంతరం, సాయంకాలం గానకచ్చేరీలు, వేదాంత తత్త్వబోధనము, ఆటపిమ్మట ఉదయంవరకు "చింతామణి" అన్న నాటకం ప్రదర్శింపబడ్డాయి. శ్రీ వివేకానంద నాట్య సమాజంవారు "సత్య హరిశ్చంద్ర" అన్న నాటకాన్ని ప్రదర్శించారు. 29 వ తేదీన శ్రీమతి గెంజి వెంకమ్మ, వారి తమ్ముడు గంటి సీతారాంగార్లు వేలాది ప్రజలకు అన్నసంతర్పణ చేశారు. శ్రీ బర్రె నారాయణదాసుగారిచే "భక్తకబీర్" హరికథా కాలక్షేపం, శ్రీ ఆంధ్ర యువజన నాట్య కళామండలివారిచే "విజయ ప్రతిజ్ఞ" అన్న నాటకం ప్రదర్శింపబడ్డాయి.

మార్చినెల 1 వ తేదీన (ఐదవరోజు) శ్రీ బాలయోగి భక్తసమాజంవారిచే, రెండుపూటలు అన్నసంతర్పణ జరిపించబడింది. మొత్తంపైన 5 దినాలలో మొమ్మిదివేల మందికి అన్నసంతర్పణలు గావించినట్లు అంచనా వేయబడింది.

శ్రీ బాలయోగి నాట్యకళామండలి (కమ్మ కచ్చి) వారిచే "తారాశశాంకము" అన్న నాటక ప్రదర్శనంతో మహోత్సవం సమాప్తమైంది. [illegible] రెండుబర్మాదేశంలో జరిగిన రాజకీయ మార్పుల పర్యవసానంగా సమాజ సభ్యులు మాతృదేశానికి తరలిపోవడంతో 1961, 1962, 1963 సం॥లలో బాలయోగీంద్రుల మహాశివరాత్రి కార్యక్రమాలను మిగిలివున్న సభ్యులు సమాజ భవనంలోనే నిరాడంబరంగా జరిపించారు. 1964 సం॥లో బర్మా ప్రభుత్వం సకల సంస్థలను మూసివేయడంవల్ల, సమాజ అధ్యక్షులైన శ్రీ కర్రి వీరారెడ్డిగారు, శ్రీ బాలయోగీంద్రుల పూర్తి సామగ్రిని, కొంత ఆస్తిని, ఆంధ్ర మహాజన సంఘానికి (వెం. 184, లూయ్య వీధి, రంగూన్) బదలాయింపు చేస్తూ, భవిష్యత్ కార్యక్రమాలను కూడా నిర్వహించమని కోరారు. అదట్టుండగా, 1965, 1966 సం॥లలో శ్రీ కర్రి వీరారెడ్డి సోదరులు, మహాశివరాత్రి శ్రీ బాలయోగి కార్యక్రమాలను, బౌద్ధభిక్షుల అన్న సంతర్పణతో, నిరాడంబరంగా సాగించారు. తదనంతరం, 1967 సం॥నుండి 1970 సం॥ వరకు శ్రీ బాలయోగీంద్రుల మహాశివరాత్రి కార్యక్రమాలు, మూడు దినాల అన్న సంతర్పణలు పూర్వ నిర్ణయప్రకారం ఆంధ్ర మహాజనసంఘంలోనే సంఘాధ్యక్షులైన శ్రీ కొళ్ళపూడి ఎల్లయ్య, శ్రీ కోరాడ సత్యవాక్కారు పర్యవేక్షణలో, కార్యనిర్వాహక సభ్యుల సహకారంతో సంతృప్తికరంగా జరిగాయి. [illegible] అప్పుడు, అక్కడక్కడ మిగిలివున్న కొందరు సమాజపు పాత సభ్యులు ఏకమై, సమాలోచనలు జరిపి, సమాజమును పునఃస్థాపితం చెయ్యడం అత్యవసరమని తీర్మానించి, కాండాగ్లే బర్మా రైల్వే క్వార్టర్సులో, శ్రీ బాలయోగి భక్త సమాజమును తాత్కాలికంగా నెలకొల్పారు. అటుపిమ్మట 1971, 1972, 1973 మరియు 1974 సంవత్సరాలలో, ఒకవైపు ఆంధ్ర మహాజన సంఘం వారూ, ఇంకొకవైపు శ్రీ బాలయోగి భక్త సమాజం వారూ, శ్రీ బాలయోగీంద్రుల మహాశివరాత్రి కార్యకలాపములను, సభలను, మూడు దినాల అన్న సంతర్పణలను, వారి వారి స్థలాలలో వైభవంగా జరిపించారు. శ్రీ బాలయోగి

భక్త సమాజం వారి విషయంలో; సమాజ అధ్యక్షులైన శ్రీ భీమని సుబ్బారావు శ్రీ గుంటు అప్పారావుగార్ల పర్యవేక్షణలోను; సమాజ కార్యదర్శియగు శ్రీ కె. అచ్యుతరావు కవిగారి కృషితోను సభ్యుల, మిత్రుల సహకారంతోను దైనందిన పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్ర మహాజన సంఘంవారిని విషయంలో సంఘాధ్యక్షులైన శ్రీ బి. వెంకట్రావుగారి పర్యవేక్షణలో, కార్య నిర్వాహకవర్గం, వారి కృషితో దీప, ధూపారాధన కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి.

భగవాన్ శ్రీ బాలయోగీంద్రుల ఆశ్రమం భక్తుల ప్రోత్సాహం ఫలితంగా 1974 సం॥ నవంబరు నెల 15వ తేదీన, శుక్రవారంనాడు, సమాజ అధ్యక్షులైన శ్రీ గుంటు అప్పారావు, సమాజ కార్యదర్శి అయిన శ్రీ కొన్నే అచ్యుతరావు కవిగార్ల ప్రత్యేక శ్రద్ధతోను, సమాజ సభ్యుల సహకారంతోను, పుర ప్రముఖుల ఆదరాభిమానములతోను, భగవాన్ శ్రీ బాల యోగీంద్రుల 45వ జన్మదినోత్సవం మహాత్మగాంధి మెమోరియల్ హాలులో సాయంత్రం 7 గంటలు మొదలు రాత్రి 12 గంటల వరకు అతి వైభవంగా జరిగాయి. ఆ మహాసభకు అఖిల బర్మా హిందూ సెంట్రల్ బోర్డు అధ్యక్షులైన శ్రీ దీనానాథ్ గారు సభాధిపత్యం వహించారు. అనేక ఆంధ్ర, ఆంధ్రేతర సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ బాల యోగీంద్రుల జీవితం పైన తెలుగులోను, తమిళంలోను, హిందీలోను, ఉర్దూలోను, బర్మాలోను, ఇంగ్లీషు భాషలలోను వివిధ సంస్థల అధ్యక్షులు ఉపన్యాసాలను ఇచ్చారు. శ్రీ యోగీశ్వరుల తత్త్వోపదేశములు, వారిపట్ల భక్తి రసమైన గీతములు గానం చేయబడినవి. వందలాది ఆంధ్రులు, భారతీయులు, బర్మీయులు, తదితరులు ఆ మహాసభలో పాల్గొన్నారు. శ్రీ దుర్గా సంగీత్ కళామందిర్ కళాకారులచే ప్రదర్శింపబడిన, "మోహినీ భస్మాసుర" నాటిక, ఒక ప్రత్యేక ఆకర్షణగా వెలసింది. ఇటువంటి వివిధ తెగల వారి భాషల సమ్మేళనం, రంగూన్ నగరంలో ఇంతకు ముందెన్నడు జరిగి ఉండలేదు. నాటి సభా కార్యక్రమమంతా టేప్‌రికార్డింగ్ చేయబడింది కూడాను.

డిశంబరు నెల 25వ తేదీన (1974), శ్రీ బాల యోగీంద్రుల తండ్రిగారైన స్వర్గీయ శ్రీ కటికదల గంగయ్యగారి దశమవర్ధంతి సమాజగృహంలో అత్యంత భక్తి పురస్సరంగా జరిగింది. ఈ 1975 సం॥ మార్చి నెలలో జరుగ

బోవు మహాశివరాత్రి మహోత్సవ సందర్భంలో, శ్రీ బాలయోగి భక్త సమాజం వారు తమ రజతోత్సవాన్ని కూడా జరుపనున్నట్లు వినికిడి.

బర్మా భారతీయ కాందిశీకుల సహాయ సెంటర్

2 (A) కాండాల్గే — రంగూన్

1963-64 సం॥ నాటికి బర్మా దేశంలో రాజకీయంగా జరిగిన మార్పుల ఫలితంగా, విదేశీయులు తమ వర్తకములు, ఉద్యోగములు, కార్మిక వృత్తులు గోల్పోయారు. ఆ సందర్భంలో మనవారు భారత దేశానికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకొన్నారు. అదే సమయంలో బర్మా ప్రభుత్వం అన్ని సంఘాలను రద్దు చేసినందువల్ల, విదేశీయులు పడుతున్న ఆందోళన గురించి ఏ సంఘ నాయకుడు గాని ముందుకొచ్చి తగు సమాలోచన, సూచనలు ఇచ్చి భారతీయుల భావి జీవనోపాధికి మార్గ దర్శకుడుగా నిలబడే పాపాన పోలేదు. ఇక, శరణాగతులుగా అవతరించిన భారతీయులు అక్కడక్కడ గుస గుస లాడుకోవడం, తమ కష్ట సుఖాలను వెలిబుచ్చుకోవడం, వేదనలు పడడం, చివరకు దిన భత్యానికి కూడా మార్గం లేక తహ తహలాడి పోవడం జరిగింది.

ఇలాంటి క్లిష్టతరమైన వాతావరణాన్ని కనిపెట్టి, రంగూన్ కంబే ప్రాంతంలోవున్న శ్రీ బి. సేన్ గుప్తా బాబు గారు, తమ మిత్ర బృందంతో కూడి, తమ స్వగృహంలో ఒక సమావేశాన్ని జరిపించారు. దానికి శ్రీ కె.కె. మూర్తిగారు కూడా ఆహ్వానింపబడ్డారు. ఆ సమావేశంలో 46 గురు పాల్గొన్నారు. ఆ సభలో క్లిష్ట పరిస్థితులను చర్చించి, భారతీయులు పడుతున్న అష్ట కష్టాలను, భారత ప్రభుత్వపు దృష్టికి తేవాలనీ అందులో భారత దేశానికి అతి త్వరలో వెళ్ళదలచినవారి సంఖ్యను రుజువు చేయడానికి కృషి చేయవలెనని నిశ్చయించడమైసది.

ఈ ప్రణాళికకు శ్రీ బి. సేన్ గుప్తా బాబుగారు కొన్ని వేల రూపాయలు వ్యయపర్చి నాలుగు జట్టులను (టీములను) తయారు చేశారు. పదివేల పత్రాలను అచ్చొత్తించారు. వాటి పైని స్వదేశం వెళ్ళిపోదలచిన వారి పేర్లను, తగు వివరాలతో సహా ఈ జట్టులవారు సేకరించడం ప్రారంభించారు. అందులో

నాలుగు జట్టులకు నలుగురు నాయకులుగా ఉండి, వారి వారి జట్టుకు కావలసిన ఖర్చులు, శ్రమ దమాదులు, ఆయా నాయకుని బాధ్యతలుగా నిర్ణయింపబడ్డాయి. ఈ నాలుగు జట్టులలో ఉన్న వారిలో నుంటికి తొంభై మంది దక్షిణ భారతీయులు. వీరిలో కాందోం ప్రాంతానికి శ్రీ కె. కె. మూర్తి గారును, ట్రామ్వే ప్రాంతానికి శ్రీ మీనన్ గారును, రంగూన్ పట్టణమునకు దక్షిణామూర్తి, పాలుసామి మొదలైన వారును వివరాలు సేకరిస్తూ ప్రయాణీకులు ఒక్కొక్కరికి 12 ప్యాస్ పోర్టు సైజు ఫోటోలు తీసుకొని ఉంచవలసినదిగా సలహాలు ఇవ్వగా, ప్రజలు అదే విధంగా, కొన్ని వేల మంది ఫోటోలు తీసుకొని సిద్ధమై వుండేవారు. ఈ ఉద్యమం ఇట్లు సాగుతుండగా, ప్రజలలో, అశాంతి రేకెత్తిన కారణంగా, కొందరు దక్షిణ భారతీయ యువకులు, 1964 సం॥ మే నెలలో హఠాత్తుగా సమాలోచన చేసి, భారత రాయబారి కార్యాలయం ఎదుట ఉదయం 6 గంటలకు ఒక వెయ్యిమంది భారతీయులు తమ కష్టాలను తెలుపు కొనుటకు శాంతియుత సత్యాగ్రహం ప్రారంభించారు. మరి రెండు గంటల కాలమునకు దావాపు మూడు వేల మంది భారతీయులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ ఆందోళన గురించి కారణం ప్రాత పూర్వకంగా అందజేసిన తరువాత, ఆల్ బర్మా ఇండియన్ కాంగ్రెస్ వారిని పిలిపించి అడుగగా వారికి ఎటువంటి వివరాలు తెలియవని తప్పించుకొని వెళ్ళి పోయారు.

తదనంతరం, ఈ సత్యాగ్రహం చేస్తున్న గుంపులోనుండి 5 గురికి ప్రతినిధులుగా వచ్చి, సంప్రదించమని, అప్పట్లో ఇండియన్ ఎంబసీకి (**charge-d' affairs**) షార్జేడిఫేర్‌గా నున్న శ్రీ గాన్సల్వెస్ (**Shri Gonsalves**) గారు ఆహ్వానించారు. వీరి మూలంగా "అతిత్వరలో భారత ప్రభుత్వం, భారతీయులకు మాతృదేశానికి ఉచితముగా నీటి ఓడలను ఏర్పాటుచేసి, తరలించవలసినదిగా కోరుచున్నాము"అంటూ నివేదించారు. ఆ సందర్భంలో, పై కారణాలన్నీ వివరించగా తక్షణమే శ్రీ గాన్‌సల్వెస్‌గారు ఢిల్లీకి తంతిద్వారా తెలియజేసి అందుండి మధ్యాహ్నం1 గంటకు జవాబు చెబుతూ, మరుసటి నెల జూన్ నెలలో (1964) నీటిఓడలు రాగలవనీ, ఆ విషయంలో విచారించపనిలేదని ప్రతినిధులకు తెలియజేశారు. అంతటితో ప్రతినిధులు, ప్రజలకు విషయం తెలియజేయగా, సాయంత్రం 3 గంటలకు ప్రజలందరు సంతృప్తి పడుతూ, ఎవరి యింటికి వారు వెళ్ళి

పోవడం జరిగింది. ఈ సత్యాగ్రహమును ప్రారంభించిన వారిలో, ఐ.ఇ.ఎస్. ఖాల్సా హైస్కూల్, రాజారెడ్డియార్ హైస్కూల్, మరియు శ్రీ బి. సెన్ బాబుగారి జట్టులోని దక్షిణ భారతీయ ఉపాధ్యాయులు; విద్యార్థులు, యువకులు ముఖ్యులు. వీరితోబాటు, వీరి మిత్రులైన ఉత్తర హిందుస్తానీ యువకులు కూడా పాల్గొన్నారు. కొందరు ఉత్తరభారతీయ ధనవంతులు సత్యాగ్రహంలో పాల్గొన్న వారికి ఆన్నం పొట్లాలు బండ్లమీద తెచ్చి పంచిపెడుతూ తమ శాయశక్తులా సహకరించారు.

అటు తర్వాత, శ్రీ రామదాసు కటారీ గారు జూన్ నెలలో (1964) భారత రాయబారిగా వచ్చారు. జూన్ నెల 21వ తేదీని పుర ప్రముఖులు కొందరు, ఆల్ బర్మా ఇండియన్ కాంగ్రెస్ ద్వారా ఆహ్వానింప బడి, ఇండియన్ ఎంబసీ కార్యాలయంలో సమావేశం జరిపారు. ఆ సభలో 1. శ్రీ సెన్ గుప్తాబాబు గారు 2. శ్రీ మీనన్‌గారు 3. కుల్‌దీప్ సింగ్ గారు 4. తమిళ సంఘం అధ్యక్షులు శ్రీ ఏకాంబరంగారు 5. ఆంధ్ర మహాజనసంఘం ఆధ్యక్షులు, డాక్టరు కుల శేఖరం గారు 6. శ్రీ కె. మూర్తిగారు మొదలగువారు పాల్గొన్నారు. మొత్తం 21 మంది ప్రముఖులతో సమాలోచన చేసి, "బర్మా కాందిశీకుల సహాయ కార్యవర్గం" (**Indian evacuees Repatriation Committee of Burma**) అన్న సంస్థ నెలకొల్పబడింది. దానికి, ఇండియన్ ఎంబసీ రెండవ కార్యదర్శి అయిన శ్రీ నాజరెత్ గారిని అధ్యక్షులుగా, భారత రాయబారి యగు శ్రీ ఆర్. కటారీగారు ఎన్నుకొన్నారు. మొదటి కార్యదర్శి అయిన శ్రీ జోషీగారు, ప్రయాణీకుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కమిటీతో తూర్పు రంగూన్‌కు డాక్టరు కుల శేఖరంగారు. పడమర రంగూన్‌కు చిదంబరం పిళ్లైగారు చల్లా, కమ్మకచ్చీకి శ్రీ మీనన్‌గారు, ఉత్తర రంగూన్‌కు అ॥ బ॥ తమిళ సంఘం అధ్యక్షులైన శ్రీ ఏకాంబరం పిళ్ళైగారు, దక్షిణ రంగూన్‌కు శ్రీ సెన్ గుప్తాబాబు గారు, శ్రీ కె. కె. మూర్తి గారు, సెంట్రల్ రంగూన్‌కు అఖిల బర్మా భారతీయ కాంగ్రెసు (**A.B.I.C., H.Qrs.**) నకు, ఈ విధంగా కమిటీలో 11మంది నియమితులు కాగా, మరుసటి సమావేశంలో, డాక్టరు కులశేఖరం, కె. కె. మూర్తిగార్ల మధ్య ఐక్యతలేక దక్షిణ రంగూన్ ప్రాంతంలో ఉన్న తమిళ ప్రజల కోరికపైన కె. కె. మూర్తిగారి స్థానే రెవరెండ్ చార్ల్స్ గారిని మార్పుచేసి ఆంగ్ల పత్రికతో ప్రకటించినారు. శ్రీ సెన్ గుప్తాబాబు

గారు విచారించి, కె. కె. మూర్తి గారిని కలుసుకొని, రెవరెండ్ చార్ల్స్‌గారికి సహాయకులుగా ఉండడానికి సిఫారసు చేశారు. దానితో రెవరెండ్ చార్ల్స్ గారు కె. కె. మూర్తిగారిని పై సూచింపబడిన సెంటర్‌కు రెసిడెంట్ ఆఫీసరుగా ప్రకటించారు. అంతటితో దక్షిణ రంగూన్ ప్రాంతానికి కె. కె. మూర్తి గారి బర్మాఆంధ్ర ప్రాథమిక పాఠశాల గృహంలో **Repatriation Centre 2 (A)** సెంటర్ 2.(A) కాండాగ్లే, అన్న కార్యాలయం తెరువబడింది.

ఈ కార్యాలయంలో సర్వశ్రీ 1. సి. వాసుదేవ్ 2. ధనసింగ్, 3. కే. వెంకటరావు 4. కే. కామమరాజు 5. ఎమ్. ఎస్. మణి 6. వి. పైడితల్లి 7. మహాలక్ష్మి 8. కే. మంగారావు 9. కె.శేషారావు 10. కే. వసంతమూర్తి 11. వి. సింహాద్రిరావు గార్లు, సహాయకులుగా, శ్రీ కే. కే. మూర్తిగారు రెసిడెంట్ ఆఫీసరుగా ఉండి, ఉచితంగా ప్రయాణ పత్రాలు తయారుచేసి భారత కాందిశీకులకు 1964 సం॥ జూన్ 30 తేదీనుండి 1968 సం॥ వరకు మూడువేలమందికి పైగా, ఈ సెంటర్‌ద్వారా తగు సహాయము లభింపచేశారు. అనంతరం, పాఠశాల భవనం గోల్పోయిన పిమ్మట, కే. కే. మూర్తిగారి సెంటర్ మూసివేయబడింది. రెవరెండ్ చోప్స్‌గారు, రెవరెండ్ ఫాదర్ విన్ సెంట్‌గార్లు మృతి పొందగా అఖిల బర్మా భారతీయ కాంగ్రెసు (**A. B. I. C. H. Qrs,**) వారు ఆ బాధ్యతను తీసుకొన్నారు.

కేంద్ర సహాయ కమిటీ సభ్యులు

(Central Relief Committee members)

1. శ్రీ బి. సేన్ గుప్తాగారు : టోబౌంగ్, ఏ.బి.సి., తాకేటా ప్రాంతాలు.
2. శ్రీ కే. ఎమ్. మీనన్‌గారు : కింగ్స్ బేంక్, దల్లా; కమాకసి, సేజ్జీ ప్రాంతాలు.
3. డాక్టర్ పి. ఆర్. కులశేఖరంగారు : తూర్పురంగూను, పజుండౌంగ్ ప్రాంతాలు.
4. శ్రీ చిదంబరం పిళ్ళెగారు : పశ్చిమ రంగూన్, లాన్మడో, బహాన్, మ్యినిగోన్ ప్రాంతాలు.
5. శ్రీ చెల్లయ్య నాడార్‌గారు : అల్లోనే, కిమిండైన్, కమాయడ్ ప్రాంతాలు.
6. **Reverend Charles** : మాపూగాన్, బొమ్మ్యాంగ్, కాండాగ్లే ప్రాంతాలు.
7. శ్రీ బర్జోరియా : ఇన్సన్ ప్రాంతం.
8. మహమ్మద్ ఇస్మైల్ : తింగాంజ్యూన్, మింగళాడోన్ ప్రాంతాలు.
9. శ్రీ ఏకాంబరం పిళ్ళె : ఉత్తర, దక్షిణ ఓక్కలపా, కథబే ప్రాంతాలు.

బర్మాలో హిందూ దేవాలయాలు

బర్మాలో హిందూ దేవాలయాలు సుమారు మూడువేల సంవత్సరాలకు పూర్వమే నిర్మిత మయ్యాయని చెప్పవచ్చు. హిందూ మతం బలం కోల్పోయే కొద్దీ, క్రమేణా ప్రసిద్ధ హిందూ దేవాలయాలే బౌద్ధాలయాలుగా మార్చబడి నాయనీ, వేలకొద్దీ శిథిల మయ్యాయనీ చరిత్రలు తెలుపుతున్నాయి. ఈనాడు బర్మాలో ముఖ్యమైన బౌద్ధ స్తూపాలు, విహార మందిరాలు, ధర్మశాలలు, శ్మశాన వాటికలు అన్నీ ఒకనాడు హిందూ మతానికి సంబంధించినవే అని తెలుస్తోంది.

బ్రిటీషు కాలంలో హిందువులు మళ్ళీ పెద్ద సంఖ్యలో బర్మా రావటం జరిగింది. అప్పుడు ఎన్నో చిన్న, చిన్న దేవాలయాలు లేవడం, కూలడం కూడా జరిగాయి. మునుపటి లాగానే కొన్ని గురుకులాలు బౌద్ధా రామాలుగా, మండపాలు విహార మందిరాలుగా, దేవాలయాలు బౌద్ధా లయాలుగా మారినాయి. రాను రాను పెక్కు గుడులు శిథిలం కావడం, కొన్ని దీపాలను వెలిగించే దిక్కు-కైనా నోచుకోక పోవటం జరిగింది. కొన్ని ప్రభుత్వ యాజమాన్యంలోకి వచ్చాయి. మరికొన్ని "అఖిల బర్మా హిందూ సెంట్రల్ బోర్డు" యాజమాన్యంలోకి వచ్చాయి. ఇటీవలే బోర్డువారి యాజమాన్యంలోనికి మరికొన్ని గుడులు చేర్చబడుతున్నాయి.

ఇలాటి స్థితిగతులకు ఎదురొడ్డి ప్రస్తుతం ఉన్న హిందూ దేవాలయాలు : తూర్పు రంగూన్‌లో 1. భోటటాంగీ ప్రాంతంలో 50 వ వీధిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరాలయం (రెడ్డియార్ గుడి అని ప్రతీతి) 2. 58 వ వీధిలోవి కాళమ్మగుడి, 3. 48 వ వీధిలో బ్రహ్మ సమాజం, 4 సమరస సమాజం వారి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కోవెల, 5. 46 వ వీధిలోని ఆర్య సమాజం, 6. తెయంబ్ను రోడ్డులో సిక్కుల గురుద్వార (గురునానక్ మందిరం, దీనికి

ధర్మశాలలుకూడా ఉన్నాయి) 7. ఈడెన్ వీధిలో మునియాండి కోవెల 8. ఏ. బి. సి. క్వార్టరులో శ్రీ కాళమ్మ గుడి 9. పజుండాంగ్‌లో నాట్టుకోట్టై చెట్టియార్ల శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గుడి, (రోడ్డుకు ఆవల దీని తాలూకు మంటపాలు ఉన్నాయి) 10. థామ్సన్ వీధిలో శ్రీ రామకృష్ణ పరమహంస మఠం (దీనికి గ్రంథాలయం కూడా ఉంది)

మధ్య రంగూన్‌లో :– 1. స్ట్రాండ్ వీధిలో శ్రీ దుర్గా మందిరం, 2. 24 వ వీధిలో శ్రీ గణేశ గుడి 3. మౌంఖెన్ వీధిలో శ్రీ సత్యనారాయణ మందిరం 4. కలకత్తా రోడ్డులో శివాలయం 5. 27 వ వీధిలో స్కాట్ మార్కెట్ ఎదురుగా శ్రీ మారెమ్మ దేవస్థానం 6. మొగలు వీధిలో చెట్టియార్ల సుబ్రహ్మణ్యస్వామి గుడి 7. ఎడ్వర్డు వీధిలో శ్రీ కాళమ్మ గుడి దాని ధర్మ సత్రాలు 8. మౌంగ్‌టాల్ వీధిలో శ్రీ లక్ష్మీనారాయణ మందిరం 9. 29 వ వీధిలో జైను సమాజ భవనం మొదలైనవి ఉన్నాయి. పడమర రంగూన్లో అల్లోన్ ప్రాంతంలో ఓడ్రుల శ్రీ జగన్నాధస్వామి ఆలయముంది.

ఉత్తర రంగూన్‌లో — 1. కాందోంలో లిటిల్ సిస్టర్ రోడ్డుకు చివరగా ఉన్న 94 వ వీధిలో శ్రీ మారమ్మ దేవస్థానం 2. అదేవీధిలో బజారు సమీపంలో శ్రీ సత్యనారాయణ మందిరం 3. 93 వ వీధిలో భూలోకమ్మ గుడి 4. కాళమ్మగుడి, 5. 92 వ వీధిలో నూకాలమ్మ గుడి 6. కలవరు రోడ్డులో శ్రీ గణేశ్వరాలయం 7. ఫాసాపల క్వార్టరులో శ్రీ నల్లమారమ్మ గుడి మొదలైన చిన్న చిన్న గుడులు 8. కాలాబస్తిలో శ్రీ గణేశ గుడి 9. 120 వ వీధిలో నటరాజాలయం 10. 125 వ వీధిలో శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ళు (తుకారాం) స్వామి ఆలయం (దీనికి నాయుళ్ళ గుడి అని ప్రతీతి) 11. పళ్ళె తెరువులో ముత్తుమారమ్మ గుడి 12. బోలెన్ రోడ్డులో శ్రీ భూతనాధ ఆలయం 13. ఆంజనేయ గుడి 14. డొమింగ్లాలో కాళమ్మ గుడి 15. తెంగాజూన్‌లో గణేశ గుడి 16. కృష్ణాలయం 17. సోమాలమ్మ గుడి 18. టామ్వే (పెంకు పరి) లో మహలక్ష్మమ్మ గుడి 19. మినీగోన్ ప్రాంతం రోడ్డులో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గుడి (దీన్ని నూరు సంవత్సరాలకు పూర్వం ఒక తెలుగు దంపతులు నిర్మించారని ప్రతీతి) 20. అదేవీధిలో శ్రీ కాళమ్మ గుడి 21. అందుకు సమీపంలోని మిలిటరీ క్వార్టర్సులో ఉన్న అతి పురాతనమైన శ్రీ పెదపోలమ్మ

గుడి (ప్రస్తుతం ప్రభుత్వ యాజమాన్యంలో ఉంది) 22. అదేప్రాంతంలో బోజోన్ ఔంగ్సాన్ సమాధి దగ్గరగా కృష్ణా వీధిలో దుర్గా మందిరం — అన్న గుడులు ముఖ్యమైనవి. కమాయుట్ మెయిన్ రోడ్డులో శ్రీ మారమ్మ గుడి ఉంది. ఈమారి స్టేషను సమీపంలో వినాయక గుడి, కంబేలో సుబ్రహ్మణ్యస్వామి గుడి, శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి, శ్రీ గణేశాలయం, శ్రీ పెరిమ నాయకమ్మ కోవెల మొదలైన చిన్న చిన్న గుడులు కూడా ఉన్నాయి. ఇన్సిన్ ప్రాంతంలో దుర్గా మందిరం, కాళమ్మ గుడి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, విఘ్నేశ్వరాలయం ముఖ్యమైనవి. కమిండైన్‌లో శ్రీ కోదండ రామాలయం (ఇది తెలుగు వారికి సంబంధించిన వాటిల్లో చాల పెద్ద గుడి, పురాతనమైంది కూడా) శ్రీ సుబ్ర హ్మణ్యస్వామి కోవెల, కాళమ్మ ఆలయం ఉన్నాయి. వీటితోపాటు బౌటోలో ఉన్న అనాథ శరణా లయం, ధర్మశాల, గోశాలలు ఇక్కడి హిందువులకు దేవాలయ తుల్యాలే.

దక్షిణ రంగూన్‌లో - 1. డల్లా పాంతంలో ముత్తు మారమ్మ గుడి 2. కమ్మా కచ్చీలో మునియాండి గుడి 3. కాళమ్మ గుడి 4. భూలోకమ్మ గుడి 5. నూకాలమ్మ గుడి ఉన్నాయి. 6. కనంగోలో కోదండ రామాలయం 7. ట్వంటేలో సుబ్రహ్మణ్యస్వామి కోవెల 8, మునియాండి గుడి ఉన్నాయి. 9. కూంజాగోన్‌లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గుడి 10. వీర మహంకాళి గుడి పెద్దవి 11. సిరియాంలో శ్రీ జగన్నాథ స్వామి ఆలయం 12. గణేశాలయం 13. రామాలయం 14. మారమ్మ గుడి 15. జగన్నాథాలయ ఆవరణలో శివాలయం 16. పనింజాంలో మారమ్మ దేవస్థానం 17. చౌటాన్‌లో సుబ్ర హ్మణ్య స్వామి ఆలయం 19. సత్యనారాయణదేవాలయం 19. గణేశ్ మందిరం ముఖ్యమైనవి.

సాధారణంగా హిందువుల గుడులు బర్మా లో భారతీయులున్న ప్రతి ప్రాంతంలో నిర్మింప బడ్డాయి. ఇంత విపరంగా ఈ పట్టికను ఎందుకిచ్చానంటే కొన్ని కొన్ని పేర్లను బట్టి అవి తెలుగువారి గుడులని సులభంగా పోల్చుకో వచ్చు. సాధారణంగా రామాలయాలు, శివాలయాలు, అమ్మవారి గుడులు తెలుగు వారు నిర్మించినవే. మొత్తం గుళ్ళలో 4వ వంతు తెలుగువారు నిర్మించినవి.



పెరుమాళ్ స్వామి ఆలయము
మోల్మేన్

తమిళులతో కలిసి నిర్మించిన వాటిని కూడా లెక్కపెడితే సగభాగం తెలుగు వారి నిర్మాణాలని చెప్పాలి. దేశంలోని పెద్ద గుడులన్నీ ఎక్కువభాగం దక్షిణ భారతీయులవే.

ఆంధ్రులు ఎక్కువగా నివసించే స్థలాల్లో మోల్మేన్ జిల్లా ఒకటి. ఈ జిల్లాలో తెలుగువారు నిర్మించిన గుడులు కూడా ఎక్కువే. మోల్మేన్ మల్లిపూల వీధిలో శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ గుడి నిర్మాణాన్ని ఒకే ఒక్క ఆంధ్రుడు ప్రారంభించి నిర్వహించాడు. ముగింపు దశలో మాత్రం మరికొందరు కూడా పాలుపంచుకొనే అవకాశం ఏర్పడింది. ఆలయానికి కొంత పంట భూమి వగైరా ఆస్తి కూడా సమకూర్చ బడింది. ఈ ఆలయ నిర్మాణాన్ని ఆరంభించిన కీ.శే. పడుచూరి వెంకటరెడ్డి గారి అనంతరం, వారి సంతానమైన శ్రీ పెరుమాళ్ళుగారు వారి సోదరులు ఆలయ యాజమాన్యాన్ని నిర్వహిస్తున్నారు. బర్మా ఆంధ్ర సంఘంవారి యాజమాన్యంలో శ్రీ గోపాలస్వామి గుడి, శ్రీ మహాలక్ష్మమ్మ గుడి మొదలైనవి ఉన్నాయి. ఊరి మొత్తం మీద హిందువుల గుడులు వందకు పైగా ఉంటాయి. అందులో ఎనభై శాతం తెలుగు వారివి. బస్సిన్ జిల్లాలోని హిందూ దేవాలయాల్లో కార్టుమేన్ రోడ్డులో ఉన్న శ్రీ కోదండ రామాలయం, టూంబో రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణాలయం తెలుగు వారికి ముఖ్యమైనట్టివి.

ప్రతి జిల్లాలో ఉన్న గుడులన్నిటినీ పేరు పెట్టి చెప్పకపోయినప్పటికీ తెలుగువారు అధికంగా ఉండే ప్రతి ప్రాంతం లోనూ తెలుగువారి గుడులూ అధికంగానే ఉంటాయి. సామాన్యంగా ఇక్కడి ఆంధ్రుల్లో దైవ భక్తి ఎక్కువ. ఎవరేది తలపెట్టినా ఏదో ఒక దేవుడి పేరిటనే పేరు పెడుతుంటారు. అందులోనూ శ్రీ రాముడంటే, ఇక్కడి తెలుగువాళ్ళకు కూడా అపారమైన భక్తి, ప్రపత్తులు.

సమాప్తం

వివిధ ఉద్యోగాల్లో ఉన్న తెలుగువారు

ప్రస్తుతము బర్మాదేశంలో డాక్టర్లుగా ఉన్న తెలుగువారు

1. డాక్టరు గొల్లనిల్లి రామారావు నాయుడు (M.B.B.S.) Rangoon (ఇప్పుడు ఈయన U. S. A. లో వున్నారు.)
2. డాక్టరు (శ్రీమతి) సరోజినీ నాయుడు (M.B.B.S.) Rangoon
3. డాక్టరు జంపా హరిగారు (M B.B.S.) Rangoon
4. డాక్టరు పి. భుజంగరావు (M.B.B.S.) Rangoon
5. డాక్టరు ఆర్. ఉమేష్ పతి (M.B.B.S. and D.P.) Rangoon
6. డాక్టరు రాళ్ళపూడి సత్యరాజు B.Sc. (Rgn) M.D. (Hungary)
7. డాక్టరు (కుమారి) పోతినిండు లీలావతి (M.B B.S.)
8. డాక్టరు గోపాల శివరావు మెడిసిన్ చదువుతున్నారు.

ఇంజనీర్లుగా ఉన్న తెలుగువారు

1. శ్రీ భీమని సుబ్బారావు, Marine Engineer, I.W.T. Corporation
2. శ్రీ భీమని తిరుపతిరావు, —do—, Five Star Shipping Corpn.
3. శ్రీ కె. కృష్ణారావు, (B.Sc.) ప్రస్తుతం U. S. A. లో వున్నారు.
4. శ్రీ టి. కృష్ణారావు నాయుడు(Diploma from West Australia) Metal Mining Engineer, Rgn.
5. శ్రీ జంపా విటోబా (Diploma from West Germany) Elec. Engineer
6. శ్రీ వి. శంకర్, B. E. Mech. Rangoon Institute of Technology (RIT)

7. శ్రీ కోన మోహనరావు, (Diploma in Civil Engineering —G.T.I.
8. శ్రీ కోన లక్ష్మణరావు, (—Ditto—)
9. శ్రీ రాళ్ళపూడి చంద్రశేఖర్, (Second Year, Rgn. Institute of Technology)
10. కుమారి పోతినిండు లక్ష్మి, (—do—)
11. రాళ్ళపూడి పురుషోత్తం, (Diploma in Radio Electronic Engineering) B.R.I.

అకౌంటంట్లు

1. శ్రీ పోతినిండు వెంకట రమణారావు, B.Com., R.A. ప్రస్తుతం, Working peoples Daily లో General Manager గా ఉన్నారు.
2. శ్రీ బొడ్డాపు కృష్ణనాయుడు(ఉరఫ్) శ్రీ పీటర్—Chief Accountant, Pakistan International Airways
3. శ్రీ వి. వి. రావు, Income Tax Practitioner and Adviser
4. శ్రీ దొమ్మేటి కృష్ణమూర్తి—R.A. (Private Auditor)

బ్యాంకులలో ఉద్యోగులు (BANKING DIVISION)

1. శ్రీ రాయి సుబ్బరాజు...Asst. Manager Rangoon Banking Division No. 4)
2. శ్రీ రాళ్ళపూడి నారాయణరావు (Supervisor, —do—Div.1)
3. శ్రీ గోషాల పావారావు (U.D. Assistant—do—Div.1)
4. శ్రీ గుబ్బల వీరాస్వామి (National Bank of India)

ప్రస్తుతం, భారతదేశంలో వున్నారు.

5. శ్రీ సురాల అప్పలనాయుడు (Banking Assistant Moulmein)
6. శ్రీ బళ్ళా బాపనయ్య (—do—)
7. శ్రీ బళ్ళా రాజగోపాల్ (—do—)
8. శ్రీ బళ్ళా రామదాసు (—do—)
9. శ్రీ ఘంటి సీతారాం (—do—)
10. శ్రీ ఘంటి సింగారం (—do— Rangoon)

న్యాయవాదులు - న్యాయశాఖ (LAWYERS)

1. కీ॥శే॥ శ్రీ R. K. S. పతి, B.A., B.L., Advocate Moulmein
2. శ్రీ కె. శంకరపతి, Higher grade pleader (—do—)

3. కుమారి శాంతికుమారి, B.Com.,R.A., Higher Grade Pleader (కీ॥శే॥ శ్రీ R.K.S. పతి గారి కుమార్తె)
4. శ్రీమతి గోషాల పూర్ణవతి, B.A., Law Student, Rangoon

పోలీసు ఉద్యోగులు - పోలీసుశాఖ

1. కీ॥శే॥ శ్రీ గొర్రెల జానకిరామయ్య, Retd. Inspector of Police
2. కీ॥శే॥ శ్రీ బళ్ళా ప్రకాశం, B.A., B.L., Deputy Supdt. of Police (Retd.)
3. కీ॥శే॥ శ్రీ బూర ఆదినారాయణ, B.A., B.L., Retd. Senior Asst., Office of the Inspector General of Police, Rangoon.
4. శ్రీ మానేపల్లి మీర్రాజు, Retd. Sub Inspector of Police S.B.
5. శ్రీ బుంగా సుందర్రావు, Asst. Security Officer (A.S.O) S.B.
6. శ్రీ కె. మీరయ్య, Retd. Head Constable, Rangoon Town Police

ప్రభుత్వ కార్యాలయములలో ఉద్యోగమందున్న వారు

1. శ్రీ ముత్యాల అప్పారావు, B.Sc. (Geology) Myanma Oil Corporation.
2. శ్రీమతి ముత్యాల మణి (ఉరఫ్) బృందావతి, B.Sc., (Zoology) Office Assistant in B.S.P.P. H. Qrs.
3. శ్రీ బి.ఎస్. రాధాకృష్ణారావు, B. Com., B.M.A. Late Asst. Manager of Japanese Firm, Rgn. ప్రస్తుతం ఆంధ్రదేశంలో వున్నారు. Magwe,
4. శ్రీ నాలం అప్పారావు, B.Sc., Manager, Township Trade,
5. శ్రీ మంతిని వేమారావు, G. C. E., Asst. Manager, Myanma Export and Import Corporation (M.E.I.C.)
6. శ్రీ బి. ఏ. రావు, U.D., Assistant, Ministry of Education
7. శ్రీ గేత సింహాచలం, B. A., Accountant, Trade Corporation, No. 18.
8. శ్రీ కోన మోహన్‌రావు, U.D. Clerk, Applied Research Institute.

9. శ్రీ వడ్డి సోదన, Asst. Manager, Burma Pharmaceutical Industry. (B. P. I.).
10. శ్రీ వడ్డి గోపాల్, Supdt. of Stores, Burma Port Corporation.
11. శ్రీ బలిజి కృష్ణారావు, Asst. Engineer, Sinmalaik Dock-Yard.
12. కీ॥శే॥ శ్రీ బొందిలి చలపతిరావు, Cargo Supervisor, Burma Five Star Shipping Corporation.
13. శ్రీ చొల్లంగి సుబ్బారావు, U.D. Clerk, Transport Agencies Corporation. T.A.C.
14. శ్రీమతి పనసా రామలక్ష్మి (ఉరఫ్) బూసి, Typist, -do- T. A. C.
15. శ్రీ పనసా శేషగిరిరావు, Cargo Supervisor -do-
16. శ్రీ పనసా కాళిదాసు, -do- -do-
17. శ్రీ రెయ్యి సుబ్బారావు, -do- -do-
18. శ్రీ బి. సుందరరావు, Office Assistant B.P.I.
19. శ్రీ గంగాధరరావు, Aerodrome Technician.
20. శ్రీ సబ్బవరపు కృష్ణారావు, U.D. Clerk, Trade Corporation No. 10
21. శ్రీ సర్వసిద్ధి సూర్యనారాయణ, Cargo Supervisor, T.A.C.
22. శ్రీ సిద్ధనాతి అప్పలస్వామి, People's Court, East Rangoon.

ఇతర కార్యాలయాలలో ఉద్యోగ మందున్నవారు

1. శ్రీ కర్రి సుబ్బారావు, Asst. Director (Foreign Films) Motion Picture Corpn. Burma.
2. శ్రీ మాసాబత్తుల క్రిష్ణారావు Senior Assistant, Shipping Indian Embassy, Rangoon.
3. శ్రీ గొల్లపల్లి రంగారావు, Sales Representative, PANAM Airways, Rangoon.
4. శ్రీమతి కుసుమకుమారి, B.Sc. (Rgn.) ప్రస్తుతం Australia లో ఉన్నారు.

5. శ్రీ పల్లికొండ కాటూరావు, B Com., (Calcutta) Ex-Assistant in Rangoon indian Embassy ప్రస్తుతం, ఆంధ్రదేశంలో ఉద్యోగం చేస్తున్నారు.
6. శ్రీ కర్రి రంజిత్‌కుమార్ B.Sc (Zoology) ప్రస్తుత Maldives లో వున్నారు.
7. శ్రీ మానేపల్లి వసంతరావు B.A., Ex-Assistant in Rangoon indian Embassy
8. కుమారి గోషాల రుక్మిణి, B. Com., Calcutta Assistant -do-
9. కుమారి రాళ్ళపూడి సుభద్రాదేవి, Assistant -do-

పట్టభద్రులైనవారు, ఉన్నతవిద్యలో నున్నవారు

1. శ్రీమతి పోతినించు ఆదిలక్ష్మి, B.A.,
2. శ్రీమతి నాలం అనసూయ, B A.,
3. శ్రీమతి నాలం సరోజదేవి, B.A.,
4. కుమారి గోషాల భాగ్యలక్ష్మి, B.Sc.,
5. కుమారి గోషాల చంద్రవతి, B.Com.,
6. శ్రీ వి. త్రినాధరావు, B.Sc., (Zoology) Final year.
7. శ్రీమతి ఆర్. విజయలక్ష్మి (ఉరఫ్) లిల్లీ, B.A., ,,
8. శ్రీ పోకల సుధాకరరావు, B.Sc., Chemistry ,,
9. శ్రీ జలగడుగుల రాజారావు, B.Sc. (Under - Graduate)
10. శ్రీ జలగడుగుల ఆనందరావు, B.Sc., ,,
11. శ్రీ కర్రి సూరజ్‌కుమార్, B.A., ,,
12. కుమారి వి. నాగేశ్వరి B.Sc., ,,
13. కుమారి రాళ్ళపూడి సుభద్రాదేవి, B.A., ,,
14. శ్రీ కొప్పుల పైడయ్య, B.A., ,,
15. శ్రీ కుమారి రాళ్ళపూడి, రాజేశ్వరి L.C.C.
16. కుమారి రాళ్ళపూడి జానకి, L.C.C.

వివిధ ఉద్యోగములు చేసినవారు

1. కీ॥ శే॥ సబ్బవరపు అచ్చన్న పంతులు : ఆంధ్ర మహాజన సంఘం ధర్మ పాఠశాలలో సహాయోపాధ్యాయుడు తదనంతరం ప్రధానోపాధ్యాయుడు(1911-1941).

2. శ్రీ రావాడ అప్పన్న పంతులు : (a) ఆంధ్ర మహాజన సంఘం ధర్మపాఠశాలలో సహాయోపాధ్యాయుడు - 1932-1941 సం॥ వరకు (b) బర్మా-ఆంధ్ర గౌరీ సంఘపు ధర్మపాఠశాలలో 1957-1964 సం॥ వరకు, ప్రస్తుతం, ఆంధ్రదేశంలో వున్నారు.

3. శ్రీ పగడ పూసల నారాయణరావు : (B.Sc.,) I. E. S. ఖాల్సా హైస్కూల్‌లో సీనియర్ గణితశాస్త్ర అధ్యాపకులు - 1964 వరకు ప్రస్తుతం, ఆంధ్రదేశంలో వున్నారు

4. కీ॥ శే॥ శ్రీ చొల్లంగి కంచన్న : **Manager, Stores Dept., Thomas Cook & Son Rangoon.** ("తెలుగుబిడ్డ" మాజీ సంపాదకులు)

5. శ్రీ గంటా వెంకయ్య, **B.A., Senior Assistant, 1946 – 55 civil supplies, Dept. Rangoon.** ప్రస్తుతం, భారతదేశంలో ఉన్నారు.

6. శ్రీ కె. కె. మూర్తి : 1950-53, హెంజడా - ఆంధ్ర సంఘపు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు 1953-56, ఆంధ్ర యువజన భజన కూటమి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు 1956-64, **I. E. S. Khalsa** హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు మరియు బర్మా-ఆంధ్ర మాధ్యమిక పాఠశాల నిర్వాహకులు.

7. శ్రీ వి. జే. సర్వోత్తమరావు, **B.A.,B.L.,I.E.S. Khalsa** హైస్కూలులో సీనియర్ ఆంగ్లభాష అధ్యాపకులు, ప్రస్తుతం భారతదేశంలో వున్నారు.

8. కీ॥ శే॥ చొల్లంగి ధనరాజు : 1950-51, ఆంధ్ర యువజన భజన కూటమి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, 1951-1964, ఆంధ్ర మహాజన సంఘం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు.

9. శ్రీ దొమ్మేటి రామమూర్తి : 1950-51, ఆంధ్ర యువజన భజన కూటమి పాఠశాలలో సహాయోపాధ్యాయుడు, 1951-54, ఆంధ్ర మహాజన సంఘం పాఠశాలలో సహాయోపాధ్యాయుడు. ప్రస్తుతం భారతదేశంలో ఉన్నారు.

10. శ్రీ గుబ్బల సాగర్ : "**GUARDIAN**" వార్తా పత్రికాలయంలో **Sub Assistant Editor** (1955-67) ప్రస్తుతం ఆంధ్రదేశంలో వున్నారు.

11. కీ॥ శే॥ పల్లికొండ కోటయ్య : "**GUARDIAN**" వార్తా పత్రికాలయంలో **Proof Reader** (1957-66).

12. ఆదుర్తి సూర్యప్రకాశ్ : **Shipping clerk in A Scott & Co., Rangoon.** మాజీ సహాయ కార్యదర్శి–ఆంధ్రమహాజన సంఘం. కార్యదర్శి - బర్మా ఆంధ్ర గౌరీ సంఘం.

13. శ్రీ కర్ణిక క్రిష్ణారావు। "ఆంధ్రపత్రిక" పత్రికాలయంలో తెలుగు **compositor** (1934-41) "**GUARDIAN**", ఆంగ్ల దినపత్రికలో ఇంగ్లీషు **compositor.** "కర్ణిక" తెలుగుపత్రిక నిర్వాహకులు. ప్రస్తుతం, యీయన ఆంధ్రదేశంలో ఉన్నారు.

14. శ్రీ భీసెట్టిలక్ష్మణరావ్; **I.E.S. Khalsa** హైస్కూల్‌లో విద్యార్థి "అహింసారాణి" నవలకు రచయిత (రంగూన్) ప్రస్తుతం ఆంధ్రదేశంలో ఉన్నారు.

15. కీ॥ శే॥ కుమారి జయలక్ష్మి : స్టేట్ హైస్కూల్‌లో పంతులమ్మ.

16. శ్రీమతి టి. లక్ష్మికుమారి **B.A.,** : స్టేట్ హైస్కూలులో సీనియర్ పంతులమ్మ (బర్మాభాషలో నైపుణ్యం)

17. శ్రీమతి పసుపా తులసి (ఉరఫ్) డెయిసే : స్టేట్ హైస్కూల్‌లో పంతులమ్మ.

పడవ యజమానులు. కంట్రాక్టర్లు. యితర సంస్థల నిర్వాహకులు

1. శ్రీ చంద్రకంటి అర్జున : ఆంధ్రా మసాలా మిల్లు యజమాని, రంగూన్.

2. శ్రీ మద్దె వెంకటస్వామి : కార్గో పడవల యజమాని. కర్ర మర యజమాని, పైపుల కంట్రాక్టరు, **Master Plumber.**

3. కీ॥ శే॥ భీముని మునుస్వామి : కార్గో పడవల యజమాని.

4. శ్రీ గొల్లవిల్లి అప్పన్న : కార్గో పడవల యజమాని, **B.O.C.** ఏజెంటు.

5. కీ॥ శే॥ కే. శ్రీనివాసులు నాయుడు : కార్గో సూపర్‌వైజర్ 'తెలుగు బిడ్డ' వార్తాపత్రిక వ్యవస్థాపకులు, 'లక్ష్మి ముద్రాలయం' వ్యవస్థాపకులు.

6. శ్రీ రాళ్ళపూడి కోటయ్య : **Sipwaye watch Materials shop** యజమాని.

7. శ్రీ బి. ఏ. స్వామి : కార్మిక కంట్రాక్టరు.

ప్రభుత్వ కార్యాలయంలో పెన్షన్ పొందిన ఉద్యోగులు

1. శ్రీ రాళ్ళపూడి యెల్లయ్య : **Office Superintendent, Customs Dept., Rangoon.**

2. శ్రీ దొమ్మేటి క్రిష్ణమూర్తి : **U. D. Clerk, Customs Dept., Rangoon,**

3. శ్రీ మానేపల్లి మీర్రాజు : **Sub Inspector of Police (S. B.) Rangoon.**

భారత రాయబారి కార్యాలయంలో తెలుగువారు

బర్మా భారత దేశాల విభజన తరువాత బర్మాలో భారత ప్రతినిధి కార్యాలయం ద్వితీయ ప్రపంచ యుద్ధానికి పూర్వమే 1937లో ప్రారంభమైంది. అందులో శ్రీ లంకా గణేశ్వరరావు గారు ప్రధాన బాధ్యత గలిగిన ఉద్యోగిగా ఉన్నారు. యుద్ధ కాలంలో భారత దేశానికి వెళ్ళిపోయి, మళ్ళీ యుద్ధానంతరం శ్రీ గణేశ్వరరావు భారత ప్రతినిధి కార్యాలయంలో ఉద్యోగిగా తిరిగి వచ్చారు.

1948లో బర్మా దేశం స్వతంత్రమైన పిమ్మట, రాయబారి కార్యాలయం రంగూన్ నగరంలో తెరువబడింది. డాక్టర్ ఎమ్. ఎ. రాఫ్ గారు మొదటి రాయబారిగా వచ్చారు. వీరి కాలంలోనే శ్రీ మాసా బత్తుల కృష్ణారావు గారు శ్రీ కర్రి కైలాసం గారు ఇందులో ఉద్యోగులయ్యారు. శ్రీ కె. రామయ్య గారికి కూడా ఒక చిన్న ఉద్యోగం లభించింది. వీరు ముగ్గురూ వ్యాయామ క్రీడా రంగంలోనూ, సాంఘిక సేవా కార్యక్రమాల్లోనూ బాగా పాల్గొన్నారు.

1952లో శ్రీకృష్ణ చెట్టూరు గారు రాయబారిగా ఉన్నారు. వీరి కాలంలో శ్రీ వి. వి. గిరి గారి అల్లుడైన శ్రీ పరిగి కృష్ణారావు గారు వైస్-కాన్సెల్‌గా ఉన్నారు. వీరు బర్మా ఆంధ్రులందరికీ పరిచయులే.

1956లో శ్రీ సక్సేనా గారు రాయబారిగా వచ్చినప్పుడు శ్రీ పి. జగన్నాథరావు గారు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరుగా ఉన్నారు. 1957లో కమర్షియల్ సెక్షన్‌లో శ్రీ ఇళ్ళ సూర్యనారాయణ గారు ఉన్నత ఉద్యోగంలో ఉన్నారు.

1964 లో శ్రీ ఆర్. డి. కటారిగారు రాయబారిగా వచ్చారు. ఈయన అచ్చంగా తెలుగువారు. పూర్తి పేరు కటారి రామదాసుగారు. ఆ ఏడాది నుండియే బర్మాలోని భారతీయులు మాతృదేశానికి వెళ్ళి పోవటంతో, రాయబారి కార్యాలయంలో కార్యభారం అధికమైంది. అందుచేత అనేక మంది తాత్కాలిక ఉద్యోగులుగా రాయబారి కార్యాలయంలో ప్రవేశించారు. I. E. S ఖాల్సా ఉన్నత పాఠశాలలో పదవతరగతి పాసైన తెలుగు విద్యార్థులనేకంగా ఆ ఉద్యోగాలలో చేరారు. వారిలో ఆదాకం నూకరాజు, శ్రీ జి. సత్యనారాయణ, శ్రీ బి. డేవిడ్ కుమారి ధనలక్ష్మి మొదలైనవారు కౌన్సిలర్ సెక్షన్ లోను, షిప్పింగ్ సెక్షన్‌లోను

ఉద్యోగాలు చేశారు. శ్రీ పి. జగన్నాధరావుగారు సమాచార శాఖలో ఆఫీసర్‌గా ఉన్నారు. ఆ తర్వాత ఆయన షిప్పింగ్ శాఖకు బదిలీ అయ్యారు. 1967లో శ్రీయుతులు ఎం. వెంకటాచార్యులు, సి. నారాయణమూర్తిగార్లు కౌన్సిలర్ సహాయకులుగా ఉన్నారు. ఈ ముగ్గురూ బర్మా ఆంధ్రుల పురోభివృద్ధి విషయంలో మిక్కిలి పాటు పడ్డారు. ఈ సంక్షిప్త చరిత్రకు ఆధార గ్రంథమైన 'బర్మా ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి అన్నదానికి పరిశీలకులుగా ఉన్నారు.

1969లో శ్రీ బాలేశ్వర ప్రసాద్ గారు రాయబారిగా వచ్చారు. వారు రావడానికి మునుపటి నుంచి శ్రీయుతులు పీలా సూర్యనారాయణ. కర్రి అర్జున, టి. రాజు, స్థాలాపు అప్పారావు గార్లు ఇక్కడ ఉద్యోగాల్లో ఉన్నారు.

1974-65లో శ్రీ ఆర్. ఖతింగ్ గారు రాయబారిగా ఉన్నప్పుడు శ్రీ ఎమ్. భాస్కర రావు అన్న తెలుగువారు మిలిటరీ సెక్షన్‌లో హవల్దారుగా పచ్చారు. ఈ సమయంలోనే శ్రీ రాళ్ళపూడి ఎల్లయ్యగారి పుత్రిక, కుమారి సుభద్రాదేవి, శ్రీ గోపాలకృష్ణారావు గారి పుత్రిక కుమారి రుక్మిణి ఈ కార్యాలయంలో ఉద్యోగిసులయ్యారు. శ్రీ రాళ్ళపూడి పురుషోత్తం, చంద్రశేఖరం సోదరులు ఆ పాటికే కొంతకాలం ఇక్కడ ఉద్యోగం చేశారు. రాయబారి కార్యాలయంలోని తెలుగు ఉద్యోగులందరూ తెలుగు వారికి సంబంధించిన వివిధ సాంఘిక సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రద్ధా సక్తులతో పాల్గొన్నారు.

సిబ 49
2101


అంతర్జాతీయ తెలుగు సంస్థ

ప్రచురణలు

1.	తెలుగు వాణి - సంస్థ మాస పత్రిక, సాలు చందా	రు.	15-00
2.	ఇతర రాష్ట్రాలలో తెలుగు వారు (నదస్సు నివేదిక)	రు.	3-00
3.	మారిషస్‌లో తెలుగు వాణి	రు.	2-00
4.	బర్మాలో తెలుగు వాణి	రు.	3-00
5	పండుగలు - పబ్బాలు	రు.	3-00

Our Forth Coming Publications

1. Directory of Telugu Associations out side Andhra Pradesh
2. Modern Spoken Telugu
   - Reader—I
   - Reader —2
   - Reader—3
3. Telugu Language Learners Dictionary
   Telugu–English And English–Telugu
4. A Hand Book of Telugu Language
5. Andhras' Culture



రచయిత శ్రీ కె.కె. మూర్తి బర్మా ఆంధ్ర ప్రముఖులలో ఒకరు. అక్కడ తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. బర్మాలో తెలుగువారి భాషా సంస్కృతుల పరిరక్షణకోసం తత్పరతతో పనిచేస్తున్న శ్రీ మూర్తి ఎంతో పరిశ్రమించి విషయ సేకరణ చేసి ఈ అమూల్య గ్రంథాన్ని రచించారు.





INTERNATIONAL
TELUGU INSTITUTE
HYDERABAD-27.

Check List

Book Number	NPROIDY04	Date	10/04/23
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CD, 1247		
Missing Pages	ND		
Prepared By	Lakshmi	Cutting By	Lakshmi
Scanned By	P. Pragathi	Pages	159
Quality Checking	prathyu		